అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 18-08-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 230 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00



ఫ్యూచర్ సిటీ రూట్‌మ్యాప్

సిద్ధం చేయండి

అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్ సిటీకి సంబంధించిన రూట్‌మ్యాప్‌ను వెంటనే సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధికారుల్ని ఆదేశించారు. శనివారంనాడాయన ఫ్యూచర్ సిటీ ప్రణాళికలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి శ్రీనివాసరెడ్డి, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో పాటు పలు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి రోడ్ కనెక్టివిటీకి సంబంధించిన రూట్‌మ్యాప్‌ను అధికారులు సీఎంకు వివరించారు. దానిలో పలు మార్పులు, చేర్పుల్ని ఆయన సూచించారు. ఔటర్ రింగ్‌రోడ్ నుంచి రీజనల్ రింగ్‌రోడ్ వరకు కనెక్టివిటీ ఉండేలా రోడ్ మ్యాప్ తయారు చేయాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో రేడియల్ రోడ్ల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ...3లో

పట్టాలు తప్పిన

సబర్మతి ఎక్స్‌ప్రెస్

భారీ బండరాయి తగిలి యూపీలోని కాన్పూర్ స్టేషన్ సమీపంలో ఘటన

ఎలాంటి ప్రాణనష్టం లేదు

కుట్రకోణం దాగి ఉందన్న కేంద్ర రైల్వే మంత్రి



3లో..

రాజీనామా చేయాల్సింది నేను కాదు..నువ్వే

14 వేల కోట్లు కోత పెట్టారు.. 26 లక్షల మంది రైతులకు అమలు కాలేదు



- రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- రైతు భరోసా ఎగ్గొట్టి..రుణమాఫీకి నిధులు మళ్లించారు
- రైతులను మోసం చేసినందుకు క్షమాపణ చెప్పాలి
- సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం
- ఆఫీసులపై దాడులు చేస్తే ఊరుకోబోమని హెచ్చరిక

వివరాలు 15లో..

బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలు నమ్మొద్దు

రుణమాఫీ కాని రైతులందరి వివరాలు సేకరిస్తాం



- పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తాం..
- సాంకేతిక సమస్యలు పరిష్కరిస్తాం
- వ్యవసాయశాఖకు రోజువారీ ఫిర్యాదులు
- రేషన్‌కార్డు ప్రమాణికంకాదు..కుటుంబ నిర్ధారణకే : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వివరాలు 3లో..

కలకలం రేపిన

కర్నాటకం

సిద్ధరామయ్య ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి

ముడా కుంభకోణం కేసులో కీలక మలుపు

క్యాబినెట్ సూచన బేఖాతర్

ఇది కేంద్రం కుట్రేనని మండిపడిన కాంగ్రెస్

తప్పేమీ చేయలేదన్న సీఎం

అరెస్ట్ తప్పదంటూ ఊహాగానాలు



3లో..

సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలి..

దోషులను వెంటనే శిక్షించాలి

- ఆస్పత్రుల్లో భద్రతా ప్రమాణాలను నిర్దేశించాలి
- మోడీ సర్కారు మొద్దునిద్ర వీడాలి

జూడా, ఐఎంఏ రాష్ట్రస్థాయి ధర్నాలో డాక్టర్లు

ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యులు, వైద్య సిబ్బందిపై హింసకు వ్యతిరేకంగా సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తేవాలని పలువురు డాక్టర్లు, డాక్టర్ల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై లైంగికదాడి, హత్యకు నిరసనగా తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా), ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద రాష్ట్ర స్థాయి ధర్నా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఆయా ఆస్పత్రుల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించిన జూడాలు, సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు, నర్సులు రాష్ట్రస్థాయి ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ప్రాణాలు నిలుపుతున్న తమ ప్రాణాలకే గ్యారంటీ లేదా అంటూ ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు మారకుంటే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

వివరాలు 7లో



నిలిచిన వైద్యం

కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్త సమ్మె

అత్యవసర సేవలకు మినహాయింపు

పలు నగరాలలో భగ్గుమన్న నిరసనలు

7లో..



హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నాలో వైద్య సిబ్బంది

మెడికల్ కాలేజీల్లో మహిళా డాక్టర్లు, సిబ్బందికి

భద్రత కల్పించాలి

డాక్టర్ల సమ్మెకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు

నిందితులను కాపాడేందుకు బెంగాల్ ప్రభుత్వం ప్రయత్నం

7లో..

ప్రపంచబ్యాంకు ద్వారా

మూసీ సుందరీకరణ

ఆ మేరకు అధ్యక్షుడితో చర్చలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

అమెరికాలో 19సంస్థలతో రూ.31,500కోట్ల విలువైన ఒప్పందాలు

దక్షిణ కొరియాలో 12 సంస్థలతో చర్చలు

రాష్ట్రాభివృద్ధికోసం ప్రతిపక్షం సలహాలివ్వాలి

దుష్ప్రచారాన్ని మానుకోవాలి

సీఎం విదేశీ పర్యటన వివరాలు వెల్లడించిన మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మూసీ సుందరీకరణపై ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడితో చర్చించినట్లు రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు 19 విదేశీ సంస్థలతో రూ.31,500కోట్ల ఒప్పందాలు ...15లో

మహిళలపై చిన్నచూపు తగదు

- సామాజిక గౌరవం దక్కేలా చట్టాల రూపకల్పనకు ప్రయత్నిస్తా
- సంపాదనలో సమాజం కోసం ఆవగింజంత ఖర్చుపెట్టండి
- ఒక్కో కార్పొరేట్ కంపెనీ ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోవాలి : డెమొక్రటిక్ సంఘం సదస్సులో మంత్రి డాక్టర్ సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమాజంలో మహిళలపై చిన్నచూపు తగదని మహిళా శిశుసంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క)అన్నారు. మగవాళ్ల ఆలోచనా విధానం మారాలని సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో డెమొక్రటిక్ సంఘ ట్రస్టు ఆధ్వర్యంలో 'గ్రామీణ మహిళలకు నాయకత్వ లక్షణాలు పెంపొందించడం' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలకు సామాజిక గౌరవం దక్కాలనీ, ఆ దిశగా చట్టాల రూపకల్పనలో తనవంతు పాత్ర పోషిస్తానని భరోసానిచ్చారు. డెమొక్రటిక్ సంఘం అనే పదంలోనే చాలా బలం కనిపిస్తోందని చెప్పారు. ప్రతిఒక్కరికీ స్వేచ్ఛ దక్కాలన్నారు. మహిళలు లేనిది ఆహారభద్రత లేదని చెప్పారు. వారికి మర్యాదనిచ్చే గొప్ప మనసు ఉంటుందన్నారు. వాళ్ల సమస్యలను తెలుసుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో డెమొక్రటిక్ సంఘం పరిష్కరించాలని సూచించారు. రాజీవ్‌గాంధీ స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్లనే స్థానిక ప్రజాప్రతినిధులుగా మహిళలు రాజకీయాల్లో ముందడుగు వేశారని చెప్పారు. మహిళలు రాజకీయంగా కొంత ముందుకు రాగానే వెనక్కు లాగే ప్రయత్నాలు జరగడం బాధాకరమన్నారు. తాను మంత్రి అయినా కించపరుస్తూనే వేధిస్తున్నారని వాపోయారు. అయితే, వాటిని పట్టించుకుంటే ముందడుగు వేయలేమన్నారు. సమసమాజ నిర్మాణం కోసం తన కృషిని కొనసాగిస్తానని ప్రతినబూనారు. రాష్ట్రంలో మహిళా సంఘాల ఆర్థికబలోపేతం దృష్టి సారించామని చెప్పారు. ప్రభుత్వ పనులను మహిళలకు అప్పగించడం కొత్త ఒరవడి అన్నారు. మహిళలకు ఆర్థిక పునాది ముఖ్యం కాబట్టే ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కలకత్తాలో డాక్టర్‌పై లైంగిక దాడి చేసి చంపేయడం బాధాకరమన్నారు. మగవాళ్లతో సమానంగా ఎదగడమే ఆ డాక్టర్ చేసిన నేరమా? అని ప్రశ్నించారు. నేరం జరగకముందే ఎలా నివారించాలో అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. ఒక పేదగా రాజకీయాల్లోకి వచ్చాననీ, పేదల కోసం పనిచేస్తూనే ఉంటానని హామీనిచ్చారు. సేవా గుణం, ప్రజల పట్ల ప్రేమ, శ్రమ పై గౌరవం ఉన్న నేతలను గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరూ తమ సంపాదనలో సమాజం కోసం ఆవగింజంత ఖర్చు పెట్టాలనీ, కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒక్కో కార్పొరేట్ కంపెనీ ఒక్కో గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కోరారు.

శభాష్ సీతక్క : గీతారెడ్డి

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ(సీతక్క)ను మాజీ మంత్రి గీతారెడ్డి అభినందించారు. మాదాపూర్‌లో రూరల్ విమెన్ లీడర్‌షిప్ ప్రోగ్రాం ప్రారంభోత్సవం సందర్భంగా ఆమె సీతక్కతో ప్రత్యేకంగా మాట్లాడారు. 'శభాష్ సీతక్క. మంత్రిగా బాగా పనిచేస్తున్నావు. పనివిధానం బాగుంది. ఇదే ఒరవడిని కొనసాగించు. మంచి పేరు వస్తుంది. కొత్తగా మంత్రివైనా మీ నేతృత్వంలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖల పనితీరులో కొత్తదనం కనిపిస్తోంది' అంటూ ప్రశంసించారు.

లాంఛనప్రాయంగా స్వాధీనతా ప్రకటన

ICICI Bank బ్రాంచ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్., 4/10, మైత్రీ టవర్, బొమ్మనహళ్లి హెసూర్ మెయిన్ రోడ్, బెంగళూరు- 560068.

ICICI బ్యాంక్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్, రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తంను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేశారు.

బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలం చెందిన కారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ-పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదవదగిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో క్రింది సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకున్నారు. సదరు ఆస్తితో లావాదేవీలు జరుపరాదని ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాం. ఆ ఆస్తితో ఏవైనా లావాదేవీలు జరిపినచో ICICI బ్యాంక్ లిమిటెడ్ వారికి చెల్లించుటకు లోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీతల పేరు/ లోన్ అకౌంట్ నెంబర్లు	ఆస్తి యొక్క వివరణ / లాంఛనప్రాయ స్వాధీనతా తేదీ	డిమాండ్ నోటీసు తేదీ/ డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం (రూ.)	బ్రాంచ్ పేరు
1.	శేఖర్ మాదిరాజు / దుర్గాదేవి మాదిరాజు LBHYD00004979600	రంగారెడ్డి జిల్లా, గండిపేట్ మండలం, మణికొండ జాగీర్ గ్రామము మరియు గ్రామ పంచాయతీ వద్ద సర్వే నెం. 246/1లో పూర్తి విస్తీర్ణము ఎకరాలు 67-16 గుంటలునకు గాను 20.59 చ।।గ।।లు లేదా 17.22 చ।।మీ సమానమైన విస్తీర్ణముతో 465 చ।।అ।।ల సూపర్ బిల్టప్ ఏరియా కలిగియున్న ఎల్ఐజి బ్లాక్-14లో 1వ అంతస్తు నందు ఫ్లాట్ నెం. 206 మొత్తం. సరిహద్దులు : ఉత్తరం : ఫ్లాట్ నెం. 205, దక్షిణం: ఓపెన్ టు స్కై లిఫ్ట్, తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: కారిడార్, భూమి కొరకు సరిహద్దులు: ఉత్తరం : రాయదుర్గ్ నయహల్సా గ్రామ సరిహద్దు, దక్షిణం: సర్వే నెం. 71, 244, 245, 247, 248 & 246/2, మణికొండ జాగీర్ గ్రామం యొక్క భూమి. తూర్పు: మణికొండ జాగీర్ గ్రామం యొక్క సర్వే నెం.80లో భూమి, పడమర: ఖాజాగూడ గ్రామం సరిహద్దు / లాంఛనప్రాయ స్వాధీనం తేది: 14.08.2024	13/05/2024 Rs. 15,22,022.00/-	హైదరాబాద్

పైన పేర్కొన్న రుణగ్రహీత(లు)/హామీదారు(లు), మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు 30 రోజుల ప్రకటన ఇవ్వబడింది, ఒకవేళ బకాయిల చెల్లింపులో విఫలమైనట్లయితే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తర్వాత తాకట్టుపెట్టిన ఆస్తులు విక్రయించబడును.

తేది: 17 ఆగస్టు, 2024
ప్రదేశం: హైదరాబాద్

అధీకృత అధికారి,
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్.

యూపీఐ ద్వారా కరెంటు బిల్లులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కరెంటు బిల్లుల్ని ఇకపై గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎమ్ వంటి యూపీఐ పేమెంట్స్ ద్వారా కూడా చెల్లించవచ్చని ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు తెలిపాయి. యూపీఐ పేమెంట్స్ సంస్థలు భారత్ పేతో తప్పనిసరిగా అనుసంధానం కావాలనే రిజర్వుబ్యాంకు షరతుల నేపథ్యంలో రెండు నెలలుగా ప్రభుత్వ ట్రెజరీ చెల్లింపుల్ని నిలిపివేశారు. తాజాగా ఆయా సంస్థలు భారత్‌పేతో అనుసంధానం అయిన దృష్ట్యా ఈ సేవల్ని పునరుద్ధరిస్తున్నట్టు తెలిపారు.

YES BANK బ్రాంచ్ ఆఫీస్: నెం.1-8-387, HUDA లేను, అగ్రవన్ని ప్లాజా, 2వ అంతస్తు, off ఎస్.పి.రోడ్డు, సికింద్రాబాద్-500003. తెలంగాణా

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)

కస్టమర్ ఐడి 9878921, క్యాష్ క్రెడిట్ ఖాతా నెం.9784600003495, టెర్మ్‌లోన్ ఖాతా నెంలు 097LA40213120001 & 097LA40202440003 మరియు లెటర్ ఆఫ్ క్రెడిట్ - ఖాతా నెంలు (594BM08241000001, 594BM08240750001, 594BM08240730001, 594BM08240790001, 594BM08240810001, 594BM08240820001, 594BM08240900001, 594BM08240870001

ఇందుమూలముగా YES బ్యాంక్ లిమిటెడ్ (అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ ("చట్టం") 2002, క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) 2002, రూల్సులోని చదువుకోవలసిన రూలు 3, చట్టంలోని అధికరణ 13(12) కింద సంక్రమించిన అధికారములను వినియోగించుకుంటూ మెస్సర్స్ నార్ ఇన్‌ఫ్రా ప్రై.లి., ప్రాతినిధ్యం వహిస్తున్న ఋణగ్రహీతలు శ్రీ అనిల్‌రెడ్డి సూరకలపాటి, (డైరెక్టర్ & హామీదారు), శ్రీమతి పార్వతి రెడ్డి సూరకలపాటి (డైరెక్టర్ & హామీదారు), శ్రీ అనుట్టం రెడ్డి సూరకలపాటి (డైరెక్టర్ & హామీదారు) వారిని డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన బకాయిలు పూర్తిగా వసూలు అగునంతవరకు మాచే చేయబడిన ఖర్చులు **తేది.25.04.2024 నాటికి రూ.7,19,87,915.44 (అక్షరాలా ఏడు కోట్ల పంతొమ్మిది లక్షల ఎనభై ఏడు వేల తొమ్మిది వందల పదిహేను రూపాయల నలభై నాలుగు పైసలు మాత్రమే)** కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, ఖర్చులు, చార్జీలు, మొదలగు వాటిపై మరింత వడ్డీతో కలిపి చెల్లించమని కోరుతూ సెక్షన్ 13(2) ప్రకారం **తేది.25.04.2024 న డిమాండ్ నోటీసు** ను జారీ చేయడమైనది.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున సదరు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్సు 2002 రూల్స్ యొక్క రూల్ 8తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని **ది.17.08.2024 న స్వాధీనం** చేసుకొన్నారని ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్ని కోరునది ఏమనగా దిగువ పేర్కొనిన ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరుపరాదని ఇందుమూలముగా హెచ్చరించడమైనది మరియు సదరు ఆస్తితో ఏమైనా లావాదేవీలు జరిపినట్లయితే **తేది.25.04.2024 నాటికి రూ.7,19,87,915.44 (అక్షరాలా ఏడు కోట్ల పంతొమ్మిది లక్షల ఎనభై ఏడు వేల తొమ్మిది వందల పదిహేను రూపాయల నలభై నాలుగు పైసలు మాత్రమే)** కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ, ఖర్చులు, చార్జీలు, మొదలగు చెల్లించవలసిన ఇతర సొమ్ములు అన్నింటితో కలుపుకుని దిగువ తెలిపిన సొమ్ము కోసం నిబంధనలకు లోబడి YES బ్యాంక్ లిమిటెడ్ వసూలు చేయును.

దయచేసి గమనించండి ఏమనగా ముందు చెప్పబడిన చట్టంలోని అధికరణ 13(8) కింద అమ్మకం లేదా బదిలీ కోసం నిర్ణయించిన తేదీకి ముందుగా ఏ సమయంలోనైనా, మాకు అయిన అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో కలుపుకుని మా బకాయిలు చెల్లించిన సందర్భంలో సెక్యూర్డ్ ఆస్తి మాచే అమ్మబడదు లేదా బదిలీ చేయబడదు మరియు ఆ సెక్యూర్డ్ ఆస్తి యొక్క అమ్మకం లేదా బదిలీ కోసం మాచే ఎటువంటి తదుపరి చర్యలు తీసుకోబడవు.

స్థిరాస్తి వివరములు:

ఆస్తి-1: సేల్ డీడ్ నెం.4021 ఆఫ్ 2001
తనఖా ఉంచిన ఆస్తి వివరాలు: తెలంగాణ, హైదరాబాద్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ అర్బన్ జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ, షేక్‌పేట గ్రామంలోని దేవరకొండ నగర్ వద్ద సర్వే నెం.93, నెం.3 గా గల 598 చ।।గ।।లు లేదా 499.92 చ।।మీ।।ల భూమినకు **హద్దులు: ఉత్తరం:** ఓపెన్ స్పేస్, **దక్షిణం:** 40అ।। వెడల్పు రోడ్డు, **తూర్పు:** ప్లాట్ నెం.4 & ఓపెన్ ఏరియా (ఎం.సి.హెచ్ పార్క్), **పడమర:** ప్లాట్ నెం.3 ఇతర భాగం. **తనఖాదారు: శ్రీ ఎస్.అనిల్ రెడ్డి**

ఆస్తి-2: సేల్ డీడ్ నెం.2367 ఆఫ్ 2001
తనఖా ఉంచిన ఆస్తి వివరాలు: తెలంగాణ, హైదరాబాద్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ అర్బన్ జూబ్లీహిల్స్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ, షేక్‌పేట గ్రామంలోని దేవరకొండ నగర్ వద్ద సర్వే నెం.93, నెం.3 గా గల 598 చ।।గ।।లు లేదా 499.92 చ।।మీ।।ల భూమినకు **హద్దులు: ఉత్తరం:** ఓపెన్ స్పేస్, **దక్షిణం:** 40అ।। వెడల్పు రోడ్డు, **తూర్పు:** ప్లాట్ నెం.3 ఇతర భాగం, **పడమర:** ఓపెన్ ఏరియా. **తనఖాదారు: శ్రీ ఎస్.అనిల్ రెడ్డి**

ఆస్తి-3: సేల్ డీడ్ నెం.1535 ఆఫ్ 2003
తనఖా ఉంచిన ఆస్తి వివరాలు: మహేశ్వరం సబ్-జిల్లా రిజిస్ట్రేషన్, రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, తుమ్మలూరు రెవెన్యూ గ్రామం మరియు గ్రామ పంచాయితీ వద్ద సర్వే నెం.254, విస్తీర్ణం ఎ.1-00 Gts, మొత్తం విస్తీర్ణం ఎ.1-00 Gts భూమినకు **హద్దులు: ఉత్తరం:** శ్రీమతి ఎస్ పార్వతిరెడ్డి గారి భూమి, **దక్షిణం:** రాజమౌని సత్తయ్య మరియు ఆర్.రాములు గారి భూమి, **తూర్పు:** 100'-0" వెడల్పు ఆర్&బి రోడ్డు (శ్రీశైలం టు హైదరాబాద్), **పడమర:** రాజమౌని సత్తయ్య మరియు ఆర్.రాములు గారి భూమి. **తనఖాదారు: శ్రీమతి ఎస్.పార్వతి రెడ్డి.**

ఆస్తి-4: సేల్ డీడ్ నెం.634 ఆఫ్ 2001
తనఖా ఉంచిన ఆస్తి వివరాలు: మహేశ్వరం సబ్-జిల్లా రిజిస్ట్రేషన్, రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, తుమ్మలూరు రెవెన్యూ గ్రామం మరియు గ్రామ పంచాయితీ వద్ద సర్వే నెం.254, విస్తీర్ణం ఎ.2-01 Gts భూమినకు **హద్దులు: ఉత్తరం:** సుధాకర్‌రెడ్డి గారి వ్యవసాయ భూమి తరువాత బాట, **దక్షిణం:** సర్వే నెం.254లోని భూమి భాగం, **తూర్పు:** ఆర్&బి రోడ్డు హైదరాబాద్ నుండి శ్రీశైలం, **పడమర:** సర్వే నెం.254లోని భూమి భాగం.
తనఖాదారు: శ్రీమతి ఎస్.పార్వతి రెడ్డి.

తేది : 18.08.2024
స్థలం : హైదరాబాద్

సం/-అధీకృత అధికారి
(కె రఘు ప్రసాద్)

STARLITE GLOBAL ENTERPRISES (INDIA) LIMITED

CIN: L17110TG1962PLC000915
Reg Off: Office No.603, Shangrila Plaza, Plot No-14, Road No.2, Banjara Hills, Hyderabad – 500 034, Telangana
Tel: +91-40-40909988, Fax: +91-40-40909900
Email: info@starliteglobal.in website: https://www.starlitegroup.co.in

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్-1 హైదరాబాద్ వారి సమక్షంలో
కంపెనీ దరఖాస్తు నెం.సిఏ (సిఏఏ) నెం.23/230/హెచ్‌డిబి/2024
కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 230 నుండి 232 మరియు ఇతర వర్తించు ప్రొవిజన్స్ విషయంలో
మరియు
స్కీమ్ ఆఫ్ అమల్గమేషన్ విషయంలో
వీరి మధ్య
స్టార్‌లైట్ స్పిన్‌టెక్ లిమిటెడ్
మరియు
స్టార్‌లైట్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ (ఇండియా) లిమిటెడ్
మరియు
కంపెనీ యొక్క వారి సంబంధిత వాటాదారులు & రుణదాతల విషయంలో

స్టార్‌లైట్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ (ఇండియా) లిమిటెడ్, CIN: L17110TG1962PLC000915, ఇండియన్ కంపెనీల చట్టం, 2013లోని ఇన్‌కార్పొరేట్ అయినది మరియు కంపెనీల చట్టం, 2013లోని అర్థంలోపు పబ్లిక్ లిస్టెడ్ కంపెనీ మరియు దీని రిజిస్టర్డు ఆఫీస్: 603, షంగ్రీల ప్లాజా, ప్లాట్ నెం.14, రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034, తెలంగాణ వద్ద కలిగియుండి.	ట్రాన్స్‌ఫెరీ కంపెనీ

ఈక్విటీ వాటాదారుల సమావేశం ప్రకటనకు సంబంధించిన నోటీసు మరియు అడ్వర్‌టైజ్‌మెంట్

ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా తేది.05 ఆగస్టు, 2024 నాటి ఉత్తర్వు ('ఆర్డర్'), గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్-1, హైదరాబాద్ వారు కంపెనీల చట్టం, 2013 ('ది చట్టం')లోని సెక్షన్ 230 నుండి 232 మరియు అందులోని వర్తించు రూల్స్‌ను అనుసరించి స్టార్‌లైట్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ (ఇండియా) లిమిటెడ్ (**ట్రాన్స్‌ఫెరీ కంపెనీ/"ఎస్‌జిఇఐఎల్"**) మరియు వారి సంబంధిత వాటాదారులు మరియు క్రెడిటర్ ('స్కీమ్')తో స్టార్‌లైట్ స్పిన్‌టెక్ లిమిటెడ్ (**"ట్రాన్స్‌ఫెరర్ కంపెనీ"/ఎస్ఎస్ఎల్"**) మధ్య స్కీమ్ ఆఫ్ అమాల్గమేషన్‌ను మార్పులతో లేదా మార్పులు లేకుండా ఆమోదించుటకు సంబంధించి ఆలోచన సరిపోతే మరియు పరిగణించుట నిమిత్తం **స్టార్‌లైట్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ (ఇండియా) లిమిటెడ్ (ట్రాన్స్‌ఫెరీ కంపెనీ")** యొక్క ఈక్విటీ వాటాదారుల సమావేశం నిర్వహించుటకు ఆదేశిస్తున్నారు.

గౌరవ ట్రిబ్యునల్‌చే జారీచేసిన ఉత్తర్వును అనుసరించి మరియు ఆదేశిస్తున్నట్లుగా తదుపరిగా నోటీసు ఇవ్వడమేమనగా ట్రాన్స్‌ఫెరీ కంపెనీ యొక్క ఈక్విటీ వాటాదారుల సమావేశం కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసిఏ సర్క్యులర్లు')చే జారీచేసిన సర్క్యులర్లతోకలిపి వర్తించు చట్టాలతోఅనుసరించి వీడియో కాన్ఫరెన్స్ మరియు ఇతర ఆడియో విజువల్ మీన్స్ ద్వారా **సోమవారం, 16 సెప్టెంబర్, 2024న మ.02.30గం.లు** (ఐఎస్టీకి) నిర్వహించబడును, సదరు ఈక్విటీ వాటాదారులు సమావేశానికి హాజరు అవ్వల్సిందిగా కోరడమైనది. వివరణాత్మక ప్రకటనకు అనుబంధంగా కంపెనీస్ (కాంప్రమైజెస్, అరేంజ్‌మెంట్స్ మరియు అమల్గమేషన్) రూల్స్, 2016లోని రూల్6తో చదవగల చట్టంలోని సెక్షన్ 203(3) మరియు 102 క్రింద అవసరార్థం వివరణాత్మక ప్రకటనను తేది.14 ఆగస్టు, 2024నాటి సమావేశపు నోటీసును ఎలక్ట్రానిక్ డిస్పాచ్ కంపెనీ పూర్తి చేసింది. 9 ఆగస్టు, 2024 నాటికి సభ్యుల రిజిస్టర్/ బెనిఫిషియల్ ఓనర్స్ లిస్ట్‌లో పేర్లు కనిపిస్తున్న మరియు సిఐఎల్ సెక్యూరిటీస్ లిమిటెడ్, ట్రాన్స్‌ఫెరీ కంపెనీ ('కంపెనీ') యొక్క రిజిస్ట్రార్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్‌తో ఇమెయిల్ అడ్రస్‌లను రిజిస్టరైన అట్టి ఈక్విటీ వాటాదారులకు ఎలక్ట్రానిక్ విధానం ద్వారా వివరాలు పంపబడినవి. నోటీసు కంపెనీ వెబ్‌సైట్‌లో ఉంచబడింది మరియు సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ (సిడిఎస్ఎల్) వెబ్‌సైట్స్ అనగా https://www.evotingindia.com/ and MSEI https://www.msei.in/ లో కూడా అందుబాటులోఉన్న హెడ్ స్కీమ్ ఆఫ్ మెర్జర్& అమాల్గమేషన్ కింద %http://starlite global.in/investors/ వద్ద యాక్సెస్ చేయవచ్చు.

షేర్‌హోల్డర్‌లు కోరుకుంటే, info@starliteglobal.in వద్ద ఇమెయిల్ ద్వారా ట్రాన్స్‌ఫెరీ కంపెనీకి షేర్ హోల్డింగ్ వివరాలతో పాటు అభ్యర్థనను పంపడం ద్వారా ట్రాన్స్‌ఫెరీ కంపెనీ రిజిస్టర్డ్ ఆఫీసులో సమావేశం జరిగే తేదీ వరకు అన్ని పని దినాలలో ఉ.10:00గం.ల నుండి సా.5:00 మధ్య కంపెనీ నుండి వివరణాత్మక ప్రకటన మరియు అనుబంధాలతో పాటు నోటీసు కాపీని ఉచితంగా పొందవచ్చు. కాబట్టి, గౌరవనీయ ట్రిబ్యునల్ జారీచేసే ఉత్తర్వు అనుగుణంగా మరియు ఎంసిఏ సర్క్యులర్‌లకు అనుగుణంగా వీసీ/ ఓఏవిఎం ద్వారా సమావేశం నిర్వహించబడుతోంది.

శ్రీ శ్రీకాంత్ రాఠీ, అడ్వకేట్ వారిని సమావేశానికి ఛైర్మన్‌గా మరియు శ్రీ టాటా యశవి గౌడ్‌ను సమావేశానికి స్క్రూటినైజర్‌గా గౌరవ ట్రిబ్యునల్ నియమించింది. ఈ స్కీమ్, ఈక్విటీ వాటాదారులచే ఆమోదించబడినట్లయితే, గౌరవనీయ ట్రిబ్యునల్ యొక్క తదుపరి ఆమోదానికి మరియు అవసరమైన సదరు ఇతర రెగ్యులేటరీ ఆమోదాలకు లోబడి ఉంటుంది.

కంపెనీస్ (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014 (సవరించబడిన)లోని రూల్ 20 మరియు సెబీ (ఎల్ఓడిఆర్) రెగ్యులేషన్స్, 2015 (సవరించబడిన)లోని రెగ్యులేషన్ 44తో చదవగల కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 108లోని నిబంధనలకు అనుగుణంగా సిడిఎస్ఎల్ అందించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టమ్ (ఇ-ఓటింగ్) ద్వారా నోటీసులో పేర్కొన్న అన్ని తీర్మానాలపై వారి ఓట్లను వేసే సౌకర్యం సభ్యులకు కల్పించబడినది. సభ్యుల ఓటింగ్ హక్కులు **సోమవారం, సెప్టెంబర్ 9, 2024 ("ఇ-ఓటింగ్ కోసం కటాఫ్ తేదీ")**నాటికి కంపెనీ యొక్క చెల్లించి ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో వారు కలిగి ఉన్న ఈక్విటీ షేర్లకు అనులోమానుపాతంలో ఉంటాయి.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ సీక్వెన్స్ నెంబర్ (EVSN)	240813030
రిమోట్ ఇ-ఓటింగ్ ప్రారంభ తేదీ & సమయం	గురువారం, 12 సెప్టెంబర్, 2024 ఉ.9.00గం.లు (ఐఎస్టీకి)
రిమోట్ ఇ-ఓటింగ్ ముగింపు తేదీ & సమయం	ఆదివారం, 15 సెప్టెంబర్, 2024 సా.5.00గం.లు (ఐఎస్టీకి)

ఈ సమయంలో, సభ్యులు తమ ఓట్లను ఎలక్ట్రానిక్ పద్ధతిలో వేయవచ్చు. రిమోట్ ఇ-ఓటింగ్ మాడ్యూల్ ఆ తర్వాత సిడిఎస్ఎల్ ద్వారా నిలిపివేయబడుతుంది. మీటింగ్‌లో హాజరైన సభ్యులు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా తీర్మానాలపై ఓట్లు వేయని మరియు అలా చేయకుండా డిబార్ చేయబడని వారు సమావేశంలో ఓటు వేయడానికి అర్హులు. సమావేశానికి ముందు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా ఓటు వేసిన సభ్యులు కూడా సమావేశానికి హాజరు కావచ్చు/ పాల్గొనవచ్చు కానీ మళ్లీ ఓటు వేసే అర్హత ఉండదు. భౌతిక రూపంలో వాటాలను కలిగిఉన్న లేదా కంపెనీతో వారి ఇమెయిల్ చిరునామాను నమోదు చేసుకోని /అప్‌డేట్ చేయని సభ్యులు, మీ పేరు, ఇమెయిల్ ఐడి, ఫోలియో నెంబరు, నిర్వహించిన వాటాల సంఖ్య, సర్టిఫికేట్ నంబర్, వరుస సంఖ్యలు మరియు పూర్తి చిరునామాతో పాటు పాన్ కార్డ్ యొక్క స్వీయ-ధృవీకరణ కాపీని సంఖ్యను పేర్కొంటూ సంతకం చేసిన అభ్యర్థన లేఖను info@starliteglobal.in వద్ద కంపెనీ ఇమెయిల్ అడ్రస్‌కు లేదా కంపెనీ రిజిస్ట్రార్ అనగా సిఐఎల్ సెక్యూరిటీకు rta@cilsecurities.com వద్ద పంపించుం ద్వారా వాటిని నమోదు/ అప్‌డేట్ చేసుకోవచ్చును. కంపెనీలో ఇమెయిల్ అడ్రస్‌లను నమోదు చేసుకోని సభ్యులు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా ఓటు వేయడానికి వివరణాత్మక ప్రకటనతో పాటు నోటీసును స్వీకరించడానికి అభ్యర్థించవచ్చు మరియు info@starliteglobal.inకు ఇమెయిల్ ద్వారా ఇ-ఓటింగ్ వివరాల కోసం కూడా అభ్యర్థించవచ్చు.

కంపెనీ ఎలక్ట్రానిక్‌గా నోటీసు పంపిన తర్వాత కంపెనీ షేర్‌లను పొంది, కంపెనీ సభ్యుడిగా మారిన మరియు ఇ-ఓటింగ్‌కు కటాఫ్ తేదీ అనగా **9 సెప్టెంబర్, 2024** నాటికి షేర్‌లను కలిగిఉన్న ఎవరైనా వ్యక్తి కంపెనీకి info@starliteglobal.in వద్ద అభ్యర్థనను పంపడం లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ని పొందవచ్చు. అయితే, రిమోట్ ఇ-ఓటింగ్ కోసం అతను/ఆమె ఇప్పటికే సిడిఎస్ఎల్‌తో రిజిస్టర్ అయిఉంటే, అతను/ఆమె వారి ఓట్లు వేయడానికి అతని/ఆమె ఇప్పటికే ఉన్న యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉపయోగించవచ్చు. ఇ-ఓటింగ్‌కు సంబంధించి మీకు ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే, మీరు తరచుగా అడిగే ప్రశ్నలు ("ఎఫ్ఏక్యూలు") మరియు హెల్ప్ సెక్షన్ క్రింద www.evotingindia.comలో అందుబాటులో ఉన్న ఇ-ఓటింగ్ మాన్యువల్‌ని చూడవచ్చు లేదా helpdesk.evoting@cdslindia.com కి ఇమెయిల్ వ్రాయవచ్చు లేదా శ్రీ.నితిన్ కుందర్ (022-23058738) లేదా శ్రీ. ఫతేష్ పింపుట్కర్ (022-23058543) లేదా శ్రీ.రాకేష్ దాల్వి (022-23058542) వారిని సంప్రదించవచ్చు.

సమావేశం యొక్క నోటీసులో పేర్కొన్న తీర్మానంపై ఓటింగ్ ఫలితాలు కంపెనీ వెబ్‌సైట్‌లో ప్రకటించబడతాయి. స్క్రూటినైజర్ నివేదికతో పాటుగా ప్రకటించిన ఫలితాలు కంపెనీ వెబ్‌సైట్:http://www.starliteglobal.in/investors/ మరియు సిడిఎస్ఎల్ వెబ్‌సైట్‌లో చైర్మన్ లేదా అతనిచే అధికారం పొందిన వ్యక్తి ఫలితాలను ప్రకటించిన వెంటనే ఉంచబడతాయి మరియు ఫలితాలు స్టాక్ ఎక్స్ఛేంజీలకు అనగా ఎంఎస్ఇ https://www.msei.in/ కూడా తెలియజేయబడుతుంది.

స్టార్‌లైట్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ (ఇండియా) లిమిటెడ్ కొరకు
సం/-
శ్రీకాంత్ రాఠీ
స్టార్‌లైట్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ (ఇండియా) లిమిటెడ్ యొక్క ఈక్విటీ షేర్ హోల్డర్ల సమావేశానికి ఎన్‌సిఎల్‌టి నియమించిన చైర్‌పర్సన్

తేది: 16.08.2024
ప్రదేశం: హైదరాబాద్

STARLITE SPINTECH LIMITED

CIN: U18100TG1994PLC018016
Reg Off: #601, Shangrila Plaza, Plot No-14, Road No.2, Banjara Hills, Hyderabad – 500034, Telangana. Tel: +91-40-40909999, Fax: +91-40-40909900 Email: info@starlitegroup.co.in
website: https://www.starlitegroup.co.in

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ హైదరాబాద్ బెంచ్-1 హైదరాబాద్ వారి సమక్షంలో
కంపెనీ దరఖాస్తు నెం.సిఏ (సిఏఏ) నెం.23/230/హెచ్‌డిబి/2024
కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 230 నుండి 232 మరియు
ఇతర వర్తించు ప్రొవిజన్స్ విషయంలో
మరియు
స్కీమ్ ఆఫ్ అమల్గమేషన్ విషయంలో
వీరి మధ్య
స్టార్‌లైట్ స్పిన్‌టెక్ లిమిటెడ్
మరియు
స్టార్‌లైట్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ (ఇండియా) లిమిటెడ్
మరియు
కంపెనీ యొక్క వారి సంబంధిత వాటాదారులు & రుణదాతల విషయంలో

స్టార్‌లైట్ స్పిన్‌టెక్ లిమిటెడ్, CIN: U18100TG1994PLC018016, ఇండియన్ కంపెనీల చట్టం, 2013లోని ఇన్‌కార్పొరేట్ అయినది మరియు కంపెనీల చట్టం, 2013లోని అర్థంలోపు పబ్లిక్ లిస్టెడ్ కంపెనీ మరియు దీని రిజిస్టర్డు ఆఫీస్: 601, షంగ్రీల ప్లాజా, ప్లాట్ నెం.14, రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034, తెలంగాణ వద్ద కలిగియుండి.	ట్రాన్స్‌ఫెరర్ కంపెనీ

ఈక్విటీ వాటాదారుల సమావేశం ప్రకటనకు సంబంధించిన నోటీసు మరియు అడ్వర్‌టైజ్‌మెంట్

ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా తేది.05 ఆగస్టు, 2024 నాటి ఉత్తర్వు ('ఆర్డర్'), గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్-1, హైదరాబాద్ వారు కంపెనీల చట్టం,2013 ('ది చట్టం')లోని సెక్షన్ 230 నుండి 232 మరియు అందులోని వర్తించు రూల్స్‌ను అనుసరించి స్టార్‌లైట్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ (ఇండియా) లిమిటెడ్ (**ట్రాన్స్‌ఫెరీ కంపెనీ/"ఎస్‌జిఇఐఎల్"**) మరియు వారి సంబంధిత వాటాదారులు మరియు క్రెడిటర్ ('స్కీమ్')తో స్టార్‌లైట్ స్పిన్‌టెక్ లిమిటెడ్ (**"ట్రాన్స్‌ఫెరర్ కంపెనీ"/ఎస్ఎస్ఎల్"**) మధ్య స్కీమ్ ఆఫ్ అమాల్గమేషన్‌ను మార్పులతో లేదా మార్పులు లేకుండా ఆమోదించుటకు సంబంధించి ఆలోచన సరిపోతే మరియు పరిగణించుట నిమిత్తం **స్టార్‌లైట్ స్పిన్‌టెక్ లిమిటెడ్ ("ట్రాన్స్‌ఫెరర్ కంపెనీ")** యొక్క ఈక్విటీ వాటాదారుల సమావేశం నిర్వహించుటకు ఆదేశిస్తున్నారు.

గౌరవ ట్రిబ్యునల్‌చే జారీచేసిన ఉత్తర్వును అనుసరించి మరియు ఆదేశిస్తున్నట్లుగా తదుపరిగా నోటీసు ఇవ్వడమేమనగా ట్రాన్స్‌ఫెరీ కంపెనీ యొక్క ఈక్విటీ వాటాదారుల సమావేశం కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసిఏ సర్క్యులర్లు')చే జారీచేసిన సర్క్యులర్లతోకలిపి వర్తించు చట్టాలతోఅనుసరించి వీడియో కాన్ఫరెన్స్ మరియు ఇతర ఆడియో విజువల్ మీన్స్ ద్వారా **సోమవారం, 16 సెప్టెంబర్, 2024న మ.12.30గం.లు** (ఐఎస్టీకి) నిర్వహించబడును, సదరు ఈక్విటీ వాటాదారులు సమావేశానికి హాజరు అవ్వల్సిందిగా కోరడమైనది. వివరణాత్మక ప్రకటనకు అనుబంధంగా కంపెనీస్ (కాంప్రమైజెస్, అరేంజ్‌మెంట్స్ మరియు అమల్గమేషన్) రూల్స్, 2016లోని రూల్ 6తో చదవగల చట్టంలోని సెక్షన్ 203(3) మరియు 102 క్రింద అవసరార్థం వివరణాత్మక ప్రకటనను తేది.14 ఆగస్టు, 2024నాటి సమావేశపు నోటీసును ఎలక్ట్రానిక్ డిస్పాచ్ కంపెనీ పూర్తి చేసింది. 9 ఆగస్టు, 2024 నాటికి సభ్యుల రిజిస్టర్/ బెనిఫిషియల్ ఓనర్స్ లిస్ట్‌లో పేర్లు కనిపిస్తున్న మరియు సిఐఎల్ సెక్యూరిటీస్ లిమిటెడ్, ట్రాన్స్‌ఫెరర్ కంపెనీ ('కంపెనీ') యొక్క రిజిస్ట్రార్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్‌తో ఇమెయిల్ అడ్రస్‌లను రిజిస్టరైన అట్టి ఈక్విటీ వాటాదారులకు ఎలక్ట్రానిక్ విధానం ద్వారా వివరాలు పంపబడినవి. నోటీసు కంపెనీ వెబ్‌సైట్‌లో ఉంచబడింది మరియు సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ (సిడిఎస్ఎల్) వెబ్‌సైట్స్ అనగా https://www.evotingindia.com/ and MSEI https://www.msei.in/ లో కూడా అందుబాటులోఉన్న హెడ్ స్కీమ్ ఆఫ్ మెర్జర్& అమాల్గమేషన్ కింద http://starliteglobal.in/investors/ వద్ద యాక్సెస్ చేయవచ్చు.

షేర్‌హోల్డర్‌లు కోరుకుంటే, info@starlitegroup.co.in వద్ద ఇమెయిల్ ద్వారా ట్రాన్స్‌ఫెరర్ కంపెనీకి షేర్ హోల్డింగ్ వివరాలతో పాటు అభ్యర్థనను పంపడం ద్వారా ట్రాన్స్‌ఫెరర్ కంపెనీ రిజిస్టర్డ్ ఆఫీసులో సమావేశం జరిగే తేదీ వరకు అన్ని పని దినాలలో ఉ.10:00గం.ల నుండి సా.5:00 మధ్య కంపెనీ నుండి వివరణాత్మక ప్రకటన మరియు అనుబంధాలతో పాటు నోటీసు కాపీని ఉచితంగా పొందవచ్చు. కాబట్టి, గౌరవనీయ ట్రిబ్యునల్ జారీచేసే ఉత్తర్వు అనుగుణంగా మరియు ఎంసిఏ సర్క్యులర్‌లకు అనుగుణంగా వీసీ/ఓఏవిఎం ద్వారా సమావేశం నిర్వహించబడుతోంది.

శ్రీ ఇ.సతీష్ కుమార్, అడ్వకేట్ వారిని సమావేశానికి ఛైర్మన్‌గా మరియు శ్రీ.సాయి సుమేధ్ యనవిను సమావేశానికి స్క్రూటినైజర్‌గా గౌరవ ట్రిబ్యునల్ నియమించింది. ఈ స్కీమ్, ఈక్విటీ వాటాదారులచే ఆమోదించబడినట్లయితే, గౌరవనీయ ట్రిబ్యునల్ యొక్క తదుపరి ఆమోదానికి మరియు అవసరమైన సదరు ఇతర రెగ్యులేటరీ ఆమోదాలకు లోబడి ఉంటుంది.

కంపెనీస్ (మేనేజ్‌మెంట్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014 (సవరించబడిన)లోని రూల్ 20 మరియు సెబీ (ఎల్ఓడిఆర్) రెగ్యులేషన్స్, 2015 (సవరించబడిన)లోని రెగ్యులేషన్ 44తో చదవగల కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 108లోని నిబంధనలకు అనుగుణంగా సిడిఎస్ఎల్ అందించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టమ్ (ఇ-ఓటింగ్) ద్వారా నోటీసులో పేర్కొన్న అన్ని తీర్మానాలపై వారి ఓట్లను వేసే సౌకర్యం సభ్యులకు కల్పించబడినది. సభ్యుల ఓటింగ్ హక్కులు **సోమవారం, సెప్టెంబర్ 9, 2024 ("ఇ-ఓటింగ్ కోసం కటాఫ్ తేదీ")** నాటికి కంపెనీ యొక్క చెల్లించి ఈక్విటీ షేర్ క్యాపిటల్‌లో వారు కలిగి ఉన్న ఈక్విటీ షేర్లకు అనులోమానుపాతంలో ఉంటాయి.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ సీక్వెన్స్ నెంబర్ (EVSN)	240814029
రిమోట్ ఇ-ఓటింగ్ ప్రారంభ తేదీ & సమయం	గురువారం, 12 సెప్టెంబర్, 2024 ఉ.9.00గం.లు (ఐఎస్టీకి)
రిమోట్ ఇ-ఓటింగ్ ముగింపు తేదీ & సమయం	ఆదివారం, 15 సెప్టెంబర్, 2024 సా.5.00గం.లు (ఐఎస్టీకి)

ఈ సమయంలో, సభ్యులు తమ ఓట్లను ఎలక్ట్రానిక్ పద్ధతిలో వేయవచ్చు. రిమోట్ ఇ-ఓటింగ్ మాడ్యూల్ ఆ తర్వాత సిడిఎస్ఎల్ ద్వారా నిలిపివేయబడుతుంది. మీటింగ్‌లో హాజరైన సభ్యులు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా తీర్మానాలపై ఓట్లు వేయని మరియు అలా చేయకుండా డిబార్ చేయబడని వారు సమావేశంలో ఓటు వేయడానికి అర్హులు. సమావేశానికి ముందు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా ఓటు వేసిన సభ్యులు కూడా సమావేశానికి హాజరు కావచ్చు/ పాల్గొనవచ్చు కానీ మళ్లీ ఓటు వేసే అర్హత ఉండదు. భౌతిక రూపంలో వాటాలను కలిగిఉన్న లేదా కంపెనీతో వారి ఇమెయిల్ చిరునామాను నమోదు చేసుకోని /అప్‌డేట్ చేయని సభ్యులు, మీ పేరు, ఇమెయిల్ ఐడి, ఫోలియో నెంబరు, నిర్వహించిన వాటాల సంఖ్య, సర్టిఫికేట్ నంబర్, వరుస సంఖ్యలు మరియు పూర్తి చిరునామాతో పాటు పాన్ కార్డ్ యొక్క స్వీయ-ధృవీకరణ కాపీని సంఖ్యను పేర్కొంటూ సంతకం చేసిన అభ్యర్థన లేఖను info@starlitegroup.co.in వద్ద కంపెనీ ఇమెయిల్ అడ్రస్‌కు లేదా కంపెనీ రిజిస్ట్రార్ అనగా సిఐఎల్ సెక్యూరిటీకు rta@cilsecurities.com వద్ద పంపించుం ద్వారా వాటిని నమోదు/ అప్‌డేట్ చేసుకోవచ్చును. కంపెనీలో ఇమెయిల్ అడ్రస్‌లను నమోదు చేసుకోని సభ్యులు రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా ఓటు వేయడానికి వివరణాత్మక ప్రకటనతోపాటు నోటీసును స్వీకరించడానికి అభ్యర్థించవచ్చు మరియు info@ starlitegroup.co.inకు ఇమెయిల్ ద్వారా ఇ-ఓటింగ్ వివరాల కోసం కూడా అభ్యర్థించవచ్చు.

కంపెనీ ఎలక్ట్రానిక్‌గా నోటీసు పంపిన తర్వాత కంపెనీ షేర్‌లను పొంది, కంపెనీ సభ్యుడిగా మారిన మరియు ఇ-ఓటింగ్‌కు కటాఫ్ తేదీ అనగా **9 సెప్టెంబర్, 2024** నాటికి షేర్‌లను కలిగిఉన్న ఎవరైనా వ్యక్తి కంపెనీకి info@starlitegroup.co.in వద్ద అభ్యర్థనను పంపడం లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ని పొందవచ్చు. అయితే, రిమోట్ ఇ-ఓటింగ్ కోసం అతను/ఆమె ఇప్పటికే సిడిఎస్ఎల్‌తో రిజిస్టర్ అయిఉంటే, అతను/ఆమె వారి ఓట్లు వేయడానికి అతని/ఆమె ఇప్పటికే ఉన్న యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను ఉపయోగించవచ్చు. ఇ-ఓటింగ్‌కు సంబంధించి మీకు ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే, మీరు తరచుగా అడిగే ప్రశ్నలు ("ఎఫ్ఏక్యూలు") మరియు హెల్ప్ సెక్షన్ క్రింద www.evotingindia.comలో అందుబాటులో ఉన్న ఇ-ఓటింగ్ మాన్యువల్‌ని చూడవచ్చు లేదా helpdesk.evoting@cdslindia.com కి ఇమెయిల్ వ్రాయవచ్చు లేదా శ్రీ.నితిన్ కుందర్ (022-23058738) లేదా శ్రీ. ఫతేష్ పింపుట్కర్ (022-23058543) లేదా శ్రీ.రాకేష్ దాల్వి (022-23058542) వారిని సంప్రదించవచ్చు.

సమావేశం యొక్క నోటీసులో పేర్కొన్న తీర్మానంపై ఓటింగ్ ఫలితాలు కంపెనీ వెబ్‌సైట్‌లో ప్రకటించబడతాయి. స్క్రూటినైజర్ నివేదికతో పాటుగా ప్రకటించిన ఫలితాలు కంపెనీ వెబ్‌సైట్:http://www.starliteglobal.in/investors/ మరియు సిడిఎస్ఎల్ వెబ్‌సైట్‌లో చైర్మన్ లేదా అతనిచే అధికారం పొందిన వ్యక్తి ఫలితాలను ప్రకటించిన వెంటనే ఉంచబడతాయి మరియు ఫలితాలు స్టాక్ ఎక్స్ఛేంజీలకు అనగా ఎంఎస్ఇ https://www.msei.in/ కూడా తెలియజేయబడుతుంది.

స్టార్‌లైట్ స్పిన్‌టెక్ లిమిటెడ్ కొరకు
సం/-
శ్రీకాంత్ రాఠీ
స్టార్‌లైట్ స్పిన్‌టెక్ లిమిటెడ్ యొక్క ఈక్విటీ షేర్ హోల్డర్ల సమావేశానికి ఎన్‌సిఎల్‌టి నియమించిన చైర్‌పర్సన్

తేది: 16.08.2024
ప్రదేశం: హైదరాబాద్

లాంఛనప్రాయంగా స్వాధీనతా ప్రకటన

ICICI Bank బ్రాంచ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్., 4/10, మైత్రీ టవర్, బొమ్మనహళ్లి హెసూర్ మెయిన్ రోడ్, బెంగళూరు- 560068.

ICICI బ్యాంక్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్, రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తంను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేశారు.

బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలం చెందిన కారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ-పేర్కొన్న తేదీలలో చెప్పబడిన రూల్స్ యొక్క రూల్ 8తో చదవదగిన చెప్పబడిన చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో క్రింది సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకున్నారు. సదరు ఆస్తితో లావాదేవీలు జరుపరాదని ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాం. ఏదేని లావాదేవీలు జరుపదలచినవారు ICICI బ్యాంక్ లిమిటెడ్ వారికి చెల్లించుటకు లోబడి జరుపుకోవచ్చును.

క్ర. సం.	రుణగ్రహీత(ల) పేరు/లోన్ అకౌంట్ నెంబర్	ఆస్తి యొక్క వివరణ/ లాంఛనప్రాయంగా స్వాధీనతా తేదీ	డిమాండ్ నోటీసు తేదీ/ డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం (రూ.)	బ్రాంచ్ పేరు
1.	మూల సంధ్య / నారాయణరెడ్డి నాగారం / LBHYD00004552295 LBHYD00005412166	నెం.303 కలిగియున్న పాక్షికంగా-పూర్తయిన ఫ్లాట్ మొత్తం మరియు భాగం, 3వ అంతస్తులో, 1315 చ.అడుగుల బిల్ట్అప్ ఏరియాతోపాటు (కామన్ ఏరియాతో కలిపి) మరియు 100 చ.అడుగుల కారు పార్కింగ్ (నెం.9), అవిభాజ్య భూమిలో వాటా 50 చ.గజాలతోపాటు, (800 చ.గజాల నుంచి), "వెంకటేశ్వర నిలయం"గా పేరున్న కాంప్లెక్స్‌లో, బ్లాక్-ఎ, సర్వే నెం.107/8, కొంపల్లి గ్రామం మరియు గ్రామపంచాయతీ వద్ద ఉన్నది, దుండిగల్-గండిమైసమ్మ మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, టి.ఎస్., మరియు సరిహద్దులు ఈ విధంగా:- 3వ అంతస్తులోని ఫ్లాట్ నెం.303 యొక్క సరిహద్దులు:- ఉత్తరం:ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, తూర్పు :కారిడార్, పడమర: కారిడార్ & ఫ్లాట్ నెం. 302., భూమి యొక్క సరిహద్దులు:- ఉత్తరం: యజమాని యొక్క భూమి, దక్షిణం : ఫ్లాట్ నెంబర్లు : 36 & 49 & కె.శారద, ఎ. రమాదేవి, తూర్పు : 40' వెడల్పు రోడ్, పడమర: 40' వెడల్పు రోడ్ / లాంఛనప్రాయ స్వాధీనతా తేది / 12.08.2024.	12/03/2024 Rs. 33,74,156.00/-	హైదరాబాద్

పైన పేర్కొన్న రుణగ్రహీత(లు)/హామీదారు(లు), మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు 30 రోజుల ప్రకటన ఇవ్వబడింది, ఒకవేళ బకాయిల చెల్లింపులో విఫలమైనట్లయితే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తర్వాత తాకట్టుపెట్టిన ఆస్తులు విక్రయించబడును.

తేది : ఆగస్టు 17, 2024,
ప్రదేశం : హైదరాబాద్

నిజాయితీగా, అధీకృత సంతకందారు,
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ కొరకు.

లాంఛనప్రాయంగా స్వాధీనతా ప్రకటన

ICICI Bank బ్రాంచ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్., 4/10, మైత్రీ టవర్, బొమ్మనహళ్లి హెసూర్ మెయిన్ రోడ్, బెంగళూరు- 560068.

ICICI బ్యాంక్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్, రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తంను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేశారు.

బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలం చెందిన కారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ-పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదవదగిన సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో క్రింది సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకున్నారు. సదరు ఆస్తితో లావాదేవీలు జరుపరాదని ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాం. ఆ ఆస్తితో ఏవైనా లావాదేవీలు జరిపినచో ICICI బ్యాంక్ లిమిటెడ్ వారికి చెల్లించుటకు లోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీత(ల) పేరు/లోన్ అకౌంట్ నెంబర్	ఆస్తి యొక్క వివరణ/ లాంఛనప్రాయంగా స్వాధీనతా తేదీ:	డిమాండ్ నోటీసు తేదీ/ డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం:	బ్రాంచు పేరు:
1.	మేదురు సాయికుమార్/ యం ఎస్ పంచాక్షరం/ LBHYD00005491053	కొత్తగా నిర్మించబడిన ఫ్లాట్ నెం.401 మొత్తం మరియు భాగం, 4వ అంతస్తు, విస్తీర్ణం 1107చ.అ.లు(కామన్ ఏరియా మరియు కారు పార్కింగ్ స్థలం కలిపి), అవిభాజక భూమి విస్తీర్ణం 46చ.గజాలు, "సంజాన రెసిడెన్సీ"కలిగిన బిల్డింగ్‌లో, ఫ్లాట్ నెం.75 పైన,సర్వే నెం. 60లో మొత్తం విస్తీర్ణం 500చ.గజాలు, వార్డు నెం.8 వద్ద ఉన్నది, బ్లాక్: నెం.3, హనుమాన్‌నగర్. కర్మన్‌ఘాట్ గ్రామం, సరూర్‌నగర్ రెవెన్యూ మండలం, రంగారెడ్డి జిల్లా, గ్రేటర్ హైదరాబాదు మున్సిపాల్ కార్పొరేషన్, ఎల్.బి.నగర్ సర్కిల్ క్రింద ,రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా, ఎల్.బి.నగర్ మరియు **సరిహద్దులు ఈ విధంగా:మొత్తం భూమి యొక్క సరిహద్దులు:** ఉత్తరం:ఫ్లాట్ నెం.74,దక్షిణం :ఫ్లాట్ నెం.76,తూర్పు:30' వైడ్ రోడ్, పడమర:ఫ్లాట్ నెం.35. **ఫ్లాట్ నెం,401 యొక్క సరిహద్దులు:**ఉత్తరం:ఓపెన్ టు స్కై, దక్షిణం :ఓపెన్ టు స్కై, తూర్పు : ఓపెన్ టు స్కై, పడమర:కారిడార్ & ఫ్లాట్ నెం.లు. 402&403./లాంఛనప్రాయ స్వాధీనత/12.08.2024.	16/03/2024 Rs. 43,65,232.00/-	హైదరాబాద్
2.	సురేష్‌రెడ్డి గుడూరు/ గుడూరు రూప సంతోషి LBHYD00006021757/ LBHYD00006478695/ LBHYD00006343545/ LBHYD00006347411/ LBHYD00006074933/ LBHYD00006532388	**ఆస్తి యొక్క షెడ్యూల్ "ఎ"** :- మొత్తం మరియు భాగంగా ఉన్న ల్యాండ్ 3748.56 చ. గజాలు లేదా 3134.27చ.మీ.లు, లేదా ఎకి. 0-30.98 గుంటలు.... మొత్తం భూమి ఎం।। 04-38 గుంటలు, సర్వే నెం.12/ఎ/ఎ, & 12/ఎ/ఎ యొక్క వ్యవసాయ భాగం, పోచారం గ్రామం మరియు మున్సిపాలిటీ వద్ద ఉన్నది, ఘట్‌కేసర్ మండలం, మేడ్చల్-మాల్కాజ్‌గిరి జిల్లా, మరియు **సరిహద్దులు ఈ విధంగా:** ఉత్తరం: 30అడుగుల వైడ్ రోడ్డు, దక్షిణం:పారుగువారి భూమి, తూర్పు:పారుగువారి భూమి, పడమర: 120అడుగుల వైడ్ రోడ్, ఫ్లాట్ ఆస్తి యొక్క షెడ్యూల్ ఫ్లాట్ పాక్షికంగా పూర్తయిన ఫ్లాట్ నెం:జి9 మొత్తం, గ్రౌండ్ ఫ్లోర్, "మార్ రెసిడెన్సీ"పేరు ఉన్న భవనం విస్తీర్ణం 1430చ.అ.లు, కామన్ ఏరియా ఇరువురితో పాటు కారు పార్కింగ్ మరియు అనుపాతంలో గల అవిభాజ్య భూమి విస్తీర్ణం 57.32చ.గ.ల, షెడ్యూల్ భూమి యొక్క మొత్తం విస్తీర్ణం 3748.56 చ.గ.లు లేదా 3134.27చ.మీ., లేదా ఎకి. 0-30.98గుంటలు, సర్వే నెం.లు. 12/ఎ/ఎ, మరియు 12/ఎ/ఎ,పోచారం గ్రామం మరియు మున్సిపాలిటీ వద్ద ఉన్నది,ఘట్‌కేసర్ మండలం,మేడ్చల్-మాల్కాజ్‌గిరి జిల్లా , మరియు **సరిహద్దులు ఈ విధంగా:** ఉత్తరం:ఫ్లాట్ నెం.జి8 మరియు ఓపెన్ టు స్కై, దక్షిణం:ఫ్లాట్ నెం. జి10 మరియు ఓపేన్ టు స్కై, తూర్పు:6' 6" వైడ్ రోడ్, పడమర: ఓపేన్ టు స్కై/ లాంఛనప్రాయ స్వాధీనత తేది: /12.08.2024	09/02/2024 Rs. 65,38,496.00/-	హైదరాబాద్

పైన పేర్కొన్న రుణగ్రహీత(లు)/హామీదారు(లు), మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు 30 రోజుల ప్రకటన ఇవ్వబడింది, ఒకవేళ బకాయిల చెల్లింపులో విఫలమైనట్లయితే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తర్వాత తాకట్టుపెట్టిన ఆస్తులు విక్రయించబడును.

తేది: ఆగస్టు 17, 2024
ప్రదేశం: హైదారబాదు

నిజాయితీగా, అధీకృత సంతకందారు,
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ కొరకు.

లాంఛనప్రాయంగా స్వాధీనతా ప్రకటన

ICICI Bank బ్రాంచ్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్., 4/10, మైత్రీ టవర్, బొమ్మనహళ్లి హెసూర్ మెయిన్ రోడ్, బెంగళూరు- 560068.

ICICI బ్యాంక్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్, రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తంను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేశారు.

బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలం చెందిన కారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ-పేర్కొన్న తేదీలలో చెప్పబడిన రూల్స్ యొక్క రూల్ 8తో చదవదగిన చెప్పబడిన చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో క్రింది సంతకందారు దిగువ వివరించిన ఆస్తిని లాంఛనప్రాయంగా స్వాధీనం చేసుకున్నారు. సదరు ఆస్తితో లావాదేవీలు జరుపరాదని ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరిస్తున్నాం. ఏదేని లావాదేవీలు జరుపదలచినవారు ICICI బ్యాంక్ లిమిటెడ్ వారికి చెల్లించుటకు లోబడి జరుపుకోవచ్చును.

క్ర. సం.	రుణగ్రహీత(ల) పేరు/లోన్ అకౌంట్ నెంబర్	ఆస్తి యొక్క వివరణ/ లాంఛనప్రాయంగా స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేదీ/ డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తం (రూ.)	బ్రాంచ్ పేరు
1.	మంచిరాల శ్రీనాథ్ / వంగా సుప్మాగౌడ్ / LBHYD00006352027/ TBHYD00006311534	షెడ్యూల్ "ఎ" ఆస్తి :- వ్యవసాయ భూమి మొత్తం మరియు భాగం, విస్తీర్ణం: 9314.27 చ.గజాలు, సర్వే నెం.195 భాగం, 205 భాగం, 206 భాగం, కొంపల్లి మున్సిపాలిటీ వద్ద ఉన్నది, దుండిగల్-గండిమైసమ్మ మండలం, మేడ్చల్ జిల్లా., మరియు సరిహద్దులు:-ఉత్తరం: పొరుగువారి యొక్క భూమి, దక్షిణం : 60 అడుగుల రోడ్, తూర్పు : పొరుగువారి యొక్క భూమి, పడమర: పొరుగువారి యొక్క భూమి., ఆస్తి యొక్క షెడ్యూల్ (ఫ్లాట్ నెం.101, బి బ్లాక్):- నెం.101 కలిగిన ఫ్లాట్ మొత్తం, బి బ్లాక్, "మైరా" యొక్క మొదటి అంతస్తులో, 1735 చ.అడుగుల బిల్ట్-అప్ ఏరియా కలిగియున్నది (కామన్ ఏరియాతో కలిపి) మరియు స్టిల్ట్‌లో ఒక కారు పార్కింగ్, అవిభాజ్య భూమిలో వాటా 69 చ.గజాలతోపాటు, సర్వే నెం.195 భాగం, 205 భాగం, 206 భాగంలోని సౌకర్యాలు, కొంపల్లి మున్సిపాలిటీ యొక్క దుండిగల్-గండిమైసమ్మ మండలం, మేడ్చల్ జిల్లా.,మరియు సరిహద్దులు:-ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, తూర్పు :ఓపెన్ టు స్కై, పడమర: కారిడార్ / లాంఛనప్రాయ స్వాధీనతా తేది / 12.08.2024.	26/03/2024 Rs. 37,93,877.00/-	హైదరాబాద్
2.	నాగారం నారాయణరెడ్డి / మూల సంధ్య / LBHYD00005240570	నెం.303 కలిగియున్న పాక్షికంగా-పూర్తయిన ఫ్లాట్ మొత్తం మరియు భాగం, 3వ అంతస్తులో, 1315 చ.అడుగుల బిల్ట్అప్ ఏరియాతోపాటు (కామన్ ఏరియాతో కలిపి) మరియు 100 చ.అడుగుల కారు పార్కింగ్ (నెం.9), అవిభాజ్య భూమిలో వాటా 50 చ.గజాలతోపాటు, (800 చ.గజాల నుంచి), "వెంకటేశ్వర నిలయం"గా పేరున్న కాంప్లెక్స్‌లో, బ్లాక్-ఎ, సర్వే నెం.107/8, కొంపల్లి గ్రామం మరియు గ్రామపంచాయతీ వద్ద ఉన్నది, దుండిగల్-గండిమైసమ్మ మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, టి.ఎస్., మరియు సరిహద్దులు ఈ విధంగా:- 3వ అంతస్తులోని ఫ్లాట్ నెం.303 యొక్క సరిహద్దులు:- ఉత్తరం:ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, తూర్పు :కారిడార్, పడమర: కారిడార్ & ఫ్లాట్ నెం. 302., భూమి యొక్క సరిహద్దులు:- ఉత్తరం: యజమాని యొక్క భూమి, దక్షిణం : ఫ్లాట్ నెంబర్లు : 36 & 49 & కె.శారద, ఎ. రమాదేవి, తూర్పు : 40' వెడల్పు రోడ్, పడమర: 40' వెడల్పు రోడ్ / లాంఛనప్రాయ స్వాధీనతా తేది / 12.08.2024.	21/03/2024 Rs. 11,30,690.00/-	హైదరాబాద్

పైన పేర్కొన్న రుణగ్రహీత(లు)/హామీదారు(లు), మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు 30 రోజుల ప్రకటన ఇవ్వబడింది, ఒకవేళ బకాయిల చెల్లింపులో విఫలమైనట్లయితే సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 మరియు 9 క్రింద నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 30 రోజులు ముగిసిన తర్వాత తాకట్టుపెట్టిన ఆస్తులు విక్రయించబడును.

తేది : ఆగస్టు 17, 2024,
ప్రదేశం : హైదరాబాద్

నిజాయితీగా, అధీకృత సంతకందారు,
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ కొరకు.



పట్టాలు తప్పిన సబర్మతి ఎక్స్‌ప్రెస్

భారీ బండరాయి తగిలి యూపీలోని కాన్పూర్ స్టేషన్ సమీపంలో ఘటన

ఎలాంటి ప్రాణనష్టం లేదు

కుట్రకోణం దాగి ఉందన్న కేంద్ర రైల్వే మంత్రి

దేశంలో మరో రైలు ప్రమాదం జరిగింది. యూపీలోని కాన్పూర్ స్టేషన్‌కు సమీపంలో సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో 20 బోగీలు పట్టాలు తప్పాయి. అయితే తాజా రైలు ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టమూ జరగలేదు. దీంతో రైల్వే అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో రైలు సేవలకు అంతరాయం ఏర్పడింది. పలు రైళ్లు రద్దయ్యాయి.

లక్నో : యూపీలోని కాన్పూర్- భీమ్‌సేన్ స్టేషన్ల మధ్య బ్లాక్ సెక్షన్‌లో శనివారం తెల్లవారుజామున 19168 నంబరు గల సబర్మతి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. రైల్వే ట్రైన్ ఎంక్వైరీ వెబ్సైట్ ప్రకారం.. భీమ్‌సేన్ సమీపంలోని కాన్పూర్ సెంట్రల్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరిన అరగంట తర్వాత.. తెల్లవారుజామున 2:32 గంటలకు రైలు పట్టాలు తప్పింది. మరోవైపు కాన్పూర్‌కు ప్రయాణికులను తరలించేందుకు వీలుగా భారతీయ రైల్వే బస్సులను ఘటనాస్థలానికి పంపించింది. బస్సుల ద్వారా సబర్మతీ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులను కాన్పూర్‌కి తీసుకెళ్లి, అక్కడి నుంచి ప్రత్యేక రైలు ద్వారా గమ్యస్థానానికి చేరుస్తామని అధికారులు ప్రమాదం తర్వాత వెల్లడించారు. సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలు యూపీలోని వారణాసి నుంచి గుజరాత్‌లోని అహ్మదాబాద్ వరకు సేవలను అందిస్తుంది. ఘటన అనంతరం అగ్నిమాపక సిబ్బంది, అంబులెన్స్‌లు సైతం ప్రమాదస్థలానికి చేరుకున్నాయి. క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ప్రయాణికుల్లో ఎవరికీ గాయాలు అవ్వలేదని నిర్ధరించారు.

ప్రమాదం ఎలా జరిగింది..?

డ్రైవర్ ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఒక బండరాయి ఇంజిన్‌ను బలంగా తాకింది. ఇది ఇంజిన్ క్యాటిల్ గార్డ్‌కు గణనీయమైన నష్టాన్ని కలిగించింది. అనంతరం సబర్మతి ఎక్స్‌ప్రెస్ బోగీలు పట్టాలు తప్పాయి. కాగా, ఈ ఘటనపై భారతీయ రైల్వే దర్యాప్తు చేస్తున్నది. సంబంధిత స్టేషన్లకు ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ నంబర్లను అధికారులు జారీ చేశారు.

ఆందోళన కలిగిస్తున్న రైలు ప్రమాదాలు

దేశంలో ఈ మధ్య కాలంలో రైలు ప్రమాదాల సంఖ్య ఆందోళనకరంగా తయారైంది. ఏదో ఒక మూల రైలు పట్టాలు తప్పిన ఘటనలు నిత్యం వార్తల్లో నిలిచి, ప్రజలను భయపెడు తున్నాయి. కొన్ని రోజుల క్రితమే ఝార్ఖండ్‌లో హౌరా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 18 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా.. ఐదుగురు గాయపడ్డారు. అంతకుముందు జూన్‌లో పశ్చిమబెంగాల్‌లో ఓ గూడ్స్ రైలు- కాంచన్‌జంగ ప్యాసింజర్ రైలు పరస్పరం ఢీకొన్నాయి. ఈ రైలు ప్రమాదంలో 11మంది మరణించారు. మరో 60మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఇలా వరుస రైలు ప్రమాద ఘటనలతో మోడీ సర్కారుపై తీవ్ర విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి.

విచారణకు ఆదేశించాం : కేంద్ర రైల్వే శాఖ మంత్రి

కాగా, తాజా ఘటనలో కుట్రకోణం దాగి ఉన్నదని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ ఘాతుకానికి పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటనపై విచారణకు ఆదేశించినట్టు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే సాక్ష్యాలు సేకరించామన్న ఆయన.. అధికారుల నివేదిక రాగానే చర్యలుంటాయని స్పష్టం చేశారు.

కలకలం రేపిన కర్నాటకం

సిద్ధరామయ్య ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి

- ముడా కుంభకోణం కేసులో కీలక మలుపు
- క్యాబినెట్ సూచన బేఖాతర్
- ఇది కేంద్రం కుట్రేనని మండిపడిన కాంగ్రెస్
- తప్పేమీ చేయలేదన్న సీఎం
- అరెస్ట్ తప్పదంటూ ఊహాగానాలు

కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు కేంద్ర స్థాయిలో కుట్ర జరుగుతోందా? ఢిల్లీ, జార్ఖండ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల తరహాలోనే కర్నాటక సీఎం సిద్ధరామయ్యను కూడా కటకటాల వెనక్కి నెట్టే ప్రయత్నం చేస్తున్నారా? కన్నడసీమలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలను గమనిస్తే ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తోంది. 'ముడా' కుంభకోణం కేసులో కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించేందుకు అనుమతి మంజూరు చేస్తూ గవర్నర్ తీసుకున్న నిర్ణయం రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. ఇది బీజేపీ అధిష్టానం పన్నిన కుట్రేనని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరచేందుకు ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారని, వారి ఆటలో గవర్నర్ పావుగా మారారని మండిపడింది. ఇలాంటి బెదిరింపులకు సిద్ధరామయ్య లొంగబోరని, పదవికి రాజీనామా చేసే ప్రశ్నే లేదని కన్నడ మంత్రులు తెగేసి చెప్పారు. వివక్షాపూరితంగా వ్యవహరిస్తున్న గవర్నర్ పదవి నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రపతే జోక్యం చేసుకొని ఆయనను తప్పించాలని కోరారు. రాజీనామా చేసేంత తప్పేమీ తాను చేయలేదని సిద్ధరామయ్య చెప్పారు.



బెంగళూరు : మైసూరు నగర అభివృద్ధి ప్రాధికార సంస్థ (ముడా) స్థలాల కేటాయింపులో కుంభకోణం జరిగిందంటూ వచ్చిన ఆరోపణలకు సంబంధించి కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించేందుకు రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ శనివారం అనుమతించారు. సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి 14 స్థలాలను చట్టవిరుద్ధంగా కేటాయించారని, దీనికి సంబంధించి ముఖ్యమంత్రిని విచారించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సామాజిక కార్యకర్త, న్యాయవాది టీజే అబ్రహం సహా ముగ్గురు వ్యక్తులు గవర్నర్‌కు కొన్ని వారాల క్రితం పిటిషన్లు సమర్పించారు. వీటిపై గవర్నర్ స్పందిస్తూ విచారణకు అనుమతించారు. కాగా గవర్నర్ చర్యపై స్పందించిన సిద్ధరామయ్య తన న్యాయ బృందాన్ని సంప్రదించారు. గవర్నర్ నిర్ణయాన్ని హైకోర్టులో సవాలు చేసే విషయంపై వారితో చర్చించారు.

గవర్నర్ నిర్ణయాన్ని ఆయన కార్యాలయం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలియజేసింది. 1988వ సంవత్సరపు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17, భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 218 మేరకు ముఖ్యమంత్రిని ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతించారు. ఈ నెల 1వ తేదీన ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అధ్యక్షతన మంత్రిమండలి సమావేశమైంది. దీనికి సిద్ధరామయ్య హాజరు కాలేదు. సీఎంకు జారీ చేసిన షోకాజ్ నోటీసును ఉపసంహరించుకోవాలని, టీజే అబ్రహం పిటిషన్‌ను తిరస్కరించాలని గవర్నర్‌ను కోరుతూ మంత్రిమండలి ఓ తీర్మానాన్ని ఆమోదించింది. అయితే క్యాబినెట్ సలహాను గవర్నర్ తోసిపుచ్చారు.

అంత తప్పేమీ చేయలేదు : సిద్ధరామయ్య

గవర్నర్ నిర్ణయంపై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. రాజీనామా చేసేంత తప్పేమీ తాను చేయలేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పష్టం చేశారు. గవర్నర్ నిర్ణయాన్ని ఆయన తప్పుపడుతూ ఇది రాజ్యాంగ విరుద్ధమని, చట్ట వ్యతిరేకమని చెప్పారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తానని ప్రకటించారు. 'రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బీజేపీ, జేడీఎస్ కుట్ర చేస్తున్నాయి. ఢిల్లీ, జార్ఖండ్‌లో కూడా ఇలాగే చేసింది. రాజ్‌భవన్‌ను పావుగా వాడుకుంటోంది. కేంద్రం చేతిలో గవర్నర్ కీలుబొమ్మలా వ్యవహరిస్తున్నారు' అని ధ్వజమెత్తారు. గవర్నర్ నిర్ణయంపై ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఈ వ్యవహారాన్ని చట్టబద్ధంగానే ఎదుర్కొంటామని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టామని చెప్పారు. గవర్నర్ నిర్ణయం వెలువడిన వెంటనే హోం మంత్రి పరమేశ్వర, సీనియర్ మంత్రి కృష్ణ బైరెగౌడతో కలిసి ఆయన మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 'మేమంతా సిద్ధరామయ్యకు మద్దతుగా నిలుస్తాం. చట్టపరంగా, రాజకీయంగా పోరాడతాం. గవర్నర్ నిర్ణయం చట్టవిరుద్ధం. సిద్ధ రామయ్య వెనుకబడిన తరగతులకు చెందిన నాయకుడు కావడం వల్లనే ఈ కుట్ర జరుగుతోందని స్పష్టమవుతోంది' అని శివకుమార్ చెప్పారు. ముఖ్యమంత్రి ఎవరి ఒత్తిడికి లొంగిపోరని, పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇది ముఖ్యమంత్రిపై, కర్నాటక ప్రజలపై జరుగుతున్న దాడి అని బైరెగౌడ విమర్శించారు. మంత్రిమండలి సలహాను తోసిపుచ్చాలని, ముఖ్యమంత్రిని విచారించేందుకు అనుమతించాలని బీజేపీ అధిష్టానం నుంచి గవర్నరుపై ఒత్తిడి వచ్చి ఉంటుందని హోం మంత్రి డాక్టర్ జి.పరమేశ్వర ఆరోపించారు. అటవీ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రే, దినేష్ గుండూరావు సహా పలువురు మంత్రులు గవర్నర్‌పై ఎదురు దాడి చేశారు. ఆయన పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నైతిక బాధ్యత వహించి గవర్నర్ రాజీనామా చేయాలని లేదా రాష్ట్రపతి ఆయనను పదవి నుంచి తొలగించాలని ఖండ్రే కోరారు. 'కర్నాటకలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని బీజేపీ అధిష్టానం... ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా...కుట్ర పన్నారు. ఇందుకు గవర్నరును పావుగా వాడుతున్నారు' అని ఆయన ఆరోపించారు. గవర్నర్ చర్యకు నిరసనగా ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి వస్తారని హెచ్చరించారు.

ఏమిటీ కేసు?

మైసూరులో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న ప్రదేశంలో నష్టపరిహార స్థలాలను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య పార్వతికి కేటాయించారన్న ఆరోపణలు వచ్చాయి. పార్వతి నుంచి ముడా సేకరించిన భూమి కంటే అక్కడ స్థలాల విలువ అధికంగా ఉంది. పార్వతి నుంచి ముడా 3.16 ఎకరాల భూమిని సేకరించింది. దానికి బదులుగా 50:50 దామాషా ప్రాతిపదికన పార్వతికి స్థలాలు కేటాయించింది. అక్కడ ముడా రెసిడెన్షియల్ లేఅవుట్ అభివృద్ధి చేసింది. వివాదాస్పద పథకం కింద.. రెసిడెన్షియల్ లేఅవుట్ల కోసం సేకరించిన అభివృద్ధి చేయని భూమికి బదులుగా అభివృద్ధి చేసిన స్థలంలో యాభై శాతాన్ని భూమి కోల్పోయిన వారికి కేటాయించారు. ఈ వ్యవహారంలో నాలుగు వేల కోట్ల నుంచి ఐదు వేల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని బీజేపీ ఆరోపించింది.

ముడా కుంభకోణంపై విచారణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల 14న హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీఎన్ దేశాయ్ నేతృత్వంలో ఏకసభ్య విచారణ కమిషన్‌ను నియమించింది. కాగా ఈ కుంభకోణానికి సంబంధించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేయాలని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ పార్టీలు మైసూరు నుండి బెంగళూరుకు గతంలో వారం రోజుల పాదయాత్ర నిర్వహించాయి.

సిద్ధరామయ్యను అరెస్ట్ చేస్తారా?

ముడా కుంభకోణం కేసులో కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతి మంజూరు చేసిన నేపథ్యంలో ఆయనను అరెస్ట్ చేయవచ్చునన్న ఊహాగానాలు విన్పిస్తున్నాయి. గతంలో ముఖ్యమంత్రులుగా ఉన్న వ్యక్తులపై విచారణకు సంబంధింత గవర్నర్లు అనుమతి ఇచ్చిన తర్వాత వారిని అరెస్ట్ చేశారు. దాణా కుంభకోణంపై 1997లో అప్పటి బీహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌పై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఆయనపై కేసు నమోదు చేయడానికి గవర్నర్ కిద్వాయ్ అనుమతి మంజూరు చేశారు. అనంతరం సిబీఐ దర్యాప్తు చేపట్టింది. కొన్ని రోజుల తర్వాత లాలూను సీబీఐ అరెస్ట్ చేసింది. లాలూ భార్య రబ్రీదేవి ముఖ్యమంత్రి అయ్యారు.

2006లో జార్ఖండ్ ముఖ్యమంత్రి అయిన మధుకోడాపై మైనింగ్ కుంభకోణం ఆరోపణలు వచ్చాయి. బొగ్గు గనుల కేటాయింపులో ఆయన రూ.400 కోట్ల మేరకు అవినీతికి పాల్పడ్డారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సీబీఐ విచారణ కోరుతూ గవర్నర్ రిజ్వీ లేఖ రాశారు. విచారణ సమయంలో కోడాను సీబీఐ అరెస్ట్ చేసింది. 2017లో ఆయనకు శిక్ష కూడా పడింది.

2011లో బీఎస్ యడ్యూరప్ప కర్నాటక ముఖ్య మంత్రిగా ఉన్నప్పుడు భూముల అక్రమ కేటాయింపుపై కేసు నమోదైంది. లోకాయుక్త కూడా ఆయనపై అవినీతి ఆరోపణలు చేసింది. యడ్యూరప్పపై విచారణ జరిపేందుకు గవర్నర్ భరద్వాజ్ ఆమోదం తెలిపారు. లోకాయుక్త కోర్టు ఆయనకు అరెస్ట్ వారంట్ జారీ చేసింది. అరెస్టయిన తర్వాత యడ్యూరప్ప ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఇక ఢిల్లీ లిక్కర్ స్కాం కేసుపై దర్యాప్తును రాష్ట్ర గవర్నర్ సక్సేనా సీబీఐకి అప్పగించారు. ఈ కేసులో ముందుగా ఉప ముఖ్యమంత్రి సిసోడియాను సీబీఐ అరెస్ట్ చేసింది. ఆ తర్వాత ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను ఈడీ నిందితుడిగా చేర్చి మార్చిలో అరెస్ట్ చేసింది.

ఆఘమేఘాలపై...

సిద్ధరామయ్యను విచారించేందుకు అనుమతించాలంటూ గత నెల 26న అబ్రహం పిటిషన్ సమర్పించగానే అదే రోజు గవర్నర్ ఆఘమేఘాలపై ముఖ్యమంత్రికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. అబ్రహంతో పాటు సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణ, ప్రదీప్ కుమార్ కూడా గవర్నరుకు పిటిషన్లు అందజేశారు.

ప్రభుత్వ భూములకు జియో మ్యాపింగ్

- పైలట్ ప్రాజెక్టులుగా ఆర్టీసీ, పోలీస్ శాఖలు : సమీక్షలో ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ జి.చిన్నారెడ్డి

స్థిరాస్థులకు కూడా...

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రభుత్వ భూములు, స్థిరాస్థులను జియో రెఫరెన్సింగ్ మ్యాపింగ్ ద్వారా సంరక్షించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి అధికారుల్ని ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్టులుగా పోలీసు, ఆర్టీసీ శాఖలకు చెందిన భూముల్లో ఈ పనులు చేపట్టాలని చెప్పారు. శనివారం ఖైరతాబాద్‌లోని తెలంగాణ రిమోట్ ఏజెన్సీ సెంటర్ (టీజీ రాక్) సంస్థ కార్యక్రమాలను ఆయన ఉన్నతాధికారులతో కలిసి సమీక్షించారు. రానున్న రోజుల్లో ఎండోమెంట్, వక్ఫ్, ఇతర శాఖల భూముల సంరక్షణ కోసం ఇదే విధానాన్ని కొనసాగించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల జోలికి ఎవరూ రాలేని పరిస్థితిని తీసుకొచ్చేందుకే జియో రిఫరెన్సింగ్ పద్ధతిని అనుసరిస్తున్నా మన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో స్థిరాస్తుల వివరాల సేకరణ కోసం రిమోట్ సెన్సింగ్ సెంటర్ సేవలను వినియోగించు కోవాలని, ప్రయివేటు సంస్థలకు ఆ బాధ్యతలు అప్పగించొద్దన్నారు. అటవీ శాఖలో మొక్కల సంరక్షణ కోసం వినియోగించే జియో ట్యాగింగ్ బాధ్యతలను కూడా ప్రభుత్వ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌కు అప్పగించాలన్నారు, హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న 920 చెరువుల్లో 240 ఆక్రమణకు గురై కబ్జా దారుల చేతుల్లో మాయం అయ్యాయనీ, ఇలాంటి పరిస్థితులు రాకుండా ప్రభుత్వం హైడ్రాను నెలకొల్పిందన్నారు. రాష్ట్రంలో ఏటా పెరుగుతున్న పంటల సాగు విస్తీర్ణంపై అనేక అనుమానాలు ఉన్నాయ న్నారు. వీటి నివృత్తి కోసం క్షేత్రస్థాయిలో జియో రెఫరె న్సింగ్ విధానాన్ని ఉపయోగించి పక్కా సాగు లెక్కలు సేకరించాలని చెప్పారు. సమావేశంలో రిమోట్ సెన్సింగ్ అదనపు డైరెక్టర్ జనరల్ మనోహర్, అర్థ గణాంక శాఖ డైరెక్టర్ రుఫస్ దత్తం, పరిపాలన అధికారి రాజోజు నరసింహాచారి, జాయింట్ డైరెక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీ రూట్‌మ్యాప్ సిద్ధం చేయండి

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. కొత్త హైకోర్టు నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు మీదుగా ఫ్యూచర్ సిటీకి మెట్రో రైల్ మార్గం ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. రోడ్డు, మెట్రో మార్గాలకు అవసరమైన భూసేకరణ ఇతర అంశాలపై అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సాధ్యమైనంత త్వరగా పూర్తిస్థాయి ప్రణాళికలు, రూట్ మ్యాప్ సిద్ధం చేయాలనీ, అవి ఖరారు కాగానే నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉంటుందని చెప్పారు. సమావేశంలో మెట్రోరైల్ ఎమ్‌డీ ఎన్వీఎస్ రెడ్డి, పురపాలకశాఖ కార్యదర్శి దానకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలు నమ్మొద్దు

రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరిస్తాం

- పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తాం..
- సాంకేతిక సమస్యలు పరిష్కరిస్తాం
- వ్యవసాయశాఖకు రోజువారీ ఫిర్యాదులు
- రేషన్‌కార్డు ప్రమాణికం కాదు... కుటుంబ నిర్ధారణకే : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించి వెంటనే పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ఆ రైతులు చేస్తున్న రోజు వారీ ఫిర్యాదులను వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాల యానికి పంపించాలని మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రెండు లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో చేసి తీరుతామని భరోసా నిచ్చారు. ఈ విషయంలో బీఆర్ఎస్, బీజేపీ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాయని విమ ర్శించారు. వాటిని నమ్మొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. సాంకేతిక సమస్యల్లో 70 వేల నుంచి 80 వేల రైతుల ఖాతాలు ఉన్నాయని గుర్తు చేశారు. వాటికి సంబంధించిన పత్రాలు సమ ర్పించాలని సూచించారు. రుణమాఫీకి రేషన్ కార్డు ప్రమాణికం కాదనీ, అది కుటుంబ నిర్ధా రణ కోసమేనని వివరించారు. ఈ మేరకు శనివారం మంత్రి తుమ్మల ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు 22,37,848 రైతుల ఖాతాలకు రూ.17,933.19 కోట్ల నిధులు విడుదల చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోకి వచ్చిన మొదటి పంట కాలంలోపే 26,140.13 కోట్లు రైతు సంక్షేమా నికి ఖర్చు పెట్టామని వివరించారు. గత ప్రభుత్వం పెట్టిన రైతుబంధు బకాయిలు, డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీలు పామాయిల్ రైతులకు, కంపెనీలకు పెట్టిన బకాయిలను, పచ్చిరొట్ట విత్తనాల సబ్సిడీ బకాయిలను చెల్లించినట్టు వివరించారు.

'రాష్ట్రంలోని 35 బ్యాంకులకు సంబంధి చిన 3292 బ్రాంచ్‌ల్లో, 909 పీఏసీఎస్‌ల నుంచి 12 డిసెంబర్ 2018 నుంచి 09 డిసెంబర్ 2023 వరకు తీసుకున్న పంటరుణాల వివరాలు తెప్పించాం. పాస్‌బుక్ కలిగి వుండి రుణాలు పొందని ఖాతాల సంఖ్య 42 లక్షలు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి పంట కాలంలోనే జీవో 567 ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత మూడు రోజులకే (జులై 18, 2024) రూ. లక్షలోపు రుణాలున్న 11,50,193 మంది ఖాతా దారులకు రూ. 6,098.93 కోట్లు విడుదల చేశాం. రెండో విడతలో 1.50 లక్షల వరకు రుణాలు ఉన్న 6,40,823 ఖాతాదారులకు రూ. 6,190.01 కోట్లు విడుదల చేసి వారిని రుణ విముక్తు లను చేశాం. మూడో విడతలో (ఆగస్టు 15, 2024) ప్రభుత్వం ఇచ్చిన హామీలకు రెండు లక్షలలోపు రుణాలు 4,46,832 ఖాతాలలో రూ. 5,644.24 కోట్ల నిధులు విడుదల చేశాం. మూడు విడతల్లో మొత్తం 22,37,848 ఖాతాలకు రూ. 17,933.19 కోట్ల నిధులు విడుదల చేసి ఆగస్టు 15 లోగా 2 లక్షల వరకు రుణం ఉన్న రైతులను రుణ విముక్తులను చేసింది' అని పేర్కొన్నారు.

'రుణమాఫీ' వివరాలు సమర్పించండి

రేషన్‌కార్డు లేని వారు, ఆధార్‌కార్డు వివరాలు తప్పుగా నమోదైన వారు, రెండు లక్షల లోపు రుణాలు ఉండి జమకాని వారు తగిన పత్రాలతో తమ వివరాలను వ్యవసాయాధి కారులకు సమర్పించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఇప్పటికే వ్యవసాయాధికా రులందరికీ ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. మండల పరిధిలో ఉన్న అన్ని బ్యాంకుల బ్రాంచులు, పీఏసీఎస్‌లకు సంబంధించిన అన్ని సమస్యాత్మక ఖాతాలకు పూర్తి బాధ్యతను మండల వ్యవసాయాధికారి తీసుకుంటారని పేర్కొన్నారు. అధికారులే రైతుల వద్దకు వెళ్లాలని ఆదేశించారు. 'రుణఖాతాలో నమోదైన పేరు, ఆధార్‌లో నమోదైన పేరుతో సరిపోలకపోతే ఖాతాదారుని దగ్గర సరైన వివరాలు సేకరించి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. బ్యాంకుకు సమర్పించిన అసలు, వడ్డీలో తేడా ఉన్నట్టయితే ఖాతాదారులు వ్యవసాయాధికారికి తెలియ జేయాలి' అని సూచించారు.

తప్పులు సవరించి రూ. 44.95 కోట్లు విడుదల

రుణమాఫీ మొదటి, రెండు విడతల్లో తప్పులు దొర్లిన 7,925 ఖాతాలను సరిచేసి రూ. 44.95 కోట్లు నిధులను విడుదల చేసినట్టు మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం రూ. రెండు లక్షల కంటే పైన తీసుకున్న రుణ ఖాతాదారులు ఆ పై మొత్తాన్ని బ్యాంకుల్లో జమ చేసిన తర్వాత రుణమాఫీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక రుణమాఫీ ప్రక్రియ పూర్తి కాకముందే కొంత మంది రాజకీయ నాయకులు తొందర పడుతున్నారని ఎద్దేవా చేశారు. రైతులను అయోమయానికి గురి చేసేలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు.

రుణమాఫీపై రైతుల ఆగ్రహం

తమకెందుకు మాఫీ కాలేదంటూ ఆవేదన పలుచోట్ల ధర్నాలు..

నవతెలంగాణ- విలేకరులు

ప్రభుత్వం ప్రకటించిన తొలి, రెండో విడతల్లోనే కొందరికి రుణమాఫీ అందకపోగా.. మూడో విడతలోనూ చాలా మందికి మాఫీ కాకపోవడంతో అన్నదాతలు ఆందోళనలకు దిగారు. తమకెందుకు రుణమాఫీ చేయలేదంటూ శనివారం రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేశారు. మూడో విడతలో అర్హుల జాబితాలో పేర్లు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వెంపేట కెనరా బ్యాంక్ ఎదుట రుణమాఫీ కాలేదంటూ రైతులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న వ్యవసాయ, పోలీసు అధికారులు అక్కడకు వచ్చి రైతులకు నచ్చజెప్పారు. మల్లాపూర్ రైతు వేదికలో రైతులు, బ్యాంకర్లతో ఏర్పాటు చేసిన సమావేశం ఉద్రిక్తతకు దారి తీసింది. రుణమాఫీ కాలేదని, బ్యాంకు చుట్టూ తిరుగుతున్నామని మల్లాపూర్ గ్రామానికి చెందిన రైతు రాజారెడ్డి పురుగుల మందు డబ్బాతో సమావేశానికి వచ్చారు. పోలీసులు గమనించి పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని జిల్లా వ్యవసాయాధికారి వాణి, బ్యాంక్ ఎల్‌డిఎం రాము సూచించారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ ఇండియన్ బ్యాంకులోని రైతులకు రుణమాఫీ కాలేదని కరీంనగర్ - వరంగల్ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఇండియన్ బ్యాంకు మేనేజర్ తప్పిదం వల్ల తాము నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కేశవపట్నం ఏఎస్ఐ సుధాకర్ ఘటన స్థలానికి చేరుకొని రైతుల వివరాలు సేకరించారు. అనంతరం వ్యవసాయ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ.. రైతుల పూర్తి వివరాలు సేకరించి పై అధికారులకు పంపిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

అర్హులైన రైతులకు రుణ మాఫీ చేయాలని కోరుతూ రైతులు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. అధికారులు స్పందించకపోవడంతో ఖమ్మం- కొత్తగూడెం ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. పోలీసులు రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

తలమడుగులో సీఎం దిష్టిబొమ్మ దగ్ధం..జైనథ్‌లో రాస్తారోకో

ఆదిలాబాద్ జిల్లాలో తలమడుగు, జైనథ్ మండలాల్లో నిరసన తెలిపారు. తలమడుగు మండల కేంద్రంలో వందలాది మంది రైతులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో స్వల్ప తోపులాట జరిగింది. చివరకు రైతులు సీఎం దిష్టిబొమ్మకు నిప్పంటించి నిరసన తెలియజేశారు. జైనథ్ మండల కేంద్రంలోనూ రైతులు రాస్తారోకో నిర్వహించారు. వారికి బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మద్దతు తెలిపారు. రూ.2లక్షల వరకు రుణం కలిగిన వారి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పెట్టుబడి తగ్గి.. దిగుబడి పెరిగితేనే సాగు లాభసాటి

నవతెలంగాణ -నల్లగొండ కలెక్టరేట్

పెట్టుబడులు తగ్గించుకుని.. దిగుబడి పెంచుకుంటేనే సాగు లాభసాటిగా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో 'రైతుబడి' ఆధ్వర్యంలో నిర్వహించిన "వ్యవసాయ ప్రదర్శన" కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించి దిగుబడి పెంచుకున్నప్పుడే రైతుకు సాగు లాభసాటి అవుతుందని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.రెండు లక్షల రుణమాఫీ చేశామని చెప్పారు. రూ.2 లక్షలపైన ఉన్న మొత్తాన్ని రైతులు బ్యాంకులకు చెల్లించినట్టయితే.. రెండు లక్షల రుణమాఫీని ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. అలాంటి ఖాతాలు రాష్ట్ర వ్యాప్తంగా 10 నుంచి 12 వేలు ఉన్నట్టు చెప్పారు. కొంతమంది రైతుల డాక్యుమెంట్లు సరిగా లేకపోవడం, సాంకేతిక కారణాల కారణంగా రుణమాఫీ ఆగిపోయిందని, ఇందుకు సంబంధించి బ్యాంకులు, వ్యవసాయ శాఖ కార్యాలయాల వద్ద నోడల్ అధికారులతో సాంకేతిక సమస్యలను పరిష్కరించే ఏర్పాట్లు చేశామని అన్నారు. రైతు రుణమాఫీలో నల్లగొండ జిల్లాకే అత్యధికంగా రూ.1433 కోట్లు 1,72,785 మంది రైతులకు అందిందని తెలిపారు. ముఖ్యంగా ఆయిల్ పామ్ వంటి తోటలను సాగు చేస్తే ఎకరాకు లక్ష నుంచి లక్షన్నర ఆదాయం వస్తుందని, ప్రజాప్రతినిధులు రైతులను ప్రోత్సహించాలని కోరారు.

శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వ్యవసాయంలో కూలీల కొరతను తీర్చేందుకు ప్రత్యామ్నాయ మార్గంగా నూతన టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఎస్ఎల్బీసీ సొరంగ మార్గం పూర్తయితే 4 లక్షల ఎకరాలకు సాగునీరు వస్తుందని, ఇప్పటివరకు 34.8 కిలోమీటర్ల మేర పూర్తయిందని తక్కిన 9.5 కిలోమీటర్లను పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు.

రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. మూడేండ్లలో ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని పూర్తిచేసి సాగునీరు అందిస్తామని చెప్పారు. ఇటీవల బ్రాహ్మణ వెల్లెంల ట్రయల్ రన్ ప్రారంభించామని, ఏఎంఆర్పీ కాలువల లైనింగ్, ధర్మారెడ్డి పిల్లాయిపల్లి కాలువలను పూర్తి చేయడం,


వ్యవసాయంలో నూతన ఒరవడిని సృష్టించే చర్యలు

- రూ.2లక్షల పైన ఉన్న మొత్తాన్ని చెల్లించి.. రుణమాఫీ పొందాలి : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఇతర ఎత్తిపోతల పథకాల ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీరు అందిస్తామని తెలిపారు. ప్రతిక్ ఫౌండేషన్ ద్వారా రైతులకు ఫామ్ పాండ్స్ నిర్మాణం, విత్తనాలను అందజేస్తున్నామని, ఇంకా రైతులకు అవసరమయ్యే సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. ఎంపీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలను జిల్లాలో విరివిగా చేపట్టాలని అన్నారు.

అంతకుముందు మంత్రులు, శాసనమండలి చైర్మెన్ తదితరులు రైతుబడి వ్యవసాయ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వ్యవసాయ యంత్ర పరికరాలను, విత్తనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమం రైతుబడి యూట్యూబ్ ఛానల్ అధినేత రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా.. ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, కలెక్టర్ సి.నారాయణరెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ రమేష్, ప్రతిక్ ఫౌండేషన్ సీఈవో గోనారెడ్డి, అమిత్ రెడ్డి, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అవినీతిమయమైనకొద్దీ చట్టాలు ఎక్కువవుతుంటాయి - టాసిటస్



సంపాదకీయం

నివేదిక @ 78

"విరిగిన మెడ ఎముక
కళ్లల్లో గుచ్చుకుని కారిన రక్తం,
రెండు కాళ్లు 90డిగ్రీలు అటు ఇటు విరిచేయడం,
పెల్విక్ బోన్ విరిగిపోయింది,
శరీరమంతా నల్లటి మచ్చలు,
ప్రైవేట్ పార్ట్ నుండి రక్తధార,
శరీరంలో బహుళ వ్యక్తుల 150 గ్రా. వీర్యం" ఇది ప్రాథమిక నివేదిక. అతి కిరాతకంగా చంపివేయబడిన 31 ఏండ్ల ట్రెయినీ డాక్టర్ పోస్టుమార్టం రిపోర్టు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుపుకుంటున్న సందర్భంలోనే వచ్చిన నివేదిక ఇది. జంతువుల కన్నా మనుషులు ఎంత ప్రమాదకరమైన వాళ్లోనని భయంతో గుండె వణికిపోతున్న నివేదిక. ఇది డాక్టర్ల సమస్య మాత్రమే కాదు. మానవ మాత్రులమైన అందరి సమస్య. బిడ్డ గొప్పగా చదువుకుంటోందని ఎం.బి.బి.ఎస్ ఉత్తీర్ణ రాలై, పి.జీలో సీటుకొట్టి రెండో సంవత్సరంలో ఉండగా, ప్రభుత్వ సూచనల, కళాశాల నిబంధనలకు అనుగుణంగా ఆ రాత్రికి 36 గంటలు సేవలందించిన ట్రెయినీ డాక్టరమ్మ. అలసిపోయి ఆసుపత్రిలోనే నిదురపోతున్న వేళ, అమానుషం స్వేచ్ఛగా విలయతాండవం చేసింది. అత్యాచారం, హత్య జరిగి పోయింది. ఇది సాధారణ హత్య కాదు, అత్యంత దారుణంగా చిత్రవధకు గురిచేసి చేసిన హత్య. మృగాలకూ ఓ పరిమితి ఉంటుంది. ఈ మానవ మృగానిది ఊహించని క్రూరత్వం, మనుషులు ఇంత ఆటవికంగానూ

బీజేపీ వారు దీన్ని రాజకీయంగా వాడుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఉన్నావ్ సంఘటనలో నేరస్తుల పక్షం వహించినవారు, హత్రాస్ ఘటనలో పాలకులే దుర్మార్గులకు వంత పాడారు. కతువాలో రేపిస్టులను కాపాడే ప్రయత్నాన్ని సాగించి బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక ఆరోపణలు స్వయంగా అమ్మాయిలే చేసినా స్పందించనివారు, తిరిగి అతని పుత్రరత్నాన్నే ఎన్నికల్లో నిలబెట్టారు. డేరాబాబాకు బెయిలిప్పించిన వారు రాజకీయం తప్ప, దుర్మార్గాలను అడ్డుకోవడం వారినైజం కాదు.

ప్రవర్తిస్తారా! నివేదిక ఇంకా చదివితే నిదురపట్టడం లేదు. ఇదే ఘటన మన ఇంట్లో జరిగితే? జరగదనే గ్యారంటీ ఏమైనా ఉందా? ఎలాంటి మానసిక ఆలోచనలను ప్రేరేపిస్తున్నది ఈ సమాజం! విశ్వకవి రవీంద్రుని నేలలోనేనా జరిగింది! ఈశ్వరచంద్రుని, సుభాష్‌చంద్రుని కన్న భూమి లోనే ఎంత అమానవీయ ఘటన చోటు చేసుకున్నది!

ఘటన ఒక ఎత్తు. అది జరిగిన తర్వాత, మనుషులమని చెప్పుకుంటున్న మిగతావాళ్లు చేసిం దేమిటి? చనిపోయిన డాక్టరమ్మ తల్లిదండ్రులకు, 'మీ అమ్మాయి ఆత్మహత్య చేసుకున్నదని' ఆసుపత్రి వర్గాలు కబురు పెట్టాయి. వారిని ఆసుపత్రికి పిలిపించి మూడు గంటలు కూర్చోపెట్టడం ఎంత దుర్మార్గం! తల్లిదండ్రుల గుండెలు ఎంత విలపించిపోయాయో ఊహించుకోవటమే! వాళ్లు అరచి ఏడుస్తుంటే తప్ప విచారణ దిశగా కదలని ఆసుపత్రి, కళాశాల యాజమాన్యాన్ని ఏమనుకోవాలి! ఆందోళన మొదలైన వెంటనే ఆర్జీకర్ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రాజీనామా చేశాడు. ఆ వెంటనే మమతా బెనర్జీ ప్రభుత్వం ఆయనకు వేరే పోస్టింగ్ ఇచ్చి మర్యాద చేసింది. పోస్టుమార్టం రిపోర్టు వచ్చేవరకూ నిందితుల కోసం దర్యాప్తు సాగలేదు. చివరికి పోలీసులకు సహాయకుడుగా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా ఉన్న సంజయ్‌రాయ్ ప్రధాన నేరస్తుడిగా అరెస్టు చేశారు. కానీ నేరస్తుడు ఒక్కడు మాత్రమే కాదు. ఆ ట్రెయినీ డాక్టరమ్మ అత్యాచారం, హత్య విధానం, దాని నివేదిక ప్రకారం, వీడితో పాటు మరికొంతమంది ఉంటారనేది ఎవరైనా చెప్పగలిగిన విషయం! మరెందుకు అక్కడి రాష్ట్ర ప్రభు త్వం తాత్సార్యం చేస్తున్నది? ఎట్టకేలకు సి.బి.ఐ.కి కేసును అప్పజెప్పారు. ఆసుపత్రి కళాశాల యాజ మాన్యం, హత్య జరిగిన సెమినార్ హాల్ పక్కనే బిల్డింగ్ గదులను కూల్చి రిపేరు పని మొదలెట్టడం ఏమిటి? సాక్ష్యాలు దొరక్కుండా పోవడానికా! ఘటనపై పోలీసుల నిర్లక్ష్యానికి, అమానుష చర్యకు వ్యతి రేకంగా బెంగాల్‌లో తీవ్ర నిరసన వ్యక్తమైంది. కలకత్తా నిరసనలలో కొందరు దుండగులు చేరి ఆసు పత్రిలో విధ్వంసం సృష్టించారు. హైకోర్టు కూడా రాష్ట్ర సర్కారును ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. కాపా డాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారని సీపీఐ(ఎం)పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ విమర్శించారు. ముమ్మాటికీ ఇది టి.ఎం.సీ. గుండాల బరితెగింపని వ్యాఖ్యానించారు. ప్రధాన నిందితు డు సంజయ్‌రాయ్, 'చంపితే నన్ను చంపేయండి' అని ఏ మాత్రం పశ్చాత్తాపం లేకుండా ప్రకటించాడు.

బీజేపీ వారు దీన్ని రాజకీయంగా వాడుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఉన్నావ్ సంఘటనలో నేరస్తుల పక్షం వహించినవారు, హత్రాస్ ఘటనలో పాలకులే దుర్మార్గులకు వంత పాడారు. కతువాలో రేపిస్టులను కాపాడే ప్రయత్నాన్ని సాగించి బ్రిజ్‌భూషణ్‌పై లైంగిక ఆరోపణలు స్వయంగా అమ్మాయిలే చేసినా స్పందించనివారు, తిరిగి అతని పుత్రరత్నాన్నే ఎన్నికల్లో నిలబెట్టారు. డేరాబాబాకు బెయిలిప్పించిన వారు రాజకీయం తప్ప, దుర్మార్గాలను అడ్డుకోవడం వారినైజం కాదు.

కలకత్తా ఘటన దేశం మొత్తాన్ని కదిలిస్తోంది. దేశమే కాదు, విదేశంలో నిరసనలు వెల్లువెత్తు తున్నాయి. రేప్‌లు జరిగితే వస్త్రధారణ, రాత్రుళ్లు తిరగడం మీద వ్యాఖ్యానించే చచ్చు పుచ్చు సనాతనులమని చెప్పుకునే వారు, ఇప్పుడీ ఘటనకు కారణమేమి చెబుతారో! ఇప్పటికైనా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో న్యాయం చేసేందుకు పూనుకోవాలి.

మూడో పాదంలో మోడీ ఎజెండా ముప్పు



తెలకపల్లి రవి

గత రెండు ఎన్నికల తర్వాత తొలిసారి బీజేపీ ఆధిక్యత కోల్పోయిన ప్రభావమేంటో పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో స్పష్టంగా కనిపించింది. ఆగస్టు 15న ఎర్రకోటపై నుంచి ప్రధాని మోడీ చేసిన ప్రసంగం కూడా దానికే అద్దం పట్టింది. కాంగ్రెస్ అధికారిక ప్రతిపక్షంగా ఆవిర్భవించడం, రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నేత హోదా పొందడం, లౌకిక పార్టీలు 'ఇండియా' కూటమిగా ఒక్కతాటిపైకి రావడం బీజేపీ జీర్ణించుకోలేకపోతున్నది. లోక్‌సభలో తొలిసారి హిందూత్వ రాజకీయాలపై సూటిగా చర్చ జరగడం కన్నా ఇందుకు మరో నిదర్శనం అక్కర్లేదు. అయితే ప్రతిపక్షాల పెరుగుదలపై ఉక్రోశంతో బీజేపీ సభ్యులు మంత్రులు చేసిన దాడి అనేక సందర్భాల్లో వికృతంగా తయారైంది. పంద్రాగస్టు సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని మోడీ చేసిన ప్రసంగం ఈ కుల మత రాజకీయాల వ్యూహంలో భాగమే. ఉమ్మడి సివిల్ కోడ్ అనే బీజేపీ, ఎన్నికల నినాదం కోసం ఇప్పుడు దేశంలో వున్నది మతతత్వ పౌరస్మృతి అన్నట్టుగా వ్యాఖ్యానించారు.ఈ మాటలు ముస్లిం, మైనార్టీలను ఉద్దేశించినవన్నది స్పష్టమే. ఎందుకంటే హిందూ పౌరస్మృతిని ఆయన ఏమీ అనే ప్రసక్తి వుండదూ.. .వాంఛనీయమూ కాదు.రాజ్యాంగం ప్రకారం ఇప్పుడు అమలు జరుగుతున్న వాటిని మతతత్వంగా మోడీ ఎలా ఆరోపిస్తారు? విభిన్న మతాలు, విశ్వాసాలతో కూడిన ఈ దేశంలో అందరినీ ఒప్పించి ప్రజాస్వామికంగా ఉమ్మడి పౌరస్మృతి తీసుకురావాలే గానీ ఒకరి విశ్వాసాలు మరొకరిపై రుద్దడం సాధ్యం కాదు.

నిజానికి బీజేపీ పూర్వపు అవతారమైన జనసంఘం ఆదినుంచి అదేపనిగా వివాదం రేపుతున్న అంశాల్లో ఉమ్మడి పౌరస్మృతి ఒకటి.1951 అక్టోబర్‌లో జనసంఘం ఆవిర్భవించినప్పటి ఎజెండాలోనే ఈ అంశం వుంది. అయినా బీజేపీ ఏర్పడిన తర్వాత 1989 ఎన్నికల వరకూ ఈ వూసే ఎత్తుకోలేదు. అయోధ్య చిచ్చు రగిలిన తర్వాతనే బీజేపీ కీలక ఎజెండా కింద చేపట్టిన మూడు అంశాలలో దీన్ని చేర్చింది. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశ్మీర్ 370 అధికరణం రద్దు అన్నవి తక్కిన రెండు అంశాలుగా ప్రకటించింది. రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో 44వ అధికరణం ఉమ్మడి పౌరస్మృతి వుండాలని చెబుతున్నమాట నిజమే.కానీ తన మత రాజకీయాలకు భూమిక లభించిందని రూఢీ అయిన తర్వాతనే 1998లో దీన్ని ఆ పార్టీ ముందుకుతెచ్చింది.అప్పటి నుంచి దీనిపై ఏదో రూపంలో చర్చ చేస్తూనే వుంది.

ఇక్కడ ఇంకో విశేషం కూడా గమనించాలి.

రెండు పూర్తయినట్టేనా?

అయోధ్యలో రామమందిరం,370 రద్దు అనే లక్ష్యాలు ఇప్పటికే సాధించినట్టు ఆ పార్టీ అతిశయంతో వుంది. మిగిలింది ఉమ్మడి పౌరస్మృతి(కామన్ సివిల్ కోడ్-యుసిసి) మాత్రమేనని అహంభావం కూడా సంఘ పరివారం దీనిపై ఒత్తిడి కూడా చేస్తున్నది. ఉత్తరాఖండ్ శాసనసభతో సహా పలు బీజేపీ పాలిత రాష్ట్రాలు దీనిపై శాసనసభలో తీర్మానాలు చేశాయి కూడా. ఈ ఏడాది అనేక కీలక రాష్ట్రాల్లో ఎన్నికలు జరగవలసి వుంది. మూడోసారి ఎలాగో అధికారంలోకి వచ్చాము గనక ఎలాగోలా దీన్ని పూర్తి చేసుకోవాలనే ఆరాటమూ వుంది.ఇన్ని కారణాలతోనే మోడీ సూటిగా ఎర్రకోట ప్రసంగంలో దాన్ని లేవనెత్తారు.తద్వారా ఒకటి రెండు విషయాలు స్పష్టం చేయదలిచారు. మొదటిది మెజార్టీ రాకపోయినా తమ ఎజెండాలో ఆలోచనల్లో భౌగోళిక ప్రాంతాల తేడాలు, లింగభేదం వంటి విషయాల్లోనే ఆయన అందరినీ కలుపుకోవాలనే పదాలు వాడారు. అదే మతం విషయానికి వస్తే మెజార్టీ మత భాషనే ఉపయోగించారు. మతం, దేవుడు వంటి ప్రస్తావనలకు వచ్చేసరికి కనిపించింది అదే.మనదేశంలో ప్రతిరాతిలో శివుణ్ని చూస్తామనీ, ప్రతినదినీ భూతల్లిగా భావించడం గర్వకారణమంటూ కీర్తించారు.మహిళలను శక్తి స్వరూపిణిగా పరిగణిస్తారనడంలోనూ మతభావనే వినిపించారు.ఎందుకంటే ఇతర మతాల వారికి ఇది వర్తించదనీ, వారి విశ్వాసాలు, ఆచారాలు వేరుగా వుంటాయని మోడీకి తెలుసు. ఇంకా చెప్పాలంటే బంగ్లాదేశ్ పరిణామాలను కూడా హిందువులపై దాడులు అన్న కోణంలోనే ఆయన ప్రస్తావించడం యాదృచ్ఛికం కాదు.

కాశ్మీర్ పాఠాలేంటి?

మోడీ మొన్నటి ఎన్నికల ఫలితాల ప్రభావాలనూ, పాఠాలనూ నేర్చుకోదలచలేదని ఈ ప్రసంగం స్పష్టం చేసింది. ఎందుకంటే బీజేపీ కీలక ఎజెండాలోని ముఖ్యాంశాలు మూడింటిలో రెండు నెరవేరినట్టు చెప్పడమే అతిశయోక్తి.అయోధ్య సమస్యపై రాజకీయం చేయడం ద్వారా ఆ పార్టీ లాభపడిన మాట నిజం.ఏకంగా మూడోసారి కేంద్రంలో అధికారం రావడానికి మతరాజకీయం బాగా దోహదం చేసింది. అయితే ఆ అయోధ్యలోనే బీజేపీ అభ్యర్థి మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయారు.ఆ మందిరం కట్టిన యూపీలోనూ బీజేపీ వెనకబడింది. చడీ చప్పుడు లేకుండా కాశ్మీర్ 370వ అధికరణాన్ని రద్దు చేయడం కూడా నిజమే. కాని అక్కడ ఇంతవరకూ సాధారణ పరిస్థితి నెలకొల్పలేకపోయింది. ఆ రద్దుకు ముందు తర్వాత పదేళ్లపాటు ఎన్నికలు కూడా వాయిదా వేయవలసి వచ్చింది. జరిగిన మేరకు ఏకధాటిగా విజయాలు సాధించిందీ లేదు. ఎన్నికలు జరపకపోవడానికి అదీ ఒక కారణం.ప్రధాని ప్రసంగించిన ఆగష్టు 15 తర్వాత రోజున ఎన్నికల సంఘం తేదీలు ప్రకటించింది. సెప్టెంబరు 30లోగా అక్కడ ఎన్నికలు జరిపి శాసనసభను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించి వుండకపోతే ఇవైనా జరిగేవా అన్నది సందేహమే. ఇప్పుడు కూడా అక్టోబర్1 వరకూ జరపాల్సి వస్తుందన్నారు. కారణం భద్రతా దళాల కొరత! 370 రద్దు తర్వాత పరిస్థితి ఎంత లక్షణంగా వుందో దీన్ని బట్టే తెలుస్తుంది. ఈ ఎన్నికలకు ముందే జమ్మూలో తీవ్రవాదం విజృంభించిందనే ప్రచారాలూ అణచివేతలూ చూస్తున్నాం. ఇవన్నీ ఎన్నికల సమయంలో ఎలాటి ప్రభావం చూపేది తెలియదు. సాధ్యమైనంత త్వరలో కాశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరిస్తామనే పూచీలు ఏమైందీ తెలియదు. బీజేపీ కేంద్రం ప్రత్యేకించి మోడీ మాటలకూ వాస్తవాలకూ ఎంత తేడానో ఇక్కడే తెలిసిపోతుంది.



మార్పులేదనేది దేశానికి మాత్రమే గాక ఎన్డీయే మిత్రులకూ స్పష్టం చేయడం. రెండోది హర్యానా,కాశ్మీర్ తర్వాత మహారాష్ట్ర ఆపైన ఢిల్లీ వంటి శాసనసభల ఎన్నికలకు ముందే మతతత్వ ఎజెండాను మళ్లీ సిద్ధం చేయడం. తద్వారా హిందువుల ఓట్లను ఆకర్షించాలనే తాపత్రయం.

మిత్రుల ఇరకాటం

బీజేపీ అనుకున్నట్టే ఎన్డీయే భాగస్వామ్య పార్టీలేవీ మోడీ ప్రసంగంపై ప్రతికూలంగా స్పందించలేదు. టీడీపీ మైనార్టీనాయకులొకరు దీనిపై స్పందిస్తూ యుసిసిలో ఏ అంశాలపై ప్రభావం ఎలా వుంటుందో తెలుసుకోగోరుతున్నామని చెప్పారు.అంతకుముందు వక్ఫ్‌చట్టంపైనా ఇలాగే కొన్ని అభ్యంతరాలు చెబుతూనే మార్పులను స్వాగతిస్తామని వ్యాఖ్యానించారు.తమ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల వల్లనే కేంద్రం వక్ఫ్ చట్ట సవరణల బిల్లును సంయుక్త పార్లమెంటరీ సంఘానికి నివేదించిందని కూడా ఆయన చెప్పారు. ఇక్కడ టీడీపీ ఇరకాటం స్పష్టమే. ఇక జేడీయూ విషయానికొస్తే సీనియర్ నాయకుడు కెసిత్యాగి మాట్లాడుతూ ఉమ్మడి కోడ్‌పై తమ వైఖరిని ముఖ్యమంత్రి నితిష్‌కుమార్ ఎప్పుడో ప్రకటించారని దాటేశారు. క్లిష్టమైన ఇలాంటి విషయాల్లో రాష్ట్రాలను సంప్రదించి ముందుకుపోవాలని నితిష్ లేఖ రాశారని గుర్తు చేశారు.అంతేగాని ఏకపక్ష వైఖరిని వ్యతిరేకిస్తున్నట్టు గట్టిగా చెప్పలేకపోయారు.దీనిపై విదేశీ పత్రికలు కూడా స్పందిస్తుంటే భాగస్వామ్య పార్టీలు, బడా మీడియా మౌనం దాల్చడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రధాని మోడీ ప్రసంగంలో సమ్మిళిత అనే పదం వాడారు గానీ, అది మతం విషయాలలో కాదని ఒక పత్రిక విశ్లేషించింది.

బీజేపీ ప్రచారంలో కీలకమైన మరో అంశాన్ని అర్థం చేసుకోవడానికి కూడా ఈ సందర్భం సరిపోతుంది.మోడీకి చాలా ఇష్టమైన మంత్రజపం ఒకే దేశం-ఒకే ఎన్నిక. ఈ ప్రసంగంలోనూ వినిపించారు. అసలు ఒకేదేశం ఒకేపన్ను ఒకే కార్డు ఒకే పార్టీ, ఒకేమతం ఒకే మోడీ అన్నది ఆయనకు ఇష్టమైన ప్రచారం. ఒకేదేశం ఒకే ఎన్నిక సాధించడానికి కృషిచేయాలని మొన్నటి ప్రసంగంలోనూ నొక్కి వక్కాణించారు. అయితే ఆమరుసటి రోజునే వచ్చిన ఎన్నికల తేదీల ప్రకటన సంకేతాలేంటి? మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగాల్సి వుండగా వాటిలో ఒకటైన మహారాష్ట్రలో జరపలేకపోతున్నట్టు సిఇసి రాజీవ్‌కుమార్ తేల్చిచెప్పారు. ఇందుకు అనేక కారణాలు చూపించినా ప్రధానమైంది మాత్రం భద్రతా దళాలు కాశ్మీర్‌లో వుండాల్సి రావడంతో ఏర్పడిన కొరత.

మోడీ మొన్నటి ఎన్నికల ఫలితాల ప్రభావాలనూ, పాఠాలనూ నేర్చుకోదలచలేదని ఈ ప్రసంగం స్పష్టం చేసింది. ఎందుకంటే బీజేపీ కీలక ఎజెండాలోని ముఖ్యాంశాలు మూడింటిలో రెండు నెరవేరినట్టు చెప్పడమే అతిశయోక్తి.అయోధ్య సమస్యపై రాజకీయం చేయడం ద్వారా ఆ పార్టీ లాభపడిన మాట నిజం.ఏకంగా మూడోసారి కేంద్రంలో అధికారం రావడానికి మతరాజకీయం బాగా దోహదం చేసింది. అయితే ఆ అయోధ్యలోనే బీజేపీ అభ్యర్థి మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయారు.ఆ మందిరం కట్టిన యూపీలోనూ బీజేపీ వెనకబడింది. చడీ చప్పుడు లేకుండా కాశ్మీర్ 370వ అధికరణాన్ని రద్దు చేయడం కూడా నిజమే. కాని అక్కడ ఇంతవరకూ సాధారణ పరిస్థితి నెలకొల్పలేకపోయింది.

ఏకకాల ఎన్నికల మోజు

బీజేపీ ప్రచారంలో కీలకమైన మరో అంశాన్ని అర్థం చేసుకోవడానికి కూడా ఈ సందర్భం సరిపోతుంది.మోడీకి చాలా ఇష్టమైన మంత్రజపం ఒకే దేశం-ఒకే ఎన్నిక. ఈ ప్రసంగంలోనూ వినిపించారు. అసలు ఒకేదేశం ఒకేపన్ను, ఒకే కార్డు ఒకే పార్టీ, ఒకేమతం ఒకే మోడీ అన్నది ఆయనకు ఇష్టమైన ప్రచారం. ఒకేదేశం ఒకే ఎన్నిక సాధించడానికి కృషిచేయాలని మొన్నటి ప్రసంగంలోనూ నొక్కి వక్కాణించారు.అయితే ఆమరుసటి రోజునే వచ్చిన ఎన్నికల తేదీల ప్రకటన సంకేతాలేంటి? మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగాల్సి వుండగా వాటిలో ఒకటైన మహారాష్ట్రలో జరపలేకపోతున్నట్టు సిఇసి రాజీవ్‌కుమార్ తేల్చిచెప్పారు. ఇందుకు అనేక కారణాలు చూపించినా ప్రధానమైంది మాత్రం భద్రతా దళాలు కాశ్మీర్‌లో వుండాల్సి రావడంతో ఏర్పడిన కొరత. కేవలం మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు జరపడమే ఇంత కష్టమైతే 28చోట్ల ఒకేసారి జరపాలనడం ఎంత హాస్యాస్పదం? పైగా రాజ్యాంగ నిబంధనల ప్రకారం కూడా శాసనసభల ఏర్పాటు, పార్లమెంట్‌లో లోక్‌సభ ఏర్పాటు వేర్వేరు విషయాలు. భారతదేశం రాష్ట్రాల సమాఖ్య అని చెబుతున్న రెండవ అధికరణం ఏ శాసనసభకు దానిగా కాలపరిమితిని బట్టి ఎన్నికలు జరపాలంటుంది. ఒకే ఎన్నిక కోణమే లేదు. పైగా మిశ్రమ ప్రభుత్వాల యుగంలో ఏ కారణంతో ఏ సర్కారు కూలిపోయి సభ రద్దయినా మిగిలిన చోట అకారణంగా సభల పదవీ కాలం వున్నా ఎన్నికలు జరపడమనే ఆలోచనే అర్థరహితం. విడివిడిగా రాష్ట్రాలలో గానీ లేక ఏకంగా కేంద్రంలో గానీ సర్కార్లు పడిపోయి ఎన్నికలు జరపాల్సి రావచ్చు. మిగిలిన పదవీకాలానికి వాటిని కృత్రిమంగా కొన సాగించడం అకారణ సమస్యలను అనైతిక పెత్తనాన్ని ఆహ్వానించడమే అవుతుంది. అలాంటి అవకాశమే కల్పించితే నీతిమాలిన నేతలు కావాలని అనేక మాయోపాయాలను పాల్పడతారు కూడా. నిజానికి ఏకీకృత పెత్తనం కోరుకునే బీజేపీ-ఆరెస్సెస్ రాజకీయాల కోసం తప్ప ఈ విధానానికి హేతుబద్ధతే లేదు. దేశాన్ని వంద రాష్ట్రాలుగా విభజించి కేంద్రానికే కీలకాధిపత్యం అప్పగించాలనేది వారి మనోగతం. ఒకేసారి ఎన్నిక జరిగితే ఘనత వహించిన మోడీ వంటి నేతను చూసి, ప్రజలు రాష్ట్రాల నేతలను గాక ఆయన్ను చూసి అన్నిచోట్లా గెలిపిస్తారని అత్యాశ.ఇప్పటికీ అనేక రాష్ట్రాల్లో టికానా లేని బీజేపీ నిరంతరం ఒకే ఎన్నిక పాట పాడుతూనే వుంటుంది. ఒకేసారి ఎన్నికల కోసం ఎన్నుకున్న పదవీకాలం పూర్తికాకుండా ఏ సభను రద్దుచేసినా సుప్రీం కోర్టులో సవాలు చేయొచ్చు కూడా. ■

జమీన్ అస్మాన్ ఫరక్!

మొన్న దావోస్ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి రూ.4వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామన్నారు. ఇప్పుడు మళ్లీ అమెరికా వెళ్లిన ఆయన మళ్లీ వేలకోట్ల పెట్టుబడుల వరద పారుతున్నట్టు పత్రికల్లో వార్తలు చదువుతుంటే అర్థమవుతుంది. అంతకు ముందు పదేండ్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి హోదాలో కల్వకుంట్ల తారక రామారావు విదేశాలకు వెళ్లినప్పుడల్లా వేలు... లక్షల కోట్ల పెట్టుబడులంటూ ఊదరగొట్టిన మాటలు ఇంకా చెవుల్లో ఠంగు మంటూనే ఉన్నాయి. ఈ సార్లు చెప్తున్న మాటలు వింటుంటే అమెరికా మొత్తం ఖాళీ అయ్యి, పారిశ్రామిక వేత్తలంతా తెలంగాణకు క్యూ కట్టారేమో అనిపిస్తుంది. అక్కడితో ఆగని పెద్దసార్లు... లక్షలాదిమంది నిరు ద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నామనీ ఢంకా బజాయించి చెప్పబడ్తిరి. కానీ ఎమ్మెస్సీ చదివిన బిడ్డకు కొలువు రాలేదని నా కొలీగ్ చెప్తుండే. బీటెక్ సదివి ఆవారాగాని లెక్క కొడుకు తిరుగుతున్నడనీ పొరుగింటి పరం ధాములు మొత్తుకోబట్టే! అశోక్‌నగర్, అమీర్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్ కోచింగ్ సెంటర్లల్లో, హాస్టళ్లలో వేలాదిమంది నిరు ద్యోగులు కొలువుల కోసం ఆశగా ఎదురుచూడబట్టే! సర్కారు సార్లు సెప్పే గప్పాలకీ, మాక్కనబడే కొలువులు, కంపెనీలకు జమీన్ ఆస్మాన్ ఫరక్ కనిపిస్తుండే! ఏం సార్లూ...జర కండ్లకు ఆ నల్లకండ్లద్దాలు తీసి సూడరాదుర్రీ!!

-ఎస్ఎస్ఆర్ శాస్త్రి

'యథా రాజా..తథా ప్రజా'

నిన్నటి వరకు జనాభాలో రెండవ స్థానంలో ఉన్న భారత దేశం చైనాను వెనక్కినెట్టి మొదటి స్థానానికి చేరుకుంది. జనాభా విషయంలో ప్రపంచంతో పోటీ పడుతున్నా క్రీడల్లో మాత్రం ఇండియా అట్టడుగు స్థాయిలో ఉంది. క్రికెట్, హకీ లాంటి కొన్ని ఆటల్లో తప్ప పెద్దగా ప్రతిభ చూపిన దాఖలాలు లేవు. ఒలంపిక్స్‌లో అయితే చెప్పాల్సిన పనిలేదు. 150 కోట్ల జనాభాకు, మన క్రీడాకారులు తెస్తున్న పథకాలకు సంబంధం లేకుండా ఉంది. అయినా వారిననడం తప్పే. వాళ్లనలా తయారు చేసిన క్రీడా సంఘాలు, రాజకీయ నాయకులదే పూర్తి బాధ్యత! 'యథా రాజా... తథా ప్రజా'. అవునూ.. సామెతలు ఊరకనే పుట్టుకుని రాలేదు. అనుభవాల సారంగానే వాడుకలోకి వచ్చాయి. రాజెలా ఉంటే అక్కడి ప్రజలు కూడా అలాగే ఉంటారు. రాజకీయ వ్యవస్థ మూలాల క్రమంలోనే క్రీడా రంగం తయారైంది. ఎంపిక నుంచి శిక్షణ వరకూ అన్నింటా రాజకీయాలే. ఎలాంటి ప్రావీణ్యం లేని వారు అందలం ఎక్కుతుంటే, అత్యంత ప్రతిభ గలవారు మరుగున పడిపోతు న్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలు ఎంపికను ప్రభావితం చేస్తున్నాయి. వీటికి తోడు కక్షలు, వేధింపులు రోజురోజుకూ పెరిగిపోతు న్నాయి. క్రీడా సంఘం పెద్దాయన తమను లైంగికవేధిం పులకు గురిచేస్తున్నారని భారత రెజ్లర్లు ఢిల్లీ వేదికగా నెలల తరబడి పోరాటం చేసినా పాలకులు పట్టించుకోలేదు. ఇలాంటి ఘటనల్ని చూస్తే కొత్తగా ఈ రంగానికి రావాలంటే ఎంత ప్రతిభ ఉన్నవారైనా ఆలోచిస్తారు. ముందు ఆ వ్యవస్థలోని లోపాలను సరిద్దే చర్యలు చేపట్టాలి. ఎందుకంటే క్రీడారంగంలో మనమెక్కడు న్నామో పారిస్ ఒలంపిక్ పట్టికను చూస్తే అర్థమవుతుంది. విశ్వ విపణిలో భారత పతాకాన్ని రెపరెపలాడించే క్రమ శిక్షణ, నిబద్ధత కలిగిన క్రీడాకారులను తయారుచేసే దిశగా సర్కార్ సాగితేనే మనదేశానికి పేరు.

- ఊరగొండ మల్లేశం

'ఏమి సేతుర లింగా..ఏమి సేతూ'

'మావోళ్లు మంచిగుంటే మొన్ననే అధికారంలోకి వచ్చేటోళ్లం. గిట్లనే ఉంటనే ఎవ్వరూ బాగచేయలేరు. ఎప్పుడు ఎలా స్పందించాలనే విషయంపై అధిష్టానం క్లారిటీగా లేదు' అంటూ బీజేపీ ఎమ్మెల్యేలు బాహాటంగానే అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. ఇగ, బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అయితే తన కష్టానికి తగిన ప్రతిఫలం రావట్లేదని హైరానా పడిపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిరోజూ ఏదో ఒక అంశంపై మీడియా ముందుకొచ్చి బాంబులు పేల్చేస్తున్నాడు. తనకు పార్టీలో మద్దతు దక్కకపోవటాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. 'సుంకిశాల' ఘటనలో ఎమ్మెల్యేల బృందాన్ని అక్కడికి తీసుకెళ్లి, సమస్యను లేవనెత్తి ఇంజినీర్‌ను సస్పెండ్ చేయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో తాను సక్సెస్ అయ్యానని చెప్పుకుంటున్నారు. అయితే, ఈ విషయంలో ఆయనకు పార్టీ నుంచి తగిన మద్దతు లభించలేదు. 'సక్సెస్‌ను కూడా పార్టీ ఓన్ చేసుకోకపోతే ఎందుకు?' అని ఆయన గుస్సా అవు తున్నారు. 'ఎంత మొత్తుకున్నా ఏమున్నది గర్వకారణం? మీడియాలో నాలుగు స్కోలింగ్‌లు తప్ప! సర్కారు లోపాలపై పోరాటంపై సపోర్టు ఇచ్చేవారేరి? ఏమి సేతుర లింగా...ఏమి సేతూ' అని ఏలేటి అనుకోవాల్సిన దుస్థితి వచ్చింది.

- అచ్చిన ప్రశాంత్

బేటీ..!



'ఏమండీ శ్రీవారు! చాయి తీసుకోండి!" అంటూ టీకప్పు అందించింది వనజ.

ఫోనులోనుండి తలపైకెత్తి టీ తీసుకుని మళ్లీ ఫోనులో మునిగిపోయాడు కుమార్.

"ఏమిటండి అంతగా ఏముంది మీ ఫోనులో! పొద్దటి నుండి చూస్తూనే ఉన్నారు! చూడకుడనిది ఏమైనా చూస్తున్నారా?" అడిగింది వనజ.

"దేశానికి స్ఫూర్తినందించేది చూస్తున్నాను! ఇది చూస్తుంటే నా జన్మకిది చాలు అన్పిస్తోంది!" అన్నాడు కుమార్ తన్మయత్వంతో.

"ఓహో అల్లూరి సీతారామరాజు సినిమా చూస్తునారా?" అన్నది వనజ.

"అబ్బే కాదు! పెద్దాయన చేసిన ట్వీట్లు చూస్తున్నాను.ఆడపిల్లలు అంటే పెద్దాయనకు ఎంత ప్రేమ! నిరంతరం ఆడపిల్లల గురించి తపన పడుతూనే ఉంటారు. ఈ దేశంలో పెద్దాయన కాలంలో ఆడపిల్లగా పుట్టాలంటే పూర్వజన్మలో పుణ్యం చేసుకుని ఉండాలి!" అన్నాడు కుమార్ ట్రాన్స్‌లో ఉండి.

"ఓహో మీరేం పాపాలు చేశారో! మగాడిగా పుట్టారు!" అన్నది వనజ.

"పతియే ప్రత్యక్ష దైవం! మొగుడిని అలాంటి మాటలు అనరాదు! అసలు మగాడులో గాడ్ అనబడే దేవుడు ఉన్నాడు తెలుసా?" అన్నాడు కుమార్.

"మీరు ఫోను ఎందుకు చూస్తునారంటే, ఏదేదో చెబుతారేంటి" అన్నది వనజ విసుగ్గా.

"అట్లా అడుగు చెబుతాను! ఇందుకే అన్నాను కదా! పెద్దాయన చేసిన ట్విట్స్‌లో మహిళల గురించి ఎంత గొప్పగా ఆలోచిస్తున్నారో తెలుస్తుంది! మను బాకర్‌కు పతకం రాగానే ఫోన్ చేసి, అభి నందనలు తెలుపుతూ మాట్లాడారు!" వినేశ్ కి ఏ పతకం రాలేదని తెలిసినా వినేశ్ వీరవనిత" అంటూ ట్విట్ చేశారు! అంతెందుకు ఒలింపిక్ సంఘానికి ఒక మహిళను అధ్యక్షురాలిగా నియమించారు! ఇది చాలదా?" అన్నాడు కుమార్.

"ట్వీట్ చేయటం, ఫోన్ చేయటం కూడా గొప్పేనా?" అంది ఆశ్చర్యంగా వనజ.

"ట్వీట్ చేయటం, ఫోన్ చేయటమే కాదు వినేశ్ కోసం రూ.డెబ్బయి లక్షలు కేటాయించారు. ఖర్చు కూడా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడైనా ఇంతఖర్చు పెట్టిందా?" ప్రశ్నించాడు కుమార్.



"ఇంతకూ మీరు ఏమంటారు?" ప్రశ్నించింది వనజ.

"పెద్దాయన బేటీల కోసం చేస్తున్న ఖర్చు, త్యాగాలు తెలుసుకోమంటున్నాను" అన్నాడు కుమార్.

"మీరు చెప్పింది అర్థమయ్యింది. అయితే పోటీల్లో పతకాలు గెలిచిన తర్వాత ఫోన్లు చేసి అభినందించే బదులు, పోటీలకు సిద్ధమయ్యే టైములో, అందరు ఆటగాళ్లకు సరైన క్రీడావసతులు ఏర్పాటు చేసి, మీరు గెలవండి! అందుకు మేమేం చేయాలో మాకు చెప్పండి. అది పెద్దాయన ఎప్పుడైనా అడిగారా? లేదు కద!" అన్నది వనజ.

"దానికేం, కాని ఇప్పటికే ఎన్నో స్టేడియాలు కట్టించీ, క్రీడల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు పెద్దాయన! అహ్మదాబాద్‌లో నరేంద్రమోడీ స్టేడియం కూడా కట్టించాడు తెలుసా!" అన్నాడు కుమార్ గొప్పగా.

"అది..క్రికెట్ స్టేడియం!" అన్నది వనజ నవ్వుతూ.

కుమార్ గందరగోళపడ్డాడు.

"మీరిందాక, ఈ దేశంలో మహిళలుగా పట్టడం గొప్పవిషయం అన్నారు! కాని ఈ దేశంలో మహిళలకు ఏ మాత్రం, గౌరవ మర్యాదలు లేవు! అసలు మహిళలను మనుషులుగా చూడటం లేదు! పెద్దాయన ఫోను చేసి మాట్లాడటం, మహిళల కోసం ట్వీట్స్ చేయటం గొప్ప అన్నట్లు చెబుతున్నారు! నిజంగానే మహిళల పట్ల అంత బాధ్యత ఉంటే ఈ రోజు వరకు మణిపూర్‌కి ఎందుకు వెళ్లలేదు! అక్కడ అవమానాలకు గురైన మహిళలను ఎందుకు ఆదుకోలేదు!" నిలదీసింది! వనజ.

"ఎప్పుడూ మణిపూర్ మీద పడి ఏడుస్తారేం?" చిరాగ్గా అన్నాడు కుమార్.

"ఎందుకంటే మణిపూర్ మహిళల మానమర్యాదలు మంటగలిశాయి కనక! అక్కడ డబులింజన్ సర్కార్ రాజ్యమేలుతున్నది కనక! సరే మీరన్నట్లు మణిపూర్‌ని పక్కనపెడితే ఏమున్నది గర్వకారణం? మహిళా రెజ్లర్లు రోడ్డుమీద న్యాయంకావాలి మొర్రో! అని రోదిస్తుంటే వారి బాధ పట్టించుకోలేదు! పట్టు దలగా జగజ్జెట్టీలను ఓడించి, ఫైనల్‌కి వచ్చిన వినేశ్‌ని దొంగదెబ్బ తీశారు! ఆ తర్వాత తీరిగ్గా వినేశ్ వీరవనిత అని ట్వీట్ చేస్తే ఏమి ఉపయోగం?" ప్రశ్నించింది! వనజ.

కుమార్ గొంతు పెగలలేదు.

'మొన్న కొల్‌కతాలో ఓ మహిళా డాక్టర్‌పై పశువుల్లా అత్యాచారం చేశారు. గత పదేండ్లలో లైంగికదాడులు, హత్యలు బాగా పెరిగిపోయాయి. ఎందుకో తెలుసా? మగాళ్లలో గాడ్ ఉన్నాడన్న అహంకారం, మహిళలు పురుషులకు బానిసలన్న భావజాలం, ఇందుకు కారణాలు! గత పదేండ్లుగా మీ భావజాలం విస్తరించి, మహిళలకు రక్షణ లేకుండా చేసింది. స్త్రీలకు మనస్సు ఉంటుందని, వారికి ఇష్టా యిష్టాలుంటాయని మీ భావజాలానికి తెలియదు. మీ భావజాలానికి తెలిసినవి రెండే రెండు. అందులో ఒకటి ద్వేషం, మరొకటి ఆధిపత్యం. అందుకే దేశంలో అత్యాచాలు రోజురోజుకీ పెరిగి పోతున్నాయి" అంటూ ముగించింది వనజ.

- ఉషాకిరణ్

డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం

మాదక ద్రవ్యాలు వాడితే జీవితం నాశనం   కాలేజీల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ చర్యలు

- మత్తు పదార్థాలకు బానిసలైతే తల్లిదండ్రులు మా దృష్టికి తేవాలి : డీజీపీ జితేందర్
- ర్యాగింగ్ నిరోధానికి వారంలో టోల్‌ఫ్రీ నెంబర్ • కాలేజీల్లోనూ డ్రగ్స్ నివారణకు ప్రహరీ క్లబ్‌లు
- రెండ్రోజుల్లో ఉత్తర్వులు విడుదల చేస్తాం : విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డ్రగ్స్ రహిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యమని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. మాదక ద్రవ్యాల కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందనీ, అందుకోసం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా యాంటీ నార్కోటిక్ బ్యూరోను ఏర్పాటు చేసిందన్నారు. డ్రగ్స్ వాడితే జీవితం నాశనమవుతుందని చెప్పారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటేనే జీవితంలో సంతోషంగా ఉంటారని అన్నారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్‌ఈ) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూలో 'మాదకద్రవ్యాల దుర్వినియోగం-ర్యాగింగ్ వ్యతిరేకత' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్ నివారణ, ర్యాగింగ్ నిరోధానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. 'మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటాను, మంచి సమాజాన్ని నిర్మించడానికి కృషి చేస్తాను. తెలంగాణ రాష్ట్రానికి మేలు కలిగేలా ప్రవర్తిస్తాను' అని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం అందరితో ప్రమాణం చేయించారు. తెలంగాణ ముఖ్యఅతిథిగా పాల్గొన్న జితేందర్ మాట్లాడుతూ ర్యాగింగ్‌పై నిషేధం ఉందన్నారు. కాలేజీల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామనీ, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాలేజీ నుంచి సస్పెన్షన్ చేస్తారని అన్నారు. ఇది కొందరికి సరదా కావొచ్చు, కానీ చాలా మంది విద్యార్థులు సున్నితంగా ఉంటారని వివరించారు. ర్యాగింగ్‌కు గురైన విద్యార్థుల్లో చదువు ఆపేసినవాళ్లు, ఆత్మహత్యలకు పాల్పడిన వాళ్లున్నారని గుర్తు చేశారు. కాలేజీల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలున్నాయని చెప్పారు. ఏదో ఒక రోజు పోలీసులకు దొరికితే జీవితం ప్రశ్నార్థకమవుతుందని తెలిపారు. డ్రగ్స్ వినియోగం మంచిది కాదన్నారు. మాదక ద్రవ్యాలను సరఫరా చేసే వారికి ఇది వ్యాపారమనీ, సామాన్యులు ఆ ఊబిలోకి దిగుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని దేశాలు డ్రగ్స్ వినియోగానికి అనుమతి ఇస్తున్నాయనీ, భారత్‌లో ఎందుకివ్వొద్దంటూ కొందరు వితండవాదం చేస్తున్నారని అన్నారు. ఆయా దేశాల్లోని యువత నష్టపోతున్నదనీ, వారిని చూసి ఈ దేశంలోని యువత నష్టపోవాలా? అని ప్రశ్నించారు. మాదక ద్రవ్యాల నివారణకు కేంద్రాలున్నాయని వివరించారు. సాధారణ పౌరులుగా మార్చేందుకు డాక్టర్లు, ఇతర సిబ్బంది ప్రయత్నిస్తారని చెప్పారు. కానీ అది అంత సులువు కాదన్నారు. పిల్లల ప్రవర్తనతో పాటు వారు ఏం చేస్తున్నారో గమనించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని చెప్పారు. వారిలో ఏమైనా తేడా ఉంటే వెంటనే పోలీసులు, డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలైతే తమ దృష్టికి తేవాలని కోరారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండండి, జీవితంలో సంతోషంగా ఉండండి అని అన్నారు.

కాలేజీల్లోనూ ప్రహరీ క్లబ్‌లు : బుర్రా వెంకటేశం

ర్యాగింగ్ నిరోధానికి వారంరోజుల్లో టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తామని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. జూనియర్లను సీనియర్లు పరిచయం చేసుకునే క్రమంలో క్రూరంగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. ర్యాగింగ్‌ను అరికట్టేందుకు విద్యాశాఖ, పోలీసు శాఖ కలిసి పనిచేస్తున్నాయని అన్నారు. మెడికల్ కాలేజీలు, ఇంజినీరింగ్ కాలేజీల్లో ఈ ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని అన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా విద్యార్థులు నిర్భయంగా చెప్పొచ్చని సూచించారు. ఈ విషసంస్కృతిని కూకటివేళ్లతో పెకిలించాలని చెప్పారు. డ్రగ్స్ తీసుకుంటే హీరో, హీరోయిన్ అయినట్టుగా భావించడం మూర్ఖత్వమని అన్నారు. మాదక ద్రవ్యాలను తీసుకుంటే జీవితం నాశనమవుతుందన్నారు. దేశ విచ్ఛిన్నానికి పాల్పడే వారికి ఇది ఓ ఆదాయ వనరు అని చెప్పారు. పాఠశాలల్లో ఉన్నట్టుగానే కాలేజీల్లోనూ డ్రగ్స్ నివారణకు ప్రహరీక్లబ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. రెండు రోజుల్లో ఉత్తర్వులను జారీ చేస్తామని అన్నారు.

పల్లెలకు చేరిన డ్రగ్స్ మహమ్మారి : లింబాద్రి

డ్రగ్స్ మహమ్మారి పట్టణాల నుంచి పల్లెలకు చేరిందనీ, పబ్‌ల నుంచి విద్యాసంస్థలకు వస్తున్నదని ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి చెప్పారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాల పట్ల సమాజంలో అవగాహన కల్పించాలనీ, విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించాలని సూచించారు. వాటిని వాడితే కుటుంబ పురోభివృద్ధి కాకుండా నాశనమవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణను డ్రగ్స్ నిర్మూలన రాష్ట్రంగా మార్చడమే లక్ష్యమని అన్నారు. ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. విద్యాసంస్థల్లో వాటిని నివారించేందుకు మరిన్ని అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలనీ, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మాట్లాడుతూ భారత్ అభివృద్ధి కాకుండా యువత జీవితాలను నాశనం చేసేందుకు చాలా మంది ప్రయత్నిస్తున్నారని అన్నారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని చెప్పారు. యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ ర్యాగింగ్ విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. డ్రగ్స్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా 8712671111 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పొగాకు, మద్యపానం, మాదక ద్రవ్యాలను వాడితే మెదడు దెబ్బతింటుందనీ, జీవితం అంధకారంలోకి వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, రూసా ప్రాజెక్టు ఆఫీసర్ సౌందర్య జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ తదుపరి రాజకీయ మజిలీ బీజేపీయే

- త్వరలోనే ఆయన ఆ పార్టీలో చేరటం ఖాయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలు
- 24న మహిళా కమిషన్ ముందు హాజరవుతానంటూ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదుపరి రాజకీయ మజిలీ బీజేపీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. త్వరలోనే ఆయన ఆ పార్టీలో చేరటం ఖాయమని అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్, మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రధాని మోడీ అంటే తనకు ఎందుకంత భయమనే విషయాన్ని రేవంత్ ఇటీవల తన సన్నిహిల వద్ద వెల్లడించారని తెలిపారు. 'నేను పుట్టింది బీజేపీలోనే, చివరకు నా రాజకీయ ప్రస్థానం బీజేపీలోనే ముగుస్తుంది...' అంటూ సీఎం ప్రధాని మోడీకి, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు హామీనిచ్చారని ఎద్దేవా చేశారు. తాను ఏబీవీపీతో, కాషాయ జెండాతో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించాననీ, అదే జెండా కప్పుకుని చనిపోతానంటూ ప్రధానితో రేవంత్ చెప్పింది వాస్తవమా? కాదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ అంశంలో ప్రజలకు స్పష్టతనివ్వాలంటూ సీఎంను డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై తాను ఇటీవల పార్టీ అంతర్గత సమావేశంలో యధాలాపంగా చేసిన వ్యాఖ్యలపై కొందరు రాద్ధాంతం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఈ అంశంపై ఇప్పటికే విచారం వ్యక్తం చేశానని గుర్తు చేశారు. అయినా మహిళా కమిషన్ నోటీసులిచ్చిందని వాపోయారు. తాను చట్టాన్ని గౌరవిస్తాననీ, ఈనెల 24న కమిషన్ విచారణకు తాను హాజరవుతానని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో గత ఎనిమిది నెలల్లో మహిళలపై కొనసాగిన దాడులు, దౌర్జన్యాలు, అఘాయిత్యాలన్నింటినీ వివరిస్తానని చెప్పారు. అసెంబ్లీలో తమ పార్టీకి చెందిన మహిళా సభ్యులపై కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలను కూడా ప్రస్తావిస్తానని తెలిపారు.



ఎంఎల్ఆర్ఐటీ, ఐఏఆర్ఈ గుర్తింపును రద్దు చేయాలి

- బీ కేటగిరీ అడ్మిషన్ల దందాపై విచారణ జరపాలి : ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రికి ఎస్ఎఫ్ఐ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మర్రి లక్ష్మారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ (ఐఏఆర్ఈ) కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బీ కేటగిరీ అడ్మిషన్ల దందాపై విచారణ జరపాలని కోరింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్‌కు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి శనివారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. బీ కేటగిరీ నోటిఫికేషన్ ప్రభుత్వం జారీ చేయకముందే ఎంఎల్ఆర్ఐటీ, ఐఏఆర్ఈ కాలేజీలు విద్యార్థుల నుంచి డొనేషన్లను తీసుకున్నాయని వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆ కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ కాలేజీల యాజమాన్యం చైర్మెన్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బీ కేటగిరీ నోటిఫికేషన్ రాకముందే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సీట్లు ఇస్తామంటూ ఒక్కో సీటుకు రూ.16 లక్షల డొనేషన్‌ను వసూలు చేశారని తెలిపారు. వంద మంది విద్యార్థుల దగ్గర సుమారుగా రూ.200 కోట్ల వరకు వసూళ్లకు పాల్పడ్డారని విమర్శించారు. అక్రమ వసూళ్లకు పాల్పడి ఇప్పుడు సీట్లు ఇవ్వబోమని ప్రకటించడంతో విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందని తెలిపారు. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలియజేస్తుంటే గూండాలను పంపి దాడి చేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. అక్రమ పద్ధతుల్లో వసూళ్లకు పాల్పడిన ఆ కాలేజీ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలేజీల గుర్తింపు రద్దు చేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి, నాయకులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పొద్దంతా ఉక్కపోత..రాత్రిపూట వాన

- రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం
- మరో వారం పాటు ఇలాగే
- రాష్ట్రంలో పలుచోట్ల మోస్తరు వాన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో విభిన్నమైన వాతావరణం నెలకొంది. ఉదయంపూట ఎండాకాలంలో మాదిరిగా విపరీతమైన ఉక్కపోత ఉంటున్నది. సాయంత్రం అయినప్పటికీ అలాగే ఉంటున్నది. రాత్రి సమయాల్లో మాత్రం ఎక్కువప్రాంతాల్లో వర్షం కురుస్తున్నది. కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్ బరెస్ట్ అయిందా? అన్నట్టుగా ఒకే చోట కొద్దిసేపట్లోనే 9 నుంచి 17 సెంటీమీటర్ల వరకు భారీ వర్షపాతం నమోదవుతున్నది. అంతర్గత కర్నాటక, తెలంగాణ మీదుగా సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు ఆవర్తనం నెలకొని ఉంది. అది ఎత్తుకు పోయేకొద్దీ నైరుతి వైపునకు వంగి ఉన్నది. అదే సమయంలో ఉపరితల ద్రోణి కర్నాటక, తెలంగాణ, కేరళ, అంతర్గత తమిళనాడు మీదుగా కోమరిన్ ప్రాంతం వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతున్నది. దీంతో గాలిలో హ్యుమిడిటీ ఎక్కువగా ఉంటున్నది. దాని ఫలితంగా ఉక్కపోత తీవ్రంగా ఉంటున్నది. మాన్‌సూన్ బ్రేక్ వల్ల ఈ పరిస్థితి నెలకొందనీ, మరో వారం పాటు పరిస్థితి ఇలాగే ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. ఆది, సోమ, మంగళ, బుధ వారాల్లో రాష్ట్రంలో దాదాపు అన్ని జిల్లాల్లోనూ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన పడే అవకాశముందని పేర్కొన్నారు. ఉరుములు, మెరుపులతో పాటు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే సూచనలున్నాయని తెలిపారు. అయితే, ఒకటెండ్రు ప్రాంతాల్లో మాత్రం భారీ వర్షం పడే అవకాశముందని హెచ్చరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసే సూచనలున్నాయి. నైరుతి, పశ్చిమ దిశలో గాలులు వీచే అవకాశముంది.

రాష్ట్రంలో శనివారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు 177 రెయిన్‌గేజ్ సెంటర్లలో వర్షపాతం నమోదైంది. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం రామారం గ్రామంలో అత్యధికంగా 8.2 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. హన్మకొండ జిల్లా ఖాజీపేటలో, రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో, సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం మునిగడపలో భారీ వర్షం పడింది.

అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు

రామారం (సిద్దిపేట)	8.2 సెంటీమీటర్లు
ఖాజీపేట (హన్మకొండ)	7.0 సెంటీమీటర్లు
కడ్తాల్ (రంగారెడ్డి)	6.6 సెంటీమీటర్లు
మణిగడప(సిద్దిపేట)	6.5 సెంటీమీటర్లు
వెల్జాల (రంగారెడ్డి)	6.1 సెంటీమీటర్లు

శ్రీధర్‌బాబును కలిసిన టీఆర్టీఎఫ్ నేతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యారంగంలో సంస్కరణల కోసం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం చైర్మెన్ శ్రీధర్‌బాబును టీఆర్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి శనివారం హైదరాబాద్‌లో కలిశారు. బడుగు, బలహీన వర్గాల పిల్లలకు విద్యాఫలాలు అందాలని కోరారు. విద్యా కమిషన్ ఏర్పాటుతోపాటు విద్యారంగంలో తేవాల్సిన సంస్కరణల గురించి ఆ కమిటీ ఆలోచించాలని సూచించారు.



దసరా నుంచి స్కిల్ యూనివర్సిటీలో కోర్సులు ప్రారంభం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా పలు సాంకేతిక శిక్షణా కోర్సులను దసరా పండగ నుండి ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. ఈ యూనివర్సిటీ ద్వారా 20 కోర్సులు నిర్వహించాలని గుర్తించామనీ, వాటిలో ఆరు కోర్సుల్ని దసరా నుంచి ప్రారంభిస్తామన్నారు. శనివారంనాడామె స్కిల్ యూనివర్సిటీపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక, పరిశ్రమల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, జయేష్‌రంజన్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, టీజీఐఐసీ కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మెన్ ప్రొఫెసర్ వెంకట రమణ, పారిశ్రామికవేత్తలు శ్రీనిరాజు, వీవీఎల్ఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముచ్చర్ల వద్ద కేటాయించిన 57 ఎకరాల స్థలంలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారనీ, ఆ పనులు ముగిసేంతవరకు యూనివర్సిటీని తాత్కాలిక భవనంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా, న్యాక్, నిథమ్ ప్రాంగణాల్లో వీటిని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు తెలిపారు. యూనివర్సిటీ చైర్-పర్సన్‌గా ఆనంద్ మహేంద్ర, కో చైర్మెన్‌గా శ్రీనివాస సి రాజు ను ఇప్పటికే నియమించామన్నారు. స్కిల్ యూనివర్సిటీలో దాదాపు 140 కంపెనీలు భాగస్వామ్యం కావడానికి ఆసక్తి చూపుతున్నాయన్నారు. తొలివిడతలో స్కూల్ ఆఫ్ ఈ-కామర్స్, లాజిస్టిక్స్ రిటైల్ విభాగంలో సర్టిఫికెట్ కోర్స్ లు, డిప్లొమా కోర్సులను ప్రారంభించనున్నట్టు చెప్పారు.

వివిధ విభాగాల్లో శిక్షణ కోసం దేశంలోని ప్రముఖ కార్పొరేట్ సంస్థలు ఎస్‌బీఐ, న్యాక్, డాక్టర్ రెడ్డీస్, అదానీ, త్వాగా వంటి సంస్థలు భాగస్వామ్యం అయ్యేందుకు అంగీకరించారని వివరించారు. ఈ యూనివర్సిటీ లో కోర్సు పూర్తి చేసిన వారికి ఆకర్షణీయమైన వేతనంతో కూడిన ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

మంత్రి సీతక్క, నేరెళ్ల శారదను టార్గెట్ చేస్తూ అసభ్య దూషణలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో అసభ్య దూషణలకు పాల్పడ్డారని మహిళా సంఘాలు, పౌరసమాజం నేతలు శనివారం సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ట్రోలర్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు కాంగ్రెస్ ఎల్పీ భేటీ

- సీఎం, మంత్రుల రాక • రాజ్యసభ అభ్యర్థి అభిషేక్ సింఘ్వీ పరిచయం • 19న నామినేషన్ దాఖలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం ఆదివారం హైదరాబాద్‌లో జరగనుంది. రానున్న రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా బరిలోకి దిగనున్న ప్రముఖ న్యాయవాదీ, సీనియర్ కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ ఎంపికైన విషయం తెలిసిందే. ఆయన పరిచయంతోపాటు ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు అవగాహన కల్పించనున్నారు. నానక్‌రామ్‌గూడలోని ట్రైడెంట్ హోటల్‌లో రాత్రి ఏడు గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. దీనికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, పీసీసీ సీనియర్ నేతలు హాజరవుతారు. అలాగే ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సైతం వచ్చే అవకాశం ఉన్నట్టు ఆ పార్టీ నేతలు అంటున్నారు. ఇకపోతే ఈనెల 19న అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ దాఖలు చేయనున్నారు. అలాగే ముఖ్యమంత్రి ఇటీవలి అమెరికా పర్యటన వివరాలు, రుణమాఫీ ఇతర అంశాలను మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి వివరించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఇదిలావుండగా అభిషేక్ మను సింఘ్వీని ఏఐసీసీ న్యాయ, మానవ హక్కులు, ఆర్టీఐ కమిటీ చైర్మెన్‌గా నియమిస్తూ ఏఐసీసీ శనివారం నిర్ణయం తీసుకుంది. చైర్మెన్‌తో పాటు మరో 18 మందికి సీనియర్ ప్యానెల్, ఎగ్జిక్యూటివ్ ప్యానెల్ పేరుతో ఆ కమిటీలో స్థానం కల్పించింది.

వచ్చే నెల మూడున ఎన్నిక

కేశవరావు రాజీనామాతో రాష్ట్రంలో ఏర్పడిన రాజ్యసభ ఖాళీని భర్తీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈమేరకు ఈనెల 14న నోటిఫికేషన్ జారీ చేసింది. అలాగే ఈనెల 21లోపు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నిక సెప్టెంబరు మూడున ఉండనుంది. పోలింగ్ జరిగితే అదే రోజు ఓట్లను లెక్కిస్తారు. ఈ మేరకు అధికార యంత్రాంగం సన్నాహాలు పూర్తి చేసింది. ఇతర పక్షాల అభ్యర్థులెవరూ బరిలోకి దిగే అవకాశం లేకపోవడంతో ఈనెల 21నే ఫలితం తేలే అవకాశం లేకపోలేదు.

ఎనిమిది నెలల్లో 1,800 లైంగికదాడులు

మహిళా మంత్రులు స్పందించరెందుకు? : బీఆర్ఎస్ మహిళా నేతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రసంగంలో దొర్లిన పొరపాటుకు క్షమాపణ చెప్పిన తర్వాత కూడా కేటీఆర్‌పై విమర్శలు చేస్తున్న మహిళా మంత్రులు రాష్ట్రంలో మహిళలపై లైంగికదాడులు జరుగుతుంటే స్పందించలేదెందుకని బీఆర్ఎస్ మహిళా నేతలు ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, నాయకురాలు సుశీలా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రసంగంలో దొర్లిన పొరపాటుకు అతి వేగంగా స్పందించిన మహిళా కమిషన్ మహిళలపై లైంగికదాడులకు కూడా స్పందిస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలో షీ టీమ్స్ కుంటుపడ్డాయని విమర్శించారు.

కేటీఆర్‌కు కేసీఆర్ సంస్కారం నేర్పినందుకే క్షమాపణ చెప్పారనీ, సీఎం రేవంత్ రెడ్డికి ఆ సంస్కారం ఎవరూ నేర్పినట్టు లేదని విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై బీఆర్ఎస్ కార్యకర్తల దాడిని ఖండించారు. మాటతప్పిన సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు రాజీనామా కోరే అర్హత లేదని కొట్టిపారేశారు.

గెస్ట్ లెక్చరర్లను రెన్యూవల్ చేయాలి

టీజీజేఎల్ఏ

నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల్లో గెస్ట్ లెక్చరర్లను వెంటనే రెన్యూవల్ చేయాలని టీజీజేఎల్ఏ-475 డిమాండ్ చేసింది. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వస్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ శనివారం ఆన్‌లైన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో గెస్ట్ లెక్చరర్లను పునరుద్ధరించినప్పటికీ గతనెల 31తో ముగిసిందని తెలిపారు. దీంతో 1,600 మంది గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారు లేకపోవడంతో విద్యార్థులకు పాఠాలు చెప్పడంలో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పూర్తిగా వారి సేవలను వాడుకునేందుకు వెంటనే రెన్యూవల్ చేయాలని సూచించారు. నూతనంగా నెలకొల్పిన 22 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులను మంజూరు చేయాలని కోరారు. 26 జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి (డీఐఈవో) పోస్టులను మంజూరు చేసి వెంటనే నియమించాలని తెలిపారు.

యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు

- సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా ట్వీట్‌కు సీఎం రీట్వీట్ చేశారు. మహీంద్రా మాటలు యువతకు స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు. స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్లతో కలిపి ఈ యూనివర్సిటీ ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. ఈ యూనివర్సిటీ ఏర్పాటుకు హకీంపేటలోని స్పోర్ట్స్ స్కూల్ లేదా గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పరిశీలిస్తున్నట్టు వెల్లడించారు. ఇటీవల తాను దక్షిణ కొరియా పర్యటన సందర్భంగా సియోల్‌లోని నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించినట్టు తెలిపారు. తాజాగా పారిస్‌లో ముగిసిన ఒలంపిక్స్‌లో దక్షిణ కొరియా 32 మెడల్స్ సాధించగా అందులో 16 మెడల్స్ కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన వారు దక్కించుకున్నారని గుర్తు చేశారు. అర్చరీలో మూడు గోల్డ్ మెడల్స్ సాధించిన కుమారి లిమ్ సిహైయెన్‌తో తాను సమావేశం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ యూనివర్సిటీకి సాంకేతిక భాగస్వాములుగా ఉండేందుకు ప్రభుత్వం ప్రముఖ యూనివర్సిటీలతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు.

కష్టంగా మారిన మెట్రో ప్రయాణం

- బోగీలు పెంచాలి, పార్కింగ్ చార్జీలు రద్దు చేయాలి
- సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం. శ్రీనివాస్
- మెట్రో భవన్ వద్ద ధర్నా



నవతెలంగాణ-బేగంపేట్

మెట్రో రైలులో రద్దీ బాగా పెరిగిపోయి ప్రయాణం చాలా కష్టంగా మారుతున్నదని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. వెంటనే రైలు బోగీలను పెంచాలని, పార్కింగ్ చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బేగంపేట్‌లోని మెట్రో భవన్ వద్ద శనివారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డికి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మెట్రోలో బ్లూ లైన్, రెడ్ లైన్‌లలో పీక్ టైంలో రైలు ఎక్కడం, దిగడం కూడా కష్టంగా మారిందన్నారు. రైలు లోపల నిలబడలేని పరిస్థితి ఏర్పడుతున్నదని చెప్పారు. ప్రయాణికుల రద్దీకనుగుణంగా మెట్రో రైల్ కోచ్‌లను మూడు నుంచి ఆరుకు పెంచుతామని ఎల్అండ్‌టీ, హెచ్ఎంఆర్ఎల్ అధికారులు గతంలో ప్రకటించినప్పటికీ ఎలాంటి చర్యలూ చేపట్టలేదని అన్నారు. కోచ్‌ల సంఖ్య పెంచాలని మెట్రో ప్రయాణికులందరూ డిమాండ్ చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించడం లేదన్నారు. మెట్రో రైల్ కోచ్‌లను పెంచే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, హెచ్ఎంఆర్ఎల్ తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కోల్‌కతా ఘటన నిందితులను కఠినంగా శిక్షించాలి

- ద డెక్కన్ ఆస్పత్రి సీఈఓ డాక్టర్ విజయ మోహన్ రెడ్డి



నవతెలంగాణ-హైదరాబాద్

కోల్‌కతాలోని ఓ ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ద డెక్కన్ ఆస్పత్రి సీఈఓ డాక్టర్ విజయ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఇచ్చిన 24 గంటల దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా శనివారం ద డెక్కన్ ఆస్పత్రి ఔట్ పేషెంట్ సేవలు, శస్త్రచికిత్సలను నిలిపివేసింది. అత్యవసర సేవలను మాత్రమే యథావిధిగా కొనసాగించింది.అలాగే బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, వైద్య నిపుణులకు మెరుగైన రక్షణ కల్పించాలని కోరుతూ ద డెక్కన్ హాస్పిటల్ సోమాజిగూడ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది పంజాగుట్టలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దక్కన్ ఆస్పత్రి సీఈఓ డాక్టర్ విజయ మోహన్ రెడ్డి మాట్లాడుతూ తాము ఐఎంఏ ఇచ్చిన పిలుపు మేరకు సంఘీభావం తెలుపుతున్నామన్నారు. అలాగే బాధితురాలికి న్యాయం జరిగే విషయంలో ఐఎంఏ తీసుకున్న చర్యలను బలపరుస్తున్నామని చెప్పారు. వైద్యుల భద్రత, ముఖ్యంగా శిక్షణలో ఉన్నవారి భద్రత చాలా ముఖ్యం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ కె ప్రేమ్ కుమార్ రెడ్డి, డాక్టర్లు నర్సులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆ ఎంపీడీవోలకు పదోన్నతులేవి !?

17 ఏండ్లుగా పెండింగ్
85 మంది నిరీక్షణ
పోస్టుల్లేవంటూ కాలయాపన
గ్రామాల అభివృద్ధిలో వీరిదే కీలకపాత్ర



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)..గ్రామాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే ప్రధాన అధికారి. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులెత్తించడంలో ఎంపీడీవోలదే ముఖ్య భూమిక. అనేక సర్కారీ శాఖలతో సమన్వయం చేసుకుంటూ మండలాలను ముందుకు తీసుకెళ్లడంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తారు. ప్రజల సమస్యలు నేరుగా పరిష్కరించడానికి అవకాశం కలిగిన పోస్టు ఎంపీడీవో. కాగా ఆ అధికారులకే ఇప్పుడు తిప్పలు తప్పడం లేదు. వారంగా సర్వీసు సమస్యలతో సతమతమవుతున్నారు. పదోన్నతుల్లేక ఏండ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో సమాజం కోసం విస్తృత సేవలు అందిస్తున్న ఎంపీడీవోలకు దీర్ఘకాలికంగా పదోన్నతులు రాకపోవడంతో, వారిని నిరుత్సాహం వెన్నాడుతున్నది. ఈ కోవలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 85 మంది ఎంపీడీవోలు ఉన్నట్టు ఎంపీడీవోల అసోసియేషన్ చెబుతున్నది. వీరిలో 71 మందికి 2007 నుంచి పదోన్నతులు ఇవ్వకపోగా, మరో 14 మందికి అంతకుముందు నుంచే ప్రమోషన్లు దక్కకపోవడం గమనార్హం. సాధారణంగా ఎంపీడీవోలకు ప్రమోషన్ విధానమంటూ లేదని ఎంపీడీవోల అసోసియేషన్ వ్యాఖ్యానించడం గమనార్హం.

ఏ ఏ పనులు ..

ఎంపీడీవోనే మండలానికి సుప్రీమో. ఒక్కటేమిటీ ఎన్నో బాధ్యతలు నిర్వహిస్తారు. పర్యవేక్షిస్తారు. ప్రభుత్వ పథకాలను అమలుచేస్తారు. నిరంతరం ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుంటారు. విద్యా, వైద్యం, ఆరోగ్యం, అంగన్వాడీ, ఐకేపీ, ఆర్అండ్‌బీ, నీరుపారుదల శాఖ, ఉపాధి హామీ, విద్యుత్, ఎక్సైజ్ తదితర శాఖలతో కలిసి పనిచేస్తారు. గ్రామాల్లో దాదాపు అన్నీ ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలకు ప్రోగ్రామ్ అధికారిగా వ్యవహరిస్తారు. జెడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్లతోనూ నిరంతరం సంప్రదింపులు చేస్తారు. ఆయా ప్రభుత్వ శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మండలస్థాయిలో అమలుచేసేందుకు సహకరిస్తారు. ప్రస్తుతం ఆదర్శ పాఠశాలలు, పల్లె ప్రగతి, మన ఊరు మన బడి తదితర కార్యక్రమాలకు టీమ్ లీడర్లుగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.

17 ఏండ్లుగా..

ఎంపీడీవోలకు 17 సంవత్సరాలుగా పదోన్నతులు దక్కలేదు. వారితోపాటు నియామకమైన ఇతర శాఖల్లోని అధికారులు రెండు, మూడు ప్రమోషన్లు తీసుకున్నారని సంబంధిత ఎంపీడీవోల అసోసియేషన్ చెబుతున్నది. 2018లో డిసెంబరు 19న జీవో నెంబరు 765 ప్రకారం తొలిసారి 103 మంది ఎంపీడీవోలకు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోలు ప్రమోషన్లు ఇచ్చారు. ఆ తర్వాత మళ్లీ జీవో 329 ప్రకారం 2021లో ఆగస్టు 31న మరో 57 మందికి పదోన్నతులు వచ్చాయి. కాగా 2007లో ఎంపీడీవో(గ్రూప్-1)లు నియామకమైక వారికి మాత్రం ప్రమోషన్ రాకపోవడం గమనార్హం. ఇందుకు పలు కారణాలు ఉన్నట్టు తెలిసింది. సర్కారీ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 58 నుంచి 61 ఏండ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే. దీంతో రిటైర్ కావాల్సిన వారంతా సర్వీసులో కొనసాగే అవకాశమేర్పడింది. ఈనేపథ్యంలో ఎంపీడీవోలకు ప్రమోషన్లు ఆగిపోయాయి. 2007లో రిక్రూట్ అయి ఆయా హోదాల్లో హెచ్‌వోడీలుగా విధులు నిర్వహిస్తున్నా , ఒక్క ప్రమోషన్ కూడా రాకుండా కేవలం ఎంపీడీవోలుగానే మిగిలిపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.

ప్రమోషన్ కోసం ఎదురుచూస్తూ..

గ్రూప్-1 అధికారులైన వీరందరిని ఆయా సర్కారీ శాఖల్లో డిప్యూటేషన్లపై పనిచేయించే అవకాశముంది. అదనపు డీఆర్‌డీవోలుగా తొమ్మిది మందిని , అదనపు ఐకేపీ పీడీలుగా తొమ్మిది మందికి, డీపీవోలుగా ఎనిమిది మందికి, సెర్ప్‌లో పీఎంఎస్‌లుగా ఐదుగురికి, సెర్ప్ డైరెక్టర్లుగా ఇద్దరికి, తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థలో ఇద్దరికి, డిప్యూటీ సీఈవోలుగా ఆరుగురుని నియమించే అవకాశాలు ఉన్నాయి. అలాగే రిటైరయ్యే వారి స్థానంలో వచ్చే ఖాళీలు తొమ్మిది, జడ్పీ డిప్యూటీ సీఈవో, సీఈవో ప్రమోషన్ల ద్వారా సైతం మరో ఆరు ఖాళీలు రానున్నాయి. అలాగే ఆయా శాఖల్లో ఫారెన్ సర్వీసెస్ కింద పనిచేయడానికి ఇంకో 15 మందికి అవకాశం కలగనుంది.

ప్రస్తుత పరిస్థితి

ఎంపీడీవోల సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో అసోసియేషన్ నేతలు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఇటీవల వినతిపత్రం సమర్పించారు. కేరళ, మహారాష్ట్ర, కర్నాకట సర్వీసు రూల్స్, పోస్టుల పరిస్థితి, ప్రమోషన్ల గురించి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. త్వరలో డీపీసీ జరిగితే, కొంతమంది ఎంపీడీవోలకు ప్రమోషన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం. 2007 బ్యాచ్ గ్రూప్-1 అధికారులు 71 మంది ఉండగా, అంతకుముందున్న 14 మంది తో కలిసి మొత్తం 85 మంది పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా 35 ప్రతిపాదిస్తూ నోటిఫై చేస్తూ ఫైలు సచివాలయానికి వెళ్లినట్టు సమాచారం. అయినా సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యేలా లేదనే ప్రచారం జరుగుతున్నది. ఇటీవల అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగ, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించిన నేపథ్యంలో ఎంపీడీవోలు సైతం తమ సమస్యను పరిష్కరించి ప్రమోషన్లు ఇవ్వాలని సర్కారును కోరుతున్నారు.

నాడీ వ్యవస్థపై మాదకద్రవ్యాల ప్రభావం

- తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- టీనేజర్స్‌లోనే ఎక్కువ వినియోగం : సైక్రియాటిస్ట్ సతీష్‌బాబు
- డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక సదస్సు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మాదక ద్రవ్యాల రహిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. డ్రగ్స్‌ను తరమేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌తో నాడీ వ్యవస్థ దెబ్బతింటుందని చెప్పారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో శనివారం ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల వ్యతిరేక సదస్సులో నర్సిరెడ్డి మాట్లాడారు. తెలియకుండానే పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడిపోతున్నారని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాంటి నార్కోటిక్స్ టీంలను పటిష్ట పరచాలన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకొని రాష్ట్రం నుంచి డ్రగ్స్‌ను తరిమేయాలన్నారు. డ్రగ్స్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఓ పాఠ్యాంశంలా పిల్లలకు వివరించారు. టీనేజర్సే ఎక్కువగా డ్రగ్స్‌ను వినియోగిస్తున్నట్టు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో) వెల్లడించిందని ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ ఆర్.సతీష్‌బాబు చెప్పారు. ప్రపంచంలో ఏటా 30 లక్షల మంది డ్రగ్స్ బారిన పడి మరణిస్తున్నారన్నారు. 4.6శాతంగా మరణాల రేటు ఉందన్నారు. ప్రతి 17 మందిలో ఒక్కరు డ్రగ్స్ తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీరిలో 40% మంది టీనేజర్సేనని వివరించారు. అనుకరణ, ఐడెంటిక్ క్రైసిస్, ఏమీ తోచని స్థితి, యాంటి సోషల్ ఎలిమెంట్స్ (హీరోయిజం), పార్టీ కల్చర్, ఎమోషనల్, పెద్దరికం కోసం తహతహ, తల్లిదండ్రుల పెంపకం, పేరెంట్స్ ఆల్కాహాల్‌కు అలవాటై ఉండటం, ఫెయిల్యూర్స్.. ఇలాంటివన్నీ కూడా పిల్లలను డ్రగ్స్ వైపు నడిపిస్తాయని వివరించారు.

డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో భాగస్వాములవండి: నున్నా నాగేశ్వరరావు

డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రైతుసంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు అన్నారు. విషపు పురుగులాంటి డ్రగ్స్‌ను పారదోలేందుకు పౌరసమాజం మొత్తం నడుం బిగించాలన్నారు. ప్రతి విద్యార్థీ పోలీసులా మారాలని జూనియర్ కళాశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శేషగిరిరావు అన్నారు. చదువుకు ఎడిక్ట్ కావాలని సూచించారు. 23 గంజాయి కేసుల్లో ఈ ఏడాది 45 మందిని అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ బి.కృష్ణ తెలిపారు. వీరిలో 25 ఏండ్లలోపు వారే ఎక్కువగా ఉన్నారన్నారు. 9వ తరగతి చదివే ఓ బాలున్ని సైతం ఈ కేసులో అరెస్టు చేశామన్నారు.

క్లబ్, పబ్బు సంస్కృతితోనే డ్రగ్స్ వ్యాప్తి డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్

క్లబ్, పబ్బు సంస్కృతితోనే డ్రగ్స్ వ్యాప్తి అధికమవుతోందని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్ అన్నారు. తెలంగాణ రాకముందు 20, 30వరకు ఉన్న పబ్బులు నేడు వందల సంఖ్యలోకి చేరాయన్నారు. సినిమాలు, సోషల్ మీడియా ప్రభావంతో గ్రామీణ ప్రాంతాల్లోకీ డ్రగ్స్ విస్తరించిందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరంలోని క్లబ్బులు, పబ్బులు రాజకీయ నాయకుల చేతుల్లో ఉన్నాయని తెలిపారు. అందుకే వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వ యంత్రాంగం వెనకాడుతోందన్నారు. హత్యలు, లైంగికదాడులకు డ్రగ్స్ కారణమని ఆవేదన వ్యక్తం చేశారు.

పాఠశాలల్లోకి డ్రగ్ విస్తరించింది ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు

పాఠశాలల్లోకీ డ్రగ్స్ విస్తరించిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు అన్నారు. ఏటా 25 లక్షల మంది మాదకద్రవ్యాలకు బానిసలు అవుతుంటే వారిలో అత్యధికులు యువతే ఉంటోందని తెలిపారు. హైదరాబాద్ వంటి చోట పబ్బుల్లోనూ విద్యార్థులు పట్టుబడుతున్న సంఘటనలు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే అనేకచోట్ల డ్రగ్స్ వ్యతిరేక సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పాఠశాల స్థాయిలోనే డ్రగ్స్‌ను తరిమివేయాలని, డ్రగ్స్ వ్యతిరేక కమిటీలు వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు షేక్ బషీరుద్దీన్, తుడుం ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ట్రస్మా రాష్ట్ర, జిల్లా నాయకులు రామచందర్‌రావు, శశిధర్‌రెడ్డి, మతిన్, భాస్కర్, అశోక్‌రెడ్డి, యోగి, డాక్టర్ భారవి, ఫిజియోడాక్టర్ అనీల్‌కుమార్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్, ఎం.ప్రభాకర్, చింతల రమేష్, సంగీత, సత్య సుజాత, శీలం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఆర్ఐటీ, ఐఏఆర్ఈ గుర్తింపును రద్దు చేయాలి

- బీ కేటగిరీ అడ్మిషన్ల దందాపై విచారణ జరపాలి
- ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రికి ఎస్ఎఫ్ఐ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మర్రి లక్ష్మారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ (ఐఏఆర్ఈ) కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బీ కేటగిరీ అడ్మిషన్ల దందాపై విచారణ జరపాలని కోరింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్‌కు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి శనివారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. బీ కేటగిరీ నోటిఫికేషన్ ప్రభుత్వం జారీ చేయకముందే ఎంఎల్ఆర్ఐటీ, ఐఏఆర్ఈ కాలేజీలు విద్యార్థుల నుంచి డొనేషన్లను తీసుకున్నాయని వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆ కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ కాలేజీల యాజమాన్యం చైర్మెన్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బీ కేటగిరీ నోటిఫికేషన్ రాకముందే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సీట్లు ఇస్తామంటూ ఒక్కో సీటుకు రూ.16 లక్షల డొనేషన్‌ను వసూలు చేశారని తెలిపారు. వంద మంది విద్యార్థుల దగ్గర సుమారుగా రూ.200 కోట్ల వరకు వసూళ్లకు పాల్పడ్డారని విమర్శించారు. అక్రమ వసూళ్లకు పాల్పడి ఇప్పుడు సీట్లు ఇవ్వబోమని ప్రకటించడంతో విద్యార్థుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందని తెలిపారు. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలియజేస్తుంటే గూండాలను పంపి దాడి చేసే ప్రయత్నం చేశారని విమర్శించారు. అక్రమ పద్ధతుల్లో వసూళ్లకు పాల్పడిన ఆ కాలేజీ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలేజీల గుర్తింపు రద్దు చేసేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్ రెడ్డి, నాయకులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల ఆందోళన

- అర్హులైనా అత్యధికులకు వర్తించని మాఫీ
- ప్రపోజల్స్ పంపడంలో బ్యాంకర్ల నిర్లక్ష్యం
- ఖమ్మం యాక్సిస్ బ్యాంకులో ఒక్కరికీ అందని మాఫీ
- కెనరా, ఐడీబీఐ బ్యాంకుల నుంచి అధిక సమస్యలు
- రెండు బ్యాంకుల్లో లోన్లున్నా సమస్యలే..!
- పెండింగ్ ఖాతాల స్పెషల్ డ్రైవ్‌పై వ్యవసాయశాఖకు అందని ఆదేశాలు
- రాష్ట్రవ్యాప్తంగా మూడింటా ఒక వంతుకే లబ్ధి
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో మహారాష్ట్ర బ్యాంకులో ఎక్కువ సమస్యలు
- కలెక్టరేట్ల ఎదుట రైతుల నిరసనలు



నవతెలంగాణ- ఖమ్మం/ ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధులు

రుణమాఫీతో కొందరు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంటే.. మరికొందరు తీవ్ర నిరాశ.. ఆవేదనతో ఉన్నారు. ఇప్పటికే మొదటి, రెండో విడతల్లో మాఫీ కాలేదని కొందరు అధికారుల చుట్టూ తిరుగుతుండగా.. తాజాగా ప్రభుత్వం మూడో విడత రుణమాఫీ జమ చేయడంతో మరింత మంది వీరికి జతయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా మూడింట ఒక వంతు మందికే రుణమాఫీ లబ్ధి చేకూరిందని, మిగిలిన రైతులు ఆందోళనలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ ఖాతాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తారనే చర్చ సాగుతున్నా.. తమకు ఎలాంటి ఆదేశాలూ అందలేదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారులు డ్రైవ్ నిర్వహించి అర్హులను గుర్తిస్తారంటున్నా.. ఎడిట్ ఆప్షన్ కూడా లేని నేపథ్యంలో వ్యవసాయ అధికారులు చేసేదేమీ లేదు. రూ.2 లక్షల కంటే ఎక్కువ ఉన్న రైతులు పైమొత్తాన్ని చెల్లిస్తేనే మాఫీ వర్తిస్తుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. కానీ, దీనిపైనా ఎలాంటి ఆదేశాలూ రాలేదని తెలుస్తోంది. మరోవైపు రూ.2లక్షల పైన ఎంత ఉంటే ఆ మొత్తాన్ని చెల్లించకపోయినా మాఫీ వచ్చేలా ప్రభుత్వం యోచిస్తోందని సమాచారం. కానీ వీటిపై కూడా ఎలాంటి మార్గదర్శకాలూ అందలేదని వ్యవసాయశాఖ చెబుతోంది.

బ్యాంకర్ల నిర్లక్ష్యం

రుణమాఫీకి సంబంధించి ప్రపోజల్స్ పంపడంలో కొన్ని బ్యాంకులు నిర్లక్ష్యం వహించాయి. ఖమ్మం జిల్లాలో కమర్షియల్ బ్యాంకులతో కలిపి 14 బ్యాంకుల నుంచి ప్రపోజల్స్ ప్రభుత్వానికి చేరాయి. కానీ మూడు విడతల్లోనూ ఒక్క పైసా కూడా యాక్సిస్ బ్యాంకు ఖాతాదారులకు మాఫీ కాకపోవడంపై అను మానాలు నెలకొన్నాయి. దీనిపై 'నవతెలంగాణ' సంబంధిత బ్యాంకులో విచారించగా.. తమ ఖాతాదారులందరూ రూ.2 లక్షలకు పైబడిన వారేనని, అందుకే వర్తించలేదని సమాధానం ఇస్తున్నారు. ఐడీబీఐ బ్యాంకు నుంచి రెండో విడతలో తొమ్మిది, మూడో విడతలో ఆరుగురికి మాత్రమే మాఫీ వర్తించింది. ఐసీసీఐ 2, హెచ్‌డీఎఫ్‌సీ 5, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏడుగురు.. ఇలా కమర్షియల్ బ్యాంకుల్లో అతి తక్కువ మంది మాత్రమే రుణమాఫీ పొందారు. దీనిపై ఆ బ్యాంకుల స్థానిక శాఖలను సంప్రదిస్తే వరంగల్ రీజియన్ బ్రాంచీల నుంచి ప్రపోజల్స్ వెళ్లినట్టు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు.

సాంకేతిక సమస్యలతో ఇక్కట్లు

మూడో విడతలో ఖమ్మం జిల్లాలో మొత్తం 23,546 మందికి రూ.245 కోట్లు మాఫీ అయ్యాయి. దీనిలో కెనరా బ్యాంకులో 341 ఖాతాల్లో రూ.4.3 కోట్లు జమయ్యాయి. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రుణమాఫీ టోల్‌ఫ్రీ నంబర్ (9063211298)కు ఫోన్ చేయడంతోపాటు హెల్ప్‌డెస్క్‌ను ఈ బ్యాంకు ఖాతాదారులే ఎక్కువగా సంప్రదిస్తున్నారు. రోజుకు హెల్ప్‌డెస్క్‌కు సగటున వంద మందికి పైగా వస్తుండగా.. టోల్‌ఫ్రీ నంబర్‌కు సైతం వంద మంది వరకు ఫోన్‌లు చేస్తున్నారు. దీనిపై లీడ్‌బ్యాంకు మేనేజర్‌నూ సంప్రదిస్తున్నారు. సాంకేతిక సమస్యలతో ఈ పరిస్థితి ఏర్పడినట్టు చెబుతున్నారు. రుణమాఫీ స్థితి చెక్ చేస్తే 'నో డేటా ఫౌన్డ్ (కనిపించట్లేదు)' అని వస్తోంది. భార్యాభర్తలు కలిసి ఉన్నప్పుడు రుణమాఫీ తీసుకుంటే విడిపోయాక మాఫీ రావడంతో హెల్ప్‌డెస్క్‌ను సంప్రదిస్తున్న వారూ ఉన్నారు.

రెండు బ్యాంకుల్లో రుణాలుంటే మాఫీ కాలేదు

రెండు బ్యాంకుల్లో రుణాలున్న పలువురికి మాఫీ వర్తించలేదు. రెండింటిలో కలిపి రూ.2 లక్షల లోపు రుణం ఉన్నా మాఫీ చేయలేదు. అంతకుమించి ఉన్నా రూ.2 లక్షల వరకు మాఫీ చేయాల్సి ఉన్నప్పటికీ రైతువేదికలు, బ్యాంకుల వద్ద పెట్టిన జాబితాలో పేర్లు కనిపించకపోవడంతో చాలా మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు బ్యాంకుల్లో కలిపి రూ.2 లక్షల పైన ఉంటే.. పైన ఉన్న మొత్తాన్ని చెల్లిస్తే మాఫీ వర్తిస్తుందని బ్యాంకర్లు చెబుతున్నా.. అది నిజంగా అమల వుతుందా? అనే సందేహాలను సైతం రైతులు వెలిబుచ్చుతున్నారు. రెండింటిలో ఏ లోన్ చెల్లిం చాలనే దానిపైనా స్పష్టత లేదు. వీటిలో వేటికీ అధికారుల వద్ద సమాధానాలు లేకపోవడం గమనార్హం.

ఇటు బ్యాంకర్లు...అటు ప్రభుత్వం నిర్లక్ష్యం..

ఓ వైపు బ్యాంకర్ల నిర్లక్ష్యం.. మరోవైపు ప్రభుత్వం రైతులను తగ్గించుకునే ప్రయత్నంతో.. ఖమ్మం జిల్లాలో మూడు విడతల్లో కలిపి 3,71,157 మంది రైతులకుగాను 1,15,345 మందికి మాత్రమే రుణమాఫీ అయ్యింది. ఇంకా 2,55,812 మంది వివిధ కారణాలతో మాఫీకి దూరమయ్యారు. దీనిపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటు రైతుభరోసా రాక.. అటు రుణమాఫీ కాక తమ బతుకులు రెంటికీ చెడ్డ రేవడిలా మారాయని కలెక్టరేట్‌కు వచ్చి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆ బ్యాంకులో అధిక సమస్యలు

ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలోని మహారాష్ట్ర బ్యాంకులో సుమారు 2వేలకు పైగా రైతుల ఖాతాలు ఉండగా.. ఇందులో 400 మంది వరకు రైతులు రూ.2లక్షల రుణం కలిగి ఉన్నారు. వీరిలో ఏడుగురికి మాత్రమే మాఫీ జరిగింది. దీంతో మిగతా రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నిరసన తెలిపారు. ఇదే మాదిరి జైనథ్ మండల కేంద్రంలోనూ అన్నదాతలు నిరసన తెలిపారు. రూ.2లక్షల రుణం కలిగిన వారితో పాటు రూ.1.50లక్షల వరకు ఉన్నప్పటికీ కొందరి ఖాతాల్లో డబ్బులు పడకపోవడంతో అంతా అయోమయం నెలకొంది. ముఖ్యంగా మహారాష్ట్ర బ్యాంకుల్లో ఖాతాలు కలిగిన రైతులను ఈ సమస్య అధికంగా వేధిస్తున్నట్టు తెలుస్తోంది. కానీ బ్యాంకుల్లో తప్పిదం జరిగిందా.. ప్రభుత్వం నుంచి నిధులు రాలేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏఈఓలకు ఫిర్యాదుల వెల్లువ..!

ఉమ్మడి జిల్లాలో మూడు విడతల్లో 2.27లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2135.37కోట్లు నిధులు జమ చేసినట్టు ప్రభుత్వం చెబుతోంది. ఈ రుణమాఫీ ప్రక్రియలో తలెత్తిన సమస్యల కారణంగా వాటిని పరిష్కరించుకునేందుకు అన్న దాతలు పాట్లు పడుతున్నారు. అన్ని అర్హతలూ ఉన్నప్పటికీ మాఫీ ఎందుకు కావడం లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా మందికి ఆధార్, రుణఖాతాల్లో పేర్లలో అక్షరదోషాలు, చిన్న పాటి తప్పులు దొర్లడం కారణంగా సాంకేతిక సమ స్యలు తలెత్తి మాఫీ కావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఏఈఓలను సంప్రదించి సమగ్ర వివరాలు అందజేయాలని చెబుతున్నారు.

ఎందుకు మాఫీ కాలేదో చెప్పడం లేదు : సెవ్వ గంగారెడ్డి, తలమడుగు

నేను మహారాష్ట్ర బ్యాంకులో రూ.1.80లక్షల పంట రుణం తీసుకున్నాను. ప్రభుత్వం మూడో విడతలో చేపట్టిన రూ.2లక్షల రుణమాఫీ ప్రక్రియలో నా రుణం మాఫీ కావాల్సి ఉంది. కానీ అర్హుల జాబితాలో పేరు లేదు. ఎందుకు మాఫీ కాలేదో కూడా అధికారులు చెప్పడం లేదు.

ఆడిట్ చేయాలంటున్నారు : అల్లకొండ భూమన్న, జైనథ్

గ్రామంలో రెండెకరాల పొలం ఉంది. పంట కోసం బ్యాంకులో రూ.1.30లక్షల రుణం తీసుకున్నా. రెండో విడత రుణమాఫీలోనే కావాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు కాలేదు. అధికారులను సంప్రదిస్తే ఆడిట్ చేయాల్సి ఉంటుందని చెబు తున్నారు. సమస్య పరిష్కరించాలని కోరుతున్నాం.

నల్లబ్యాడ్జీలతో నర్సింగ్ ఆఫీసర్ల నిరసన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉత్తరాఖండ్‌లో నర్సింగ్ ఆఫీసర్‌పై జరిగిన లైంగికదాడి, హత్యకు వ్యతిరే కంగా రాష్ట్రవ్యాప్తంగా నర్సింగ్ ఆఫీసర్లు నిరసన తెలిపారు. తెలంగాణ (ప్రభుత్వ) నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఆస్పత్రుల ప్రాంగణాల్లో ష కార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కోల్‌కతాలో మహిళా పీజీ వైద్యురాలిపై, ఉత్తరాఖండ్‌లో నర్సింగ్ ఆఫీసర్‌పై, మరో రాష్ట్రంలో ఇంకో వైద్యసిబ్బంది అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని ఆఫీసర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో పేద రోగులకు సేవలందించేలా తగిన భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మరియమ్మ పాల్గొన్నారు.పలు ఆస్పత్రుల్లో డాక్టర్లతో కలిసి నర్సింగ్ ఆఫీసర్లు నిరసన తెలిపారు. నిలోఫర్, ఉస్మానియా, గాంధీ తదితర ఆస్పత్రులతో పాటు జిల్లాల్లో నిర్వహించిన నిరసన కార్యక్రమాలు విజయవంతమైనట్టు అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి లక్ష్మణ్ రుఢావత్ తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో అధికారం మనదే

- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం : ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ శ్రేణులతో కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ఎనిమిది నెలల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని కేటీఆర్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ నాయకులు, శ్రేణులు, కార్యకర్తలతో శనివారం ఆయన హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా నిత్యం ప్రజలతోనే ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ నాలుగేండ్ల కాలంలో పార్టీని బలోపేతం చేసుకుందా మని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పని చేయాలనీ, ప్రజలంతా మనవైపే ఉన్నారని చెప్పారు. పార్టీలో కష్టపడే కార్యకర్తలకు తగిన గౌరవం, గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. పార్టీ ద్వారా మంచి అవకాశాలు పొంది పార్టీ వీడిన నాయకుల గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యకర్తలు ఒక్కరు కూడా పార్టీని వీడలేదని ఈ సందర్భంగా జిల్లా పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను, ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని సూచించారు. సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



నిలిచిన వైద్యం

కోల్‌కతా ఘటనపై దేశవ్యాప్త సమ్మె

- అత్యవసర సేవలకు మినహాయింపు
- పలు నగరాలలో భగ్గుమన్న నిరసనలు
- జత కలిసిన ప్రయివేటు వైద్య సిబ్బంది
- న్యాయం జరగాల్సిందేనంటూ నినాదాలు

న్యూఢిల్లీ : కోల్‌కతాలోని ఆర్జీ కార్ వైద్య కళాశాల ఆస్పత్రిలో తమ సహచరురాలిపై పైశాచికంగా లైంగికదాడికి పాల్పడి, హత్య చేసిన ఘటనను దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్రంగా నిరసించారు. తమ సహచరురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం 24 గంటల నిరసన చేపట్టారు. దీంతో దేశంలోని పలు ప్రాంతాలలో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నెల 9న పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడి, ఆమెను హత్య చేసిన ఘటన వైద్య సిబ్బందిలో పెద్ద ఎత్తున ఆగ్రహాన్ని కలిగించింది. ఈ అమానుషాన్ని నిరసిస్తూ శనివారం ఉదయం 6 గంటల నుంచి అత్యవసర సేవలు మినహా మిగిలిన అన్ని సేవలనూ నిలిపివేయాలని, ప్రదర్శనలు నిర్వహించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపునిచ్చింది. ఆదివారం ఉదయం 6 గంటల వరకూ ఈ నిరసన కార్యక్రమం కొనసాగుతుంది.

ఐఎంఏ గురువారం ప్రభుత్వం ముందు ఐదు డిమాండ్లను ఉంచింది. ప్రధానంగా రెసిడెన్షియల్ వైద్యుల పని, జీవన పరిస్థితులను సమూలంగా మార్చేయాలని, పని ప్రదేశంలో వైద్య సిబ్బందిపై హింస జరగకుండా నివారించేందుకు కేంద్ర చట్టాన్ని తీసుకురావాలని కోరింది.

బెంగాల్‌లో...

దేశవ్యాప్త నిరసనలో భాగంగా పశ్చిమ బెంగాల్‌లో వైద్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వ ప్రయివేటు ఆస్పత్రులలో ఔట్ పేషెంట్ సేవలు కూడా నిలిచిపోయాయి. 'మా పోరాటం కొనసాగుతుంది. మా డిమాండ్లు నెరవేరాలంటే ఇంత కంటే వేరే దారి లేదు' అని ఓ వైద్యుడు చెప్పారు. పోలీసులు ఉన్నప్పటికీ ప్రజలు ఆస్పత్రి లోపలికి వచ్చి తమపై ఎలా దాడి చేస్తారని ప్రశ్నించారు. బెంగాల్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎస్ఎస్‌కేఎం ఆస్పత్రి, శంభూనాథ్ పండిట్ ఆస్పత్రి, కోల్‌కత్తా నేషనల్ మెడికల్ కాలేజీ ఆస్పత్రితో పాటు ప్రయివేటు ఆస్పత్రులలో కూడా అత్యవసరం కాని వైద్య సేవలు స్తంభించిపోయాయి.

జార్ఖండ్‌లో...

జార్ఖండ్‌లో వైద్యులు సమ్మెలో చేరడంతో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. న్యాయం కోసం తాము డిమాండ్ చేస్తున్నామని ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రదీప్ కుమార్ సింగ్ తెలిపారు. రాజధాని రాంచీలో వైద్య సిబ్బంది భారీ ప్రదర్శన నిర్వహించారు. సమ్మెకు సంఘీభావం తెలుపుతూ రిమ్స్-రాంచీ, మరో ఐదు వైద్య కళాశాలలకు చెందిన జూనియర్ వైద్యులు విధులను బహిష్కరించారు.

అస్సాంలో...

అస్సాంలోని వైద్యులు కూడా సమ్మెలో భాగస్వాములయ్యారు. ఔట్ పేషెంట్ సేవలు, అత్యవసరం కాని వైద్య సేవలు నిలిచిపోయాయి. వైద్యులు నల్ల బ్యాడ్జీలు, ప్లకార్డులు ధరించి వివిధ ఆస్పత్రుల వెలుపల నిరసన తెలిపారు. 'బాధితురాలికి, ఆమె కుటుంబానికి న్యాయం జరగాలి. ఇలాంటి నేరాలు జరగకుండా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉంది' అని గౌహతి వైద్య కళాశాల ఆస్పత్రికి చెందిన ఓ రెసిడెంట్ వైద్యుడు కోరారు. డ్యూటీలో ఉన్న సిబ్బందికి సరైన రక్షణ లేదని, భద్రత కల్పించకుండానే తమను అర్ధరాత్రి విధులకు పిలుస్తున్నారని జూనియర్ డాక్టర్ ఒకరు వాపోయారు. దిబ్రూఘర్, కోక్రాఝార్‌లో కూడా నిరసనలు మిన్నంటాయి. తమ భద్రత కోసం సీసీటీవీలు ఏర్పాటు చేయాలని సిబ్బంది డిమాండ్ చేశారు. నాగావ్, గోలాఘట్‌లో నిరసన ప్రదర్శనలు జరిగాయి. వైద్య సిబ్బంది ప్లకార్డులు ప్రదర్శించారు.

గోవా, ఢిల్లీలో...

గోవాలో ప్రయివేటు ప్రాక్టీసు చేస్తున్న వైద్యులు, వివిధ ప్రైవేటు ఆస్పత్రులలో పని చేస్తున్న సిబ్బంది కూడా నిరసనలో జత కలిశారు. గోవాలో వైద్య సిబ్బంది పెద్ద ఎత్తున మౌన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలో శుక్రవారం మధ్యాహ్నం నుండే సమ్మె జరుగుతోంది. అవసరమైతే సమ్మెను పొడిగించేందుకు సిద్ధమేనని వైద్యులు తెలిపారు. రాజధాని ఢిల్లీలో సమ్మె ఆరో రోజుకు చేరింది. ఎయిమ్స్, ఆర్ఎంఎల్ సహా వివిధ ఆస్పత్రుల నుండి వచ్చిన రెసిడెంట్ వైద్యుల సంఘాలు నగరంలో ప్రదర్శనలు, కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించాయి. ప్రయివేటు ఆస్పత్రులు కూడా సమ్మెకు మద్దతు ఇచ్చాయి. అయితే కొన్ని రకాల వైద్య సేవలు కొనసాగించాయి.

కర్నాటక, కేరళలో...

కర్నాటకలో కూడా వైద్యుల నిరసన కొనసాగింది. బెంగళూరు చామరాజ్‌పేటలోని ఐఎంఏ కార్యాలయం వద్ద ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రంలోని ఆస్పత్రులలో ఔట్ పేషెంట్ సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వ ఆస్పత్రులలో అత్యవసర సేవలు కొనసాగించాలని ప్రభుత్వం ఓ సర్క్యులర్ జారీ చేసింది. మెడికల్ ఆఫీసర్లు, సర్జన్ల సెలవులను రద్దు చేసింది. కేరళలో అత్యవసర సేవలు మినహా మిగిలిన సేవలు, ఔట్ పేషెంట్ సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. వివిధ ఆస్పత్రుల వద్ద ప్రదర్శనలు జరిగాయి.

ఈ రాష్ట్రాలలో కూడా...

ఉత్తరాఖండ్‌లో అత్యవసర సేవలు మాత్రమే కొనసాగాయి. పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో వైద్య సిబ్బంది సమ్మెలో చేరారు. పాటియాలా, అమృతసర్, లూథియానా సహా పలు నగరాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఒడిశాలో సుమారు ఆరు వేల మంది ఐఎంఏ సభ్యులు సమ్మెలో భాగస్వాములయ్యారు. దీంతో వైద్య సేవలు స్తంభించాయి. అనేక ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో సమ్మె ప్రభావం బాగా కన్పించింది. త్రిపురలోనూ వైద్య సేవలకు ఆటంకం ఏర్పడింది. రాజధాని అగర్తలలో భారీ ర్యాలీ నిర్వహించారు.

మెడికల్ కాలేజీల్లో మహిళా డాక్టర్లు, సిబ్బందికి భద్రత కల్పించాలి

- దాక్టర్ల సమ్మెకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు
- నిందితులను కాపాడేందుకు బెంగాల్ ప్రభుత్వం ప్రయత్నం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోల్‌కతాలో ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ట్రైనీ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హత్యకు నిరసనగా శనివారం తెలంగాణతో పాటు, దేశవ్యాప్తంగా నిర్వహించిన డాక్టర్ల సమ్మెకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కేసును ఆత్మహత్యగా చిత్రీకరించి ఘటనకు పాల్పడిన నిందితులను కాపాడటానికి, ఆనవాళ్లు లేకుండా చేయడానికి పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. ఆ కాలేజీ ప్రిన్సిపాల్‌ను అరెస్టు చేయకుండా, సాక్ష్యాలను రూపుమాపేందుకు పూనుకుంటున్నదని తెలిపారు. న్యాయం కోసం ఆందోళన చేస్తున్న వారిపై, ఆస్పత్రిపై టీఎంసీ గూండాలు దాడులకు పాల్పడుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధమున్న నిందితులను తక్షణమే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తెలంగాణతోపాటు, దేశవ్యాప్తంగా అన్ని మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల్లో మహిళా డాక్టర్లు, నర్సులు, ఇతర మహిళా సిబ్బందికి భద్రత కల్పించాలని ఆయన కోరారు.

సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాలి

మోడీ సర్కారు మొద్దునిద్ర వీడాలి

జూడా, ఐఎంఏ రాష్ట్రస్థాయి ధర్నాలో డాక్టర్లు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పశ్చిమబెంగాల్‌లో మహిళా వైద్యురాలిపై ఘటన మరువక ముందే ఉత్తరాఖండ్‌లో ఓ నర్సును అదే విధంగా హత్య చేశారని ఐఎంఏ యాంటీ క్వాకరీ సెల్ నాయకులు డాక్టర్ ప్రభుకుమార్, తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు దేశవ్యాప్తంగా వైద్యులు ఆందోళన చేస్తుంటే మరోవైపు కోయంబత్తూరులో మహిళా వైద్యురాలిపై లైంగికదాడి యత్నం జరిగినట్టు తెలిపారు. దేశంలో ఏ ఒక్క ఆస్పత్రి, మెడికల్ కాలేజీ మహిళల భద్రతకు అనుగుణంగా లేదని విమర్శించారు. ప్రభుత్వాస్పత్రులు, ప్రభుత్వ మెడికల్ కాలేజీలే కాకుండా ప్రయివేటు ఆస్పత్రులు, ప్రయివేటు మెడికల్ కాలేజీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని చెప్పారు. నేషనల్ మెడికల్ కమిషన్ ఇష్టానుసారంగా ప్రయివేటు మెడికల్ కాలేజీలకు అనుమతిస్తూ భద్రతను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవసరమైతే అత్యవసర సేవలూ బంద్

తమ డిమాండ్లను నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకుంటే అవసరమైతే అత్యవసర సేవలనూ బంద్ చేస్తామని డాక్టర్లు హెచ్చరించారు. ఘటన జరిగిన తర్వాత పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీరు ఏ మాత్రం బాగా లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరగాలనీ, అన్ని విషయాలను వెలికి తీసి, దోషులందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో భద్రత కోసం చేస్తున్న ఈ పోరాటానికి ప్రజలు, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు స్పందించాలని కోరారు. మౌనం సమస్యలను పరిష్కరించదనీ, అందుకే తాము రోడ్డెక్కామంటూ, ప్రజలు తమతో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి

ధర్నా సందర్భంగా పలువురు మహిళా జూనియర్ వైద్యులు మాట్లాడారు. పిల్లల తల్లిదండ్రుల్లో మార్పు రావాలని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా మగపిల్లల తల్లిదండ్రులు వారిని సరిగ్గా పెంచాలని సూచించారు. సంఘవిద్రోహ శక్తులు మారకుండా చూడాలని హితవు పలికారు. కోల్‌కతా ఘటన తర్వాత తమ తల్లిదండ్రులు చదువుకునేందుకు పంపించేందుకు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భేటీ పడావో...భేటీ బచావో కేవలం నినాదాలకే పరిమితం కాకుండా అమలు చేసేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు..

బోధనా వైద్యుల సంఘీభావం

జూడా, ఐఎంఏ చేస్తున్న ఆందోళనకు తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం సంఘీభావం తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్ మాదాల తదితరులు హాజరై మాట్లాడారు. భారతదేశంలో ఆస్పత్రుల్లోని భద్రతా లోపాలపై ఎండగడుతున్నా ప్రభుత్వాల్లో మార్పు రావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కోల్‌కతా ఘటనను పాకిస్తాన్ వైద్యుల సంఘం కూడా ఖండించిందని గుర్తుచేశారు. వైద్యుల పోరాటంతో సమాజం కలిసి వస్తే ప్రభుత్వాల్లో మార్పు రావొచ్చుని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

వైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు మద్దతుగా ఉంటానని కాంగ్రెస్ ఎంపీ డాక్టర్ కావ్య తెలిపారు. వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తానని తెలిపారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ వారికి భద్రత, కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తుచేశారు. ధర్నాలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కాళి ప్రసాద్, జూడా రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

- వరంగల్ ఎంపీ డాక్టర్ కావ్య



మూసీ అభివృద్ధి పేరుతో పేదలను ముంచొద్దు

- నష్టం కలగకుండా ప్రణాళిక రూపొందించాలి :సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్

నవతెలంగాణ-అంబర్‌పేట

మూసీ అభివృద్ధి పేరుతో పేదలను ముంచొద్దని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ అన్నారు. పేదలకు నష్టం కలగజేస్తే మూసీ బాధితులతో కలిసి ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. మూసీ ఇరువైపులా జీవనం కొనసాగిస్తున్న పేదలతో కలిసి శనివారం సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కమిషనరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ నదికి రెండు వైపులా 54 కిలోమీటర్ల పొడవున పేదల ఇండ్లు, స్థలాలను లాక్కునే చర్యలు విరమించుకోవాలని కోరారు. మూసీని శుద్ధిచేసి ఇప్పటికే ఉన్న మూసీ భూముల్లో అభివృద్ధి చేపట్టొచ్చని అన్నారు. ఆ దిశగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి కారిడార్ గంగానది పక్కన ఉన్న పేదల ఇండ్లను తొలగించే సందర్భంలో అక్కడి బీజేపీ ప్రభుత్వం.. కమర్షియల్ కాంప్లెక్స్ కట్టిస్తామని హామీ ఇచ్చి.. ఆ తర్వాత పేదలకు ఇవ్వకుండా పెద్ద పెద్ద కంపెనీలకు ఇచ్చి మోసం చేసిందని గుర్తు చేశారు. అదే మాదిరిగా హైదరాబాద్‌లో కూడా మున్సిపల్, రెవెన్యూ, హెచ్ఎండిఏ అధికారులు సామాజిక, ఆర్థిక సర్వే చేస్తూ.. మంచి మాటలు చెప్పి మోసం చేసేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. అనంతరం జీహెచ్ఎంసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్వాన్, బహదూర్‌పురా, మలక్‌పేట్, గోషామహల్, చార్మినార్ తదితర నియోజకవర్గాల మూసీ పరిసర బస్తీల నుంచి బాధిత కుటుంబాలు పెద్దఎత్తున హాజరయ్యాయి. ఈ ధర్నాలో సీపీఐ(ఎం) హైదరాబాద్ జిల్లా నాయకులు పి.నాగేశ్వర్, ఎం.బాలు, అబ్దుల్ సత్తార్, ఎల్ కోటయ్య, ఎం.మీనా, శశికళ, ఎం.శ్రావణ్ కుమార్, ఏ.కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఆర్ఐటీ, ఏరోనాటికల్ కాలేజీ అక్రమ డొనేషన్లపై విచారణ జరపాలి

విద్యార్థులకు న్యాయం చేయాలి : డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మర్రి లక్ష్మారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ (ఐఏఆర్ఈ) కాలేజీల అక్రమ డొనేషన్ల దందాపై విచారణ జరపాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏరోనాటికల్ ఇంజనీరింగ్, మర్రి లక్ష్మారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు డొనేషన్ల పేరుతో రూ.కోట్లు వసూలు చేశాయని విమర్శించారు. 250 మంది విద్యార్థుల నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.14 లక్షల నుంచి రూ.16 లక్షలు వసూలు చేశారని వివరించారు. రసీదులు ఇవ్వకుండా అక్రమ దందాకు ఆ కాలేజీల యాజమాన్యాలు పాల్పడ్డాయని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి రూ.లక్షలు వసూలు చేసి చివరికి అడ్మిషన్లు ఇవ్వకుండా మోసం చేశాయని తెలిపారు. ఆ కాలేజీ సెక్రెటరీ, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. డొనేషన్ల దోపిడీపై విచారణ జరపించాలని కోరారు. 320 సీట్లకు అనుమతి ఉంటే 500కుపైగా అడ్మిషన్లు తీసుకున్నారని పేర్కొన్నారు. డొనేషన్ కట్టిన విద్యార్థులకు న్యాయం చేయాలని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేసిన యాజమాన్యాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవానలి డిమాండ్ చేశారు.

చిల్లర వేషాలకు భయపడేది లేదు

- కేసీఆర్ శిఖరం లాంటివారు..
- ఎంతోమందిని తరిమికొట్టారు
- కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసింది :మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి హేయమైన చర్యని, చిల్లర వేషాలకు భయపడేది లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. కార్యాలయంపై దాడి కాంగ్రెస్ గూండాల పని అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ శిఖరం లాంటి వారని, ఎంతోమందిని తరిమికొట్టారని అన్నారు. రుణమాఫీ విషయంలో అన్నదాతలను నిలువునా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ విషయాన్ని పక్కదారి పట్టించేలా ఈ దాడులు మొదలు పెట్టిందని విమర్శించారు. శనివారం



నల్లగొండ జిల్లా కేంద్రంలోనిబీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో జగదీశ్‌రెడ్డి మాట్లాడారు.

గతంలో తెలంగాణ ఉద్యమాన్ని అణచివేయాలని ఎన్నో కుట్రలు చేశారని అయినా.. వెనకడుగు వేయకుండా అహింసా పద్ధతిలో ఉద్యమాన్ని నడిపామని అన్నారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నమ్మించి గొంతు కోసిందని విమర్శించారు. ఇచ్చిన మాట తప్పి ఇవాళ రూ.17 వేల కోట్లు ఇచ్చి సగం మంది రైతులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ కానందునే రైతులు తిరగబడుతున్నారని, అందుకే సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో హింసను ప్రేరేపించేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రుణాలు ఇచ్చేటప్పుడే అన్ని పత్రాలూ సరిచూసుకునే ఇస్తారని, మరి మాఫీ విషయంలో ఇన్ని కొర్రీలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ రైతుల తరపున కొట్లాడుతుందని చెప్పారు. ఇప్పటికైనా అందరికీ రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అన్ని రాజకీయ పార్టీల కార్యాలయాలు ఉన్నట్టుగానే తమ పార్టీ ఆఫీస్ ఉందని అన్నారు. అందరిలాగే తామూ నిబంధనల ప్రకారమే కార్యాలయం కట్టుకున్నామని, కానీ తమ పార్టీ కార్యాలయాన్ని కూలుస్తామనడం సమంజసం కాదన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు రవీంద్ర కుమార్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ జెడ్పీ చైర్మెన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లబోతు భాస్కరరావు, చిరుమర్తి లింగయ్య ఉన్నారు.

సిద్దిపేటలో ఫ్లెక్సీ వార్

హరీశ్‌రావు రాజీనామా చేయాలని ఫ్లెక్సీ వేసిన కాంగ్రెస్

- నైతిక హక్కు లేదంటూ బీఆర్ఎస్ శ్రేణుల నిరసన
- ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అర్ధరాత్రి హంగామా
- పోటాపోటీ నిరసనలు, నినాదాల హోరు
- ఉద్రిక్తత.. భారీగా పోలీసు బందోబస్తు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రుణమాఫీ ప్రక్రియ కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ మధ్య మాటల 'ఫ్లెక్సీ' వార్‌కు దారి తీసింది. సగం మందికే రుణమాఫీ చేశారంటూ బీఆర్ఎస్.. లేదు రైతులందరికీ చేశామంటూ కాంగ్రెసోళ్ల వాదనలతో సిద్దిపేట జిల్లా రాజకీయం వేడెక్కింది. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న హరీశ్‌రావు సవాల్‌కు కట్టుబడి రాజీనామా చేయాలంటూ ' రుణమాఫీ అయిపోయే.. నీ రాజీనామా ఏడబోయే' అంటూ కాంగ్రెసోళ్లు భారీ ఫ్లెక్సీ వేశారు. దీనిపై బీఆర్ఎస్ వాళ్లు నిరసనకు దిగారు. శుక్రవారం అర్ధరాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోకి చొరబడిన కాంగ్రెస్ నాయకులు కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీలను చింపేసి హంగామా చేశారు. పోటాపోటీగా ఫ్లెక్సీలు చించుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సభల్లో ప్రసంగిస్తూ.. ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామంటూ మెదక్ చర్చి, ఏడుపాయల దుర్గమ్మపై ఒట్టు వేశారు. రాష్ట్రంలోని రైతులందరికీ రూ.2 లక్షల వరకు మాఫీ చేయాలంటే రూ.41 వేల కోట్ల బడ్జెట్ కావాలని ప్రకటించారు. దానిపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందిస్తూ.. ఆరు గ్యారంటీల్లోని 13 హామీలతో పాటు రూ.2 లక్షల రుణమాఫీ ఆగస్టు 15 వరకు అమలు చేస్తే రాజీనామా చేస్తానంటూ సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు దశల్లో 22 లక్షల మంది రైతులకు రూ.17933 కోట్లు రుణమాఫీ చేసినట్టు ప్రకటించింది. ఈ క్రమంలో హరీశ్‌రావు రాజీనామా చేయాలంటూ సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అయితే, రాష్ట్రంలో 47 లక్షల మంది రైతుల్లో సగం మందికే మాఫీ అయిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. రూ.41 వేల కోట్లు కావాలని చెప్పి రూ.17.93 వేల కోట్లే మాఫీ చేయడమంటే సగం మందికి మాఫీ చేయనట్లేగా అని నిలదీస్తున్నారు. ఆరు గ్యారంటీల్లో మహిళలకు రూ.2500, రూ.4 వేల పింఛన్లు, రైతులందరికీ రుణమాఫీ చేస్తే రాజీనామాకు కట్టుబడి ఉన్నానని హరీశ్‌రావు స్పష్టత ఇచ్చారు. అయినా హరీశ్‌రావు రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తుండటంతో గొడవలకు దారితీస్తోంది.



ఫ్లెక్సీ వార్..

హరీశ్‌రావు రాజీనామా చేయాలంటూ ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తూ వచ్చారు. ఇటీవల 'రుణమాఫీ అయిపోయే.. నీ రాజీనామా ఏడబోయే' అంటూ హరీశ్‌రావు ఫొటోతో భారీ ఫ్లెక్సీని సిద్దిపేట ప్రధాన కూడలిలో పెట్టారు. దీనిపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం తెలిపారు. అయితే, శుక్రవారం అర్ధరాత్రి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ నాయకత్వంలో నాయకులు సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలోకి చొరబడ్డారు. కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీలను చించేశారు. అక్కడ హంగామా సృష్టించారు. దీంతో పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్ని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాంగ్రెస్ దాడికి నిరసనగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైటాయించారు. హరీశ్‌రావు రాజీనామా చేయాలంటూ వేసిన ఫ్లెక్సీని చించేందుకు ప్రయత్నించారు. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య నినాదాలు హోరెత్తాయి. తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు అప్రమత్తమై భారీ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంపు కార్యాలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలు అధికారిక భవనాలైనందున అక్కడ మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావు ఫొటోలు పెట్టకూడదని, ఇది ప్రొటోకాల్‌కు విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు వాదిస్తున్నారు. ఈ విషయంపై గతంలోనే కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

అశాంతి నెలకొల్పే చర్యలు సబబు కాదు: సీపీఐ(ఎం)

అధికారంలో ఏ పార్టీ ఉన్నా సిద్దిపేట జిల్లా అభివృద్ధి కోసం పాటుపడాలి తప్ప అశాంతి నెలకొల్పేలా గొడవలకు దిగడం సబబు కాదని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కమిటీ స్పష్టం చేసింది. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి.. ఫ్లెక్సీ గొడవలపై స్పందించారు. ఫ్లెక్సీల గొడవలు జిల్లా ప్రశాంతతను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రొటోకాల్ విషయాలపై అభ్యంతరాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కారం చేసుకోవాలి తప్ప దాడులు చేయడం సరైంది కాదన్నారు.

ప్రపంచ శాంతి వర్ధిల్లాలి : ఏచూరి

సీతారాం ఏచూరి, డి.రాజాకు రోమేష్ చంద్ర శాంతి పురస్కారం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రపంచ శాంతి వర్ధిల్లాలని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ప్రపంచ శాంతి మండలి 75వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నాడిక్కడ హరి కిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో ప్రపంచ శాంతి మండలి, ఆల్ ఇండియా పీస్ అండ్ సాలిడారిటీ ఆర్గనైజేషన్స్ (ఏఐపీఎస్ఓ) ఆధ్వర్యంలో దేశంలో శాంతి, సంఘీభావ ఉద్యమాన్ని నిర్మించడంలో చేసిన విశిష్ట కృషికి సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, మాజీ ఎమ్మెల్సీ కె.యాదవరెడ్డిలను రోమేష్ చంద్ర శాంతి పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి మాట్లాడుతూ ప్రపంచ శాంతి నెలకొల్పా ల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రపంచంలోని దేశాలు రక్షణ బడ్జెట్‌ను తగ్గించాలని కోరారు. ఈబడ్జెట్‌ను తగ్గిస్తేనే విద్యా, వైద్యాన్ని ఉచితంగా అందించొచ్చని తెలిపారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు వంటివి ఆగాలని అన్నారు. ప్రపంచ దేశాల మధ్య సోదరభావం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్. అరుణ్ కుమార్, పల్లబ్‌సేన్ గుప్తా, డి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు జులై వేతనం చెల్లించాలి

- రిటైర్డ్ బెనిఫిట్స్ పెంచుతూ కొత్త జీవో విడుదల చేయాలి
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సీఐటీయూ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు జులై నెల వేతనాలను వెంటనే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సునీత, పి.జయలక్ష్మి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీమేరకు రిటైర్డ్ బెనిఫిట్స్ పెంచుతూ కొత్త జీవో విడుదల చేయాలని కోరారు. శనివారం ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వారు లేఖ రాశారు. ఒకటో తేదీ దాటిపోయి 17 రోజులు గడుస్తున్నా ఇంకా వేతనం ఇవ్వకపోవడమేంటని ప్రశ్నించారు. ముఖ్యమైన పండుగల సమయంలో కూడా సకాలంలో వేతనం ఇవ్వకపోతే ఎలా అని అడిగారు. అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు నష్టం చేకూర్చే జీవో నెంబర్ 10ని రద్దు చేయాలనీ, 24 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ.1 లక్ష, పెన్షన్ పెంచుతూ వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని కోరారు. జులై 16న ఐసీడీఎస్ మంత్రి సీతక్కను కలిసిన సమయంలోనూ, 19న ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేసిన సమయం లోనూ వారు వీఆర్ఎస్, పెన్షన్ సౌకర్యాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని గుర్తుచేశారు. రెండు రోజుల్లోనే జీవో ఇస్తామన్న మాట ఏమైందని సీతక్కను ప్రశ్నించారు. జులై ఒకటో తేదీ నుంచి విధుల నుండి తొలగించబడి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతామని చెప్పినా, కొత్త జీఓ రాకపోవడంతో 65 ఏండ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఒట్టిచేతులతో ఇంటికి వెళ్లి బతకలేకపోతున్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం తాము ఇచ్చిన మాట మీద నిలబడకపోవటం, కొత్త జీవో చాలా ఆలస్యం కావడంతో 65 ఏండ్లు నిండిన అంగన్‌వాడీ ఉద్యోగులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.

టార్గెట్ డైమండ్ లీగ్

లాసానె బరిలో నీరజ్ చోప్రా



ముంబయి : భారత సూపర్‌స్టార్ అథ్లెట్, ఒలింపిక్స్‌లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన నీరజ్ చోప్రా.. తన గాయంపై వచ్చిన వార్తలను కొట్టిపారేశారు. ఆగస్టు 22న లాసానె (డైమండ్ లీగ్) మీట్‌లో పోటీపడుతున్నట్టు తెలిపాడు. 'నేను లాసానెలో ఆడుతున్నాను. పారిస్ ఒలింపిక్స్ తర్వాత గాయం పెద్దగా తిరగబెట్టలేదు. టోక్యో ఒలింపిక్స్ తర్వాత.. సీజన్‌ను కొనసాగించాలని అనుకున్నాం. ఇప్పుడూ అంతే.. నేను భారత్‌కు రావటం లేదు. ఇతర టోర్నీల్లో పోటీపడేందుకు సిద్ధమవుతున్నాను. ఈ సీజన్ ముగిసిన తర్వాత గాయంకు తుది చికిత్స తీసుకుంటాను. సీజన్‌కు ఇంకో నెల రోజులే ఉంది. ప్రస్తుతం నా దృష్టి జ్యూరిచ్ డైమండ్ లీగ్, ఫైనల్‌పైనే ఉంది' అని నీరజ్ చోప్రా అన్నాడు.

ప్రతి దేశం గర్వపడే ఆతిథ్యం ఒలింపిక్స్. భారీ ఖర్చుతో కూడిన నిర్వహణ వ్యవహారమైనా.. ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వటం గొప్ప గౌరవంగా భావిస్తున్నారు. ఇదే సమయంలో ఒలింపిక్స్ నిర్వహణ ఎంతో బాధ్యతతో కూడుకున్నది. నిర్వహణ ఖర్చు పరంగా దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయగలదు. ప్రపంచ వ్యాప్తంగా చిన్న దేశాలు, నగరాలు ఒలింపిక్స్‌కు వేదికగా నిలిచినా.. భారత్ ఇప్పటి వరకు విశ్వ క్రీడల ఆతిథ్యానికి నోచుకోలేదు. 2036 ఒలింపిక్స్ నిర్వహణపై భారత్ ఆసక్తి చూపిస్తుంది. భారత ప్రధానమంత్రి స్వయంగా ఒలింపిక్స్ నిర్వహణపై ఆసక్తి కనబరిచారు. దీంతో భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహణపై క్రీడా వర్గాల్లో చర్చ నడుస్తుంది. ఒలింపిక్స్‌లో పోటీ, నిర్వహణ, సన్నద్ధత సహా బడ్జెట్ పరిగణనలోకి తీసుకుంటే విశ్వ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇవ్వగలదా?!



ఒలింపిక్స్ ఆతిథ్యం సాధ్యమా?



2036 ఒలింపిక్స్ నిర్వహణపై భారత్ ఆసక్తి

బిడ్ దాఖలుకు భారత ఒలింపిక్ సంఘం సిద్ధం

నవతెలంగాణ క్రీడావిభాగం

205 దేశాలు, 15000 మంది క్రీడాకారులు, అబ్బురపరిచే ఆరంభ వేడుకలు, అట్టహాసంగా ముగింపు వేడుకలు, ప్రపంచం మొత్తం ఆతిథ్య నగరం గురించే చర్చ. అందుకే ప్రతి దేశం, ప్రతి నగరం ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలని కలలు కంటుంది. ఇప్పుడు ఆ జాబితాలోకి భారత్ సైతం చేరిపోయింది. అహ్మదాబాద్ వేదికగా 2036 ఒలింపిక్స్ నిర్వహణ పట్ల భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ఆసక్తి చూపిస్తుంది. ఆర్థిక మద్దతుపై ప్రభుత్వం నుంచి హామీ లభించటంతో త్వరలోనే 2036 ఒలింపిక్స్ ఆతిథ్యం కోసం బిడ్ దాఖలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

మౌళిక సదుపాయాల కల్పన

ఒలింపిక్స్ నిర్వహణకు భారీ బడ్జెట్ అవసరం. ఆతిథ్య నగరంలో అందుబాటులో ఉన్న మౌళిక సదుపాయాలను బట్టి ఖర్చు మారుతుంది. భారత్‌లో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం అందించే స్థాయిలో ఏ నగరంలోనూ క్రీడా సదుపాయాలు లేవు. ఒలింపిక్స్ స్థాయి ఆరంభ, ముగింపు వేడుకలకు అనువైన స్టేడియాలు సైతం అందుబాటులో లేవు. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కులు దక్కితే.. భారత్ సున్నా నుంచి మొదలుపెట్టాల్సి ఉంటుంది. ఒలింపిక్ క్రీడలకు అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలు, స్టేడియాలు నిర్మించాలి. ఇందుకు భారీగా డబ్బులు అవసరం. అందుకు తగినట్టుగా బడ్జెట్‌లో ప్రభుత్వం కేటాయింపులు చేయాల్సి ఉంటుంది. ప్రయివేటు రంగం నుంచి పెట్టుబడులు తీసుకోవాల్సి ఉంటుంది.

ఖర్చు అంతా వీటికే..

సాధారణంగా ఒలింపిక్స్ బడ్జెట్ అంటే.. 17 రోజుల పాటు క్రీడల నిర్వహణకు అయ్యే వ్యయం. కానీ ఆధునిక ఒలింపిక్స్‌లో ఈ బడ్జెట్‌లో ఇతర అంశాలకు పెద్ద పీట వేస్తున్నారు. ఒలింపిక్ గ్రామం, మీడియా గ్రామం, జాతీయ స్టేడియం, తాత్కాలిక స్టేడియం నిర్మాణం ముఖ్యమైనవి. 205 దేశాలకు చెందిన అథ్లెట్లకు రవాణా సదుపాయం, కమ్యూనికేషన్, హాస్పిటాలిటీ ఇన్‌ఫ్రాస్టక్చర్ కీలకం. ఆతిథ్య నగరం అవసరాలు, ప్రణాళికలను అనుగుణంగా ఇందులో మార్పులు, చేర్పులు ఉంటాయి. ఆధునిక ఒలింపిక్స్‌లో మరో ప్రధాన ఖర్చు.. సెక్యూరిటీ. భద్రత కోసం ఏకంగా 200 కోట్ల డాలర్లు వెచ్చిస్తున్నారు. 2036 సమయానికి ఇది 300-350 కోట్ల డాలర్లకు చేరవచ్చని అంచనా. ఒలింపిక్స్ సమయంలో క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు, సహాయకులకు నివాసం, భోజనం, వైద్యం వంటి ఏర్పాట్లను ప్రపంచ శ్రేణి ప్రమాణాలతో ఏర్పాటు చేయాలి.

ఐఓసీ సాయం చేయదా?

అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఒలింపిక్స్ నిర్వహణకు సాయం అందిస్తుంది. కానీ అది క్రీడల నిర్వహణ సాంకేతిక అవసరాలకు సైతం సరిపోదు. పారిస్ ఒలింపిక్స్‌కు ఐఓసీ తన వాటాగా 170 కోట్ల డాలర్లను అందించింది. ఒలింపిక్స్ ప్రసార హక్కుల నుంచి ఐఓసీ 400 కోట్ల డాలర్ల ఆదాయం ఆర్జిస్తుంది. ఒలింపిక్స్‌కు హాజరయ్యే 205 మంది క్రీడాకారుల ప్రయాణ ఖర్చులను ఐఓసీ తన ఖాతా నుంచి చెల్లిస్తుంది. ఒలింపిక్స్ సమయంలో ఐఓసీ అధికారులకు పూర్తి ఏర్పాట్లను చేస్తుంది. ఇందుకు ఐఓసీకి భారీగా ఖర్చు అవుతుంది.

కొసరు ఖర్చే ఎక్కువ!

ఒలింపిక్స్ నిర్వహణ వ్యయం ఎక్కువగా మౌళిక సదుపాయాల కల్పనకే అవుతుంది. ఒలింపిక్స్ వ్యయంలో కనిపించని ఖర్చు ఆతిథ్య నగరానికి ఎక్కువగా ఉంటుంది. క్రీడాకారులు, పాత్రికేయులు, ప్రేక్షకులకు మంచి రవాణా, వసతి కల్పించటం కీలకం. రైలు, రోడ్డు మార్గాల ఆధునీకరణ, ఎయిర్‌పోర్టుల సుందరీకరణకు అధిక మొత్తంలో ఖర్చు అవుతుంది. ఆతిథ్య నగరం సహా కీలక నగరాల్లో టూరిజం కోసం పట్టణ సుందరీకరణ, ప్రజా సదుపాయాల మెరుగుదలకు గణనీయంగా ఖర్చు చేయాలి. ఈ లెక్కల పద్దు ఒలింపిక్స్ బడ్జెట్‌లో కనిపించదు.

నిర్వహణతో లాభం లేదా?!

విశ్వ క్రీడల నిర్వహణతో ఆర్థికంగా లాభపడిన చరిత్ర లేదు. కానీ ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుంటే.. ఒలింపిక్స్ నిర్వహణ ఉపయుక్తం. ఒలింపిక్స్ ఆతిథ్యం అనంతరం.. యూరోప్‌లో బార్సిలోనా పాపులర్ టూరిజమ్ డెస్టినేషన్‌గా నిలిచింది. కానీ లండన్, బీజింగ్, టోక్యోలకు అందుకు విరుద్ధంగా జరిగింది. ఒలింపిక్స్ నిర్వహణతో స్థానికంగా ఉద్యోగ కల్పన, పర్యాటకం, నగరానికి గ్లోబల్ బ్రాండింగ్ వంటి అనుకూలతలను ఐఓసీ హైలైట్ చేస్తుంది. ఒలింపిక్స్ నిర్వహణ అనంతరం క్రీడా గ్రామం, స్టేడియాలు, ఇతర వసతుల వినియోగం సరిగా లేకపోవటమే అతిపెద్ద బలహీనత. ఒలింపిక్స్ నిర్వహణతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం, లావాదేవీల పెరుగుదలను సర్వేలు, నివేదికలు హైలైట్‌గా చెప్తాయి. కానీ వాస్తవంలో సర్వేలను నిర్మాణ రంగం బడా కంపెనీలు శాసిస్తాయి. ఒలింపిక్స్ నిర్వహణలో అత్యధికంగా లాభపడేది నిర్మాణ రంగం కంపెనీలు.

రేసులో ఎవరున్నారు?

2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల రేసులో భారత్‌కు గట్టి పోటీ ఎదురు కానుంది. 2032 ఒలింపిక్స్ నిర్వహణ హక్కులను తృటిలో కోల్పోయిన ఇండోనేసియా.. 2036 రేసులో నిలిచింది. ఒలింపిక్స్ నిర్వహణే లక్ష్యంగా ఇండోనేషియా ఇప్పటికే బిడ్ దాఖలు చేసింది. టర్కీ సైతం ఇస్తాంబుల్ ఆతిథ్య నగరంగా బిడ్ దాఖలు చేసింది. భారత్ ఇప్పటివరకు బిడ్ దాఖలు చేయలేదు. త్వరలోనే భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నిపుణులతో సంప్రదించి ప్రభావశీల బిడ్‌ను సమర్పించనుంది. చిలీ, ఈజిప్ట్, దక్షిణ కొరియా, చైనా, ఖతార్, సౌదీ అరేబియా, హంగరీ, డెన్మార్క్, కెనడాలు సైతం 2036 ఒలింపిక్స్ బిడ్ దాఖలుపై ఆలోచన చేస్తున్నాయి.

ఆర్థికంగా గుదిబండ

ఒలింపిక్స్ నిర్వహణ ఆషామాషీ కాదు. 1896లో ఆధునిక ఒలింపిక్స్ మొదలైన నాటి నుంచి.. ఇప్పటివరకు ఏ నగరం సైతం ఆర్థిక నష్టం లేకుండా క్రీడలకు ఆతిథ్యం ఇవ్వలేదు. 1960 నుంచి ఒలింపిక్స్ నిర్వహణ మరింత భారంగా మారింది. 2004 ఏథెన్స్ ఒలింపిక్స్ నిర్వహణతో గ్రీసు ఆర్థిక వ్యవస్థ దివాళా తీసే దుస్థితికి చేరుకుంది. 2020 టోక్యో ఒలింపిక్స్ అంచనాలను 730 కోట్ల డాలర్లకు వేయగా.. 2800 కోట్ల డాలర్ల వ్యయం అయ్యింది. 2016 రియో ఒలింపిక్స్ అంచనా 1400 కోట్ల డాలర్లు కాగా.. ఖర్చు 2000 కోట్ల డాలర్లు. 2012 లండన్ ఒలింపిక్స్ అంచనా 500 కోట్ల డాలర్లు కాగా.. వ్యయం 1800 కోట్ల డాలర్లు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌కు ఏకంగా 5000 కోట్ల డాలర్లు ఖర్చు చేశారు. విపరీత ఖర్చుతో ఒలింపిక్స్ నిర్వహణపై ఆసక్తి సన్నగిల్లుతున్న తరుణంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఖర్చు తగ్గించే మార్గాలపై క్రీడల నిర్వహణ కమిటీతో కలిసి పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



వెల్‌కమ్ చాంపియన్

వినేశ్ ఫోగట్‌కు అపూర్వ స్వాగతం

న్యూఢిల్లీ : భారత చాంపియన్ రెజ్లర్, పారిస్ ఒలింపిక్స్‌లో సిల్వర్ మెడల్ కోల్పోయిన వినేశ్ ఫోగట్‌కు స్వదేశంలో అపూర్వ స్వాగతం లభించింది. ఒలింపిక్ పతక విజేతలతో సమానంగా వినేశ్ ఫోగట్‌కు అభిమానులు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళల 50 కేజీల విభాగంలో ఫైనల్‌కు చేరుకున్న వినేశ్ ఫోగట్ కనీసం రజత పతకం ఖాయం చేసుకుంది. కానీ పసిడి పోరు ముంగిట నిర్దేశిత బరువు కంటే 100 గ్రాములు అధికంగా ఉన్న కారణంగా వినేశ్ ఫోగట్‌పై అనర్హత వేటు పడింది. సిల్వర్ మెడల్ సైతం వెనక్కి తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని వినేశ్ ఫోగట్ సీఏఎస్ (కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్)లో అప్పీల్ చేయగా.. న్యాయస్థానంలో నిరాశే ఎదురైంది. శనివారం న్యూఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అడుగు పెట్టిన వినేశ్ ఫోగట్ తీవ్ర భావోద్వేగానికి గురైంది. స్టార్ రెజ్లర్లు సాక్షి మాలిక్, బజరంగ్ పూనియా సహా అభిమానులు, ప్రజలు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. రాజధాని నుంచి వినేశ్ ఫోగట్ స్వగ్రామానికి 3 గంటల ప్రయాణం కాగా.. దారి పొడవునా వినేశ్‌కు అభిమానులు జేజేలు కొట్టారు. హర్యానా ముఖ్యమంత్రి ఇప్పటికే వినేశ్ ఫోగట్‌కు ఒలింపిక్ సిల్వర్ మెడలిస్ట్‌కు అందించే ఆర్థిక ప్రోత్సాహకం, సన్మానం చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే.

డబ్ల్యూఎఫ్ఐ మద్దతు ఇవ్వలేదు


వినేశ్ ఫోగట్‌కు భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) నుంచి మద్దతు లభించలేదని ఆమె భర్త సోమ్‌వీర్ ఆరోపించారు. స్పోర్ట్స్ ఆర్బిట్రేషన్ కోర్టులో వినేశ్‌కు మెడల్ దక్కలేదు. పారిస్‌లో వినేశ్‌కు డబ్ల్యూఎఫ్ఐ నుంచి సహకారం దక్కలేదు. స్వదేశంలో వినేశ్ ఫోగట్‌కు అపూర్వ స్వాగతం దక్కటం ఆనందంగా ఉందని సోమ్‌వీర్ అన్నారు.

బరిలో 43 మంది అథ్లెట్లు

అండర్-20 వరల్డ్ అథ్లెటిక్స్



చెన్నై : అండర్-20 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో టీమ్ ఇండియా జంబో జట్టును బరిలోకి దింపుతోంది. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో అన్ని విభాగాల్లో కలిపి భారత్ నుంచి ఏకంగా 43 మంది క్రీడాకారులు పోటీపడనున్నారు. 2022 కొలంబియాలో జరిగిన అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో భారత్ మూడు మెడల్స్ సాధించింది. రెండు సిల్వర్ మెడల్స్, ఓ కాంస్య అందులో ఉన్నాయి. 2024 అండర్-20 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ పోటీలు పెరూలోని లిమా నగరంలో ఆగస్టు 27-31 వరకు జరుగనున్నాయి.



నిధి అగర్వాల్

మహా లక్ష్మీదేవికి ప్రతిరూపం..

పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న 'హరి హర వీర మల్లు' చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈనెల 14 నుంచి ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ తిరిగి ప్రారంభమైంది. ప్రస్తుతం యాక్షన్ దర్శకుడు స్టంట్ సిల్వ పర్యవేక్షణలో భారీ యుద్ధ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న నిధి అగర్వాల్ పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పోస్టర్‌తో చిత్ర బృందం శుభాకాంక్షలు తెలిపింది. పోస్టర్‌లో మహాలక్ష్మి దేవి అవతారంగా నిధి అగర్వాల్ అందర్నీ అలరిస్తోంది. అణగారిన వర్గాల కోసం పాలకుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడే ఒక యోధుడిగా ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ కనిపించనున్నారు. దర్శకుడు జ్యోతి కృష్ణ ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు. ఏ.ఎం.రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు భారీగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది.
మొదటి భాగం 'హరి హర వీర మల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' త్వరలో తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.

సుకుమార్ మాటలు మరింత నమ్మకాన్ని ఇచ్చాయి



లక్ష్మణ్ కార్య

దర్శకుడు సుకుమార్ సతీమణి తబిత సమర్పణలో విడుదల అవుతున్న సినిమా 'మారుతీ నగర్ సుబ్రమణ్యం'. రావు రమేష్ కథానాయకుడు. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలపై బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు. రావు రమేష్ సరసన ఇంద్రజ, అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి మరో జంటగా, హర్షవర్ధన్ కీలక పాత్రలో నటించారు. ఈనెల 23న సినిమా విడుదల కానుంది.
ఈ సందర్భంగా దర్శకుడు లక్ష్మణ్ కార్య మీడియాతో మాట్లాడుతూ, 'హ్యాపీ వెడ్డింగ్' తర్వాత దర్శకుడిగా ఇది నా రెండో సినిమా. మా వైఫ్‌కి జరిగిన ఒక ఘటన స్ఫూర్తితో ఈ కథ రాశాను. అలాగే అల్లు అరవింద్ మీద డైలాగ్, అల్లు అర్జున్ పాటల స్ఫూర్తితో ఓ సాంగ్ తీశాం. ఇది ఎందుకు తీశామన్నది సినిమాలో చూస్తేనే బాగుంటుంది.
నా వైఫ్, సుకుమార్‌వైఫ్ తబితకి కామన్ ఫ్రెండ్స్ ఉన్నారు. సినిమా అంతా అయ్యాక ఓసారి తబితకి చెప్పమని నా భార్యను అడిగా. తను చెబితే తబిత, సుకుమార్ పిలిచి మాట్లాడారు. ఓ రోజు తబితకి ప్రివ్యూ వేశా. ఆమె సినిమా బావుందని మెచ్చుకున్నారు. అదే రోజు తబితతో మైత్రి శశి వచ్చారు. ఆయనకూ సినిమా నచ్చింది. ఆ తర్వాత నవీన్ ఎర్నేని, రవిశంకర్‌కి సినిమా చూపిద్దామని చెప్పారు. వాళ్లకూ నచ్చింది. డిస్ట్రిబ్యూషన్ చేస్తామని చెప్పారు. అలాగే ఈసినిమాని సుకుమార్ చూశారు. రావు రమేష్ అద్భుతంగా చేశారని, సినిమా బాగా తీశావని చెప్పారు. నేను ఆనందంలో తేలిపోయా. ఆయన మాటలు నాకు మరింత కాన్ఫిడెన్స్ ఇచ్చాయి. ఈనెల 23న ప్రేక్షకులు కూడా సినిమా చూసినప్పుడు అంతే ఆనందంగా నవ్వుతారని ఆశిస్తున్నాను' అని చెప్పారు.



వినూత్నంగా పోస్టర్ లాంచ్

ఏకే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న చిత్రం 'దేవ్ పారు'. తాజాగా ఈ చిత్ర పోస్టర్ లాంచ్ వేడుక చాలా వినుత్నంగా జరిగింది. ఫుడ్ డెలివరీ కంపెనీలో పనిచేసే డెలివరీ బాయ్స్ చేతుల మీదుగా ఈ లాంచ్ జరగడం విశేషం.
తమ విలువైన సమయాన్ని పోస్టర్ అవిష్కరణకు వినియోగించి నందుకు చిత్ర యూనిట్ డెలివరీ బాయ్స్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మూవీ టీమ్ ఒక వీడియోను విడుదల చేశారు. అందరి ఆకలి తీర్చడానికి డెలివరీ బాయ్స్ ఎంతో కష్టపడుతూ.. ఎండ, వాన అని తేడా లేకుండా సమయానికి ఫుడ్ అందిస్తున్నారు. వారి శ్రమకు 'దేవ్ పారు' టీమ్ ఒక చిన్న ట్రిబ్యూట్‌ను ప్లాన్ చేశారు. అందుకని ఒక డెలివరీ యాప్‌లో ఫుడ్ ఆర్డర్ చేసి, ఆ ఆర్డర్ తీసుకొచ్చిన డెలివరీ బాయ్స్‌తో పోస్టర్ లాంచ్ చేశారు. ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగానే సినిమాను తెరకెక్కిస్తున్నట్లు, త్వరలోనే మరో సాలిడ్ అప్డేట్‌తో వస్తామని చిత్ర యూనిట్ తెలిపింది.

నవచిత్రం

నేను రివ్యూ రాస్తా : నిర్మాత దిల్ రాజు



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'రేవు'. ఈ చిత్రాన్ని సంహిత్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్, పారుపల్లి ప్రొడక్షన్ పై నిర్మాత డా. మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి సంయుక్తంగా నిర్మించారు.
నిర్మాణ సూపర్ విజన్‌గా జర్నలిస్ట్ ప్రభు, ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా ఫిలిం జర్నలిస్ట్ పర్వతనేని రాంబాబు వ్యవహరిస్తున్నారు. హరినాథ్ పులి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఈనెల 23న రిలీజ్ కానుంది. ఈ క్రమంలో ఈ చిత్ర ట్రైలర్‌ను లాంచ్ చేశారు.
దిల్ రాజు మాట్లాడుతూ, 'రేవు' కాన్సెప్ట్ బాగుంది. రాంబాబు, ప్రభు ఈ చిత్రం గురించి చెప్పారు. వీళ్ల వెనకాల ఉండి ఈ సినిమాను తీశారు కాబట్టి.. నేను ముందుండి నడిపించాలని అనుకున్నాను. ఇంత వరకు వీళ్ళు సినిమాని చూసి రివ్యూ రాశారు. ఇప్పుడు వీళ్ళు సినిమా తీశారు. కాబట్టి వీళ్ళ సినిమాని చూసి నేను రివ్యూ రాస్తా' అని అన్నారు.
దర్శకుడు కోదండ రామిరెడ్డి, జర్నలిస్ట్ ప్రభు, నిర్మాతలు మురళీ, రామ సత్యనారాయణ, ప్రసన్న కుమార్, దామోదర ప్రసాద్, డీఎస్ రావు, దర్శకుడు రేలంగి నర్సింహారావు, నటుడు ప్రదీప్ తదితరులు చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

కిల్లర్స్ కథ..



ఎన్టీఆర్ శ్రీను సమర్పణలో జాకీ షరాఫ్, సన్నీలియోన్, ప్రియమణి, సారా అర్జున్ ముఖ్య పాత్రల్లో ఫిల్మ్ నటి ప్రొడక్షన్స్, వై స్టూడియోస్ పై వివేక్ కుమార్ కన్నన్ నిర్మించి, దర్శకత్వం వహించిన సినిమా 'క్యు జి'. మరో నిర్మాతగా గాయత్రి సురేష్ వ్యవహరిం చారు. ఈ సినిమా తెలుగు వరల్డ్ వైడ్ రిలీజ్ రైట్స్‌ని రుషికేశ్వర్ ఫిలిమ్స్ సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా నిర్మాత ఎం. వేణుగోపాల్ మాట్లాడుతూ, 'ఎంతో హెవీ కాంపిటీషన్‌లో కూడా ఈ సినిమా తెలుగు వరల్డ్ వైడ్ రిలీజ్ రైట్స్ నాకు ఇచ్చినందుకు తమిళ నిర్మాతలకి థ్యాంక్స్. టీజర్‌కి, ఫస్ట్ లుక్ పోస్టర్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. అతి త్వరలో సినిమాని తెలుగులో గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నాం' అని చెప్పారు. ఈ చిత్రానికి నిర్మాతలు : ఎం.వేణుగోపాల్, వివేక్ కుమార్ కన్నన్, గాయత్రి సురేష్.

మిస్టర్ బచ్చన్.. నా కెరీర్‌లో న్యూ చాప్టర్



మిక్కీ జే మేయర్

"మిస్టర్ బచ్చన్' మ్యూజిక్‌కి ఇంత మంచి రెస్పాన్స్ రావడం చాలా హ్యాపీగా ఉంది. సాంగ్స్ అన్ని ప్రేక్షకులకు చాలా బాగా నచ్చాయి. ఇదొక సర్‌ప్రైజ్ (నవ్వుతూ)' అని అంటున్నారు సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్. రవితేజ, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి.విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది.
ఈ నేపథ్యంలో మ్యూజిక్ డైరెక్టర్ మిక్కీ జే మేయర్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు. 'నేను మాస్, క్లాస్ అని అలోచించను. సాంగ్స్ అనేవి స్క్రిప్ట్ ప్రకారమే వస్తాయి. ఇందులో ఇలాంటి మాస్ సాంగ్స్ చేసే అవకాశం వచ్చింది. ఇందులో ఎక్కువ హిందీ సాంగ్స్ ఉన్నాయి. ఇది మొత్తం డైరెక్టర్ ఐడియా. కిషోర్ కుమార్‌కి హరీష్ బిగ్ ఫ్యాన్. నేను కూడా ఆ సాంగ్స్ విని పెరిగాను. అయితే ఆ పాటలన్నిటికి కొత్త బీట్స్, బ్యాకింగ్ యాడ్ చేసి కొంచెం యాంప్లిఫై చేశాం. ఈ ఆల్బం కోసం హరీష్ సియాటిల్ వచ్చారు. అప్పటివరకూ నేను ఎప్పుడూ మ్యూజిక్ సిట్టింగ్స్‌లో కూర్చోలేదు. నాలుగు రోజుల్లో ట్యూన్స్ పూర్తి చేశాం. హరీష్ కి గ్రేట్ మ్యూజిక్ సెన్స్ ఉంది. మ్యూజిక్ సెన్స్ ఉన్న దర్శకులతో పని చేయడం కంపోజర్‌కి ఈజీగా ఉంటుంది. రవితేజ 'కిక్' సినిమా నేను చేయాల్సింది. అయితే కొన్ని కారణాల వలన అది కుదరలేదు. ఇప్పుడు ఈ సినిమాకి మ్యూజిక్ చేయడం పర్‌ఫెక్ట్ టైమింగ్ అనిపించింది. అంతేకాదు నా కెరీర్‌లో ఇదొక న్యూ చాప్టర్ కూడా'.



త్వరలోనే తంగలాన్ 2

విక్రమ్ హీరోగా నటించిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. ఈ నెల 15న థియేటర్స్‌లోకి వచ్చి బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకుంది.
ఈ చిత్రాన్ని పా రంజిత్ దర్శకత్వంలో నీలమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ ఫిలింస్ బ్యానర్ పై నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించారు.
ఈ సినిమా సక్సెస్ మీట్‌లో నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా మాట్లాడుతూ, 'ఎంతో పోటీలో రిలీజైన మా సినిమాకు మంచి సక్సెస్ అందించారు తెలుగు ప్రేక్షకులు. మరిన్ని స్క్రీన్స్ యాడ్ అవుతున్నాయి. మాకు ఒక ఎపిక్ మూవీని ఇచ్చిన పా రంజిత్‌కు థ్యాంక్స్' అని తెలిపారు. 'మా సినిమాను తెలుగు ప్రేక్షకులు బాగా రిసీవ్ చేసుకుంటున్నారు. "తంగలాన్" ఒక డిస్కషన్ మొదలయ్యేలా చేసింది' అని దర్శకుడు పా.రంజిత్ తెలిపారు.
హీరో విక్రమ్ మాట్లాడుతూ, 'ఈ సినిమా రిలీజ్‌కు ముందే నేను పా రంజిత్, జ్ఞానవేల్‌కి చెప్పాను. ఇది తెలుగు ఆడియెన్స్ బాగా రిసీవ్ చేసుకునే సినిమా అవుతుందని. ఎందుకంటే ఇది మట్టి మనుషుల కథ. 'తంగలాన్'కు పార్ట్ 2 చేయాలని నేను, పా రంజిత్, జ్ఞానవేల్ అనుకున్నాం. తప్పకుండా ఈ సినిమాకు సీక్వెల్ వస్తుంది' అని అన్నారు.

టాలెంట్‌కి పట్టం కట్టే వేదిక



విశ్వక్‌సేన్

హైదరాబాద్‌కు తలమానికంగా భాసిల్లుతున్న థ్రిల్ సిటీ - అమ్యూజ్మెంట్ థీమ్ పార్క్ సోషల్ మీడియా ప్రభావాశీలుర సృజనాత్మకతకు సవాలు విసిరింది. అసాధారణమైన, అద్భుతమైన అనేక విశేషాల సమాహారంగా ఇంటిల్లిపాదినీ అలరిస్తున్న థ్రిల్ సిటీ - థీమ్ పార్క్‌లోని ఫన్ గేమ్స్, అడ్వెంచర్ గేమ్స్, హార్రర్ మేజ్, 12డి థియేటర్ లాంటి వందలాది యాక్టివిటీస్‌ని బేస్ చేసుకుని వీడియో రీల్‌ను చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియోల నుంచి అత్యుత్తమమైన వీడియో రీల్స్ మూడింటిని ఎంపిక చేసి, లక్ష రూపాయల చొప్పున మూడు లక్షల నగదు బహుమతులను అందించనుంది.
'థ్రిల్లింగ్ ఇన్‌ఫ్లూయెన్సర్స్ ఛాలెంజ్' ఈవెంట్ కర్టెన్ రైజర్ వేడుకకు హాజరైన హీరో విశ్వక్‌సేన్ మాట్లాడుతూ, 'ప్రస్తుతం సోషల్ మీడియాపై ఆధారపడని వ్యవస్థ, వ్యాపార రంగమంటూ ఏదీ లేదు. టాలెంట్ ఎవరి సొత్తు కాదు. క్రియేటివిటీ ఉన్న ప్రతీ ఒక్కరికీ సోషల్ మీడియా పట్టం కడుతుంది' అని అన్నారు.
ఈ ఈవెంట్ కో-ఆర్డినేటర్ 'బందూక్' లక్ష్మణ్ మాట్లాడుతూ, 'మూడు విభాగాల్లో ముగ్గురు విజేతలను ఎంపిక చేసి, ప్రముఖ దర్శకుల సమక్షంలో జరిగే వేడుకలో లక్ష రూపాయల చొప్పున నగదు బహుమతి అందిస్తాం' అని తెలిపారు.

'నేడు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర సన్నాహక సమావేశం'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అంశానికి వ్యతిరేకంగా ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నేడు (ఆదివారం) హిమాయత్ నగర్ లోని పరివర్తన 'లా' ఛాంబర్స్ లో సమితి రాష్ట్ర సన్నాహక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు సమితి జాతీయ చైర్మన్, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో వివిధ దళిత రాజకీయ పార్టీలు, ఎస్సీ, ఎస్టీ కుల సంఘాలు, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

నాంపల్లి తహసీల్దార్ ప్రేమ్ కుమార్‌కు ప్రశంసపత్రం అందజేత



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రెవెన్యూలో శాఖలో విశేష సేవలు అందిస్తున్న నాంపల్లి మండల తహసీల్దార్ ఎం.ప్రేమ్ కుమారు ఇటీవల జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆయనకు ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు.

కఠిన చట్టాలు తీసుకురావడం ఎంతో అవసరం

- ఎంపీ ఈటల రాజేందర్

నవతెలంగాణ-ముషీరాబాద్



గతంలో పాలకులు ఇచ్చిన హామీలు సరిగా అమలు కాకపోవడంతో మహిళలపై దాడుల ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. వెస్ట్ బెంగాల్‌లో జరిగిన అమానుష ఘటనపై దేశవ్యాప్త బంద్ పాటిస్తున్న శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద డాక్టర్లు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఎంపీ ఈటెల రాజేందర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పగడాల కాశీ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. బెంగాల్ రాష్ట్రంలో జరిగిన అమానుషదాడిని ఖండిస్తున్నాను. ఇలాంటి సభ్యసమాజం తలదించుకునే పరిస్థితి ఇంకెప్పుడూ కలుగకూడదని దేశవ్యాప్తంగా బంద్ నిర్వహి స్తున్నందుకు నా మద్దతు ఉంటుందని తెలిపారు. గతంలో పాలకులు ఇచ్చిన హామీలు సరిగ్గా అమలు కాకపోవడం వల్ల, ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ప్రజలకు ప్రాణ దానం చేసే డాక్టర్లు ఇలా రోడ్ల మీదకు రావడం చాలా దురదృష్టకారమన్నారు. ఇలాంటి సైకో శాడిస్టులకు, మానవ మృగాలకు సమాజమే సరైన శిక్ష వేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి వాటికి కఠిన చట్టాలు తీసుకురావడం ఎంతో అత్యవసరమని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా, మేధోమథనం జరగాల్సిన అవసరం ఉందని ఇలాంటి సైకోలను ఉరితీయాలని డిమాండ్ చేశారు. సమాజంలో వైద్యులు, వైద్య సిబ్బందిపై జరుగుతున్న దాడుల తదితర సమస్యలపై పార్లమెంట్లో ప్రస్తావిస్తానని తెలిపారు. ఈ ధర్నాలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ డాక్టర్ సెక్రటరీ విజయ రావు, డాక్టర్ వైస్ ప్రెసిడెంట్ రాజేందర్ కుమార్ యాదవ్, డాక్టర్ సురేష్ గుప్తా, తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీలపై లాకప్ హింసకు పాల్పడుతున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలి'

నవతెలంగాణ-ముషీరాబాద్



అకారణంగా ఎస్సీ,ఎస్టీలపై దొంగతనాల నెపంతో ఎస్సీ, ఎస్టీ మహిళలు, పిల్లలపై లాకప్ హింసలకు పాల్పడుతున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీబీఎఫ్, డీఎల్ఎఫ్‌ల ఆధ్వర్యంలో 78 ఏండ్ల స్వాతంత్ర్య పాలనలో ఎస్సీ,ఎస్టీలపై ఆగని దాడులు, తెలంగాణలో ఎస్సీ, ఎస్టీలపై లాకప్ హింసకు పాల్పడుతున్న పోలీసులను శిక్షించాలని డిమాండ్ చేస్తూ డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. హెూం మంత్రిగా బాధ్యత వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి నిందితులైన పోలీసులను శిక్షించాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, డీఎల్ఎఫ్ నాయకులు మర్రాడి సుదర్శన్‌లు మాట్లాడుతూ.. దళిత, గిరిజనులను లాకప్ హింసకు పాల్పడ్డ రామడుగు, బషీరాబాద్ పోలీసులపై కేసుల నమోదు చేయాలని షాద్‌నగర్ సంఘటనలో పోలీసులను అరెస్టు చేయాలన్నారు. ఎరుకల యువకుడు కనకయ్యను చిత్రహింసలకు గురిచేసిన రామడుగు ఎస్ఐ సురేంద్రబాబుపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలన్నారు. షాద్‌నగర్‌లో దళిత మహిళ సునీతను చిత్రహింసలకు గురి చేసిన డీఐ రాంరెడ్డి, కానిస్టేబుళ్లను అరెస్టు చేయాలన్నారు. దళిత మహిళ కళావతిని హింసించిన బషిరబాద్ ఎస్ఐ రమేష్‌పై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దళిత, గిరిజనులపై పోలీసుల దౌర్జన్యాలు నిత్యకృత్యంగా మారాయన్నారు. షాద్‌నగర్‌కు చెందిన దళిత మహిళ సునీత మాట్లాడుతూ ఆడమనిషిని అని చూడకుండా తన భర్త, కొడుకు ముందే కొట్టారని కన్నీరుమున్నీరయ్యారు. నన్ను కొట్టిన డీఐ రామిరెడ్డి ఇతర పోలీసులకు శిక్షించాలని కోరారు. కరీంనగర్ జిల్లా రామడుగుకు చెందిన ఎరుకల కనకయ్య, అనిత దంపతులు మాట్లాడుతూ మాకు రామడుగు ఎస్ఐ సురేందర్ బాబుతో తమ ప్రాణాలకు హని ఉందని ఎస్ఐపై చర్యలు తీసుకోవాల న్నారు. నేరెళ్ల బాధితులు మహేష్, బాణయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వం మారితే మాకు న్యాయం జరుగుతుందని అనుకున్నాం కానీ మాపై హింసకు పాల్పడిన పోలీసులకు శిక్షలుపడటం లేదన్నారు. కొనరావుపేటకు చెందిన జర్నలిస్టులు కర్ణకర్, నరేష్ ప్రసాద్‌లు తమపై అన్యాయంగా కేసుల పాలు చేశారన్నారు. ఈ సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొపెసర్ లక్ష్మణ్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు బాలరాజు, రోహిత్, జంగయ్య, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మర్రాడి సుదర్శన్, డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, వివిధ సంఘాల నాయ కులు రాంప్రసాద్, శివలింగం, తదితరులు పాల్గొన్నారు.

బస్తీల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్



ముషీరాబాద్ నియోజకవర్గం, గాంధీనగర్ డివిజన్ లోనీ బస్తీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అన్నారు. డివిజన్‌లోని అరుంధతి నగర్ బస్తీలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఇరిగేషన్ ఏఈ శ్యామ్ సుందర్, సూపర్వైజర్ రవి కుమార్, వాటర్ వర్క్స్ మేనేజర్ కృష్ణ మోహన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్, హార్టికల్చర్ సర్కిల్ మేనేజర్ భాస్కర్, అసిస్టెంట్ వెంకటేష్ పలు శాఖల సిబ్బందితో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ బస్తీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా అరుంధతి నగర్‌లో నాలా రిటర్నింగ్ వాల్ నిర్మాణం వద్ద వర్షాలకు వరదనీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అందుకు పటిష్టమైన శాశ్వత పరిష్కారం కొరకు ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. మంచినీటి లోప్రెషర్, సేవరేజి ఓవర్ ఫ్లో సమస్యల తీవ్రత అధికమయ్యిందని వాటి పరిష్కారానికి జలమండలి అధికారులు వెంటనే ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బస్తీలోనీ చెట్ల కొమ్మలకు కీటకాలు చేరి బస్తీవాసులకు ఇబ్బందికరంగా మారినందువల్ల హార్టికల్చర్ సిబ్బందితో చెట్టు కొమ్మలు తొలగించాలని సూ చించారు. డివిజన్ వ్యాప్తంగా సమస్యలున్నా ప్రతి బస్తీలో పర్యటించి క్రమంగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. పర్యటనలో బీజేపీ నాయకులు శ్రీకాంత్, పి. నర్సింగ్ రావు,ఎం.ఉమేష్, సాయి కుమార్, ఆనంద్ రావు, అరుణ్ కుమార్, నీరజ్, శ్రీనివాస్ గౌడ్,బస్తీ వాసులు చిప్స్ రాజు, ప్రకాష్, రాజయ్య, నర్సింగ్, ఆరోగ్యం, సాయిలు, లలిత, భారతమ్మ యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇంటి స్థలం కేటాయించాలి'

- సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోద్రమోని పురుషోత్తం

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లా, మండల, గ్రామాల్లో సర్వే చేసి ఇండ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్ల పేరిట ప్రతి కుటుంబానికి 100 గజాల ఇంటి స్థలం, ఇంటి నిర్మాణం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ చేయూత కింద రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోద్రమోని పురుషోత్తం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నారాయణగూడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పురుషోత్తం మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల ఓట్లతో గెలిచి 10 ఏండ్లు రాజకీయ సుఖ భోగాలు అనుభవించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి బుద్ధి రావాలని ప్రతిపక్ష హెూదాలోకి నెట్టిన, అదే విధంగా పార్లమెంటులో ఒక ఎంపీ సీటు కూడా ప్రజలు ఇవ్వలేదని గుర్తు చేశారు.గత కాంగ్రెస్ హయాంలో రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీ, వైయస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో కేటాయించిన ఇండ్లు ఇప్పటికి బీఆర్ఎస్ ప్రభుత్వం పదిలో ఒక వంతు కూడా నెరవేర్చలేక పోయిందని, అందుకే బీఆర్ఎస్ కు ప్రజలు ఉనికి లేకుండా చేశారని విమర్శించారు. నగరంలో మధ్య తరగతి ప్రజలు ఎంతో కష్టపడి నిర్మించు కున్న ఇండ్లను అక్రమ కట్టడాల పేరుతో కూల్చివేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా కూల్చివేతలు ఆపాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలందరికీ జారీ చేయాలని డిమాండ్ చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం హెచ్ఎండీఏ పేరుతో ఎంతో మంది పేదల భూమిలను బలవంతంగా స్వాధీనం చేసుకుందని, వారికి ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వకుండా ఆ భూములను ట్రస్టులకు అప్పగించడం సిగ్గుచేటున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములు అన్నింటిని సర్వే చేసి వెంటనే పేద రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

నిలిచిపోయిన ఓపీ సేవలు

- నేటి ఉదయం 6 గంటల వరకు కొనసాగింపు
- గ్రేటర్ వ్యాప్తంగా ఇబ్బందులు పడ్డ రోగులు

నవతెలంగాణ-సిటీబ్యూరో



ఉస్మానియా ఆస్పత్రిలో ఖాళీగా ఓపీ బ్లాక్

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడి దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), ఫ్యాకల్టీ అసోసి యేషన్ ఆఫ్ ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ దేశవ్యాప్తంగా నిరసనకు పిలుపు నిచ్చింది. వైద్య సంఘాలు 24 గంటల పాటు వైద్య సేవలను బంద్ చేయాలని నిర్ణయించాయి. అత్యసర సేవలు మినహా అన్ని రకాల ఆరోగ్య సేవలు, సాధారణ ఓపీడీలు, శస్త్రచికిత్సలను శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు నిలిపేశారు. డాక్టర్లు కేవలం ఎమర్జెన్సీ కేసులను మాత్రమే అటెండ్ చేయాలని ఐఎంఏ వెల్లడించింది. ఈ పిలుపు మేరకు గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా వైద్యుల ఆందోళనలు కొనసాగాయి. దాదాపు అన్ని పెద్ద హాస్పిటల్స్‌లో ఓపీ సేవలను నిలిపేశారు. కేవలం అత్యవసర సేవలను మాత్రమే అందించారు. ఈ బంద్ నేటి ఉదయం 6 గంటల వరకు కొనసాగుతుందని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా నింధితులను కఠినంగా శిక్షించాల ంటూ గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా వైద్య విద్యార్థులు నిరసన తెలిపారు.

నిలిచిపోయిన ఓపీ సేవలు

వైద్యుల సమ్మెకు గ్రేటర్ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు వైద్యులు, మెడికల్ సిబ్బంది తమ సంఘీభావం ప్రకటించి ఓపీ సేవలను నిలిపేశారు. దీంతో గ్రేటర్ వ్యాప్తంగా రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నిరసన ద్వారా వైద్యులు పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. వైద్యులకు కేంద్ర రక్షణ చట్టం అమలు చేయాలనీ, కోల్‌కతా ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో బాధితురాలికి తక్షణ న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. సెక్యూరిటీ ఆడిట్, సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అందుబాటులో ఉండేలా చూడాలనీ, హాస్పిటల్స్‌లో అమర్చిన కెమెరాల పూరిత నివేదికను ఇవ్వాలని డాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఆయా ప్రభుత్వ, ప్రయివేటు హాస్పిటల్స్‌లో అత్యవసర, క్యాజువాలి టీ వార్డులు మాత్రమే పని చేశాయి. తప్పనిసరిగా విధులకు హాజరైన వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గ్రేటర్‌లోని దాదాపు అన్ని పెద్ద కార్పొరేట్ హాస్పిటల్స్ సమ్మెను పాటించాయి. ఇందిరాపార్కు వద్ద ఐఎంఏ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వైద్యులు, వైద్య విద్యార్థులు నిరసనల్లో పాల్గొన్నారు. పలువురు రాజకీయ నాయకులు వీరికి మద్దతు తెలిపారు. వైద్యులే కాకుండా వైద్య అనుబంధ వర్గాలైన నర్సుల సంఘాలు, వైద్య ప్రతినిధి సంఘాలు కూడా ఈ సమ్మెకు మద్దతు ప్రకటించాయి. కాగా సమ్మె గురించి సమాచారం లేని పలువురు రోగులు హాస్పిటల్స్‌కు వచ్చి వెనుదిరిగారు. హాస్పిటల్స్‌కు వచ్చిన రోగుల్లో పరిస్థితి బాగాలేని వారికి నిరసన తెలుపుతున్న వైద్యులు అక్కడే వైద్యం చేశారు.

గాంధీ, ఉస్మానియాలో ఇలా..

గాంధీ, ఉస్మానియా హాస్పిటల్స్ ఓపీ బ్లాకుల వద్ద తక్కువ హడావుడి కనిపించింది. అత్యసవర, క్యాజువాలిటీ, ఇన్‌పేషెంట్ విధులకు హాజరైన వారు కూడా నల్ల బ్యాడ్జీలు ధరించి వచ్చారు. పలువురు తమ హాస్పిటల్ దగ్గర గంట సేపు నిరసన తెలిపారు. దీంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ వైద్య కాలేజీ విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఈఎస్ఐ హాస్పిటల్ ఆవరణం నుంచి అమీర్‌పేట వరకు ప్రదర్శన నిర్వహించారు. చదువుకుంటున్న చోటే వైద్యురాలిపై అఘాయిత్యం జరగడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఓపీడీ, విధులను బహిష్కరిస్తున్నట్టు వెల్లడించారు.

'యువ వైద్యురాలి లైంగికదాడి ఘటనపై వైద్యుల నిరసన'



వైద్యురాలికి ఆత్మశాంతి కలగాలని కొవ్వొత్తుల ప్రదర్శన

నవతెలంగాణ-హిమాయత్ నగర్

పశ్చిమ బెంగాల్ కలకత్తాలో యువ వైద్యురాలిని లైంగిక దాడి, హత్య సంఘటనపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం నగరంలోని ఉదయ్ ఓమ్ని ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ఈఆస్పత్రితో పాటు ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రులు మద్దతు తెలిపాయి. మృతి చెందిన వైద్యురాలికి ఆత్మశాంతి కలగాలని కొవొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఉదయ్ ఆస్పత్రి డైరెక్టర్లు డాక్టర్ రాఘవ, డాక్టర్ జయ ప్రకాష్, డాక్టర్ లత మాట్లాడుతూ రాఖీ పండుగ రోజు రాఖీలు కట్టడమే కాదు, మహిళాల కు పురుషులు రక్షణగా ఉండాలని కోరారు. న్యాయస్థానం ఇలాంటి కేసులలో త్వరితగతిన విచారించి నిందితులను కఠినంగా శిక్షించి, బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో అనేక మంది ఉన్నట్లు వారు అనుమానం వ్యక్తం చేశారు. అత్యవసర సేవలు మినహా అన్ని వైద్య సేవలు నిలిపివేసినట్లు తెలిపారు. అప్పటి వరకు తమ పోరాటాన్ని దశల వారీగా కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

'లైంగిక దాడి, హత్య కేసులో దోషిని కఠినంగా శిక్షించాలి'

సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి

గత వారం కలకత్తాలో ట్రైనీ జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య చాలా బాధాకరమని, దోషిని వెంటనే కఠినంగా శిక్షించాలని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి డిమాండ్ చేశారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో శనివారం హిమాయత్ నగర్ 'వై' జంక్షన్ వద్ద కలకత్తా జూనియర్ డాక్టర్ అత్యాచారం, హత్య నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసన కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ దేశంలో ఇలాంటి సంఘటనలు పదే పదే జరుగుతున్నాయని, ఉత్తరప్రదేశ్, బీహార్‌తో సహా మొత్తం దేశంలో మహిళల భద్రతపై నేడు ప్రశ్నలు తలెత్తుతున్నా యని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, కార్యవర్గ సభ్యులు పడాల నళిని, నెర్లకంటి శ్రీకాంత్, కంపల్లి శ్రీనివాస్, నేతలు కొంరెల్లి బాబు, సిహెచ్.జంగయ్య, చైతన్య చెట్టుకింది శ్రీనివాస్ పాల్గొన్నారు.

లైంగిక దాడి నిందితులను శిక్షించాలి

నవతెలంగాణ-అంబర్‌పేట



పశ్చిమ బెంగాల్లో ఆర్జి కార్ వైద్య కళాశాలలో జరిగిన లైంగిక దాడి ఘటన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా న్యాయవిచారణ జరపాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎం ప్లాయిస్ యూనియన్ సీఐటీయు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర ప్రధాన కార్యదర్శి నాగలక్ష్మి మాట్లాడుతూ వైద్యురాలికి సంబంధించిన అత్యాచార ఘటన కేసు విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఒక మెట్రోపాలిటన్ నగరంలో ఉన్న వైద్య కళాశాలలో ఇంత పెద్ద ఘటన జరగడం సమాజంలో మహిళలకు రక్షణ లేదు అనడానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యమే దీనికి కారణమన్నారు. ఆర్జీ కార్ కళాశాల వైద్యురాలు అత్యాచార ఘటన దోషులను తక్షణమే కఠినంగా శిక్షించాలని విచారణ వెంటనే పూర్తి చేయాలని జాప్యం జరిగినచో దేశవ్యాప్తంగా ప్రజా సంఘాల ఉద్యమం నిర్వహిస్తామన్నారు. సీఐటీయు నగర అధ్యక్షులు కుమారస్వామి మాట్లాడుతూ ఇది కేవలం ఒక అత్యాచార ఘటన మాత్రమే కాదని ఇది మరో నిర్భయ ఘటన అన్నారు. సీబీఐ వెంటనే దర్యాప్తును పూర్తి చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కిరణ్ మై అధ్యక్షత వహించగా ఏఎన్ఎంలు లక్ష్మి రాజేశ్వరి జ్యోతి షీలా విజయ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నిరసన ర్యాలీ..

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన దాడి, హత్యకు నిరసన గా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు నాంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, స్టాఫ్ నర్సు లు, వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఘటనకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

చట్టాలు నేరస్తుల చుట్టాలుగా మారిపోయాయి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

నవతెలంగాణ-ముషీరాబాద్



మనదేశంలో చట్టాలు నేరస్తుల చుట్టాలుగా మారిపో యాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. పశ్చిమబెంగాల్ ట్రైన్ డాక్టర్‌పై సామూహిక లైంగికదాడికి పాల్పడి హత్య చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నారాయణ గుడా చౌరస్తా వద్ద క్యాండిల్ ర్యాలీ చేపట్టి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు హాజరై మాట్లాడుతూ. దేశంలో అమ్మా యిలు అన్ని రంగాల్లో ముందుకెళ్తున్న క్రమంలో ఇలాంటి సంఘటనలు జరగడం బాధాకరమన్నారు. సమాజంలో మహిళలకు ఎక్కడా భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై ఏ సమయంలో ఎటువంటి దాడి జరుగుతుందో అని భయాందోళనకు వాతావరణంలో జీవించాల్సి వస్తుంద న్నారు. నిందితులను కఠినంగా శిక్షిస్తే తప్పా ఇటు వంటి చర్యలు పునరావృతం కావని తెలిపారు. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ నగర అధ్యక్ష కార్యదర్శులు లెనిన్ గువేరా, అశోక్ రెడ్డిలు మాట్లాడుతూ.. మన దేశంలో చట్టాలు నేరస్తులకు చుట్టాలుగా మారిపోయాయన్నారు. కోల్‌కతా నగరంలో మెడికల్ కాలేజీలో మౌమిత అనే అమ్మాయిపై పాశవికంగా దాడి చేసి చంపివేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చట్టాలను కఠినంగా అమలు పరచాలని కోరారు. నిందితులు చట్టాలలోని లోసుగులను ఉపయోగించుకొని దర్జాగా బయట సంచరి స్తున్నారని అటువంటి మృగాలను అనిచివేయాలంటే కఠినం గా శిక్షిస్తే తప్ప నేరాలు తగ్గవన్నారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ కన్వీనర్ రమ్య , ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ నగర ఉపాధ్యక్షులు నాగేందర్ , శ్రీమాన్ , చరణ్ శ్రీ నాయకులు విఘ్నేష్ , తేజ , స్పందన తదితరులు పాల్గొన్నారు

వర్గీకరణ ఘనత మందకృష్ణ మాదిగదే..

నవతెలంగాణ-ధూల్ పేట్



వర్గీకరణ ఘనత మందకృష్ణ మాదిగదేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వీఎస్ రాజు మాదిగ కార్వాన్ నియోజకవర్గ నాయకులు మ్యాతరి చంద్రమోహన్ మాదిగలు అన్నారు. విజయవంతంగా ఢిల్లీ నుండి హైదరాబాద్ వచ్చిన ఆయనను ఎమ్మార్పీఎస్ కార్వాన్ నియోజకవర్గ నాయకులు ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛ, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 30 ఏండ్ల ఎమ్మార్పీఎస్ సుదీర్ఘ పోరాటం చేసి సుప్రీంకోర్టు తీర్పు అనుకూలంగా ఇవ్వడంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు. రాజ్యాంగం ఏర్పడినప్పటి నుంచి ఎస్సీ మాదిగ సామాజిక వర్గంలో రిజర్వేషన్లు 58 కులాలు దోపిడి గురవుతున్న విషయన్ని గుర్తించిన మహాజననేత అన్నారు. 1994లో ఎంఆర్పిఎస్ దండోరా ఉద్యమాన్ని ప్రారంభించి బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఉద్యమ పోరాటం చేశారని గుర్తుచేశారు. ఆ సుదీర్ఘ పోరాట ఫలితమే ఆగస్ట్ 1న సుప్రీంకోర్టు 58 కులాలకి న్యాయపరమైనటువంటి వర్గీకరణ తీర్పుని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గోపి రామస్వామి మాదిగ, శ్రీనివాస్ మాదిగ, సందీప్ పాగ కుమార్ మాదిగ, ఎద్దుల శ్యామ్ మాదిగ పాల్గొన్నారు.

'మహిళా వైద్యురాలిని హతమార్చిన ఘటన సిగ్గుచేటు'

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కలకత్తాలోని ఆర్.జీ.కర్ మెడికల్ కాలేజీలో మహిళా వైద్యురాలిని కిరాతకంగా అత్యాచారం చేసి, హతమార్చిన నేరగాళ్లను కఠినంగా శిక్షించాలని తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మోతుకూరి రాంచందర్ శనివారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా వైద్యురాలిని డ్యూటీలో ఉండగానే కిరాతకంగా హతమార్చిన ఘటన మానవ సమాజానికి సిగ్గుచేటన్నారు. ఇంతటి ఘోరమైన నేరానికి పాల్పడిన నేరగాళ్లను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంఘటన ఆగస్టు 9వ తేదీన, ఆర్.జి.కర్ మెడికల్ కాలేజీ, కలకత్తాలోని ఛాతీ వైద్య విభాగం, సెమినార్ రూమ్ లో జరిగిందని గుర్తు చేశారు. పని ప్రదేశాల్లో పటిష్టమైన భద్రత లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. ఆమె కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ప్రజల గొంతులు వినిపించాలని కోరారు. మహిళా డాక్టర్ పోస్ట్ మార్టం, మహిళా సర్జన్లు, ఇతర సంబంధిత అధికార బృందాల సమక్షంలో అవసరమైన అన్ని పరీక్షలు, విధానాలు, సాక్ష్యాలతో న్యాయ బృందం సరైన ప్రోటోకాల్ అనుసరించి కేసు వీలైనంత త్వరగా పరిష్కరించబడాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ సహకారంతో ఆసుపత్రి యాజమాన్యం అధికారికంగా అన్ని చట్టాలను పూర్తి చేసి మహిళా వైద్యురాలికి న్యాయం చేసి ఆమె కుటుంబానికి పరిహారం అందించాలని, ప్రాణాలు కాపాడే డాక్టర్లకే భద్రత లేకపోతే మిగిలిన వారి పరిస్థితి ప్రశ్నార్థకమని, ఇది మొత్తం మహిళల భద్రతకు సంబంధించిందని, ఈ విషయంలో అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకుని మహిళాలకు భద్రత కల్పించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సైకాలజిస్టులు వెంపటి రాజు, సుధాకర్, డా.శ్రీపూజ, లక్ష్మీ సౌజన్య, హిమబిందు, కృష్ణ సాహితి పాల్గొన్నారు.

అనుమానంతో భార్యపై హత్యాయత్నం

నవతెలంగాణ-మెహిదీపట్నం



అనుమానంతో భర్త భార్యను హత్య చేసేందుకు ప్రయత్నించిన సంఘటన ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆసిఫ్ నగర్ సీఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం ఆటో డ్రైవర్‌గా పని చేసే వసంత్ (43) అతని భార్య జ్యోతి (28) ఆసిఫ్ నగర్ లోని హుడా కాలనీలో నివాసం ఉంటున్నారు. వసంత్ గత కొంత కాలంగా తన భార్యపై అనుమానం పెంచుకున్నాడు. శనివారం తెల్లవారుజామున ఒంటిగంట ప్రాంతంలో ఇంటిలో భార్యతో గొడవ పడి ఆమెను కత్తితో పొడిచాడు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. సమాచా రం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని వసంత్‌ను అదుపు లోకి తీసుకున్నారు. అతని భార్య జ్యోతిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిం చారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు పోలీసులు తెలి పారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - జవహర్ నగర్

తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సెంట్రల్ యూనియన్ ఆధ్వర్యంలో జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ప్రభాకర్, డీఈ మాధవచారి, మేనేజర్ నగేష్ బాబు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కృష్ణాప్ప, కృష్ణారెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు కమిషనర్‌ను శాలువాతో సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-కాప్రా

కాప్రాలోని ప్రభుత్వ పాఠశాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం కస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్ట్రర్‌ను పరిశీలించారు. పాఠశాలకు హాజరు కానీ టీచర్స్ మీద చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన ఫుడ్‌ను పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాలలో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బైరీ నవీన్ గౌడ్, హెచ్ఎం శ్రీనివాస్, బాపు రాజగోపాలం, బాబీయా నాయక్, శ్రీనివాస్ చారి, నాయకులు ఇంద్రయ్య, మైసయ్య, భాస్కర్ గౌడ్, మచ్చ శ్రీకాంత్ గౌడ్, కుమార్, సాయి రాము, వడ్లకొండ కృష్ణ గౌడ్, సరోజ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వినతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని మౌలాలి డివిజన్ ఎంజే కాలనీ పార్కు స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కాలనీ సభ్యులు శనివారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా కాలనీలోని పలు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మౌలాలి డివిజన్ నాయకులు భాగ్యాందరావు, కాలనీ అధ్యక్షులు బైద్యానాథ్ సింగ్, కాలనీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



- బీఆర్ఎస్ శామీర్ పేట మండలాధ్యక్షుడు సరసం మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌డెస్క్

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసి ప్రజలకు అండగా నిలుస్తానని బీఆర్ఎస్ శామీర్‌పేట మండల నూతన అధ్యక్షుడు సరసం మోహన్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ శామీర్ పేట మండల నూతన అధ్యక్షుడిగా మజీద్‌పూర్ మాజీ సర్పంచ్ సరసం మోహన్ రెడ్డిని శనివారం మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి నియమించి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పార్టీ మండల అధ్యక్షుడిగా నియమించిన మల్లారెడ్డికి, సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చెర్మెన్ డాక్టర్ రామిడి మధుకర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ నర్సింహా రెడ్డి, నాయకులు వంగ వెంకట్ రెడ్డి, భాస్కర్, కుమార్, సొసైటీ వైస్ చైర్మెన్ ఐలయ్య యాదవ్, భూమి రెడ్డి, చాంద్ పాషా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి సన్నిధిలో మైనంపల్లి



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఆనంద్ బాగ్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణంలో మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రవీందర్ రెడ్డి, క్లర్క్ సుధాకర్, ప్రధాన అర్చకులు ముదుంబై వెంకటరమణాచార్యులు, ఆలయ మాజీ చైర్మెన్ రాందాస్ సంతోష్ ముదిరాజ్, కన్నా, రత్నాకర్, జీఎస్‌వీ. సతీష్ కుమార్, హరిబాబు, తదితరులున్నారు.

జవహర్ నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



- మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్
- మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

నవతెలంగాణ - జవహర్ నగర్

జవహర్ నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మేయర్ దొంతగాని శాంతి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జవహర్ నగర్ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను చర్చించి, నిధులను కేటాయించారు. మున్సిపల్ సాధారణ నిధుల నుండి నగర పాలక సంస్థ పరిధిలో కొన్ని డివిజన్లలో సీసీరోడ్లు, డ్రయినేజీ నిర్మాణానికి రూ.90 లక్షలు, చిన్న చిన్న ప్యాచ్ వర్క్‌లు చేయుటకు ప్రతి డివిజన్‌కు రూ. 2 లక్షల చొప్పున 28 డివిజన్లకు రూ.56 లక్షలు కేటాయించారు. అదే విధంగా నగర పాలక సంస్థ పరిధిలో చేసే అభివృద్ధి పనుల నాణ్యతను నిర్ధారించడానికి ఏజెన్సీని నియమించాలని నిర్ణయించారు. 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో శానిటేషన్ అవసరమయ్యే బ్లీచింగ్, లైమ్ పౌడర్, సిబ్బందికి వర్షాల దృష్ట్యా రెయిన్ కోట్స్ కొనుగోలుకు రూ.7 లక్షలు, జవహర్ నగర్ పరిధిలో ఓపెన్ లే ఔట్స్‌లో మొక్కలు నాటుటకు రూ.10 లక్షసలు ఖర్చు చేయాలని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి ప్రత్యేక నిధులు తీసుకోవచ్చి అభివృద్ధి పనులు కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి, డిప్యూటి మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, డీఈ మాధవచారి, మేనేజర్ నగేష్ బాబు, రెవెన్యూ అధికారి ప్రభాకర్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, వాటర్ డిపార్ట్మెంట్ అధికారులు, ఎలక్ట్రిసిటీ ఏఈ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నాలాలో పూడికతీత పనులు పరిశీలన



- కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్

నవతెలంగాణ-నేరేడ్ మెట్

దీన దయాల్ నగర్‌లోని సంతోషిమాత గుడి వెనకాల ఉన్న నాలాను మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ పరిశీలించారు. రూ.6 లక్షల వ్యయంతో చేపట్టిన గుడి కింద ఉన్న పూడిక తీత పనులను స్థానిక నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గుడి వెనకాల పూడిక తీయాలని స్థానిక కాలనీవాసుల కార్పొరేటర్‌ను కోరారు. దీంతో ప్రజల కోరిక మేరకు పనులు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పనులు మొక్కుబడిగా చేయొద్దని, నాలా కింద పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తీస్తేనే కాలనీ వాసులకు ఉపశమనం కలుగుతుందని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రావణ్, వాసుదేవరావు, బీజేపీ మల్కాజిగిరి నాయకులు గున్నాల చంద్రశేఖర్ యాదవ్, జనరల్ సెక్రెటరీ వెంకటేష్ నేత, తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడికి పాల్పడిన నిందితులను శిక్షించాలి



- అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి బి. శోభారాణి
- ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి రేవతి కల్యాణి

నవతెలంగాణ-సిటీబ్యూరో, నేరేడ్‌మెట్

కలకత్తాలోని ఆర్జీగార్ ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్న మహిళా జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడి చేసి హత్య చేసిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి శోభారాణి, తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కల్యాణిలు డిమాండ్ చేశారు. కలకత్తాలో డాక్టర్‌పై లైంగికదాడి, హత్య ఘటనను నిరసిస్తూ 24 గంటల పాటు ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఓపీ వైద్యసేవలు నిలిపి వేయాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు మేరకు అంగన్వాడీ యూనియన్ నాయకులు, ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలుపుతున్నామని పేర్కొన్నారు. ట్రైనీ వైద్యురాలి హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని వాపోయారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్‌డీఏ సంఘం ఆధ్వర్యంలో..



కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో వైద్యురాలిపై జరిగిన లైంగికదాడి, హత్యపై సికింద్రాబాద్ దంతవైద్యుల సంఘం(ఎస్‌డీఏ) ఆధ్వర్యంలో శనివారం నిరసన చేశారు. 150 మంది సికింద్రాబాద్‌లోని క్లాక్ టవర్ అమర్ వీరుల స్థూపం వరకు ర్యాలీ వెళ్లి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డీఏ కమిటీ సభ్యులు సుభాష్ గట్టు, డాక్టర్ అబేద్ అలీ,డాక్టర్ పవన్ మహాత్మ డాక్టర్ దినేష్ నమిలె, డాక్టర్ నూతన్ పోతులు, డాక్టర్ ప్రేమ్ కుంజు, డాక్టర్ చైతన్య, డాక్టర్ అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్కేసర్‌లో..



కోల్‌కత్తాలో వైద్యార్థినిపై జరిగిన ఘటనకు నిరసనగా నీలిమా హాస్పిటల్‌లో శనివారం అవుట్ పేషెంట్ సేవలు నిలిపివేశారు. హాస్పిటల్ సీఈవో నీలిమ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ చెన్నకేశవ మల్లేష్, వైద్యులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

శామీర్‌పేటలో..



వైద్యులకు, మహిళలకు భద్రత కల్పించాలని మూడుచింతలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ దమయంతి ప్రభుత్వాలను కోరారు. కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన ఘటనకు నిరసనగా మూడుచింతలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యులు, నర్సులు, ఆశాలు ధర్నా నిర్వహించారు. అలియాబాద్ పల్లె దవాఖాన వద్ద వైద్యులు, నర్సులు, ఏ ఎన్ ఎంలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ... ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డా సంగీత , డా మేరీ హెలీనా, డాక్టర్ సృజన, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కాప్రాలో..



కోల్‌కత్తాలో పీజీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య సంఘటనను నిరసిస్తూ కాప్రా, శ్రీరాంనగర్ కాలనీలోని అశోక రిహాబిలేషన్ , చిల్డ్రన్స్ డెవలప్మెంట్ సెంటర్ ఆస్పత్రి డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో శనివారం కాప్రా, నేతాజీ నగర్, సైనిక్‌పురి, నేరేడ్‌మెట్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ డాక్టర్ పై హత్యాచారం, హత్య కేసులో ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను కఠినంగా శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో డాక్టర్ నవిత, డాక్టర్ కిరణ్, డాక్టర్ సచిన్‌తో పలువురు డాక్టర్లు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరసనలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి



కోల్‌కత్తాలో వైద్య విద్యార్థిని అత్యాచార హత్య ఘటనపై ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నిందితులపై కఠిన చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. జూడాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో పాల్గొన్నారు.



మల్లాపూర్ సాయి గార్డెన్స్‌లో నిర్వహించిన ఓ వివాహ వేడుకకు ఐటీ ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి, నాచారం ,మల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. -నవతెలంగాణ,కాప్రా

అంగన్వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి



- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

ప్రజలు అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం



చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వాగారం, రాంపల్లిలో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలను మున్సిపల్ చైర్మెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణీలు, చిన్నారులకు పౌష్టికాహారం తీసుకునేందుకు అంగన్వాడీ కేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బండారి మల్లేష్ యాదవ్, కమిషనర్ రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు చింతల సరిత రమేష్, ఎలిజల నాగేష్ గౌడ్, గోక కళావతి యాదగిరి, బాదనాపురం లక్ష్మీ వేణు, కో ఆప్షన్ సభ్యులు క్యాసరం అశోక్ గౌడ్, షఫిక్, డీఈఈ సుదర్శనం రఘు, ఏఈ నరేశ్ కుమార్, మేనేజర్ చంద్ర శేఖర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, అంగన్వాడీ టీచర్స్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

మంజీరా వాటర్ సమస్యను పరిష్కరించాలి



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి పరిధిలోని గౌతమ్ నగర్ డివిజన్ ఐఎన్ నగర్ హిల్‌టాప్ కాలనీలో నాలుగు రోజులుగా మంజీర వాటర్ రావడం లేదని, వాటర్ సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు 141వ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే స్పదించి మారెడ్ పల్లిలోని వాటర్ హెడ్ ఆఫీస్‌లో డీజీఎం విద్యాసాగర్ యాదవ్‌ను శనివారం కలిసి సమస్యను వివరించారు. సానుకూలంగా స్పందించిన డీజీఎం నీటి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాము యాదవ్, కాలనీ వాసులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

ఇటుక బట్టీ వ్యాపారుల వద్ద డబ్బులు వసూలు

- వ్యక్తి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ- మేడ్చల్

ఇటుక బట్టి వ్యాపారుల వద్ద డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెలిసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మండల పరిధిలోని సైదోనిగడ్డ తండాకు చెందిన నునావత్ కిషన్ నాయక్, అదే గ్రామానికి చెందిన మరి కొంతమంది వ్యవసాయం చేసుకుంటూ ఇటుక బట్టిల వ్యాపారం చేస్తున్నారు. కాగా అదే గ్రామానికి చెందిన అగోత్ ధనరాజ్ నాయక్ అనే వ్యక్తి తాను విజిలెన్స్ మ్యానిటరింగ్ కమిటీ సభ్యుడినని, ప్రభుత్వ అధికారులకు మామూళ్లు ఇవ్వాలని లేకపోతే వ్యాపారం నడవనివ్వబోమని బెదిరించాడు. వారి నుండి మొదటి విడుతగా రూ.2 లక్షలు ఫిబ్రవరి 24వ తేదీన తీసుకున్నాడు. మళ్లీ జులై 31 తేదీన ఫోన్ చేసి తనకు డబ్బులు ఇవ్వాలని లేకపోతే కేసులు పెట్టించి ఇబ్బందులు పెడతానని బెదిరించడంతో రూ.2లక్షల 90వేల నగదు ఇచ్చామని, మిగతా రూ.10వేలు గూగుల్ పే చేశామని బాధితులు తెలిపారు. అక్రమ వసూళ్లకు పాల్పడ్డ ధనరాజ్ నాయక్ పై 318,319,308 సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థులకు టై, బెల్టు, షూస్ పంపిణీ



నవతెలంగాణ-బోడుప్పల్

ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారందరూ నిరుపేదలే.. పిల్లలను బడికి పంపించడం కూడా తల్లిదండ్రులకు భారమే.. తల్లిదండ్రులు భారంగా భావించకుండా ఉండటానికి పిల్లలకు ప్రభుత్వం భోజనం, దుస్తులు, పుస్తకాలతో పాటు అనేక వసతులు కూడా కల్పిస్తోంది. పేద, మధ్యతరగతి విద్యార్థులకు అండగా నిలవాలనే సంకల్పంతో తమవంతు సాయంగా రాపోలు వెంకటేశ్వర్లు, రాపోలు సుదర్శన్, స్వాతి పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక, పాఠశాల, ఉర్దూ పాఠశాలలోని 750 మందికి విద్యార్థులకు రూ.3 లక్షలతో కొనుగోలు చేసిన షూస్, బెల్ట్, టైలను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ కొల్తూరి మహేష్‌లు పంపిణీ చేశారు. అనంతరం జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసిందన్నారు. ఆంగ్లంలో విద్యాబోధన, అదనపు తరగతి గదుల నిర్మాణం, నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, నోటు పుస్తకాల పంపిణీ, కంప్యూట ర్, డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటుతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి ప్రపంచంతో పోటీ పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. పాఠశాలలో అవసమైతే విద్యావా లంటీర్లను ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ కొల్తూరి మహేష్ మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో చదివేది పేద విద్యార్థులే అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే స్వచ్ఛంద సంస్థలు సర్కారు బడుల్లో చదువుతున్న పేద విద్యార్థులపై దృష్టి సారించాలన్నారు. సర్కారు బడిలో విద్యను ప్రోత్సహించడానికి షూస్, బెల్ట్, టై పంపిణీ చేసిన దాతలు రాపోలు వెంకటేశ్వర్లు, రాపోలు సుదర్శన్, స్వాతిలకు అభినందనలు తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లేతాకుల రఘుపతిరెడ్డి, జావీద్ ఖాన్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, మైనారిటీ అధ్యక్షులు జిలాని పాషా, శంకర్ రావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులుగా యశ్వంత్ యాదవ్





నవతెలంగాణ-సిటీబ్యూరో

అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులుగా గొర్ల యశ్వంత్ రాజ్ యాదవ్ నియామకం అయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బద్దుల బాబురావు యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్ సమక్షంలో నియామకపత్రం అందుకున్న యశ్వంత్ మాట్లాడుతూ.. తనకు ఈ పదవి కట్టబెట్టడం సంతోషంగా ఉందన్నారు. యాదవు ల్లో ఐక్యత, చైతన్యం తీసుకురావడానికి, యాదవుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామా ల్లో నిరక్షరాస్యతను నిర్మూలించే విధంగా తగు ప్రణాళికను సిద్ధం చేస్తామని తెలిపారు. సాంస్కృ తిక కార్యక్రమం, యాదవ్ ఐక్యతకు చిహ్నమైన సదర్ ఉత్సవాన్ని ప్రతి ఏటా అన్ని మండల, జిల్లాల సెంటర్లలో ఘనంగా నిర్వహించేలా చూస్తానని పేర్కొన్నారు. నిరుద్యోగులకు జాబ్ మేళా, స్కిల్ డెవలప్మెంట్ శిక్షణా తరగతులు జిల్లాల వారీగా నిర్వహించే ప్రయత్నం చేస్తానన్నారు. త్వరలో రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, జిల్లా యాదవ మహాసభ నాయకులను సంప్రదించి కమిటీలను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జాతీ య అధ్యక్షులు డాక్టర్ శ్వపన్ ఘోష్, జాతీయ కార్య నిర్వహక అధ్యక్షులు డాక్టర్ శ్యామ్ సింగ్ యాదవ్, ఉపాధ్యక్షులు, శతాబ్ది ఉత్సవ సమితి చైర్మెన్ సత్య ప్రకాష్‌సింగ్ యాదవ్, ఉపాధ్యక్షులు సొంప్రకాష్ యాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు బద్దుల బాబురావు యాదవ్‌తో పాటు తనకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా యశ్వంత్ యాదవ్ చిన్నతనం నుంచే యాదవ సంఘం కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవారు. 2011లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన కార్యదర్శిగా, ఆ తర్వాత రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శిగా, అనంతరం జాతీయ యువజన కో-ఆర్డినేటర్‌గా పని చేశారు.

వైభవంగా శ్రీ వీరభద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ-హైదరాబాద్‌డెస్క్

శామీర్ పేట మండల కేంద్రంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శ్రీవీరభద్రస్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు.శ్రీ భవాని రామలింగేశ్వరస్వామి(శివాలయం) ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో 18 మంది వేద బ్రాహ్మణుల మంత్రోశ్చరణల మధ్య ప్రత్యేక పూజలతో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కాగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, డీసీసీ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, బీజేపీ విక్రమ్ రెడ్డిలు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. జడల రమేష్ బృందం భక్తి గీతాలు ఆలపించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
ఆదివారం | ఆగస్టు 18, 2024 | www.navatelangana.com

పట్నం మహేందర్ రెడ్డిని కలిసిన శేరి సతీష్ రెడ్డి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

మేడ్చల్ మల్కాజిగిరి ఇన్‌చార్జి పట్నం మహేందర్ రెడ్డిని శనివారం వారి నివాసంలో కూకట్‌పల్లి నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి కలిశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లిలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఇకపై అధికారిక కార్యక్రమాలు ఏమి జరిగినా ఇన్‌చార్జి మంత్రి మహేందర్ రెడ్డి, కేపీహెచ్‌బీ ఇన్‌చార్జి బండి రమేష్, పాల్గొంటారని మహేందర్ రెడ్డి తెలిపారు.



టీజేఎస్ అధినేత, ప్రొఫెసర్ ఆచార్య కోదండరామ్ ఇంటివద్ద హార్డ్ వేర్ పార్క్ బాధిత రైతులు ప్లాట్ల యజమానులు అందరు కలిసి కోదండరావమ్‌కు, రామేశ్వర్ రావు, దార సత్యం ఆధ్వర్యంలో... శనివారం కలసి పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హార్డ్ వేర్ పార్క్ బాధిత రైతులు ప్లాట్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-బడంగ్ పేట్

కే.ఎం పాండు 79వ జయంతి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

చింతల్ ప్రధాన రహదారిలోని స్వర్గీయ మహానేత, బాపు "కె.ఎం.పాండు" విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన కె.ఎం.పాండు 79వ జయంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ పాల్గొన్నారు. వారి నాన్నగారైన కె.ఎం.పాండు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, మహానేత సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మహానేత కె.ఎం.పాండుని స్మరిస్తూ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ మట్లాడుతూ... ఇందిరా గాంధీ ప్రభుత్వంలో నాడు కుత్బుల్లాపూర్ మున్సిపల్ చైర్మెన్‌గా ఉన్న పాండు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆసియా ఖండంలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడ అయిన "జీడిమెట్ల పారిశ్రామిక వాడను ఏర్పాటుచేయించి అభివృద్ధి చేసిన ఘనత పాండుకి దక్కుతుందన్నారు. భవిష్యత్తు తరాలు బాగుండాలంటే అందరికీ విద్యా అందించాలని, నిరుపేదల విద్య కోసం అనునిత్యం తపించిన నాయకులు కె.ఎం.పాండు అని అన్నారు. వారి ఆశయ సాధనలో భాగంగానే ఒకేషనల్ కాలేజీ ఏర్పాటు చేశారు. త్వరలోనే డిగ్రీ కళాశాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. నేడు కుత్బుల్లాపూర్‌లోని ఎంతోమంది నాయకులు కుత్బుల్లాపూర్ పాఠశాలలోనే విద్యనభ్యసించారన్నారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం మా నాన్నగారి జయంతి సందర్భంగా నిరుపేద మహిళలకు ఉపాధి కల్పనలో భాగంగా కె.ఎం.పాండు మెమోరియల్ ట్రస్ట్ ద్వారా కుట్టు మిషన్లను పంపిణీ చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, వివిధ పార్టీల నాయకులు, కె.ఎం.పాండు అభిమానులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "కె.ఎం.పాండు" జయంతి వేడుకలు..

జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ వద్ద గల దివంగత నేత కె.ఎం.పాండు 79వ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ కేఎం పాండు చేసిన సేవలను కొనియాడారు. రాజకీయాలకతీతంగా అందరి అభివృద్ధిని, శ్రేయస్సును ఆకాంక్షించిన నేత కె.ఎం.పాండు అని అన్నారు. వారి ఆధ్వర్యంలో అనేకమంది ప్రజలకు సేవ చేయడాన్ని తెలుసుకొని అనేక పదవులలో తమదైన ముద్రను వేసుకున్నారన్నారు. విద్య ద్వారానే పేదరికాన్ని పోగొట్టవచ్చని నమ్మిన నేత కె.ఎం.పాండు అడుగుజాడల్లో నడుస్తూ ప్రజల కోసం పనిచేసిన నాకు ఎన్నికలలో హ్యాట్రిక్ రికార్డును అందించిన కుత్బుల్లాపూర్ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. అనంతరం ఎమ్మెల్యే సీనియర్ సిటిజన్స్‌తో కాసేపు క్యారం బోర్డ్ ఆడుతూ సందడి చేశారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బలవంత్ రెడ్డి, ఠాగూర్ రాజేంద్ర సింగ్, సామల నర్సింహా రెడ్డి, పెద్ది మల్లేశం, మురళి గౌడ్, నరహరిగౌడ్ అభిమానులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నేత కెఎం పాండు..

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ ప్రజల,కార్మికుల,కర్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహానేత మాజీ మున్సిపల్ చైర్మెన్ కీర్తిశేషులు కేయం.పాండు అని సేవలు మరువలేనివని ఐ.ఎన్.టి.యు.సి.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ అన్నారు. శనివారం కేఎం.పాండు జయంతి పురస్కరించుకొని ఐఎన్‌టీయూసీ కార్మిక బృందంతో కలిసి చింతల్ ప్రధాన రహదారిలోని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అరణ్యముగా ఉండే ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తూ లక్షలాది మందికి ఇండ్ల స్థలాలు, ఉపాధి, కనీస సౌకర్యాలు కల్పించిన పేద సామాన్య ప్రజల నాయకుడు కేఎం.పాండు సేవలు గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయ సాధన కోసం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన చరిత్ర వారి సేవలు యువతరానికి తెలిసే విధంగా ప్రచురించాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ను కోరారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎన్.టి.యు.సి.జాతీయ కార్యదర్శి అమర్ బాబు, కుత్బుల్లాపూర్ అధ్యక్షులు ఏం.జనార్దన్, నాయకులు జాన్, ఎల్లన్న, పాల్గొన్నారు.



స్కూళ్లకు స్కావెంజర్లు..!

- పారిశుధ్య సమస్యకు పరిష్కారం
- అడ్వాన్స్‌గా 3 నెలల గ్రాంటు విడుదల
- అమ్మ ఆదర్శ కమిటీలకు నిర్వహణ బాధ్యతలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లు లేకపోవడంతో చాలా చోట్ల స్కూళ్ల పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. దీంతో స్పందించిన ప్రభుత్వం పాఠశాలల పరిస్థితిని మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టింది. టాయ్ లెట్లను శుభ్రం చేయడంతో పాటు మొక్కలకు నీళ్లు పట్టడం, పరిసరాలను శుభ్రం చేయడానికి స్థానికులను నియమించుకోవాలని సూచించింది. నియామకం బాధ్యతలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అప్పగించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు విడుదల కానున్నాయి. అయితే సమగ్ర శిక్ష కింద అందుతున్న గ్రాంటుకు ఇది అదనం.

తీరనున్న సమస్యలు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 505 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 375 ప్రాథమిక పాఠశాలలు, 22 ప్రాథమికోన్నత పాఠశాలలు, 108 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం దాదాపు లక్ష మంది విద్యార్థుల వరకు విద్యనభ్యసిస్తున్నారు. ఈ స్కూళ్లలో 2021 సెప్టెంబర్ వరకు స్కావెంజర్లు ఉండేవారు. ఆ తర్వాత వారిని తొలగించి పారిశుధ్య బాధ్యతలను పంచాయతీ కార్మికులకు అప్పగించారు. కానీ వారికి పని భారం, వేతనాలు సకాలంలో రాకపోవడంతో పాఠశాలలకు రావడం మానేశారు. దీంతో బడిని ఊడ్చేవారు కరువయ్యారు. కొన్ని చోట్ల ఉపాధ్యాయులే సొంత డబ్బులతో స్కావెంజర్లను నియమించుకున్నారు. మరికొన్ని చోట్ల విద్యార్థులే ఊడ్చేవారు. ఇటీవల పాఠశాల పరిశుభ్రత అంశం మరోసారి తెరపైకి రావడంతో సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది.

పది నెలల పాటు నిధులు..

పాఠశాలల్లో పారిశుధ్య పరిరక్షణకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ 21 విడుదల చేసింది. జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ నుంచి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు మంజూరు చేయనుంది. 1 నుంచి 30 వరకు విద్యార్థులుంటే రూ.3వేలు, 31 నుంచి 100 వరకు విద్యార్థులుంటే రూ.6వేలు, 101 నుంచి 250 వరకు విద్యార్థులుంటే రూ.8వేలు, 251 నుంచి 500 వరకు విద్యార్థులుంటే రూ.10వేలు, 251 నుంచి 500 వరకు విద్యార్థులుంటే రూ.12 వేలు, 501 నుంచి 750 వరకు విద్యార్థులుంటే రూ.15వేలు, 750 పైన విద్యార్థులుంటే రూ.20 వేలు మంజూరు చేయనున్నారు. ఈ నిధులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ప్రతి మూడు నెలలకోసారి నిధులు విడుదల అవుతాయి. కమిటీ, ప్రధానోపాధ్యాయుల భాగస్వామ్యంతో స్కావెంజర్లను నియమించుకోవచ్చు. అయితే స్కావెంజర్ కమిటీలు ఎలాంటి అగ్రిమెంట్ చేసుకోవద్దు. వీరు నిర్వహించాల్సిన విధులు ముందుగానే తెలియజేయాలి. సంతప్తికరంగా విధులు నిర్వహించలేనప్పుడు వారిని తొలగించి కొత్త వారిని నియమించుకోవచ్చు.

ఇక పరిశుభ్రమైన వాతావరణం..

ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలలు పరిశుభ్రం కానున్నాయి. స్కావెంజర్ల నియామకానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపడంతో పాటు పారిశుధ్యానికి 'స్కూల్ ఫెసిలిటీ మెయింటెనెన్స్ నిధులు' మంజూరు చేయనుంది. వీటితో తాత్కాలిక స్కావెంజర్లను నియమించు కోవడం, మొక్కలకు నీరు పోయడం, పాఠశాల పరిసరాలను శుభ్రం చేయడం.. తదితర పనులు చేపట్టనున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు నిర్వహణ బాధ్యతలను అప్పగించనున్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలదే కావడంతో సమగ్ర శిక్ష కింద అందిస్తున్న కాంపోజిట్ స్కూల్ గ్రాంట్‌కు అదనంగా ఈ గ్రాంట్ అందిస్తున్నారు. పాఠశాలలో పరిశుభ్రమైన వాతావరణం అందించడంతోపాటు మరుగుదొడ్లు శుభ్రపర్చడం, మొక్కలకు నీరు పోయడం వంటి వాటికి ఈ నిధులను వినియోగించుకోవాలి. క్లీనింగ్, స్వీపింగ్ మొదలైన వాటికి అవసరమైన మెటీరియల్ ఖర్చు కోసం సమగ్ర శిక్ష కింద పాఠశాలలకు విడుదల చేసిన కాంపోజిట్ స్కూల్ గ్రాంట్‌ను వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది.

'కోల్‌కతా ఘటన సమాజాన్ని తలదించుకునేల చేశాయి'



- అబస్టిక్ అండ్ గైనిక్ హెచ్ఓడి

డాక్టర్ ఛాయా దేవి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కొల్‌కత్తా మెడికల్ కళాశాల ఆస్పత్రిలో పీజీ వైద్యురాలిపై పాశవికంగా జరిగిన లైంగికదాడి, హత్య ఈ సమాజాన్ని తల దించుకునేల చేశాయని అబస్టిక్ అండ్ గైనిక్ హెచ్ఓడి డాక్టర్ ఛాయా దేవి అన్నారు. సమాజానికి ఎంతో సేవ చేస్తూ.. అహర్నిశలు శ్రమిస్తున్న వాళ్లపై ఇంత కర్కశంగా దాడి చేసిన కిరాతకులకు ఖచ్చితంగా కఠిన శిక్ష పడాలని ఆమె తెలిపారు. దీనికి నిరసనగా శుక్రవారం ఉదయం 9.30 నిమిషాలకు రాందేవ్ రావ్ హాస్పిటల్ యాజమాన్యం భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ చాయ దేవితో పాటు జనరల్ ఫీజీసియన్ డాక్టర్.శ్యామల, హాస్పటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ కమలాకర్, హాస్పిటల్ సీఈఓ డాక్టర్.యోబు, క్యాండిల్స్ వెలిగించి సంతాపం తెలిపారు. కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్ 1లోని గాంధీ విగ్రహం వరకు అందరూ కలిసి ర్యాలీగా నిర్వహించారు. అనంతరం డాక్టర్ శ్యామల మాట్లాడుతూ "యత్ర నార్యంతు పూజ్యంతే రమంతే తత్ర దేవతా" అని ఆడవాళ్ళని దేవతల్లా పూజించే ఈ దేశంలో ఈ రోజున ఇలాంటి అసాంఘిక ఘటనలు జరగటం అనేది చాలా విషాదకరం అని పేర్కొన్నారు. రోగులకు సేవ చేస్తున్న ఒక డాక్టర్‌నీ ఈ విధంగా అత్యాచారం చేసి చంపటం అనేది ప్రతి భారతీయుడిని కలిచివేస్తున్న విషయం అని ఆమె తెలిపారు. జనరల్ అండ్ లాప్రోస్కోపీ సర్జన్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ఉమెన్ ఎంప్లాయిస్‌కి సేఫ్టీ అనేది చాలా ముఖ్యమన్నారు. ఎన్ని కఠినమైన 'దిశ' చట్టాలు వచ్చినా ఈ రోజుకి ఆడపిల్లలను ఇంత కిరాతకంగా హింసించి అత్యాచారాలు చేసి, హత్యలు చేస్తుంటే ఆకాశాన్ని తాకుతున్న "ఆ ప్రతి భారత మాత" ఆక్రందన తీర్చేదెవరు అని వాపోయారు. "నర్సింగ్ ఇస్ ఎ నోబెల్ ప్రొఫెషన్" అలాంటి నర్సు వృతి లో ఉన్న ఒక నర్సింగ్ ఆఫీసర్ పై ఉత్తరాఖండ్‌లో జరిగిన అత్యాచారం, హత్య.. షాద్ నగర్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విధులలో ఉన్న నర్సింగ్ ఆఫీసర్ పై జరిగిన దాడి అని పేర్కొన్నారు. నిందితుడు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోవటానికి వీలు లేదని, స్టేట్ గవర్నమెంట్ సెంట్రల్ గవర్నమెంట్ దీనిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. హాస్పిటల్ సీఈఓ డాక్టర్ యోబు మాట్లాడుతూ డ్యూటీలో ఉన్న ఒక డాక్టరు పై కానీ, నర్స్ పై కానీ, ఇలాంటి అసాంఘిక ఘటనలు పునరవృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. నర్సింగ్ సూపరిండెంట్ మేరి డేవిడ్ కూడా ఈ ఘటనపై చాలా తీవ్రంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కన్సల్టెంట్ డాక్టర్స్ శ్యామల , శ్రీనివాసులు, సుధా రాణి, రాజీవ్, లోకేష్ రెడ్డి, ఐశ్వర్య, జర్నలిస్టు మిత్రులకు ర్యాలీకి సహకరించినందుకు రాందేవ్ రావ్ హాస్పిటల్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన పుష్పాల భాస్కర్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సూరారం 129 డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుష్పాల భాస్కర్ పుట్టినరోజు సందర్భంగా శనివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో.. బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాక అధ్యక్షులు కేటీఆర్‌ని కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్, పుష్పాల భాస్కర్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 126 డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్ , 130 డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, ముకుంద రావు, తాటి రవి కుమార్, కిరణ్ కుమార్, ప్రసాద్ జై కృష్ణ తదితరులు పాల్గొన్నారు. పుట్టినరోజులో భాగంగా శంభీపూర్‌లోని కార్యాలయంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కలిశారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, పోలే శ్రీకాంత్, రుద్ర అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద విద్యా మందిర్ హైస్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 130 డివిజన్ సుభాష్ నగర్‌లోని వివేకానంద విద్యానగర్ హై స్కూల్‌లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఆనందోత్సాహాలతో ఒకరినొకరు రాఖీలు కట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మండవ.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు రాఖీ పౌర్ణమి పండుగ విశేషత గురించి తెలియజేశారు. రక్షాబంధన్ ఓ పవిత్రమైన పండుగా.. మన దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతి రూపం అని పేర్కొన్నారు. ఈ పండుగ విద్యార్థుల జీవితాలలో అన్నాచెల్లెళ్ల అనుబంధాలు, ఆప్యాయతలు, సమరస్య భావాలు పెంపొందుతాయన్నారు. విద్యార్థులకు ముందస్తు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసి, నువ్వు నాకు రక్ష -నేను నీకు రక్ష మనిద్దరం దేశానికి రక్ష అనే నినాదంతో ఈ పండుగ జరుపుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఎం. సునీత, వైస్ ప్రిన్సిపాల్ లత, ఫ్లోర్ ఇన్‌చార్జి పల్లవి, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థిని విద్యార్థులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను తల్లిదండ్రులు క్రీడల్లో ప్రోత్సహించాలి



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలి అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆగస్టు 11వ తేదీన ఒడిశా భువనేశ్వర్‌లో జరిగిన 40వ, సబ్ జూనియర్, 50వ జూనియర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో, కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ ఫిరోజ్ గూడాకు చెందిన, బేగంపేట్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న, తేజస్ కుమార్ 50, 100 మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో, రెండు కాంస్య పథకాలు, అలాగే 200 మీటర్స్ బటర్ ఫ్లై విభాగంలో ఒక సిల్వర్ మెడల్ గెలుచు కున్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో కూకట్‌పల్లికి చెందిన విద్యార్థులు, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో, ఎంతో ప్రతిభ కనబరుస్తున్నారని ఇందుకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. అలాగే తల్లితండ్రులు కూడా పిల్లల ఆసక్తిని గమనించి క్రీడల పట్ల ప్రోత్సహిస్తే, వారు అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందుతారని పేర్కొన్నారు. అంతే కాకుండా క్రీడలు వారు మానసిక ఉల్లాసానికి, ఎంతో దోహదపడుతుందని తెలిపారు. క్రీడలను ప్రోత్సహించేందుకే గత పదిఏండ్ల నుంచి నియోజకవర్గంలోని అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తూ వచ్చామని, ఇవన్నీ కూడా ప్రజలు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అన్నయ్య సన్నిధి...అదే నాకు పెన్నిధి...అంటూ సృష్టిలో అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ల బంధానికి, ఆత్మీయతకు, అనురాగానికి ప్రతీక రక్షబంధన్(రాఖీ)అని బాపూజీ విద్యాసంస్థల చైర్మెన్ నవ్వా ప్రభాకర్ రావు అన్నారు. సోమవారం రాఖీ పండగ పురస్కరించుకొని జగద్గిరిగుట్ట పరిధి, వెంకటేశ్వర నగర్‌లోని బాపూజీ హైస్కూల్ క్యాంపస్‌లో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థినిలు, ఉపాధ్యాయులు కరస్పాండెంట్ నవ్వా ప్రభాకర్ రావుకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు చదువుతోపాటు సంస్కారం, విలువలతో కూడిన జీవన శైలిని నేర్పుతున్నామన్నారు. నేటితరం విద్యార్థులు ప్రతి పండగల విశిష్టత తెలుసుకోవడంతో, మన సంస్కృతి, సాంప్రదాయాలను, కట్టు బొట్టును భావితరాలకు వివరించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.నాగిరెడ్డి, కే.రమేష్, పి.జగదీష్, రేణుక, చంద్రకళ, సుజాత, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

మహాత్మ జ్యోతి రావు పూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపికైన శివ కుమార్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

భారతీయ దళిత్ సాహిత్య అకాడెమీ న్యూఢిల్లీ ఆధ్వర్యంలో.. ప్రతిష్టాత్మకమైన మహాత్మా జ్యోతి రావు పూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డుకు కూకట్‌పల్లి డివిజన్, ప్రగతి నగర్, జగద్గిరిగుట్టకు చెందిన శ్రీరామోజు శివ కుమార్ ఎంపికయ్యారు. శివ మధ్యతరగతి కుటుంబంలో పుట్టి.. సమాజానికి తన వంతు సేవలందించాలనే ఉద్దేశ్యంతో.. 20 ఏండ్లుగా ప్రజా సమస్యలపై పోరాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పురోగతికి పాటుపడుతున్న వ్యక్తిగా.. విద్యార్థి నాయకుడిగా, అనేక సమస్యలను ప్రశ్నిస్తూ పోరాడాడు. సామాజిక కార్యక్రమాలు చేస్తూ.. తను ఒక ప్రయివేటు కంపెనీలో పని చేస్తున్న చిరుద్యోగి అయినప్పటికీ, ఎవరికైనా కష్టం వచ్చిందనే తెలిస్తే చాలు నేనున్నానంటూ తనకు తోచిన ఆర్థిక సాయం అందిస్తుంటాడు. అన్ని రకాలుగా సహాయం చేస్తూ ముందుకు వెళ్తున్న ఒక గొప్ప సమాజిక కార్యకర్త, యువనాయకుడుగా గొప్ప గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ మేరకు ఆయన సేవలను గుర్తించి, భారతీయ దళిత్ సాహిత్య అకాడమి న్యూఢిల్లీ వారు, మహాత్మా జ్యోతి రావు పూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపిక చేశారు. వచ్చే డిసెంబర్ నెల 8,9 తేదీలో ఢిల్లీలో జరిగే జాతీయ సదస్సులో అవార్డ్ ను అందజేయనున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఈ అవార్డుకు ఎంపిక చేసిన జాతీయ అధ్యక్షులు, సుమనక్షార్‌కి, సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జితేందర్ మనుకి, ఇన్ని సంవత్సరాలుగా తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

సోదర సోదరీమణుల బంధానికి ప్రతిబింబం రాఖీ

- చైర్మెన్, కరస్పాండెంట్ యాద నరేంద్రగుప్త
- రాజధాని పాఠశాలలో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సోదర సోదరీమణుల బంధాలకు ప్రతిబింబంగా రాఖీ పండగ నిలుస్తుందని రాజధాని హై స్కూల్ చైర్మన్, కరెస్పాండెంట్ యాద నరేంద్ర గుప్త అన్నారు. సోమవారం రాఖీ పండగ పురస్కరించుకొని జగద్గిరిగుట్ట పరిధి పాపిరెడ్డి నగర్ లోని రాజధాని పాఠశాలలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు రాఖీలు కట్టుకుంటూ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రతి పండగ విశిష్టత తెలియజేసేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయు లకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు యాద రేణుక,యాద కార్తీక్ గుప్తా, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'వృద్ధాశ్రమానికి సమాజం అండగా ఉండాలి'

నవతెలంగాణ-హాయత్ నగర్



వృద్ధాశ్రమానికి సమాజం అండగా ఉండాలని హాయత్ నగర్ కోర్ట్ 7వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ సంకేత్ మిత్ర సూచించారు. శనివారం హాయత్ నగర్‌లో ఉన్న ఓ వృద్ధాశ్రమానికి వెళ్లి అక్కడ ఉన్న వాళ్లను కలిసి సాదకభాదలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వనస్థలిపురం కోర్ట్ బార్ కార్యదర్శి సంతోష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో మేయర్ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్‌లో పోచమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేయర్ వెంట ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, భీమిడి స్వప్న జంగారెడ్డి, నాయకులు బంగారు ప్రభాకర్, పెద్దబావి మహేందర్ రెడ్డి, పెద్దబావి బాబు, చారి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భూములు, చెరువులను రక్షించండి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఏర్పుల నరసింహులు

నవతెలంగాణ-పెద్ద అంబర్‌పేట్

పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టి అన్నారం గ్రామంలో కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూములు, చెరువులను రక్షించాలని కోరుతూ సీపీఐ(ఎం) పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ రవీందర్ దత్తుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తట్టికాన చెరువు సర్వే నెంబర్ 1లో రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు చెరువులు, కుంటలను కబ్జా చేస్తున్న ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు వ్యాపారస్తులతో చేతులు కలిపి డబ్బులకు ఆశపడి కబ్జాదారుల జోలికి పోకుండా ఊరుకుంటున్నారని పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి తట్టికాన చెరువును రక్షించాలని కోరారు. అదేవిధంగా ఇదే గ్రామంలో ఊర చెరువును పై నుండి పూడ్చివేస్తూ, వర్షం పడితే వర్షం నీళ్ల నిల్వకుండా తూము గుండా, అలుగు భాగాన్ని తొలగించి కిందికి నీళ్లను వదులుతున్నారని చెప్పారు. గాలకుంట ఖఏవ కన్స్ట్రక్షన్ వాళ్లు కుంటలు మొత్తం పూడ్చివేసి విల్లాస్ నిర్మిస్తున్నారని ఆరోపించారు. జంగారెడ్డి కుంట సర్వేనెంబర్ 73 ఈ గుంటని జై కన్వెన్షన్ వాళ్లు పూర్తి చేసి మార్పు స్థలంగా మార్చారని తెలిపారు. ఈ విషయంలో గతంలో సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేసి చెరువులో మట్టి తీసి వేయించడం జరిగిందన్నారు. అయినా రెవెన్యూ మరియు ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు వర్గాల ముత్యాలు గుండె శివకుమార్, మేడిపల్లి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డల వివాహాలకు చేయూత

- ఉప్పల శ్రీనివాస్ గుప్త




నవతెలంగాణ-నాగోల్

పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయూత ఇస్తున్నట్టు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్, టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస గుప్త తెలిపారు. శనివారం నాగోల్ డివిజన్‌లోని కోఆపరేటివ్ కాలనీలో గల ఉప్పల శ్రీనివాస గుప్త క్యాంప్ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన లాస్య మరియు సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం కడవేర్గు గ్రామానికి చెందిన అక్షయ వివాహాలకు సహాయ సహకారాలు అందించాలని వారి కుటుంబ సభ్యులు ఉప్పల శ్రీనివాస గుప్తను మర్యాదపూర్వకంగా కలిశారు. స్పందించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త మంగళసూత్రం, మెట్టెలు, చీర, గాజులను వారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా కులాలకు అతీతంగా అనేక పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు చేయూత అందించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సదానంద గుప్త, కాంగ్రెస్ నాయకులు యాద శ్రీనివాస గుప్తా, రాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రస్థాయి పీజీ ప్రవేశ పరీక్ష-2024లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు'



నవతెలంగాణ-హాయత్ నగర్

హాయత్ నగర్ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర స్థాయిలో పీజీ ప్రవేశ పరీక్ష -2024లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు శనివారం అభినందించారు. కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పీజీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు ఎం.కామ్ అశ్ర.ఫర్హిన్ 25వ ర్యాంక్, ఆర్కియాలజీ 130 ర్యాంక్, మహేశ్వరి 177 ర్యాంక్, బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ 207 ర్యాంక్, సైకాలజీ 209 ర్యాంక్, కెమిస్ట్రీ 213 ర్యాంక్, జంతు శాస్త్రం 397 ర్యాంక్, తెలుగు 442 ర్యాంక్, జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ 473 ర్యాంక్, ఎం.కామ్ 501 ర్యాంక్ , రసాయన శాస్త్రం 532 ర్యాంక్, ఎకనామిక్స్ 672 ర్యాంక్, కంప్యూటర్ సైన్స్ 1400 ర్యాంక్.. మొత్తం కళాశాల డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు అన్ని సబ్జెక్టులలో, అన్ని ప్రవేశ పరీక్షలలో 85 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. అనంతరం ఆ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోత్స్న ప్రభ, కళాశాల అధ్యాపకులు, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, బాల, శారద, గ్రంథ పాలకులు దుర్గాప్రసాద్ తదితరులు అభినందించారు.

వైద్య విద్యార్థినిపై లైంగిక దాడికి నిరసన



నవతెలంగాణ - సిటీబ్యూరో

కోల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడిని ఖండిస్తూ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ వారు ఇచ్చిన పిలుపు మేరకు గ్లోబల్ ఆస్పత్రి వైద్య సేవలను నిలిపివేసినట్టు సీఈవో కరు ణాకర్ రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం ఆస్పత్రిలో ఓపి సేవలు, ఆపరేషన్లు ఒక రోజు మటుకు నిలిపివేసినట్టు పేర్కొన్నారు. అనంతరం ఆస్పత్రి ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

నవతెలంగాణ - మలక్‌పేట్

కోల్‌కత్తాలోని ఆర్ జే ఖేర్ మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలిపై జరిగిన లైంగికదాడికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు మలక్‌పేట్‌లోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో శనివారం ఉదయం నుంచి వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. రోగులను పరీక్షించే ఓపి సేవలను నిలుపుదల చేశారు. పలు వైద్యశాల అధికారులు, సిబ్బంది పురవీధుల్లో శాంతియుత ప్రదర్శన చేశారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో జరగకుండా దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఎల్బీనగర్ జోనల్‌కు సిటీ ప్లానర్ కావలెను..

- ఎల్బీనగర్ సర్కిల్‌కు టీపీఎస్ కావాలి
- ఉన్న అధికారిని బదిలీ చేశారు
- కొత్త అధికారి రాలేదు
- ఉన్నతాధికారులు కొత్త అధికారిని నియమించడం మర్చిపోయారు
- పేరుకుపోతున్న భవన నిర్మాణ అనుమతుల ఫైల్స్



నవతెలంగాణ- ఎల్బీనగర్

ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారిని బదిలీ చేశారు. కొత్త అధికారిని ఇంత వరకూ నియమించడం లేదు. జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో సిటీ ప్లానర్ లేక 20 రోజులు దాటింది. ఎల్బీనగర్ టౌన్ ప్లానింగ్ విభాగంలో పాలన గాడి తప్పుతుంది. 2019లో ప్రభుత్వం టీఎస్ బీ పాస్ చట్టాన్ని తీసుకొచ్చింది. సత్వరమే ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడానికి ప్రభుత్వం టీ ఎస్ బీ పాస్ విధానాన్ని తీసుకొచ్చింది.

తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అండ్ అప్లికేషన్ సిస్టంను తీసుకొచ్చారు. భవన నిర్మాణదారులు ఇంటి నిర్మాణం అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న ఇరవై ఒక్క రోజుల్లోనే అనుమతులు ఇవ్వడానికి ఈ సిస్టాన్ని తీసుకొచ్చారు. దరఖాస్తుదారుడు సేల్ డీడి, లింక్ డాక్యుమెంట్, ఈసి, మార్కెట్ వాల్యూ, సర్టిఫికెట్స్‌ను అప్లై చేసి ఫీజు చెల్లిస్తే జీహెచ్ఎంసీ అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి డాక్యుమెంట్లను పరిశీలించి, ఇరవై ఒక్క రోజుల్లో ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇస్తున్నారు. దరఖాస్తు పత్రాలు సరిగా లేకపోతే వాటిని తిరస్కరించే అధికారం అధికారులకు ఇచ్చారు. తర్వాత టీఎస్ బీ పాసును, టీజీ బిపాస్ గా మార్చారు.

ఎల్బీనగర్ జోన్ పరిధిలో ఐదు సర్కిల్స్...

జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోన్ పరిధిలో ఐదు సర్కిల్స్ ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారుల కొరత తీవ్రంగా ఉంది. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఇక్కడ పనిచేస్తున్న అధికారులను బదిలీ చేశారు.

కొత్త అధికారులను వారి స్థానంలో నియమించక పోవడంతో గత మూడు మాసాలుగా జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో భవన నిర్మాణ దరఖాస్తుల ఫైల్స్ పేరుకుపోతున్నాయి. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం రాకుండా పోయింది. ఇక్కడ పనిచేస్తున్న అధికారులను బదిలీ చేశారు. కొత్త అధికారులను వెంటనే వారి స్థానంలో నియమించలేకపోయారు. జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోన్‌లో పనిచేస్తున్న సిటీ ప్లానర్ ప్రసాద్ రావును 20 రోజుల క్రితం బదిలీ చేశారు. వారి స్థానంలో కొత్త అధికారి ఇప్పటివరకు రాకపోవడంతో సిపి లాగిన్‌లో అనేక ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న టీపీఎస్ శ్రీదేవిని బదిలీ చేశారు. నెలరోజులు దాటిన ఇంతవరకు కొత్త అధికారి రాలేదు.

టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారుల కొరత..

ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో టౌన్ ప్లాన్ విభాగంలో ఇద్దరు అధికారులు పని చేయాల్సి ఉండగా... ఉన్న ఒక అధికారిని కూడా ముందు చూపు లేకుండా బదిలీ చేశారు. కానీ ఇంతవరకు ఒక్క అధికారిని కూడా నియమించలేకపోయారు. దీని వలన ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో ఇంటి నిర్మాణం అనుమతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. హాయత్ నగర్ సర్కిల్లో ఒకే ఒక టీపీఎస్ పని చేస్తున్నారు.. అదేవిధంగా సరూర్ నగర్ సర్కిల్లో కూడా ఒకే అధికారి పనిచేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారుల కొరత ఏర్పడింది. ప్రభుత్వం తీసుకొచ్చిన టీ జీ బి పాస్ విధానం ఎల్బీనగర్ జోన్ లో మూడు నెలల నుండి నత్తనడక నడుస్తుంది. యజమానులు తమ ఇంటి నిర్మాణాల కోసం నిరీక్షణ చేస్తున్నారు. గతంలో టీఎస్ బి పాస్ విధానంలో ఎక్కడ ఏ అధికారి వద్ద ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయో గుర్తించే వారు. ఏ అధికారి లాగిన్ లో ఫైల్స్ పెండింగ్ లో ఉంటే గుర్తించే వారు.

దరఖాస్తులను జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేసి పైనుండి వెంటనే ఫైల్ క్లియర్ చేయాలని ఆదేశాలు ఇచ్చేవారు. ప్రస్తుతం పై నుండి అధికారులు పట్టించుకోకపోవడంతో భవన నిర్మాణం అనుమతుల ఫైల్స్ పేరుకుపోతున్నాయి. గతంలో పది రోజులు దాటితే రెడ్ లైన్ వచ్చేది . 21 రోజుల్లో అనుమతులు ఇవ్వాల్సి ఉండగా నెలల కొద్ది ఫైల్స్ పెండింగ్ లో ఉంటున్నాయి.

తొలిసారి సిటీ ప్లానర్ కుర్చీ ఖాళీ..

జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపం వలన ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో తొలిసారి సిటీ ప్లానర్ లేకుండా కుర్చీ ఖాళీగా ఉన్నది. ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో టౌన్ పాన్ విభాగంలో పనిచేస్తున్న రాజేందర్ యాదవ్ పదవీ విరమణ చేసి దాదాపు 2 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు కొత్త అధికారిని నియమించలేదు. ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారుల కొరత ఏర్పడంది. తెలంగాణ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానం పై ఉన్నతాధికారులు దృష్టి సారించి.. వెంటనే ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో సిటీ ప్లానర్‌ను నియమించవలసిందిగా ప్రజలు కోరుతున్నారు. జోనల్ కార్యాలయంలో సిటీ ప్లానర్ అధికారి లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిటీ ప్లానర్ లాగిన్ లో భవన నిర్మాణం అనుమతుల కోసం చేసుకున్న దరఖాస్తులు పేరుకుపోతున్నాయి. కొత్త సీపీ రాకపోవడం వలన భవన యజమానులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొత్త సిటీ ప్లానర్ వచ్చేవరకు తాము ఏమీ చేయలేమని అధికారులు పేర్కొనడంతో చేసేది ఏమీ లేక సీపీ కోసం ఎదురుచూస్తున్నారు. జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో వెంటనే అధికారులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ - చంపాపేట్

సింగరేణి గుడిసెల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో శనివారం సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు శంకర్ నాయక్ మాట్లాడుతూ గుడిసెవాసులకు రెగ్యులైజేషన్ చేసి పట్టాలివ్వాలని కోరారు. రౌద్రీ సొసైటీ వారు అక్రమ కట్టడాలని ఆపివేయాలని డిమాండ్ చేశారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ గుడిసెవాసులకు న్యాయం చేస్తానన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విక్రమ్, సద్దాం, విజయ్, చక్రి, అంజయ్య, నర్సింగ్, నాగరాజు, భాస్కర్, సుకూర్, పాషా, వంశీ, ఎల్లేష్, విజయ్, దశరథ్, షేక్ మహమూద్, దాసు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్‌లో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న జంగయ్య ఈ నెల 7న మృతి చెందినట్లు కమిషనర్ వాణిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు



అందరూ కలిసి 51వేల రూపాయలు జమ చేసి మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి, చేయూతనిచ్చారు. తర్వాత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జ్యోతి, ఏఈఈ అయేషా, కౌన్సిలర్లు బుడుమాల యాదగిరి, షేక్ పమీద అఫ్జల్, ఎన్విరాన్‌మెంట్ అధికారి శ్రీనివాస్, సూపర్వైజర్ కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్‌లో పారిశుధ్య పనుల పరిశీలన

నవతెలంగాణ వనస్థలిపురం

హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బీడీఎల్ కాలనీలో మార్నింగ్ వాక్ లో భాగంగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పారిశుద్ధ కార్మికుల విధుల, నిర్వహణను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్వచ్ఛ ఆటో, పారిశుధ్య కార్మికుల పనితీరును కాలనీవాసులను అడిగి తెలుసుకోవడం జరిగింది. తర్వాత ఆయన మాట్లాడుతూ చెత్తా చెదారాన్ని కాలనీలో ఉన్న ఖాళీ ప్రదేశాలలో వేయకుండా, కేవలం స్వచ్ఛ ఆటోలో మాత్రమే వేయాలని స్థానికులకు సూచించారు. పారిశుద్ధ కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించకపోయిన, కాలనీవాసులను ఎలాంటి ఇబ్బందులకు గురిచేసిన వెంటనే సమాచారం అందించాలని సూచించారు. ఈ పర్యటనలో శానిటేషన్ జవాన్ యాదయ్య, సూపర్వైజర్ వెంకట్ రెడ్డి, బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి




నవతెలంగాణ-బడంగ్‌పేట్

డ్రైనేజీ నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 29వ డివిజన్ ఆంజనేయ టవర్స్, రామిడి చంద్రా రెడ్డి కాలనీలల్లో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ పెద్దబావి శోభ ఆనంద్ రెడ్డితో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, ఏఈఈ సాయిరాం, పెద్దబావి బాబు, పెద్దబావి మహేందర్ రెడ్డి, కాలనీ వాసులు ధన్ రాజ్, కృష్ణ, మౌనిక, రాంబాబు, జయరాజ్ పాల్గొన్నారు.

సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే

- కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి



నవతెలంగాణ - చంపాపేట్

ప్రజలకు సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి అన్నారు. చంపాపేట్ డివిజన్ పరిధిలోని చంపాపేట్ ఓల్డ్ విలేజ్, చంపాపేట్ చౌరస్తా, చంపాపేట హరీష్ అన్న బస్తీ, చంపాపేట్ మోడల్ మార్కెట్, కర్మన్ ఘాట్ ఓల్డ్ విలేజ్, కర్మంఘాట్ శుభోదయ కాలనీ, కర్మంఘాట్ చౌరస్తాలో జలమండలి శాఖ అధికారులతో కలిసి కార్పొరేటర్ శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ డ్రైనేజీ, తాగునీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. హరిజన బస్తీలో తాగునీటి పైప్ లైన్ పనుల్లో ఎలాంటి అలసత్వం వహించకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని అన్నారు. హరిజన బస్తీ కర్మన్ ఘాట్ శుభోదయం కాలనీలో డ్రైనేజ్ మరమ్మతులు చేయాలని సబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పాశం శ్రీశైలం, అంజి, బసంత్, నాగేష్, బస్తీ వాసులు పోల్దస్ లక్ష్మణ్, జగన్, మైసయ, తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులు న్యాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి'




నవతెలంగాణ-వనస్థలిపురం

న్యాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎజి.యం. సతీష్ విద్యార్థులకు సూచించారు. వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్ నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల్లో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలను పెంపొందించే కార్యక్రమం ' ఇన్వెస్టచర్ సెరేమోనీ' వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ వేడుకలను శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎ జి. యం. సతీష్, ఆర్ ఐ వెంకట్ రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ జితేందర్, జోనల్ పీఈటీ ఇంచార్జి అయోధ్య, ప్రిన్సిపల్ మంగళ గౌరీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ ఆధునిక సమాజ నిర్మాణంలో చేయుతనందించేందుకు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మంచి రాజకీయ పటిమతో పాటు ప్రతి రంగంల్లోనూ విద్యార్థులు రాణించేందుకు నాయకత్వ లక్షణాలను కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు తమ బాధ్యతలను స్వీకరిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమం ఆధునిక చట్టసభలను తలపించే విధంగా జరిపించడం ఒక విశేషం. ఈ కార్యక్రమంలో డిన్ మహేష్, సి బ్యాచ్ ఇంచార్జ్ రమేష్, ప్రైమరీ ఇంచార్జ్ స్రవంతి, ప్రీ ప్రైమరీ ఇంచార్జి దుర్గా, ప్రోగ్రాం ఆర్గనైజర్ అశోక్, ఏ వో మల్లేష్, పీఈటీ హరీష్, లక్ష్మి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. 7

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
HMDA
ఆదివారం | ఆగష్టు 18, 2024 | www.navatelangana.com

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి రాఖీ పండుగ ప్రతీకగా శనివారం శ్రీ చైతన్య టెక్నో స్కూల్ నల్లకుంట బ్రాంచీలో రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఒకటవ తరగతి విద్యార్థినీలు స్కూల్ ప్రిన్సిపాల్, తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ టీచర్లు శాంతి, సరిత, దివ్య, పల్లవి, నాగజ్యోతి పాల్గొన్నారు.

మహిళల సంరక్షణ కోసం కృషి



నవతెలంగాణ-బంజారాహిల్స్

మహిళల సంరక్షణ, బాలికల సాధికారత, విద్యా ఆరోగ్యంపై తమ రాష్ట్రీయ యువ హిందూ వాహిని సంస్థ పని చేస్తుందని సంస్థ జాతీయ అధ్యక్షుడు మహంత్ అనురాగ్ భృగువంశీ గోస్వామి తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ ఉపాధ్యక్షురాలిగా స్మితా గ్రంధి, తెలంగాణ అధికార ప్రతి నిధిగా సినీనటి మాధవీలతను నియమించి వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు, మహిళలకు రక్షణ కవచంలా నిలబడటం తమ సంస్థ ఉద్దేశమ న్నారు. ఆసరా ఆర్గనైజే షన్ అనే స్వచ్ఛంద సంస్థను నిర్వహించే హబీబ్‌సుల్తాన్ అలీ అనే వ్యక్తి 11 ఏండ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించడంతో షామిర్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని అయినా కూడా అతనిపై చర్యలు తీసుకోకుండా స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారని ఆరోపించారు. సినీ నటి మాధవీ లత మాట్లాడుతూ చాలా సమస్యల వల్ల మహిళలు ఇంకా ముందుకు రాలేకపోతున్నారని వారికి అండగా నిలబడేందుకు హిందూ వాహిని ముందుంటుందన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- హైదరాబాద్ ఇమేజీను మరింత పెంచాలి.. సమన్వయంతో పనిచేయాలి
- నిమజ్జనం అంశంపై కోర్టు ఆదేశాల ప్రకారమే ముందుకెళ్తాం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో నిర్వహించే గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఘనంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బాంబే తర్వాత హైదరాబాద్‌లో గణేష్ ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని గుర్తు చేశారు. నరగంలో ఈ సారీకూడా ఘనంగా జరిపించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పాటు అన్ని శాఖల సమన్వయంతో ఉత్సావాలను ప్రశాంత వాతావరణంలో ఘనంగా పూర్తి చేసి హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచాలన్నారు. శనివారం బంజారాహిల్స్‌లోని (ఐసీసీసీ) ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గణేష్ పండగ-2024పై కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో న్విహించిన ఈ సమావేశంలో అన్ని ప్రభుత్వ శాఖల కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు. గణేష్ ఉత్సవాల నేపథ్యంలో విగ్రహాల ప్రతిష్టతోపాటు నిమజ్జనం ప్రక్రియ పూర్తయ్యేవరకు తీసుకోవాల్సి జాగ్రత్తలపై చర్చించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పలు సూచనలు, సలహాలను అందించారు. ఈ సందర్భంగా మంత్రి శాఖల వారీగా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే నెల సెప్టెంబర్ 7 నుండి సెప్టెంబర్ 17 వరకు జరిగే గణేష్ ఉత్సవాలు, నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపు కోవడానికి అన్ని శాఖలతో సమన్వయ సమావేశం జరిగిందని తెలిపారు. వారం రోజుల్లో ప్రజా ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీతో కలిసి మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్మెంట్ (ఎంసీహెచ్ఆర్‌డీ) సెంటర్‌లో మరో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. గణేష్ ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండడానికి ఇంటర్నల్ డిపార్ట్మెంటల్ సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించామన్నారు. గతంలో జరిగిన లోటుపాట్లు పునరావతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించినట్టు తెలిపారు. విగ్రహాల తయారీ నుంచి జిల్లాలకు తీసుకెళ్లే విగ్రహాలతో పాటు నగరంలో వివిధ ప్రాంతాలకు తరలించే విగ్రహాలకు ఎలాంటి ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్న ప్రజల సహకారం ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రజల సహకారంతోనే బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయని గుర్తు చేశారు. అదే తరహాలో గణేష్ ఉత్సవాలలో ప్రజలందరినీ భాగస్వామ్యం చేసి ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. నిమజ్జనం అంశం కోర్టు ఆదేశాల ప్రకారమే ముందుకు వెళ్తామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం, వాలంటీర్ ఆర్గనైజేషన్ పర్యావరణాన్ని కాపాడే ఎన్జీవో సంస్థల ద్వారా మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం నగర సీపీ మాట్లాడారు. నగరంలో జరిపిన అన్ని పండుగలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేశామని, గణేష్ ఉత్సవాలను సైతం ప్రశాంత వాతావరణంలో పూర్తి చేస్తామన్నారు. అందుకావాల్సి సూచనలు, సలహాలను అందించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ ట్రాఫిక్ విశ్వ ప్రసాద్, ఆర్టీసీ, రెవెన్యూ, ఆర్.అండ్‌బి, ఎలక్ట్రిసిటీ, ట్రాన్స్‌ఫోర్ట్, హెల్త్ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట:

గత అసెంబ్లీ ఎన్నికల ముందు కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో ఎన్నికలకు వెళ్లి గెలుపొందిన తర్వాత ఆరు నెలల్లో కులగణన చేసి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రకరకాల సాకులతో అమలును వాయిదా వేస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఉద్యమం ఉధృతం చేయనున్నట్టు వెల్లడించారు. దీనిలో భాగంగా ఈ నెల 22న అఖిలపక్ష రాజకీయ పార్టీల సమా వేశాన్ని, 26న రాష్ట్రంలోని అన్ని జిల్లాల ముట్టడి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మిలియన్ మార్చ్ తరహాలో సెప్టెంబరు 6న కులగణన మార్చ్ నిర్వహించి ప్రభుత్వ మెడలు వంచుతామని చెప్పారు. ప్రభుత్వం అప్పటికీ స్పందించకుంటే రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో విలేకరుల సమావేశంలో పలు బీసీ సంఘాల నేతలు బాలగోని బాలరాజ్ గౌడ్, వేముల వెంకటేశ్, కుందారం గణేశ్చారి తదితరులతో కలిసి మాటాడారు. దేశ కులగణన చేసి జనాభా ప్రకారం వాటా ఇవ్వాలని రాహుల్‌గాంధీ ప్రకటిస్తుంటే... రాష్ట్రంలో మాత్రం దీనికి భిన్నంగా జరుగుతుందని దుయ్యబట్టారు. రాష్ట్ర ఎన్నికల తర్వాత కులగణన ప్రక్రియ ప్రారంభిస్తామని కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రకటించారని, ఎన్నికలు ముగిసి కూడ మూడు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటి కమిషన్ ఏర్పాటు చేయలేదని బీసీల పై ప్రభుత్వ మొండి వైఖరి విడాలని లేనియెడల రాబోయే రోజుల్లో భారీ ఎత్తున ఉద్యమం ఉధృతం చేస్తామని తెలిపారు.

కొవ్వొత్తులతో వైద్యుల సంఘీభావం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి. రఘునాథ్‌స్వామి అధ్యక్షతన కలెక్టరేట్ లోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో జిల్లా అధికారులు, సిబ్బంది సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో రెసిడెంట్ పీజీ డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, దారుణ హత్య నేపథ్యం లో బాధితురాలికి సంఘీభావం తెలియజేయడంతో పాటు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు, వైద్య నిపుణులకు మెరుగైన భద్రత కల్పించాలని కోరుతూ, బాధితురాలికి కొవ్వొత్తులతో సంఘీభావం తెలిపినట్టు డీఎంఅండ్‌హెచ్ తెలిపారు.

లైంగిక దాడి నిందితులను ఉరితీయాలి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

కలకత్తాలో వైద్యురాలిపై జరిగిన దాడి, హత్యకు నిరసనగా తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు కాకు మాను శశి శ్రీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఫ్ల కార్డులు ప్రదర్శించి, నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు కాకుమాను శశి శ్రీ, జనరల్ సెక్రెటరీ విజయనిర్మల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అనిత, ట్రెజరర్ డాక్టర్ షీలా, సుజాత, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



నవతెలంగాణ-ముషీరాబాద్

పశ్చిమ బెంగాల్‌లో వైద్యురాలిపై అత్యాచారం చేసిన నిందితులను ఉరితీయాలని, మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా నిందితులకు కఠిన శిక్ష విధించాలని పీ ఆర్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్, డాక్టర్ సుచరిత రెడ్డి డిమాండ్ చేశారు. కోల్‌కత్తాలో చోటు చేసుకున్న పీజీ వైద్యురాలి అత్యాచారం ఘటనకు నిరసనగా శనివారం రాత్రి జీజీ చారిటీ, 9 స్టార్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో రామ్ నగర్ అభయాంజనేయ స్వామి దేవాలయం నుంచి రాంనగర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు.

మహిళ కడుపులో లీకైన 4 లీటర్ల రక్తం..

నవతెలంగాణ-సిటీబ్యూరో

డెంగ్యూ వచ్చిన ఓ మహిళ తొలుత వేరే ఆస్పత్రిలో చేరి, పరిస్థితి విషమించడంతో కిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. ఆమెకు ఇక్కడి వైద్యులు శస్త్ర చికిత్స చేసి నయం చేశారు. వివరాలను ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ యూరో గైనకాలజిస్టు డాక్టర్ ఎస్.బిందుప్రియ తెలిపారు. 'నగరానికి చెందిన 37 ఏండ్ల మహిళ డెంగ్యూ జ్వరంతో పాటు విపరీతమైన కడుపునొప్పితో మా దగ్గరకు వచ్చారు. అప్పటికే షాక్‌లో ఉన్న ఆమెను సాధారణ స్థితికి తీసుకు రావడానికి పది యూనిట్ల రక్తంతో పాటు ప్లేట్‌లెట్లు కూడా ఎక్కించాల్సి వచ్చింది. అయినా కడుపునొప్పి తగ్గకపోతుం డటంతో అల్ట్రా సౌండ్, సిటీ స్కానింగ్ చేయడంతో ఆమెకు ఒవేరియన్ సిస్ట్ పగిలిపోయి, అంతర్గత రక్తస్రావం బాగా ఎక్కువగా ఉందని తేలింది. దీంతో అత్యవసరంగా లాప్రోస్కాపిక్ సర్జరీ చేయాల్సి వచ్చింది. అప్పుడు ఆమె ఉదరభాగంలో ఏకంగా 4 లీటర్ల రక్తం ఉంది. అదంతా పగిలిపోయిన సిస్ట్ నుంచి బయటకు వచ్చిన రక్తమే కావడం గమనార్హం. దీంతో ఆమెకు అత్యవసరంగా శస్త్రచికిత్స చేసి, మొత్తం సిస్ట్‌ను తొలగించడంతో పాటు లోపల రక్తం మొతాన్ని శుభ్రం చేయడంతో ఆమెకు రక్తస్రావం ఆగిపోయింది. ఈ శస్త్రచి కిత్సలో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ శివరాజు, జనరల్ సర్జన్ డాక్టర్ ఎం.బీ .వీ. ప్రసాద్, ఎంఐసీయూ వైద్యులు డాక్టర్ పవన్, అనస్థీషియా బందంతో పాటు కూడా ఎమర్జెన్సీ వైద్యులు శాయ శక్తులా కృషి చేశారు. అందరి సమిష్టి కృషి వల్లనే ఈ మహిళను కాపాడగలిగాం" అని డా.బిందుప్రియ వివరించారు.

చిన్నపాటి వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం

అత్యవసర పరిస్థితుల్లో చేతులెత్తేస్తున్న జీహెచ్ఎంసీ





నవతెలంగాణ-బంజారా హిల్స్

చిన్నపాటి వర్షాలకు బంజారాహిల్స్ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో పాటు భారీగా రోడ్ల తవ్వకాలు నూతన రోడ్ల వేసే కార్యక్రమాల్లో రహదారులన్నీ జలదిగ్బంధంలో మునిగాయి. వాహన చోదకులు ఎలా వెళ్ళాలో తెలియక గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి నెలకొందని ఆవేదన చెందుతున్నారు. జూబ్లీ చెక్‌పోస్ట్ నుంచి పంచగుట్ట వెళ్లడానికి సుమారు రెండు గంటల సమయం పడితే నాగార్జున సర్కిల్ నుండి బంజరా హిల్స్ రోడ్ నెంబర్ మీదుగా మాసబ్ ట్యాంక్ వెళ్లడానికి మరో రెండు గంటలు విరంచి ఆస్పత్రి కోడలి నుంచి అపోలో ఆస్పత్రి రోడ్ నెంబర్ 12 మీదుగా వెళ్లే మార్గం సైతం అదే పరిస్థితి నెలకొంది. హిల్స్ ప్రాంతాల్లో ఎతైన కొండలపై ఉన్న నివాసాలకు ఒకలా గుంటే లోతట్టు ప్రాంతాల్లో ఉండే బస్తీలు మాత్రం అనేక సమస్యలు నెలకొంటున్నాయి. ఇకనైనా తమ పరిస్థితిని ప్రభుత్వాలు గుర్తించి రోడ్ల తవ్వకాలు వర్షాకాలంలో చేపట్టకుండా సకాలంలో పూర్తిచేసి ప్రయాణాలు కనీసం నడిచి వెళ్లే మార్గాలు అయినా సుగుమం చేయాలని బస్తీ వాసులు కోరుతున్నారు.

లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



నవతెలంగాణ-అంబర్‌పేట

పేద, మధ్య తరగతి ప్రజలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక చేయూత అందిస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ తో కలసి మొత్తం 77 మంది లబ్దిదారులకు సీఎం రిలీఫ్ నుంచి మంజూరైన రూ.17 లక్షల30 వేల విలువగల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురై దవఖానాల్లో చికిత్స పొందుతున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. తాను అంబర్‌పేట ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన దాదాపు ఐదున్నరేండ్ల కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి కొన్ని కొట్లాది రూపాయలు బాధితులకు అందజేసామని తెలిపారు. తమ కార్యాలయం సిబ్బంది సీఎం కార్యాలయ అధికారులతో సంప్రదింపులు జరుపుతూ వీలైనంత త్వరగా బాధితులకు చెక్కులు అదే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా మని ఆయన వివరించారు. లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు అనిల్, సంతోష్, సంతోష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాన్ పేలి అగ్ని ప్రమాదం.. వ్యక్తికి తీవ్ర గాయాలు..



నవతెలంగాణ-ధూల్ పేట్

ఇంట్లో ప్రమాదవశాత్తు టేబుల్ ఫ్యాన్ పేలిన అగ్ని ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన షాహినాథ్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చుడీ బజార్‌లోని శంకర్ బజార్ ప్రాంతానికి చెందిన సుశాంత్ కిరాద్ ఇంట్లో మధ్యప్రదేశ్ రాంపూర్ బేగ్ లాన్ ప్రాంతానికి చెందిన రాజేంద్ర ప్రసాద్ యాదవ్(25) వచ్చి గత 3 ఏండ్లుగా నివాసం ఉంటున్నారు. ఇక్కడ సేల్స్ మ్యాన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 17న శనివారం ఉదయం నిద్రలో ఉండగానే ఇంట్లో ఉన్న టేబుల్ ఫ్యాన్ ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలి మంటలు చెలరేగాయి. అతడు తెలుసుకునే లోపు ఆ మంటల్లో పడి కాళ్ళు, చేతులు, శరీరం తీవ్ర గాయాలయ్యాయి. అరుపులూ ఆ శబ్దాలకు స్థానికులు మంటలు అదుపు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాయాలైన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. 50 శాతం పైగా గాయాలైనట్లు వైద్యులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

కస్తూరిబా గాంధీ జూనియర్ కాలేజ్ ఫర్ ఉమెన్ శనివారం నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల వారు రూపొందించిన సావనీరుని కూడా ఎమ్మెల్యే ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు జ్ఞాపికలను ఎమ్మెల్యే అందజేశారు. ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఈ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొనడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ గోపాల చారి, గంగాధర్ రావు,సత్యేందర్ వనం, హనుమంతరావు, రమాదేవి, చక్రవర్తి ,వినయ్ కుమార్, జనార్ధన్ బాయిల్, చారుమతి దేవి తదితరులు పాల్గొన్నారు.

విరిగిపడిన చెట్టును పరిశీలించిన డిప్యూటీ మేయర్



నవతెలంగాణ-ఓయూ

తార్నాకలోని సండే మార్కెట్ కాలనీలో ఒక పెద్ద చెట్టు విరిగి పడడంతో పాటు, హై టెన్షన్ వైర్లు తెగిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమాచారం అందుకున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి , ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి తో కలిసి వెంటనే డీఆర్ఎస్ టీమ్, హార్టికల్చర్, విద్యుత్ అధికారులను అప్రమత్తం చేసి ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించారు. అలాగే, డివిజన్‌లోని ప్రతి కాలనీలో ప్రమాదకర స్థితిలో ఉన్న చెట్ల గురించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కోట్లాది రూపాయలతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాం

- రాష్ట్ర రవాణా, బిసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- కార్వాన్ కూల్సుంపురా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగం బలోపేతం కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి పాఠశాలలో మౌళిక వసతులు కల్పించిందని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదవాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కార్వాన్ నియోజకవర్గంలోనికుల్సంపూర ప్రాధమిక, ఉన్నత పాఠశాల లను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్,యూనిఫామ్స్ అందరికి అందాయా అని తెలుసు కున్నారు. ప్రతిరోజు పాఠశాలకు రావాలని, ప్రభుత్వం కలిగిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని బాగా చదివాలని,ఈ సంవత్సరం పదో తరగతి పరీక్ష లలో మంచి ఫలితాలు సాధించాలని మంత్రి అన్నారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి మూడవ తరగతి గదిలో కింద కూర్చొని విద్యార్థులతో ముచ్చటించారు.వివిధ సబ్జెక్టు లలో వారిని ప్రశ్నించారు.బేసిక్ ఇంగ్లీష్ పై పిల్లలు పట్టు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

నూతనంగా నిర్మితమవుతున్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు.అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించిన సమవేశంలో మంత్రి మాట్లాడుతూ విద్యారంగం బలోపేతానికి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ.1100 కోట్లతో రాష్ట్రం లోని 25 వేల ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించామన్నారు. గత నెలలో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి ఉపాధ్యాయుల కొరత లేకుండా చూసామన్నారు. త్వరలో ప్రతి పాఠశాలకి ఉచిత విద్యుత్ అందివ్వడంతో శానిటేషన్ సిబ్బంది, స్కావెంజర్స్ కోసం ప్రతినెల ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. కూల్సుమ్ పూర పాఠశాలలో టాయిలెట్, డ్రింకింగ్ వాటర్ సమస్య లేకుండా చూస్తానని అన్నారు.తల్లిదండ్రులు పిల్లలు ఇంటి దగ్గర హోమ్ వర్క్ చేసాల చూడాలని, టీవీలకు దూరంగా పిల్లలను ఉంచాలని, పిల్లలు ప్రతి రోజు పాఠ శాలకు వెళ్లేలా చూడవలసిన బాధ్యత తల్లిదే అన్నారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి జాదవ్ శ్లోక్ ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమంలో భాగంగా రూపొందించినస్మార్ట్ పెస్టిసైడ్స్ స్ప్రేయర్ విధానం గురించి తెలుసుకుని అతన్ని మంత్రి అభినందించారు ఈ కార్యక్రమంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి, డీఈఓ ఆర్.రోహిణి, హెచ్‌ఎం రుక్మిణి, డి డి ఎస్సి వెల్ఫేర్ పెరిక యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నేత ఉస్మాన్ బిన్ ఆల్ హజ్రి,తదితరులు పాల్గొన్నారు.

మసకబారుతున్న ఆర్ట్స్ కళాశాల ప్రతిష్ట

- ఓయూలో పాకురు మచ్చలతో ఆర్ట్స్ కళాశాల..
- మసక బారుతున్న కళాశాల బాహ్య, అంతర్ సౌందర్యం
- లీక్‌కు అడ్డుకట్ట వేశారు.. అంతర్గత మరమ్మతులు ఎప్పుడు ?
- ఎదుట, లోపల పాకుడు మచ్చలు..
- ఇన్‌చార్జి వీసీ చొరవతో మరమ్మతులకు రూ. 5 కోట్లు విడుదల..!







నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఆర్ట్స్ కళాశాల నిర్మాణం ,ఆర్కిటెక్చర్ ఒక గొప్ప సౌంద ర్యం. నాణ్యత కు మారుపేరు. 106 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఓయూ ఆర్ట్స్ కళాశాల, సామాజిక ఉద్యమాలకు కేరఫ్‌గా నిలుస్తోంది. ఎంతోమంది వివిధ రంగాల్లో దేశ విదేశాల నిపుణులు అందించిన వేదిక ఆర్ట్స్ కళాశాల. అయితే ఆర్ట్స్ కళాశాల బాహ్య, అంతర్ సౌందర్యం ప్రస్తుతం మసక బారుతోంది. ఎదుట, లోపల పాకుడు మచ్చలతో ప్రతిష్టతకు భంగం కలుగుతోంది. పాకురు మచ్చలతో ఆర్ట్స్ కళాశాల కలహీనంగా కనిపిస్తోంది.



నాడు కళకళ... నేడు మసక బారుతున్న సౌందర్యం

గత కొన్ని సంవత్సరాల నుండి కురుస్తున్న ఆర్ట్స్ కళాశాల ఎట్టకేలకు ఇటీవలే 3 నెలల క్రితం రూఫ్‌ను అధునాతన టెక్నాలజీని జోడించి అత్యంత జాగ్రత్తగా మరమ్మతులు పూర్తి చేశారు. అంతకు ముందు కురిసిన వర్షాలకు ఆర్ట్స్ కళాశాల రూఫ్ కురవడంతో గోడల మధ్య, సందుల్లోకి వర్షపు నీరు లీక్ అయిన గోడలు పట్టుత్వం కోల్పోయ్యాయి. ఇక ఇలా గోడల్లోకి పోయిన ఈ వర్షపు నీరు తో గోడలు చెమ్మ రావడంతో అక్కడ పచ్చని కలర్‌తో అనేక చోట్ల పాకుడు మచ్చలు మచ్చలుగా కలహీనంగా తయారైంది. నిత్యం వివిధ సెమినర్స్ ,సదస్సులు ,చర్చల సమావేశం లాంటి కార్యక్ర మల కోసం వచ్చే అతిథులు, డెలిగేట్స్ ఓయూ పూర్వ విద్యార్థులు ఈ పాకురు మచ్చలతో ఆర్ట్స్ కళాశాల కలహీనంగా ఉండటం చూసి అసంతృప్తి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బయట జిగేల్ వెలుగులు, లోపల ఇలా

అయితే కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నాడు ప్రత్యేక చొరవతో కేంద్రప్రభుత్వం నిధులతో ఆర్ట్స్ కళాశాల కు ప్రతి శనివారం ఆదివారం అధునాతన టెక్నాలజీని జోడించి లైట్ అండ్ లైవ్ షో ఏర్పాటు చేశారు. సదరు లైట్ షో ద్వారా ఓయూ చరిత్ర విశేషాలు తెలియజేస్తూంటారు. దీనిపై ప్రశంసలు వస్తున్నా ఇలా ఆర్ట్స్ కళాశాలకు పైన పటారం లోపల లోటారం ఏంటి ? అని పలువురు అంటున్నారు.

న్యాక్ టీమ్ పర్యటన

రానున్న 5 ,6 నెలల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో న్యాక్ టీమ్ పర్యటన ఉంది. మరి ఇలా కళాశాల ఉంటే ఎలా అంటున్నారు విద్యార్థులు.

ఇన్‌చార్జి వీసీ చొరవతో నిధులు..!

ఓయూ ఇన్‌చార్జి వీసీ , పురపాలక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ దాన కిషోర్ పలుమార్లు ఆర్ట్స్ కళాశాలను సందర్శించి ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఆర్ట్స్ కళాశాల అంతర్గత మరమ్మతులకు, కలర్స్ కోసం సుమారు రూ. 5 కోట్లా 90 లక్షలు ఇటీవలే విడుదల చేసినట్టు తెలిసింది. ఈ మరమ్మతులు ప్రక్రియ త్వరలోనే ప్రారంభించనున్నారు.

దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాం

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్




నవతెలంగాణ-బేగంపేట్

సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక దీర్ఘకాలిక సమస్యలకు తెలంగాణ ప్రభుత్వ హయాంలో శాశ్వత పరిష్కారం చూపించామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడి పోస్ట్ ఆఫీస్ వద్ద గల జయంత్ అపార్ట్మెంట్ పరిసరాలలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమకు సరైన సీవరేజ్ లైన్ లేకపోవడం వల్ల వర్షపు నీరు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి నూతన సీవరేజ్ లైన్ ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలను రూపొందించి అందజేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కాలనీలో అవసరమైన చోట్ల రోడ్ల నిర్మాణానికి కూడా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. తరచుగా సీవరేజ్ లీకేజీల వల్ల కూడా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎయిర్ టెక్ మిషన్‌లను వినియోగించి మ్యాన్ హోల్స్ ను క్లీన్ చేయాలని, తద్వారా లీకేజీ సమస్యను పరిష్కరించాలని చెప్పారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు బేగంపేట నాలా పరిసర ప్రాంతాలు ముంపునకు గురయ్యేవని, కానీ ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవన్న విషయాన్ని గుర్తుచేశారు. ఎస్ఎన్‌డీపీ కార్యక్రమం ద్వారా సుమారు రూ. 45 కోట్ల వ్యయంతో నాలా లో పూడిక తొలగింపు, పరిసర బస్తీలలో సీవరేజ్ లైన్‌లు, రోడ్ల నిర్మాణం చేపట్టి ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి చేసినట్టు వివరించారు. త్వరలోనే ఈ ప్రాంత ప్రజల సమస్యను కూడా పరిష్కరిస్తామని కాలనీ ప్రజలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ టి.మహేశ్వరి, వాటర్ వర్క్ డీజీఎం ఆశిష్, ఏఈ వెంకట్ రెడ్డి, జీహెచ్ఎంసీ ఏఈ నవీన్, శానిటేషన్ డీఈ శ్రీనివాస్, ఎలెక్ట్రికల్ ఏఈ సాగర్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీహరి, నరేందర్, శేఖర్, ఆరీఫ్, శ్యాం సుందర్, కాలనీకి చెందిన రషీద్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాంను తెలంగాణ ఉద్యమకారుల సమితి ఆధ్వర్యంలో శనివారం తార్నాకలో ఆయన నివాసంలో కలిసి సత్కారం చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు అమరుల కుటుంబాలకు, కళాకారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ ప్రతినిధి వర్గంలో తెలంగాణ ఉద్యమకారుల సమితి నాయకులు సుల్తాన్ యాదగిరి, తుమ్మల ప్రపూర్ణ రాంరెడ్డి, రంగారెడ్డి,కొండ స్వామి,దొలక యాదగిరి,అమ్ములు యాదగిరి, సుజాత,వి.అరుణ,స్వరూపం రాణి,డి.వెంకట స్వామి, హనుమంతు, సునిత, ఎం.శంకర్ రావు,సిద్దు,సంతోష,సుదర్శన్ యాదవ్, ఎస్.రాజయ్య, పాల్గొన్నారు. నవతెలంగాణ-ఓయూ

నిమ్స్ నిరసనలో కదం తొక్కిన కార్మికులు



నవతెలంగాణ - బంజారాహిల్స్

కోల్‌కతాలో వైద్యురాలి హత్యకు నిరసనగా పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో జరుగుతున్న నిరసనల్లో వైద్యులు, నర్సులు, వైద్యతర సిబ్బందితో కలిసి తాము సైతం అంటూ నిమ్స్ తాత్కాలిక కాంట్రాక్టు (సీఐటీయు) కార్మికులు భాగస్వాములయ్యారు. కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించగా నిమ్స్ వైద్యులు వైద్య తర సిబ్బంది నర్సులు ఇతర పారామెడికల్ సిబ్బందితో కలిసి నిత్యం విధుల్లో ఉండే కార్మికులు సైతం భాగస్వాములై వాణి వినిపించారు. ఈ సందర్భంగా సీఐటీయు నాయకులు మాట్లాడుతూ ఇటువంటి రోజు ఒకటి వస్తుందని ఎప్పుడూ ఊహించ లేదన్నారు. నిత్యం ప్రజల ప్రాణాలను కాపాడుతూ తమ ప్రాణాలను సైతం ఫణంగా పెట్టే వైద్యులు వైద్యేతర సిబ్బందితో తాము ఎప్పుడూ కలిసి పోరాడుతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించి నిందితులను కఠినంగా శిక్షించి వైద్యులకు, వైద్య సిబ్బందికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

క్రైస్తవులపై దాడులు చేస్తే సహించేది లేదు..

నవతెలంగాణ-ఓయూ

క్రైస్తవులపై దాడులు చేస్తే సహించేది లేదని తెలంగాణ విద్యార్థి జేఏసీ గడ్డం అశోక్, యునైటెడ్ ఇండియన్ క్రిస్టియన్ జేఏసీ బెజవాడ రవికుమార్ అన్నారు. క్రైస్తవులపై దాడులు జరుగుతున్నాయని ఉస్మానియా యూనివర్సిటీలో నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా క్రైస్తవులను గుర్తించాలని ఇలాగే దాడులు జరుగుతే చూస్తూ ఊరుకునేది లేదని దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు.



బీసీ కులగణన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలి

- మంత్రి సీతక్కను కోరిన బీసీ నేత లింగంగౌడ్



నవతెలంగాణ-ఓయూ

బీసీ కులగణన ప్రక్రియను వెంటనే ప్రారంభించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రం సమర్పించినట్టు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. శనివారం జాజుల మాట్లాడుతూ.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందుబీసీ జన గణన ఈ రాష్ట్రంలో చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం బీసీలకు కేటాయించిన తర్వాత ఎన్నికలు పెడతామని హామినిచ్చిందన్నారు. ఏడు నెలలు గడుస్తున్నా బీసీ జనగణన, స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు పోవడానికి కాంగ్రెస్ సిద్ధమవుతుందని తెలుస్తున్నదని, రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్‌కి తగిన గుణ పాఠం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం ఓయూ కన్వీనర్ మార్త భాను వర్మ పాల్గొన్నారు.

బేసిక్, డీఏ, హెచ్ఆర్ఏతో కూడిన వేతనాలివ్వాలి



నవతెలంగాణ-ఓయూ

బేసిక్, డీఏ, హెచ్ఆర్ఏతో కూడిన వేతనం ఇవ్వాలని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల రూమ్ నెంబర్ 121 లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకుల రాష్ట్రస్థాయి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. డాక్టర్ విజయేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ ధర్మ తేజ, డాక్టర్ ఈ. ఉపేందర్, డాక్టర్ దత్తాత్రేయ టీయూ, డాక్టర్ శ్రీధర్ లోద్ కేయూ, డాక్టర్ సిహెచ్ వెంకటేష్, డాక్టర్ సురేష్ నాయక్ , డాక్టర్ రామేశ్వర్, తాళ్లపల్లి వెంకటేశం, డాక్టర్ నారాయణగుప్త డాక్టర్ అర్జున్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ ఉపేందర్ బాసర , డాక్టర్ ఓ కష్ణయ్య, డా. దత్త హరి బాసర వివిధ యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకులు ఒకే వేదికపైకి వచ్చి నెల గడువులోపు బేసిక్, డీఏ, హెచ్ఆర్ఏతో కూడిన స్కేలు అమలు పరచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అన్ని విశ్వవిద్యాలయాలను స్తంభించేలా ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలన్నీ పదేండ్లుగా ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యమయ్యాయని తెలిపారు. అందులో భాగంగా కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి, మంత్రి మల్లారెడ్డి విశ్వవిద్యాలయాలను పెంచి పోషిస్తూ కావాలనే కేసీఆర్ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం స్కేల్ అమలుపరిచి సెక్యూరిటీతో కూడిన జీవితాలను 1450 మంది అధ్యాపకులకు కల్పించాలని కోరారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు, బోధిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను కూడా బడ్జెట్ కోర్సులకు బోధిస్తున్న వారితోపాటు సమానంగా స్కేలు వర్తింపచేయాలని వారు కోరారు. అన్ని విశ్వవిద్యాలయాల అడ్మినిస్ట్రేషన్ విధులలో కాంట్రాక్ట్ అధ్యాపకలే ఉండి విశ్వవిద్యాలయాలను వారి బుజస్కందాలపై గత 20 ఏండ్లుగా మోసుకొస్తున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలు, అర్ధాకలితో కుటుంబాలను సరిగా పోషించలేని స్థితికి దిగజారుతూ ఉన్నత విద్యను బోధించలేకపోతున్నామని వాపోయారు. కాంట్రాక్ట్ అధ్యకులను వెంటనే సెక్యూరిటీతో కూడిన స్కేల్ ఇచ్చి విశ్వవిద్యాలయాల అభివద్ధికి తోడ్పడాలని వారు కోరారు. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. అన్ని విశ్వవిద్యాలయాల రిజిస్టర్ ఆఫీసుల ముందు ధర్నా కార్యక్రమాలు చేపట్టాలని, ప్రజాభవన్ ఎదుట అన్ని విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకులచే ధర్నా కార్యక్రమం చేపట్టాలని,ఇందిరాపార్క్ వద్ద అన్ని విశ్వవిద్యాలయ సామూహిక దీక్షలు ఒకరోజు నిర్వహించాలని ,ఇండెఫినైట్ స్ట్రైక్ నోటీసు అన్ని విశ్వవిద్యాలయ అధికారులకు, హాయర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ కు ఇవ్వాలని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు.

ఓపీ సేవలను బహిష్కరించిన యశోద హాస్పిటల్స్



నవతెలంగాణ-బేగంపేట్

కోల్ కతాలో ట్రైనీ మహిళా వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపునిచ్చిన సమ్మెకు యశోద హాస్పిటల్స్ పూర్తి మద్దతునిస్తూ, హైదరాబాద్ లో ఉన్న అన్ని యశోద ఆస్పత్రులలో ఓపీ సేవలను బహిష్కరించి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్, డాక్టర్. ఎ. లింగయ్య మాట్లాడుతూ.. కోల్‌కతా ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. కోల్‌కతాలో జరిగిన అతి బాధకరమైన విషయం యావత్తు దేశాన్ని కుదిపేసిందన్నారు. ఈ సంఘటనను పూర్తిగా ఖండిస్తూ తామందరం బాధితురాలికి మద్దత్తు తెలుపుతూ, తమ అన్ని యశోద ఆస్పత్రులలో ఓపీ సేవలను బహిష్కరించామన్నారు.



ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ముందు సంబరాలు

- ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గ అభివద్ధి కోసం ఎమ్మెల్యే శ్రీ గణేష్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించినందుకు శనివారం క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులతో సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు శాలువ కప్పి సన్మానించారు. ఎమ్మెల్యేగా కంటోన్మెంట్ కు తొలుత రూ.5 కోట్ల 49 లక్షలు నిధులు మంజూరు చేసినందుకు అభిమానులు కార్యకర్తలు సన్మానాలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం అభివద్ధి తన ధ్యేయమని, ఇది తన తొలి విజయమని. చెప్పారు రానున్న రోజుల్లో మరిన్ని నిధులు కేటాయించేలా కృషి చేసి నియోజకవర్గాన్ని అభివద్ధి చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు చెప్పారు.



జీఓ జారీ చేసిన సీఎంకు కృతజ్ఞతలు

- డా.ఎ. పరశురాం
- ప్రొ.కోదండరాంకు సత్కారం

నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఒప్పంద ఆచార్యుల సేవలు 60 సంవత్సరాల తరువాత కూడా పొడగిస్తూ నిర్ణయం తీసుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డికి యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎ. పరశురాం కృతజ్ఞతలు చెప్పారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రొ.కోదండరాంను శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తమకు కాస్త ఆసరా భరోసా ఇస్తుందన్నారు. సీఎం తమకు ఇచ్చిన మెదటి కానుకగా భావిస్తున్నట్టు తెలిపారు. తమకు అండగా నిలిచిన ప్రొ.కోదండరాం, ప్రొ.రామ మేల్కొటే ,ప్రొ.పీఎల్. విశేశ్వర్ రావు, ప్రొ.పాపిరెడ్డి కి కతజ్ఞతలు చెప్పారు .ఐఏఎస్ బుర్ర వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.లింబాద్రి, సెక్రటరీ ప్రొ.శ్రీరాం వెంకటేష్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రొ.జితేందర్ రెడ్డి , డా.రాజేష్ ,డా.సురేష్ ,డా.శివా రెడ్డి , డా.వెంకటేశ్వర్లు, డా.శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఘనంగా రామేశ్వర్ గౌడ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఓయూ

బీ.ఆర్.ఎస్. సికింద్రాబాద్ యువ నేత తీగుల్ల రామేశ్వర్ గౌడ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సితాఫలమండీ లోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ కుటుంబసభ్యులు, కార్యకర్తలు,అభిమానుల సమక్షంలో రామేశ్వర్ గౌడ్ తన జన్మ దిన వేడుకలను జరుపుకున్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా మెట్టుగూడ డివిజన్ లోని దూద్ బావి ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు క్యారం బోర్డులు, క్రీడా సామాగ్రి కిట్లను రామేశ్వర్ గౌడ్ పంపిణీ చేశారు.పలు సేవ కార్యక్రమాలను అయన చేపట్టారు. కార్పొరేటర్ రాసూరి సునీత రమేష్, హెడ్ మాస్టర్ మల్లికార్జున్ రెడ్డి , పాల్గొన్నారు.

ఈ పోషకాలు తీసుకుంటే..



మహిళలు.. తమ రోజువారీ డైట్‌లో కచ్చితంగా తీసుకోవాల్సిన పోషకాలలో ఫోలేట్ ఒకటి. ఇది గుండె ఆరోగ్యం, నరాల పనితీరు, చర్మ ఆరోగ్యం, జీర్ణక్రియ, రక్త ప్రసరణ, ఉత్పత్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. గర్భధారణ సమయంలో, మహిళలు ఫోలెట్ కచ్చితంగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తూ ఉంటారు. గర్భంలోని పిండం ఎదుగుదలకు, అభివృద్ధికి అవసరమైన ముఖ్యమైన పోషకాలలో ఇది ఒకటి.

కాల్షియం..

మహిళలు వారి డైట్‌లో కాల్షియం రిచ్ ఫుడ్స్ కచ్చితంగా చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పాలు, పెరుగు, చీజ్ వంటి డైరీ ఉత్పత్తులలో కాల్షియం అధికంగా ఉంటుంది. పాలకూర వంటి ఆకుకూరల్లోనూ కాల్షియం అధికంగా ఉంటుంది.

ఐరన్..

ఐరన్ లోపంతో అలసట, బలహీనత వేధిస్తాయి. మహిళలు ఐరన్ రిచ్ ఫుడ్స్ రోజూవారీ డైట్‌లో చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పౌల్ట్రీ, ఫిష్, నువ్వులు, బెల్లం, బీన్స్ వంటి ఆహార పదార్థాల్లో ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. మన శరీరం ఆహారంలోని ఐరన్‌ను సమర్థవంతంగా గ్రహించుకోవడానికి.. విటమిన్ సి రిచ్ ఫుడ్స్ కూడా తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

విటమిన్ సి..

విటమిన్ సి ఇమ్యూనిటీని మెరుగుపరుస్తుంది, ఇన్ఫెక్షన్ల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. మీ డైట్ సిట్రస్ పండ్లు, స్ట్రాబెర్రీలు, బెల్ పెప్పర్స్, బ్రకోలీ వంటి విటమిన్ సి రిచ్ ఫుడ్స్ తీసుకోండి.

ఫైబర్..

ఫైబర్ బరువును కంట్రోల్‌లో ఉంచుతుంది, జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది, గుండె సమస్యలు, టైప్ 2 డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక సమస్యల ముప్పును తగ్గిస్తుంది. మీరు ఫైబర్‌ను సమృద్ధిగా పొందడానికి తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు, నట్స్ వంటి ఆహారాలు మీ డైట్‌లో చేర్చుకోండి.

విటమిన్ డి..

విటమిన్ డి మహిళల శరీరంలో హార్మోన్‌గా పనిచేస్తుంది. మీరు విటమిన్ డిని సమృద్ధిగా పొందడానికి ఉదయం, సాయంత్రం పూట కొంత సమయం సూర్యరశ్మిలో గడపండి. కాడ్, షార్క్ చేపల లివర్, పాలు, క్యాబేజీ, గుడ్డు పచ్చసొనలో విటమిన్ డి పుష్కలంగా లభిస్తుంది.

ప్రొటీన్..

ప్రోటీన్ కండర ద్రవ్యరాశి, రోగనిరోధక పనితీరు, కణజాల మరమ్మత్తుకు సహాయపడుతుంది. మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి, రోజూ తగినంత ప్రొటీన్ కచ్చితంగా తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. మాంసాలు, పౌల్ట్రీ, చేపలు, గుడ్లు, పాల ఉత్పత్తులు, కాయధాన్యాలు, సోయాలో ప్రొటీన్ అధికంగా ఉంటుంది.

పొటాషియం..

పొటాషియం ఒక ఎలక్ట్రోలైట్, ఇది రక్తపోటును కంట్రోల్‌లో ఉంచుతుంది. ఆరోగ్యకరమైన కండరాలు, నరాల పనితీరుకు సహాయపడుతుంది. పొటాషియం హైపర్‌టెన్షన్, స్ట్రోక్ ముప్పును తగ్గిస్తుంది. మీ రోజూవారి ఆహారంలో అరటి, కమల , బంగాళదుంపలు, పాలకూర, బీన్స్ వంటి పొటాషియం పుష్కలంగా ఉండే ఆహారాలు తీసుకోండి.

ఒకరికొకరుగా...

వేగవంతమైన ఈ పోటీ ప్రపంచంలో మనం జీవిస్తున్నాం. బీజీ బతుకులతో మన సంబంధాలను తేలికగా తీసుకోవడం సర్వసాధారణంగా మారిపోయింది. ముఖ్యంగా దంపతుల మధ్య అన్యోన్యత కరువయ్యింది. ఉద్యోగాలూ, డబ్బు సంపాదన అంటూ కాలం వెళ్లతీస్తున్నారు. తమ కంటూ కొంత సమయం కేటాయించుకోవాలనే విషయమే మర్చిపోతున్నారు. అదిగుర్తు చేసేందుకే ప్రతి ఏడాది ఆగస్టు 18న 'నేషనల్ కపిల్స్ డే' జరుపుకుంటున్నారు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ఈ రోజు ప్రాధాన్యం కూడా పెరిగిపోయింది. దంపతులు తమ గురించి తాము పట్టించుకునేందుకు ఈ రోజును చక్కగా ఉపయోగించుకుంటే జీవితాంతం ఒకరికొకరుగా జీవించవచ్చు అంటున్నారు నిపుణులు. దంపతుల మధ్య ప్రేమ పదిలంగా ఉండేందుకు కొన్ని చిట్కాలు కూడా చెబుతున్నారు. అవేంటో తెలుసుకుందాం.

మీ బంధం ప్రాముఖ్యతను తెలుసుకొని దాన్ని బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నించండి. ఒకరి పట్ల ఒకరు కృతజ్ఞత, ప్రేమను వ్యక్తీకరించడానికి అవకాశాన్ని అందించండి. ఇద్దరూ కలిసి నాణ్యమైన సమయం గడిపేందుకు ప్రాధాన్యం ఇచ్చుకునేందుకు ఒకరినొకరు ప్రోత్సహించుకోండి. దీని కోసం కొత్త జ్ఞాపకాలు సృష్టించండి. మీ ఇద్దరి మధ్య భావోద్వేగ సంబంధాన్ని బలోపేతం చేసుకోండి. మీ భాగస్వామితో మీ మనసులోని భావాలు పంచుకునేందుకు, మీలోని ప్రేమను తెలియజేసేందుకు, వారి పట్ల మీకున్న అభిప్రాయాన్ని, ప్రశంసలను వ్యక్తీకరించడానికి, మీ సంబంధాన్ని బలోపేతం చేసుకోవడానికి ఈ రోజును మంచి అవకాశంగా భావించండి.

నిజాయితీగా ఉండండి

దాంపత్య బంధంలో నిజాయితీకెంతో ప్రాముఖ్యత ఉంది. అలాగని ఎదుటి వారితో 'సత్యమే మాట్లాడుతున్నా' అంటే సరిపోదు. ప్రవర్తనలోనూ పారదర్శకత కనిపించాలి. చెప్పినట్టు పాటించి చూపించాలి. భాగస్వామి వల్ల ఇబ్బంది కలుగుతున్న వాటిని మనసులో దాచుకోకుండా సున్నితంగా చెప్పగలగాలి. అలాగే అవతలి వారి గురించి మీ ఆలోచనలను కూడా బహిరంగంగా చర్చించాలి. అప్పుడే ఆ లోపాలు ఎదుటి వారికి తెలిసే అవకాశం ఉంటుంది. అంతేకాదు వారికి మీ వల్ల కలిగే ఇబ్బందినీ అడిగి తెలుసుకోవాలి. ఇలా ఒకరితో మరొకరు వాస్తవికంగా ఉంటేనే వారి మధ్య నిజమైన ప్రేమబంధం ముడిపడుతుంది.

సమయం ఇవ్వండి

కాపురంలో కలతలు సహజమే. అలాగని రోజూ గొడవపడుతుంటే ఎవరూ సంతోషంగా ఉండలేరు. కలతలకు కారణం దాపరికాలు, నిజాయితీ లేకపోవడం, అబద్ధాలు... వంటివే కాదు. సరైన సమయం ఇవ్వకపోవడం అని కూడా గుర్తించండి. అది మరిన్ని సమస్యలకు దారితీసి మీ బంధాన్ని చీల్చేయొచ్చు. దీన్ని పోగట్టుకోవాలంటే భాగస్వామితో మనసువిప్పి మాట్లాడడమే పరిష్కారం. అప్పటికీ అది సాధ్యం కాకపోతే నిపుణుల సాయం తీసుకోండి. కలిసి కౌన్సెలింగ్‌కి వెళ్లండి.



సానుకూలాంశాలే...

ఒకరి గురించి మరొకరికి పూర్తిగా తెలిసిపోయాక లోపాలే ఎక్కువగా కనిపిస్తుంటాయి. అలాంటి పరిస్థితి మీ ఇద్దరి మధ్య రాకూడదంటే ఏకాంతంగా కలిసినప్పుడు సానుకూలాంశాలే మాట్లాడుకోండి. అలా చెప్పలేకపోతున్నారా? అయితే రెండు కార్డ్‌బ్ బాక్సులు తీసుకుని ఒకదానికి గులాబీ, మరోదానికి బ్లూ కలర్ పేపర్స్‌ని అతికించి ఓ మూలన పెట్టండి. వారానికో లేఖ అయినా అందులో వేయండి. ఎప్పుడైనా వాదోపవాదాలు జరిగినా మీ అభిప్రాయాలను ఈ లేఖల్లో చెప్పొచ్చు. ఒకవేళ వారికి మీపై అపోహలు, అనుమానాలు ఉన్నా మీరు చూపించే ప్రేమతో సర్దుకుపోగలరు. తామేమైనా తప్పుగా ఆలోచించినా మార్చుకుంటారు.

ఒత్తిడి తగ్గించుకోండి

భార్యాభర్తల మధ్య విభేదాలకు పని ఒత్తిడీ ఓ కారణమంటారు నిపుణులు. ఆఫీసు పనులూ, ఫోన్లతోనే గడిపేస్తూ తమకి సమయం కేటాయించడం లేదన్నదే ఎక్కువమంది మహిళల ఫిర్యాదట. ఈ పరిస్థితి మీకూ ఎదురైతే, ఆ తరహా జీవనశైలిని ఎలా మర్చుకోవచ్చో, అవతలివారు సమయం ఆదా అయ్యేందుకు ఏదైనా మార్గం ఉందేమో ఆలోచించండి. వీలైతే రోజూ ఉదయపు నడకకు కలిసి వెళ్లండి. బాల్కనీలో కూర్చుని టీ తాగండి. ఈ అలవాటు మీలో అభద్రతా భావాన్నే కాదు, అవతలివారిలో ఒత్తిడినీ తగ్గిస్తుంది. ఎంత వీలు చిక్కకపోయినా, నెలకోసారైనా ఇద్దరూ కలిసి దగ్గర్లోని పార్కుకో, మీకిష్టమైన షాపింగ్‌కో వెళ్లిరండి. తేలికపడతారు.

కలిసి ప్రయాణించండి

ప్రతి ఏడు నెలలకు దంపతులిద్దరూ తమ ఉద్యోగం లేదా కుటుంబ బాధ్యతల నుంచి సెలవు తీసుకోవాలి. ఈ 'రొమాంటిక్ లీవ్స్'ను సెలబ్రేట్ చేసుకోవడానికి ఏదైనా విహారయాత్ర ప్లాన్ చేసుకోవాలి. బాధ్యతలతో రోజంతా భార్యాభర్తలిద్దరూ దూరంగా ఉంటారు. సాయంకాలానికి అలసిపోతారు. ఈ జీవనశైలి వైవాహిక బంధాన్ని యాంత్రికంగా మారుస్తుంది. ఇలా కాకుండా ఉండాలంటే దంపతులిద్దరూ ఇలా ఒంటరిగా మనసుకు నచ్చిన ప్రాంతానికి వెళ్లాలి. ప్రకృతిలో గడిపి, దైనందిక జీవితంలోని ఒత్తిడిని దూరం చేసుకోవాలి. దీంతో శరీరం, మనసు తిరిగి ఉత్సాహంగా మారతాయి. మరింత మీ బంధం బరింత దృఢంగా మారతుంది.

ఇది ప్రతిపక్షాల విజయమే

జేపీసీకి వక్ఫ్ బిల్లు నివేదనపై ఇండియా కూటమి నేతలు

సంప్రదింపులు అవసరమేనన్న టీడీపీ, జేడీయూ

గత్యంతరం లేక వెనక్కి తగ్గిన బీజేపీ

న్యూఢిల్లీ : మీడియా సంస్థలు, డిజిటల్ కంటెంట్ రూపకర్తలు, ఇంటర్నెట్ విధాన నిపుణుల విమర్శల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు ప్రసార సేవల (నియంత్రణ) బిల్లును ఉపసంహరించుకుంది. దానికి నాలుగు రోజుల ముందే వక్ఫ్ చట్ట సవరణ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపింది. గత ఐదు సంవత్సరాల కాలంలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ముస్లిం మైనారిటీలకు వ్యతిరేకమని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ బిల్లుపై మరింత విస్తృత సంప్రదింపులు అవసరమని తెలుగుదేశం, జేడీయూ, లోక్ జనశక్తి పార్టీ వంటి ఎన్డీఏ మిత్రపక్షాలు కూడా కోరాయి. 2014లో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి రెండు ప్రభుత్వాలకు లోక్‌సభలో పూర్తి మెజారిటీ చేకూరింది. బిల్లులను పరిశీలన నిమిత్తం స్టాండింగ్ కమిటీలకు, పార్లమెంటరీ కమిటీలకు పంపిన సందర్భాలు చాలా తక్కువ.

ప్రభుత్వానికి తెలిసొస్తోందన్న ప్రతిపక్షం

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి సభలో తగినంత మెజారిటీ లభించకపోవడంతో ఎన్డీఏలోని మిత్రపక్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో రెండు వివాదాస్పద బిల్లుల విషయంలో ఆచితూచి వ్యవహరించింది. దేశంలో ప్రజాస్వామ్యం ఎలా పనిచేస్తుందో ప్రభుత్వానికి తెలిసి వచ్చిందని కాంగ్రెస్ సోషల్ మీడియా, డిజిటల్ వేదిక విభాగం ఛైర్‌పర్సన్ సుప్రియా శ్రినాటే వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకూ బీజేపీ అనుభవించిన అపరిమిత అధికారానికి కళ్లెం పడిందని, మిత్రపక్షాల వైఖరే దీనికి సూచిక అని శివసేన (ఠాక్రే) ఎంపీ ప్రియాంక చతుర్వేది చెప్పారు. 'ఇది ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన తొలి వివాదాస్పద బిల్లు. దాని మిత్రపక్షాలు ఆ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి నివేదించేలా చేశాయి' అని ఆమె వ్యాఖ్యానించారు. ఇది ప్రతిపక్షాల విజయమని అన్నారు. రెండు నెలల వ్యవధిలో రెండు బిల్లులపై ప్రభుత్వం వెనక్కి తగ్గడం వాస్తవికతను ప్రతిబింబిస్తోందని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ జవహర్ సిర్కార్ తెలిపారు.

మిత్రుల సూచనలతో...

మిత్రపక్షాలు మద్దతు ఇస్తున్నప్పటికీ చర్చలు జరపాల్సిన అవసరం ఉన్నదని బీజేపీ అర్థం చేసుకుంది. వక్ఫ్ బిల్లే అందుకు ఉదాహరణ. తెలుగుదేశం, జేడీయూ పార్టీలు సభలో వక్ఫ్ బిల్లును సమర్థించాయి. అయితే దీనిపై మరింత చర్చ జరగాలని అంతర్గతంగా పట్టుబట్టాయని మీడియాలో వార్తలు వచ్చాయి. తమ ప్రయోజనాలను దెబ్బతీసే అంశాలపై ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తామని ఈ రెండు పార్టీలలోని ముస్లిం నేతలు స్పష్టం చేశారు. 'మైనారిటీలకు వ్యతిరేకంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే సలహా ఇవ్వాల్సిన బాధ్యత మాపై ఉంది' అని బీహార్‌కు చెందిన జేడీయూ ఎమ్మెల్సీ ఒకరు చెప్పారు. వక్ఫ్ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపాలని తమ నాయకత్వాలు సూచించాయని టీడీపీ, జేడీయూ నాయకులు చెప్పారు. బిల్లును పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలని తమ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ ఎంపీలకు సూచించారని పేరు చెప్పడానికి ఇష్టపడని టీడీపీ మైనారిటీ విభాగం నాయకుడొకరు తెలిపారు. వక్ఫ్ చట్టానికి సంస్కరణలు అవసరమేనని, అయితే ఆ సవరణలు ప్రస్తుత చట్టాలను నీరుకార్చేవిగా ఉండకూడదని అన్నారు.

అప్రమత్తత అవసరం

అయితే ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కి తగ్గినంత మాత్రాన ప్రతిపక్షాలు సంబరపడకూడదని, దాని ఎత్తుగడలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన వ్యూహాలను రూపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని రాజకీయ పరిశీలకులు సూచించారు.

ప్రపంచబ్యాంకు ద్వారా మూసీ సుందరీకరణ

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్నామని చెప్పారు. శనివారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డి బృందం అమెరికా, దక్షిణకొరియా పర్యటన వివరాలను వెల్లడించారు. పలు విదేశీ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలతో 30,750 మందికి నేరుగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. దక్షిణ కొరియాలో దాదాపు 12 సంస్థలతో చర్చలు జరిపామన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులపై చర్చించామని చెప్పారు. మూసీ పునరుజ్జీవం, సుందరీకరణపై ప్రపంచబ్యాంకు అధ్యక్షుడితో చర్చించామని తెలిపారు. రాష్ట్రంలో బయోడిజైర్ సిటీని ఏర్పాటు చేయాలని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీని కోరామని తెలిపారు. ఆయా సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను వందకు వంద శాతం ఆచరణలోకి తెచ్చేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తామనీ, నిరంతరం వారితో చర్చిస్తామని చెప్పారు. సీఎం విదేశీ పర్యటన అట్టర్‌ఫ్లాప్‌షో అంటూ బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తున్నారంటేనే వారికి రాష్ట్రాభివృద్ధిపట్ల ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి లక్ష్యం, గమ్యం నిర్దేశించుకున్నామనీ, దాన్ని అక్కడున్న తెలుగు ప్రజలకు, పలు సంస్థలకు వివరించామనీ తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత మొదటి సారిగా సీఎం హోదాలో యుఎస్‌లో పర్యటన చేసింది ఒక్క రేవంత్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు.

యూఎస్‌లో న్యూయార్క్, న్యూజెర్సీ, ఫిలడెల్ఫియా, వాషింగ్టన్ డీసీ, డల్లాస్, శాన్ ఫ్రాన్సిస్కోల్లో పర్యటించి పలు కంపెనీల సిఇఓలు, ఉన్నత స్థాయి యాజమాన్యంతో చర్చలు, ఒప్పందాలు చేసుకున్నామని వెల్లడించారు. ప్రపంచ బ్యాంక్ అధ్యక్షులు అజయ్ బంగా, అడోబ్ సీఈఓ, శంతను నారాయణ్‌లను కలిశామన్నారు. ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్‌లు, ముఖ్యంగా ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, స్కిల్స్ యూనివర్శిటీ, మూసీ రివర్ ఫ్రంట్ పునరుజ్జీవనం గురించి చర్చించామని తెలిపారు. దక్షిణ కొరియాలో ఎల్‌జీ, హుందాయ్, సామ్‌సంగ్, యంగ్‌గోన్, ఎల్ఎస్ గ్రూప్, పోస్కో, సియోల్ సెమీకండక్టర్స్ వంటి ప్రధాన కొరియన్ కంపెనీల ప్రతినిధులతో చర్చించామనీ, కొన్ని ఒప్పందాలు, సాంకేతిక సహకారానికి సంబంధించిన హామీలు పొందామని తెలిపారు. తెలంగాణను ఫ్యూచర్ స్టేట్‌గా ప్రమోట్ చేశామన్నారు. హైదరాబాద్ 4.0 విజన్‌ని అమెరికన్ వాణిజ్య సంస్థలతో పంచుకున్నామని చెప్పారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రధాన ప్రాజెక్టులకు తోడ్పాటునందించడానికి వారు అంగీకరించారని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మీడియా సమావేశంలో ఐటి శాఖ స్పెషల్ సిఎస్ జయేశ్ రంజన్, సమాచార శాఖ కమిషనర్ హనుమంతరావు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాజీనామా చేయాల్సింది నేను కాదు..నువ్వే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు రుణమాఫీలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఇందుకు సంబంధించి ఎన్నికల్లో చెప్పిందొకటి, క్యాబినెట్‌లో తీర్మానించింది ఇంకోటి, చివరకు అమలు చేసింది మరొకటని ఆయన ఎద్దేవా చేశారు. మొత్తం మీద రుణమాఫీకి చెప్పిన దాంట్లో ప్రభుత్వం రూ.14 వేల కోట్ల మేర కోత పెట్టిందని తెలిపారు. రాష్ట్రంలో ఇంకా 26 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదని చెప్పారు. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ తనను వ్యక్తిగతంగా దూషిస్తున్నారనీ, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలంటూ గొంతు చించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వాస్తవానికి రాజీనామా చేయాల్సింది తాను కాదనీ, రైతులను నిండా ముంచి, వారిని దగా చేసిన రేవంతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలన్నింటినీ ప్రజలకు విడమరిచి చెబుతున్నాననే కారణంతో సిద్ధిపేటలోని తన క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గుండాలతో దాడులు చేయించారని వాపోయారు. ఇలాంటి దాడులు, దౌర్జన్యాలకు భయపడేది లేదనీ, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతమైతే చూస్తూ ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, కేపీ వివేకానంద, పల్లా రాజేశ్వరరెడ్డి, చింతా ప్రభాకర్ తదితరులతో కలిసి హరీశ్‌రావు విలేకర్ల సమావేశం నిర్వహించారు. రుణమాఫీ పాక్షికంగానే జరిగిందని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ ఈ వాస్తవాన్ని అంగీకరించే స్థితిలో లేరని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల సమయంలో రుణమాఫీకి రూ.40 వేల కోట్లు అవసరమవుతాయంటూ సీఎం చెప్పారనీ, ఆ తర్వాత మంత్రివర్గంలో దాన్ని రూ.31 వేల కోట్లకు తగ్గించారనీ, బడ్జెట్‌లో ఇంకా తగ్గించి రూ.25 వేల కోట్లకు కుదించారని తెలిపారు.

చివరకు రూ.17,934 కోట్లే మాఫీ చేశారని వివరించారు. క్యాబినెట్‌లో తీర్మానించిన దాంతో పోలిస్తే మొత్తం రూ.14 వేల కోట్ల మేర ఆ పథకానికి కోతలు పెట్టారని చెప్పారు. ఈ మోసాన్ని గమనించే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా రుణమాఫీ, రైతు భరోసాపై సభలో చర్చించాలంటూ తాను పట్టుబట్టానని గుర్తు చేశారు.

కానీ ప్రభుత్వం స్పందించకుండా పారిపోయిందని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం అమలు చేసిన రైతు బంధు పథకం పేరును రైతు భరోసాగా మార్చిన రేవంత్ సర్కార్... సంబంధిత డబ్బులను ఇప్పటి వరకూ రైతుల ఖాతాల్లో వేయలేదని తెలిపారు. ఇలాంటి వాస్తవాలు మాట్లాడితే, సీఎంకు నచ్చటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీపై ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఆ పథకంపై శాసనసభలో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎంతమంది రైతులు రుణాలు తీసుకున్నారు? వారిలో ఎంతమందికి ఎన్ని వేల కోట్లు మాఫీ అయ్యాయి? ఇంకా ఎంతమంది మిగిలిపోయారనే విషయాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఏ గ్రామానికైనా వెళ్లి, పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగిందా? లేదా? అనే విషయాన్ని పరిశీలిద్దామా..? అంటూ హరీశ్, సీఎంకు సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో రైతు రుణమాఫీ చేస్తామంటూ దేవుళ్లపై ఒట్టేసి మరీ చెప్పిన ముఖ్యమంత్రి... ఇప్పుడు ఆ ఒట్టు తీసి గట్టున పెట్టారంటూ తూర్పారబట్టారు. ఆయన్ను క్షమించాలని కోరుతూ ఆయా దేవాలయాలు, చర్చిలు, మసీదులను తాను సందర్శిస్తాననీ, సంబంధిత కార్యాచరణను రెండు రోజుల్లో ప్రకటిస్తానని ఈ సందర్భంగా వెల్లడించారు.

ఎస్ఐని డిస్మిస్ చేయాలి :కేవీపీఎస్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళిత మహిళను చిత్రహింసలకు గురి చేసిన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ ఎస్ఐ రమేష్ కుమార్‌ను తక్షణమే డిస్మిస్ చేసి క్రిమినల్ కేసు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, తప్పెట్ల స్కైలాబ్‌బాబుతో పాటు దళిత బహుజన ఫ్రంట్, మానవ హక్కుల వేదిక నేతలు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బషీరాబాద్ మండలం నవల్గ గ్రామానికి చెందిన ఆమెను అనేక రకాలుగా వేధించారని పేర్కొన్నారు. గత మూడు నెల్లుగా పోలీసు స్టేషన్ చుట్టూ తిప్పుతూ థర్డ్ డిగ్రీని ప్రయోగించి చిత్రహింసలకు గురిచేశారని అన్నారు. ఆ మహిళను విచారించే సమయంలో మహిళా పోలీసులు లేకుండా చట్టాన్ని ఉల్లంఘించారని విమర్శించారు. దాహం వేసి నీళ్ళు అడిగితే మూత్రం తాగు అని అవమానించారని పేర్కొన్నారు. ఈ సంఘటనపై మహిళా కమిషన్‌కు, జాతీయ, రాష్ట్ర, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లు స్పందించాలని కోరారు. పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని అమాయక పేదలపై జులుం ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు.

పోడు దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ల నేతృత్వంలో ఎఫ్ఆర్‌సీ కమిటీలు :మంత్రి సీతక్క ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెండింగ్ పోడు భూముల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో అటవీ శాఖ, గిరిజన శాఖ స్థానిక ప్రజలతో అటవీ హక్కుల(ఎఫ్ఆర్‌సీ) కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు మంత్రి సీతక్క తెలిపారు. కమిటీల సిఫారసులకు అనుగుణంగా కొత్తగా పోడు పట్టాలు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. పోడు పట్టాలు, భూముల సమస్యలపై మంత్రులు కొండా సురేఖ, సీతక్క హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోడు పట్టాల సమస్యలను త్వరగా పరిష్కరించాలని వారు సంబంధిత అధికారులను అదేశించారు. సత్వరమే క్షేత్రస్థాయిలో పర్యటించి పెండింగ్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అర్హులకు పోడు పట్టాలివ్వాలనీ, అందుకు అర్హత సాధించని వారికి కారణాలు చెప్పి దరఖాస్తులను పక్కన పెట్టాలనీ, అలాంటి వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు.

వందశాతం రుణమాఫీ అయితే

రాజకీయాల నుంచి తప్పుకుంటా

ఏ గ్రామ రైతుల సమక్షంలోనైనా చర్చ సిద్ధం

సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సవాల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఇప్పటివరకూ రూ.2 లక్షల రుణమాఫీ వంద శాతం పూర్తయినట్టు చూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. అదే రైతులు రుణమాఫీ పూర్తి కాలేదని రైతులు చెబితే సీఎం రాజకీయాల నుంచి తప్పుకుంటారా? తన పదవికి రాజీనామా చేస్తారా? ఏం చేస్తారో చెప్పాలి అని ప్రశ్నించారు. ఏ గ్రామంలోనైనా..ఏ ప్రాంతంలోనైనా రైతుల సమక్షంలో చర్చ పెడితే రావడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియా హాల్‌లో ఆయన విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతుల్ని మోసం చేసిందన్నారు. రుణమాఫీ కాని రైతులు రోడ్లెక్కుతుండటంతోనే ప్రజల్ని డైవర్ట్ చేయడానికి బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అంటూ కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. రైతు భరోసాకు ఇవ్వాల్సిన నిధుల్నే రుణమాఫీకి డైవర్ట్ చేశారని ఆరోపించారు. రైతు భరోసా ఎప్పుడు ఇస్తారో సర్కార్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. 60 లక్షల మంది రైతులు అర్హులుండగా..కేవలం 22 లక్షల మందికే రుణమాఫీ చేశారని తెలిపారు. రూ.49 వేల కోట్లు రుణమాఫీకి ఇవ్వాల్సి ఉండగా..కేవలం రూ.17 వేల కోట్లతో ఎలా పూర్తిచేశారని నిలదీశారు. మూడు విడతల్లో రుణమాఫీ చేసిన రైతుల వివరాలను వారం రోజుల్లో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న రైతుల రుణాలను ప్రభుత్వం ఈ నెలాఖరులోగా మాఫీ చేయాలని కోరారు. రైతు భరోసా కింద ఖరీఫ్ సీజన్ డబ్బులను ఈ నెలాఖరులోగా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరంగల్‌లో కృతజ్ఞత సభ పెడితే రుణమాఫీ కాని రైతులంతా వచ్చి సీఎం నిలదీస్తారని హెచ్చరించారు.

20న క్రెడాయ్ రాష్ట్రస్థాయి సదస్సు

- ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి
- 900 మంది ప్రతినిధులు హాజరు

'రియల్' భవిష్యత్‌పై దిశానిర్దేశం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ 'తెలంగాణ గోయింగ్ గ్లోబల్' అంశంపై స్టేట్‌కాన్-2024 రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ తెలంగాణ శాఖ చైర్మెన్ మురళీకృష్ణారెడ్డి, అధ్యక్షులు ఈ ప్రేంసాగర్‌రెడ్డి, ఎలక్టెడ్ ప్రెసిడెంట్ కే ఇంద్రసేనారెడ్డి, కార్యదర్శి జీ అజయ్‌కుమార్ తెలిపారు. శనివారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సదస్సుకు ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్రంలోని 900 మంది డెవలపర్లు ప్రతినిధులుగా హాజరవుతారని చెప్పారు. రియల్ ఎస్టేట్ రంగంలో వినూత్న వ్యూహాలు, అభివృద్ధి నమూనాలు, భవిష్యత్ అవకాశాలు, ప్రభుత్వ విధివిధానాలపై ముఖ్యమంత్రి ఈ సదస్సులో ప్రసంగిస్తారని వివరించారు. రియల్టర్లు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల్ని కూడా ఆయన దృష్టికి తీసుకెళ్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్మిస్తున్న ఫోర్త్ సిటీతో నిర్మాణరంగం మరింత పుంజుకుంటుందని భావిస్తున్నామన్నారు. రాష్ట్రం నలుమూలలా రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరగాలని తాము కాంక్షిస్తున్నామనీ, ప్రభుత్వం కూడా ఆ తరహా మౌలిక సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందన్నారు. లే అవుట్ల అనుమతులు కలెక్టర్ స్థాయిలో ఇవ్వడం వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామనీ, దీనివల్ల అక్రమ లేఅవుట్లు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పురపాలిక సంస్థల్లోనే ఇచ్చేవారని గుర్తుచేశారు. రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా తగ్గించాలని తాము ఆ సదస్సులో సీఎంను కోరతామన్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణ సమయంలోని మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేస్తే, రియల్ ఎస్టేట్ రంగం మంచి అభివృద్ధి సాధిస్తుందనీ, గ్రోత్ కారిడార్‌లో సర్వేచేసి మార్కింగ్ చేస్తే చాలా ఉపయోగంగా ఉంటుందని వివరించారు. సమావేశంలో క్రెడాయ్ ఉపాధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, బీ పాండురంగారెడ్డి, యూత్‌వింగ్ కోఆర్డినేటర్లు సీ సంకీర్త్, ఆదిత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలుకానగర్ అభివృద్ధిలో బన్నాల మార్క్



బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్

GHMC స్టాండింగ్ కమిటీ మెంబర్, చిలుకానగర్ 7వ డివిజన్ కార్పొరేటర్



- బన్నాల మార్క్‌తో మారిన చిలుకానగర్ రూపురేఖలు
- ప్రజా సేవకు నిలువెత్తు నిదర్శనం కార్పొరేటర్ బన్నాల
- నిత్యం ప్రజల్లోనే, అనునిత్యం ప్రజల కోసమే
- అత్యధిక నిధులు తేవడంలో ప్రత్యేక చొరవ
- చిలుకనగర్ నుంచి ఉప్పల్ వెళ్ళే మార్గంలో కల్వర్టు నిర్మాణం

నవతెలంగాణ-ఉప్పల్

ఒకప్పుడు చిలుకానగర్ అంటేనే సమస్యల కు నిలయం. అభివృద్ధి జాడే ఎరుగని చిలుకానగర్ డివిజన్ నేడు సమస్యల వలయం నుంచి ప్రగతి పథకం వైపు నడుస్తోంది. దాని వెనుక కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ మార్క్ స్పష్టంగా కనిపిస్తుంది. ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పించడంలో ముందంజలో ఉంటూ ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తీరుస్తున్నారు. మూడున్నర సంవత్సరాల క్రితం జరిగిన గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలలో చిలుకానగర్ డివిజన్ నుండి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన బన్నాల గీతా ప్రవీణ్ అనంతరం డివిజన్ అభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించిన తీరు చూసి ఏకంగా స్టాండింగ్ కమిటీలో అవకాశం కల్పించారంటే ఆమె ఏ స్థాయిలో డివిజన్ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారో అర్థం అవుతోంది.

డ్వాక్రా మహిళా సంఘాల ప్రతినిధి నుంచి కార్పొరేటర్ గా

బన్నాల గీత సాధారణ గృహిణి. మహిళా స్వయం సహాయక పొదుపు సంఘాల ద్వారా మహిళలను చైతన్యం చేస్తూ మహిళా సంఘాల అభివృద్ధిలో విశేషంగా కృషి చేశారు. 2020లో జరిగిన గ్రేటర్ ఎన్నికల్లో చిలుకానగర్ డివిజన్ బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో ఆమె భర్త, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ ప్రోత్సాహంతో బరిలోకి దిగారు గీతా. ఉప్పల్ సర్కిల్ లో బీఆర్ఎస్ పార్టీకి నాలుగు స్థానాలలో దెబ్బ తగిలినా చిలుకనగర్ లో మాత్రమే విజయదుందిభి మోగించిందంటే ప్రజల్లో ఆ కుటుంబానికి ఉన్న ప్రత్యేకత ఎంటో ఇట్టే అర్థం అవుతుంది. గెలిచిన నాటి నుంచి నేటి వరకు ఎలాంటి సమస్యలున్నా నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజలకు కావాల్సిన వసతులు కల్పించడంలో నిత్యం కృషి చేస్తునే ఉన్నారు. కార్పొరేటర్‌గా గీతా చేస్తున్న కృషిని చూసిన బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం గ్రేటర్ హైదరాబాద్ పాలక మండలిలో అత్యున్నతమైన స్టాండింగ్ కౌన్సిల్ సభ్యురాలిగా అవకాశం కల్పించారు. తమపై నమ్మకంతో ప్రజలు తమకు ఓట్లు వేశారు.. అంతే నమ్మకంగా అభివృద్ధి చేసి చూపించాము.. రాజకీయాలలోకి వచ్చిందే ప్రజా సేవ చేయడానికి.. ఒకసారి వచ్చిన తరువాత వెనక్కి చూసుకునేది లేదు అంటారు బన్నాల గీత.

డివిజన్ అభివృద్ధికి నిధులు తేవడం లో కీలక భూమిక

చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి, నిధులు తీసుకరావడంలో కార్పొరేటర్ బన్నాల గీతా కీలక భూమిక పోషించారు. గ్రేటర్‌లోనే ఏ డివిజన్‌కు రాని నిధులను కార్పొరేటర్ గీతా తన చరిష్మాతో తీసుకువచ్చారు. సుమారు రూ. 75 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.



చిలుకానగర్ కల్వర్టుతో శాశ్వత పరిష్కారం

ఒకప్పుడు వర్షాకాలం వచ్చిందంటే, చాలు ఉప్పల్ నుంచి చిలుకానగర్ వెళ్లాలంటే ప్రజలు, ప్రాణాలు అరిచేతిలో పట్టుకొని, కల్వర్టు, దాటేవారు. కార్పొరేటర్ బన్నాల గీత కృషితో సుమారు 1కోటి 35లక్షల రూపాయలతో చిలుకానగర్ కల్వర్టు కు శాశ్వత పరిష్కారం చూపించి ప్రజల ప్రశంసలు పొందారు. చిలుకానగర్ కల్వర్టుతో పాటు డివిజన్‌లోని రఘూవేంద్రనగర్ కల్వర్టు, శ్రీగిరి కాలనీ కల్వర్టు, హైకోర్టు కాలనీ నుంచి, హెచ్ఎంటీ నగర్ చెరువు పైన రెండువైపులా కల్వర్టు ఏర్పాటు చేశారు.

Proposed Views for Vaikunta Mahaprasthanam, Chilukanagar



వైకుంఠధామాలలో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి

గతంలో డివిజన్‌లోని వైకుంఠధామాలలో సరైన వసతులు లేకపోవడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. వైకుంఠధామాలను ప్రణాళిక బద్ధంగా, జీహెచ్ఎంసీ అధికారులతో పాటు, ఉన్నతాధికారులతో ప్రత్యేక చొరవ చూపించి మైనార్టీల వైకుంఠధామాల్లో రూ. 52 లక్షలతో ఈద్గా షెడ్డు, రూ.22 లక్షలతో గుండ్లను తొలగించడం కోసం నిధులు తీసుకొచ్చారు.

మోడల్ హిందూ స్మశాన వాటిక : హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కోసం రూ.3 కోట్లతో మోడల్ హిందూ స్మశాన వాటిక అభివృద్ధి పనులు వేగవంతం గా జరుగుతున్నాయి. డివిజన్‌లో నిప్రతి కుల సంఘానికీ గ్రేవీయార్డ్ అభివృద్ధికి నిధులు కేటాయించి ప్రతేక అభివృద్ధి చేపట్టారు.

డివిజన్‌లో సీసీ రోడ్డులు, బీటీ రోడ్డులు ఏర్పాటు

చిలుకానగర్ డివిజన్‌లో రోడ్లు మొత్తం, గుంతలు ఏర్పడటంతో ప్రజల ఇబ్బందుల, దృష్ట్యా, పిస్తా హౌస్ నుంచి సాయిరాం నగర్ /ధర్మపురి కాలనీ వరకు



సుమారు 2 కిలోమీటర్ల పొడువైన రోడ్డును ఏర్పాటు చేశారు. కళ్యాణి పూరి ఈ సేవా నుంచి టీచర్ కాలనీ 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్డు.... బొడ్రాయి నుండి మల్లికార్జున నగర్ వరకు సీసీ రోడ్డు... బొడ్రాయి నుండి బ్రహ్మం గారి ఆలయం వరకు సీసీ రోడ్డు ను ఏర్పాటు చేశారు.

మౌలిక వసతులకు పెద్ద పీట

డివిజన్‌లోని మౌలిక వసతులకు పెద్ద పీట వేస్తూ పార్కుల అభివృద్ధి చేస్తున్నారు. పార్కులలో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, సీతారామ్ కాలనీ నుంచి ఎన్జీఆర్ ఐ కాంపౌండ్ నుంచి రాఘవేంద్ర నగర్ కాలనీ వరకు ఇరిగేషన్ నాలా రూ. 5 కోట్ల 5 లక్షలతో ట్రంకులైన్ పనులు.. నాలుగు ఫీట్లతో వర్షపు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేశారు. చిలుకా నగర్ కుమ్మరి కుంట నుంచి చిలుకానగర్ పోచమ్మ టెంపుల్ వరకు వర్షపు నీరు వెళ్లేందుకు 2కోట్ల రూపాయలతో సమస్య ను పరిష్కరించారు.

ప్రజా సేవకు నిలువెత్తు నిదర్శనం కార్పొరేటర్ బన్నాల గీత

ప్రజా సేవే పరమవాధిగా భావించి, నిత్యం ప్రజల్లో ఉంటూ, అనునిత్యం ప్రజల కోసమే పరితపిస్తూ, పాలకులం కాదు, ప్రజా సేవకులుగా ఉంటూ తన భర్త, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బన్నాల ప్రవీణ్ అడుగుజాడల్లో నడువాలని.. భర్త నమ్మిన సిద్ధాంతలకు ఊపిరిని పోస్తూ ఎవరూ ఊహించని విధంగా డివిజన్‌ను అభివృద్ధి చేస్తూ మోడల్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు బన్నాల గీత.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

కార్ల అమ్మకాల్లో పతనం

- రెండేళ్లలో తొలిసారి క్షీణత
- రుణదాతల్లో గుబులు
- డిస్కౌంట్లపై కంపెనీల దృష్టి

న్యూఢిల్లీ : ఆర్థిక వ్యవస్థ పనితీరుకు ప్రధాన గీటురాయిగా భావించే వాహన అమ్మకాలు క్షీణించాయి. గడిచిన రెండేళ్లలో ఎప్పుడూ లేని విధంగా తొలిసారి 2024 జులైలో ప్యాసింజర్ వాహన అమ్మకాలు తగ్గాయి. వాహన పరిశ్రమ బాడీ సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరర్స్ (సియోమ్) గణంకాల ప్రకారం.. గత జులై మాసంలో మొత్తంగా 341,510 కార్లు, యుటిలిటీ వాహనాలు, వ్యాన్‌లు అమ్ముడయ్యాయి 2023 అదే మాసంలో 3,50,355 యూనిట్ల విక్రయాలు జరిగాయి. దీంతో పోల్చితే గడిచిన నెల అమ్మకాల్లో 2.5 శాతం పతనం చోటు చేసుకుంది. 2022 ఫిబ్రవరిలో చివరి సారిగా ప్యాసింజర్ వాహన అమ్మకాలు పడిపోయాయి. ఆ సమయంలో 1.8 శాతం తగ్గి 3,02,965 యూనిట్లుగా నమోదయ్యాయి. ఫ్యాక్టరీ నుంచి డీలర్‌షిప్‌లకు చేరిన వాహనాలను సియోమ్ పరిగణలోకి తీసుకుని ఈ గణంకాలను విడుదల చేస్తుంది. గత నెలలో చిన్న కార్లు, సెడాన్లు, హ్యాచ్‌బ్యాక్‌ల అమ్మకాలు క్షీణించాయి. మరోవైపు స్పోర్ట్-యుటిలిటీ వాహనాలు (ఎస్‌యువి), ఎర్టిగా, ఇన్నోవా వంటి మల్టీపర్పస్ వాహనాలు ఒక అంకె స్థాయిలో పెరిగాయి. సియోమ్ అంచనా ప్రకారం.. ప్రస్తుతం డీలర్ల వద్ద 405,000 - 410,000 మధ్య వాహనాల నిల్వలు పేరుకుపోయాయి. గడిచిన నెలలో ప్రముఖ కార్ల తయారీ సంస్థలు మారుతీ సుజుకీ, హ్యుందాయ్ మోటార్ ఇండియా, టాటా మోటార్స్ అమ్మకాలు తగ్గాయి. మారుతి సుజుకి విక్రయాలు 9.6 శాతం, హ్యుందాయ్ మోటార్ ఇండియా 3.3 శాతం, టాటా మోటార్స్ 6 శాతం చొప్పున అమ్మకాల్లో తగ్గుదలను చవి చూశాయి. మరోవైపు మోటారు సైకిళు .., స్కూటర్ల అమ్మకాలు 12.5 శాతం పెరిగాయి. త్రిచక్ర వాహనాల్లోనూ 5.1 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ప్యాసింజర్ వాహన అమ్మకాల్లో భారీగా తగ్గుదల చోటు చేసుకోవడం రుణదాతల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వాహనాలకు డిమాండ్ పడిపోవడంతో తమ ఫైనాన్స్ వ్యాపారాలపై ప్రభావం పడుతుందని భావిస్తున్నాయి. సాదారణంగా పండుగ సీజన్‌లో వాహనాలకు డిమాండ్ ఉంటుంది. కానీ ప్రస్తుతం డిమాండ్ లేమితో డీలర్లు, కంపెనీల వద్ద నిల్వలు పెరుకుపోతున్నాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది జూన్‌లో వాహన రుణాల వృద్ధిలో 15 శాతం పతనం చోటు చేసుకుంది. లగ్జరీ వాహనాలకు, ద్విచక్ర వాహనాలకు డిమాండ్ ఉన్నప్పటికీ.. మధ్యస్త విభాగం నాలుగు చక్రాల వాహనాల్లో స్తబ్దత ఆటో, రుణ పరిశ్రమ వర్గాలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. మరోవైపు ఆర్‌బిఐ కీలక వడ్డీ రేట్లను పెంచి కూచోవడంతో రుణాలు భారం అయ్యాయి. వాహనాలపై కనీస వడ్డీ రేటు 8.75 శాతంగా ఉంది. రుణదాతలు కూడా తమ డీలర్ ఫైనాన్స్ పోర్ట్‌ఫోలియోలలో రీపేమెంట్ ఆలస్యాన్ని ఎదుర్కొంటున్నట్లు సమాచారం.

హాస్పిటల్స్‌లో వ్యయాలపై ఐటి శాఖ దృష్టి

న్యూఢిల్లీ : ప్రయివేటు ఆసుపత్రులు, హోటళ్లలో పెద్ద ఎత్తున నగదు లావాదేవీలు జరుగుతున్నాయని.. వాటిపై దృష్టి సారించాలని ఐటి శాఖకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సిబిడిటి) ఆదేశాలు జారీ చేసింది. డిజిటల్ లావాదేవీలు అందుబాటులోకి వచ్చినప్పటికీ.. భారీగా నగదు లావాదేవీలు చోటు చేసుకోవడంపై సిబిడిటి ఆందోళన వ్యక్తం చేసింది. హోటళ్లు, లగ్జరీ బ్రాండ్ విక్రయాలు, హాస్పిటళ్లు, ఐవిఎఫ్ క్లినిక్స్ వద్ద ఎక్కువగా నగదు లావాదేవీలు జరుగుతున్నాయని గుర్తించింది. వాటిపై దృష్టి సారించాలని ఐటి శాఖను ఆదేశించింది. సాధారణంగా రూ.2 లక్షలకు పైబడి నగదు లావాదేవీలు జరిగితే ఆ వివరాలు ఐటి శాఖకు అందించాల్సి ఉంటుంది. కానీ నిబంధనలు అతిక్రమించి పెద్ద మొత్తంలో లావాదేవీలు యథేచ్ఛగా జరుగుతున్నాయని ఐటి శాఖను సిబిడిటి అప్రమత్తం చేసింది.

ఆర్టీసీ ఆస్పత్రిలో సిబ్బంది నిరసన



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కోల్‌కతాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న ట్రెనీ డాక్టర్ హత్యకు నిరసనగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపుమేరకు తార్నాకలోని టీజీఎస్ఆర్టీసీ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది టీ విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నేరస్తుడిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. జీవితాలను కాపాడే డాక్టర్లకు రక్షణ కల్పించాలని కోరారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తార్నాక ఆస్పత్రి సూపరింటెండెంట్ అండ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శైలజామూర్తి మాట్లాడుతూ నిందితుడిని కఠినంగా శిక్షించాలనీ, డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, డాక్టర్ నరేష్, డాక్టర్ ప్రమోద్‌కుమార్, డాక్టర్ శ్రీగౌరీ, శిల్ప, రాజ్‌కుమార్, శశికిరణ్, ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

రూటు మార్చండి

- లిథియం, మెటల్స్, నాన్ మెటల్స్ మైనింగ్ చేపట్టాలి
- సింగరేణికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిశానిర్దేశం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్ సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు లిథియం, మెటల్స్, నాన్ మెటల్స్ మైనింగ్‌ను చేపట్టి విస్తరణ చెందాలని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక శాఖల మంత్రి భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు. శనివారంనాడాయన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సింగరేణి సంస్థ భవిష్యత్ ప్రణాళికలు, అభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పెట్రోల్, డీజిల్, బొగ్గు వంటి సాంప్రదాయ ఇంధన వనరులకు కాలం చెల్లుతున్నదనీ, భవిష్యత్ అంతా విద్యుత్ బ్యాటరీలే కేంద్రంగా మారబోతున్నాయని చెప్పారు. ఇలాంటి సమయంలో లిథియం వంటి మూలకాల అన్వేషణ, వెలికితీతపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. సింగరేణి ప్రపంచవ్యాప్త విస్తరణ కోసం ప్రత్యేకంగా కన్సల్టెన్సీని నియమించుకోవాలని సూచించారు. గ్రీన్ ఎనర్జీలో భాగంగా ఫ్లోటింగ్ సోలార్, పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని ఈ సందర్భంగా అధికారులు ఉప ముఖ్యమంత్రికి తెలిపారు. వీటి డీపీఆర్‌లు రూపొందిస్తున్నామనీ, త్వరలోనే వాటిని ప్రభుత్వానికి అందిస్తామని చెప్పారు. ఒరిస్సాలోని నైనీబ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తిపై ఆయన ఆరా తీసారు. సమావేశంలో ఇంధనశాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఉప ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రెటరీ కృష్ణభాస్కర్, సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై సుప్రీం జడ్జితో విచారణ జరపాలి

- పీడీఎస్‌యూ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై లైంగిక దాడితోపాటు హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జాతీయ కార్యవర్గ సభ్యులు ఎం పరశురాం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటన జరిగి పది రోజులు దాటినా కేంద్ర ప్రభుత్వం, బెంగాల్ ప్రభుత్వం విచారణ పేరుతో కాలయాపన చేయడం సరైంది కాదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలకు విచ్చలవిడిగా కేంద్రం అనుమతులు ఇస్తున్నదని తెలిపారు. కానీ వాటిలో కనీస ప్రమాణాలు, వసతులు ఉండేలా చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. విద్యార్థుల రక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కోరారు.

బెంగాల్ సీఎం మమత రాజీనామా చేయాలి : పీడీఎస్ఎఫ్

కోల్‌కతాలో మెడికల్ విద్యార్థిపై లైంగిక దాడికి పాల్పడి, హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్ఎఫ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల నాగరాజు, కుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ కాలేజీ ప్రిన్సిపాల్‌ను వేరే కాలేజీకి బదిలీ చేశారని తెలిపారు. డాక్టర్లు ఆందోళన చేస్తున్న సమయంలోనే గూండాలు ఆస్పత్రిపై దాడి చేసి సాక్ష్యాలను నిర్మూలించే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలు ఇస్తున్నా ఆ ఘటన పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్న బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

వైద్యుల నిరసన ర్యాలీలు

రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు, మానవహారాలు

- ప్రయివేట్ ఆస్పత్రుల్లో బంద్
- ప్రజాసంఘాల ఆధ్వర్యంలోనూ నిరసన
- వైద్యుల రక్షణ కోసం చట్టం తేవాలి
- మెడికో హత్య కేసు నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్

కోల్‌కత్తా వైద్య విద్యార్థి హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ప్రభుత్వ, ప్రయివేటు వైద్యులు, జూడాలు నిరసన ర్యాలీలు చేపట్టారు. రాస్తారోకోలు, మానవహారాలు నిర్వహించారు. ప్రయివేట్ ఆస్పత్రులు 24గంటలపాటు ఓపీ సేవలు బంద్ చేశాయి. విద్యార్థి, యువజన, కార్మిక, మహిళా సంఘాల ఆధ్వర్యంలోనూ నిరసన కార్యక్రమాలు జరిగాయి.



నవతెలంగాణ- విలేకరులు

గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా వైద్యుల ఆందోళనలు కొనసాగాయి. ఓపీ సేవలు నిలిచిపోయాయి. గాంధీ, ఉస్మానియా హాస్పిటల్స్ ఓపీ బ్లాకుల వద్ద తక్కువ హడావుడి కనిపించింది. అత్యసవర, క్యాజువాలిటీ, ఇన్ పేషెంట్ విధులకు హాజరైన వారు నల్ల బ్యాడ్జీలు పెట్టుకున్నారు. సనత్‌నగర్ ఈఎస్ఐసీ వైద్య కాలేజీ విద్యార్థులు అమీర్‌పేట వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. సీపీఐ ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ 'వై' జంక్షన్ వద్ద నిరసన కవాతు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నారాయణగూడ చౌరస్తా వద్ద క్యాండిల్ ర్యాలీ చేపట్టారు. అలాగే తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ), ఐద్వా ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తాలో నిరసన చేపట్టారు. లైంగికదాడుల నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఐద్వా హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి నాగలక్ష్మి డిమాండ్ చేశారు. మేడ్చల్ వల్కాజిగిరి జిల్లా కాప్రా శ్రీరాంనగర్ కాలనీలోని అశోక రిహాబిలేషన్, చిల్డ్రన్స్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆస్పత్రి డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. మూడుచింతలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యులు, నర్సులు, ఆశాలు ధర్నా నిర్వహించారు. ఘట్కేసర్ మండలం వెంకటాపూర్‌లో నీలిమ హాస్పిటల్ సీఓఓ ఎస్.నీలిమ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కేపీహెచ్‌బీలో రాందేవ్ రావ్ హాస్పిటల్ యాజమాన్యం భారీ ర్యాలీ నిర్వహించింది.

ఆదిలాబాద్ రిమ్స్ జూడాల ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఎదుట రాస్తారోకో చేశారు. ఈ నిరసనకు ఐఎంఎ వైద్యులు, ప్రయివేట్ వైద్యులు, ఆర్ఎంపీలు, మెడికల్ రిప్రెజెంటివ్‌లు మద్దతు తెలిపారు. తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో రిమ్స్ ఎదుట కార్మికులు, డాక్టర్లతో కలిసి నిరసన చేపట్టారు. నిర్మల్ జిల్లా ముధోల్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ నారాయణపటేల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కుమురం భీం-ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు తీశారు.

ఖమ్మంలో వైద్యులు, వైరాలో ఐద్వా ఆధ్వర్యంలో ర్యాలీలు చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెంలో జిల్లా కేంద్రంలో వైద్యులు, మెడికల్ విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. భద్రాచలంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ మద్దుతు తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు. ఇల్లందు పట్టణంలో వివిధ మహిళా సంఘాల ఆధ్వర్యంలో లైంగికదాడి భూతం దిష్టిబొమ్మను దహనం చేశారు.

సిద్దిపేట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గజ్వేల్‌లో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి నుంచి ఇందిరాపార్క్ వరకు ర్యాలీ తీశారు. ప్రగతి డిగ్రీ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. చేర్యాలలో నిరసన ప్రదర్శన నిర్వహించగా, మెడికల్ షాపులను రెండు గంటల పాటు మూసేశారు. కొండపాక మండలంలో ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఎస్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు జహీరాబాద్, జోగిపేట తదితర పట్టణాలలో వైద్యులు ఓపీ సేవలను నిలిపివేసి నిరసన వప్రదర్శనలు చేపట్టారు.



నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ప్రయివేటు ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిచిపోయాయి. మండలాల్లో పీహెచ్‌సీల సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా నిరసన చేపట్టారు. ఆర్ఎంపీలు సైతం ప్రథమ చికిత్స సేవలను నిలిపివేశారు. కలెక్టరేట్‌ల ఎదుట వైద్యులు ధర్నా చేపట్టి కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందజేశారు.

రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండల కేంద్రంలోని శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాజీవ్ చౌక్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. కొవొత్తులతో బాధితురాలికి నివాళి అర్పించారు. శంషాబాద్‌లో ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. యాచారంలో ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో బంద్ పాటించారు. పట్టణంలో ర్యాలీ తీశారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో డాక్టర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో కొవ్వొత్తులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గద్వాల జిల్లా కేంద్రంలో కాలేజ్ విద్యార్థులు నిరసన తెలిపారు. ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు.

వరంగల్ ఎంజీఎం నుంచి ములుగు రోడ్డు వరకు వైద్యులు, వైద్య విద్యార్థులు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. మహబూబాబాద్ పట్టణంలో ప్రదర్శన చేపట్టారు. మానుకోట గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రి నుంచి ర్యాలీ తీశారు. జనగామ జిల్లా కేంద్రంలో డాక్టర్లు విధులను బహిష్కరించి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు. హనుమకొండ జిల్లాలో అజారా హాస్పిటల్ డాక్టర్ల బృందం నిరసన తెలిపింది.

ములుగు జిల్లా ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు.

జగిత్యాల జిల్లా కేంద్రంలో ఐఎంఏ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పాల్గొని మద్దతు తెలిపారు. రాయికల్ పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు డాక్టర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ధర్నా నిర్వహించారు. కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. తెలంగాణ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటీవ్స్ యూనియన్ నేతలు ధర్నాలో పాల్గొన్నారు. కరీంనగర్ తెలంగాణ చౌరస్తా వద్ద ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిందితుని దిష్టిబొమ్మ దహనం చేశారు. ట్రస్మా జమ్మికుంట అధ్యక్షుడు సంపత్‌రావు ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల విద్యార్థులతో గాంధీ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు మానవహారంగా ఏర్పడ్డారు.

మంత్రి జూపల్లికి నిరసన సెగ



- కాన్వాయ్‌ని అడ్డుకున్న కార్యకర్తలు
- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అనుచరుల నినాదాలు
- మంత్రి కార్యక్రమానికి సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం
- చర్చల అనంతరం కలిసి ప్రాజెక్టుల సందర్శన

నవతెలంగాణ - జోగులాంబ గద్వాల

గద్వాల నియోజకవర్గంలో ప్రాజెక్టుల సందర్శనకు వచ్చిన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు సొంత పార్టీ నుంచే నిరసన సెగ తగిలింది. ప్రాజెక్టుల సందర్శనపై తమ నాయకురాలు జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్యకు ఎలాంటి సమాచారమూ ఇవ్వకపోవడంతో అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకుని నినాదాలు చేశారు. చివరకు మంత్రి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత నివాసానికి వెళ్లి చర్చించడంతో వివాదం సద్దుమణిగింది.శనివారం గద్వాల నియోజకవర్గంలోని జూరాల ప్రాజెక్టు, గట్టు ఎత్తిపోతల, ర్యాలంపాడు, నెట్టెంపాడు రిజర్వాయర్‌ల సందర్శనకు మంత్రి జూపల్లి వచ్చారు. మంత్రితో పాటు ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదిత్య ఈ పర్యటనలో ఉన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నివాసం నుంచి బయలుదేరిన మంత్రిని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత అనుచరులు అడ్డుకునేందుకు ప్రయత్నం చేశారు. మంత్రి జూపల్లి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ కాన్వాయ్‌కి అడ్డంగా నిలిచారు. వెంటనే పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. కాగా, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన రాకను సరితతోపాటు ఆమె అనుచరులు తీవ్రంగా వ్యతిరేకించారు. అధిష్టానం సరితకు నచ్చజెప్పడంతో ఆమె శాంతించారు.

ఈ క్రమంలో శనివారం ప్రాజెక్టుల సందర్శన విషయం సరితకు తెలియజేయకుండా.. ఎమ్మెల్యేతో కలిసి మంత్రి బయలు దేరడంతో ఆమె అనుచరులు అడ్డగించారు. దాంతో మంత్రి జూపల్లి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత ఇంటికి వెళ్లి చర్చించారు. ఆమెతో పాటు ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టుల సందర్శనకు మంత్రితోపాటు గద్వాల ఎమ్మెల్యే, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత కలిసి వెళ్లారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించిన కేంద్రం బృందం

- శంషాబాద్‌లో పర్యటన
- ధరణిలో రిజిస్ట్రేషన్లపై ఆరా

నవతెలంగాణ-శంషాబాద్



రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను కేంద్ర భూ వనరుల విభాగం సెక్రెటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రెటరీ కునాల్ రాష్ట్ర భూపరిపాలనా విభాగం ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్, జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి పరిశీలించారు. ఇందులో భాగంగా శనివారం శంషాబాద్‌లో పర్యటించారు. రాష్ట్రంలో ధరణి పోర్టల్ ద్వారా జరుగుతున్న రిజిస్ట్రేషన్ విధానాన్ని చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ నవీన్ మిట్టల్ కేంద్ర బృందానికి వివరించారు. శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ధరణి ద్వారా ప్లాట్ల రిజిస్ట్రేషన్, తహసీల్దార్ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్ గురించి కేంద్ర బృందం అధికారులను అడిగి తెలుసుకుంది. రిజిస్ట్రేషన్ చేపడుతున్న సమయంలో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు తలెత్తినప్పుడు ఏవిధంగా పరిష్కరిస్తారో వివరించారు. అంతకుముందు కేంద్ర బృందానికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటరెడ్డి, సబ్ రిజిస్టార్ రమాదేవి, ఇన్‌చార్జి తహసీల్దార్ సంతోష్‌కుమార్, తహసీల్దార్ రాములు, ఆర్ఐ సారిక తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ కోసమే రీడిజైన్లు

- పీసీ ఘోష్ కమిషన్‌తో : జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ప్రకాష్
- తుమ్మిడిహెట్టి దగ్గర నిర్మాణానికి
- మహారాష్ట్ర ఒప్పుకోలేదని వ్యాఖ్య

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలంగాణ భవిష్యత్ కోసమే సాగునీటి ప్రాజెక్టులను మాజీ సీఎం కేసీఆర్ రీడిజైన్ చేశారని రాష్ట్ర జలవనరుల సంస్థ మాజీ చైర్మెన్ వి. ప్రకాష్ స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టాలని కేసీఆర్ మదిలో ఉండేదనీ, దానికి మహారాష్ట్ర సర్కారు ఒప్పుకోలేదని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లో బీఆర్‌కే భవన్‌లో కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ ఎదుట హాజరయ్యారు. ఈసందర్భంగా కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్‌తో భేటీ అయ్యారు. తెలంగాణ సాగునీటి వనరులు, ప్రాజెక్టులు, కేసీఆర్ సర్కారులో చోటుచేసుకున్న పరిణామాలను సవివరంగా చైర్మెన్‌కు వివరించారు. అనంతరం మీడియాతో ప్రకాష్ మాట్లాడుతూ స్టోరేజీ లేకపోవడంవల్లే తుమ్మిడిహెట్టి నిర్మాణం ఆలోచన ముందుకు వెళ్లలేదని వ్యాఖ్యానించారు. సీడబ్ల్యూసీ చెప్పినట్టుగా 164 టీఎంసీల్లో 64 టీఎంసీలు తెలంగాణవి కాదని రిపోర్టులోనే ఉందని గుర్తు చేశారు. కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరామ్ తదితరులు పీసీ ఘోష్ కమిషన్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. వార్ధానదిలో బ్యారేజీ రూ.2500 కోట్లతో నిర్మాణం చేయడానికి వీలవుతుందనీ, తుమ్మిడిహెట్టి దగ్గర మాత్రం రూ.7500 వ్యయమవుతుందని చెప్పారు. 'వీ' ఆకారంలో బ్యారేజీ కట్టడం సాధ్యం కాదనీ, అందుకే నిర్మించలేదని వివరించారు. తుమ్మిడిహెట్టి వద్ద కేవలం 54 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉంటుందని కమిషన్‌కు ఆధారాలతో సహా చెప్పినట్టు తెలిపారు. కృష్ణా, గోదావరి బేసిన్‌లో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 17 లక్షల ఎకరాలకు నీళ్ల అందించడం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి అవినీతి జరగలేదని చెప్పారు. నివేదిక రూపంలో తన అభిప్రాయాలను కమిషన్‌కు తెలియజేశాననీ, కాగా అఫిడవిట్ సమర్పించాలని కమిషన్ చైర్మెన్ కోరారని చెప్పారు. ఈనెల 16న పూర్తి వివరాలు, ఆధారాలతో అఫిడవిట్ కూడా సమర్పిస్తానని ప్రకటించారు.

హబ్సిగూడలో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆటోను ఢీకొన్న లారీ.. బస్సు కింద నుజ్జయిన ఆటో
- పదో తరగతి విద్యార్థిని మృతి
- డ్రైవర్‌కు గాయాలు

నవతెలంగాణ-ఓయూ


(ఫైల్)

హైదరాబాద్ హబ్సిగూడలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సిగ్నల్ వద్ద ఓ లారీ ఆటోను బలంగా ఢీకొట్టగా.. ఆటో ఆర్టీసీ బస్సు కిందకు చొచ్చుకెళ్లింది. ఈ ఘటనలో పదో తరగతి విద్యార్థిని అక్కడికక్కడే మృతిచెందింది. వివరాల్లోకెళ్తే.. తార్నాక కిమితి కాలనీకి చెందిన రంగ గోపినాథ్‌గౌడ్, హేమలత దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె రంగ సాత్విక(16) సంతానం. సాత్విక హబ్సిగూడ గౌతమ్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఆమె రోజూలాగే శనివారం ఉదయం 7 గంటలకు తార్నాకలోని తన ఇంటి నుంచి ఆటోలో స్కూల్‌కు బయలుదేరింది. హబ్సిగూడ చౌరస్తాలో సిగ్నల్ పడటంతో ఆర్టీసీ బస్సు వెనకాల ఆటో ఆగింది. ఆ సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన టస్కర్ లారీ (ఓవర్ లోడుతో ఉన్న 18 చక్రాల లారీ) ఆటోను బలంగా ఢీకొట్టింది. దాంతో ముందున్న ఆర్టీసీ బస్సు కిందకు ఆటో చొచ్చుకెళ్లి నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని క్రేన్ సహాయంతో ఆటోను బయటకు తీశారు. విద్యార్థి సాత్వికకు, డ్రైవర్ ఎల్లయ్యకు తీవ్ర గాయాలు కాగా వారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. సాత్విక అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. ఆటో డ్రైవర్ ఎల్లయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సాత్విక మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన టస్కర్ లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ భూమి హక్కుల రికార్డు బిల్లుపై విస్తృత చర్చ జరగాలి

- సమగ్ర చట్టంగా రూపొందాలి
- రైతు సంఘం రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని భూమి యాజమానుల హక్కులను పూర్తిస్థాయిలో పరిరక్షించాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త 'తెలంగాణ భూమి హక్కుల రికార్డు బిల్లు-2024'పై విస్తృతస్థాయిలో చర్చ జరపాలని కోరారు. అప్పుడే అది సమగ్ర చట్టంగా రూపొందుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్, హిమాయత్‌నగర్‌లోని వై.వి.కృష్ణారావు రైతుభవన్‌లో తెలంగాణ భూమి హక్కుల రికార్డుల ముసాయిదాపై ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. వ్యవసాయ విధాన విశ్లేషకులు దొంతి నరసింహారెడ్డి, హైకోర్టు న్యాయవాదులు వేణుగోపాల్, రాజ్‌రెడ్డి, పోతు గోకుల్, రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటేశ్వరరావు, సామాజిక కార్యకర్త సాధిక్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు ప్రభులింగం, బండ రాజిరెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల నాయకులు సాముల వెంకట్‌రెడ్డి, శివుడు, వజ్రాల అరుణ, కొండారెడ్డి, మహిళా రైతులు పోటు స్వరూప, ప్రసన్న తదితరులు మాట్లాడారు.

సూచనలివి.

- గ్రామస్థాయిలో ఉన్న భూ సమస్యలను గ్రామ రెవెన్యూ సదస్సుల్లో బహిర్గతం చేయాలి. భూముల వివరాలను గ్రామసభలో తెలియజేయలి.గ్రామాల వారీగా రికార్డులను తయారు చేయాలి. రికార్డ్స్ డిజిటలైజ్ చేయడంతోపాటు మ్యాన్యువల్‌లో కూడా పొందుపరచాలి.
- ధరణిలో జరిగిన అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలి. తప్పులు ఎందుకు దొర్లాయో, ఎవరు చేశారనే దానిని తేల్చిన తర్వాతనే ముసాయిదాను చట్టం చేయాలి.
- భూమి స్వాధీనంలో ఉన్న తమకు హక్కుల రికార్డుల్లో నమోదు చేయాల్సిందిగా కోరితే, తహసీల్దార్ లేదా ఆర్డీవో సెక్షన్ 4(6) ప్రకారం భూయాజమాన్య హక్కులను కేవలం భూమి స్వాధీనంలో ఉన్న దాన్ని ఆధారంగా చేసుకుని భూ యాజమాన్య హక్కును ఇవ్వటానికి బిల్లు-2024లో పొందుపరిచారు. కొంత మంది దౌర్జన్యంగా ఎలాంటి హక్కులు, రికార్డులు లేకపోయినా భూముల్లో ఉంటారు. వారికి భూ యాజమాన్య హక్కును కల్పించే ఈ సెక్షను సరైంది కాదు. దీనిని తొలగించాలి.
- గ్రామస్థాయిలో ఒక రెవెన్యూ అధికారి ఉండాలి. భూసంబంధిత వివరాలను సేకరించేందుకు అధికారులకు సమాచారం ఇవ్వటానికి వీలు ఉండే పద్ధతుల్లో ఒక రెవెన్యూ అధికారి అవసరం.పహాణీ, కాస్తుకాలం కొనసాగించాలి
- జమాబంధీ, ఈ జమాబంధీనే కాక మాన్యువల్‌గా నిర్వహించాలి. భూమి వినియోగ పద్ధతిని ప్రత్యేకంగా పేర్కొనాలి.
- సాదా బైనామా ప్రకారం కొనుగోలు చేసిన వ్యక్తి పొజిషన్‌లో ఉన్నాడా? లేదా అన్నది పరిశీలించాలి.
- ఎండోమెంట్, వక్ఫ్ బోర్డులకు ట్రిబ్యునల్స్ ఉన్నట్లుగానే జిల్లా స్థాయిలలో ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేయాలి. వాటినికి రెగ్యులర్ జడ్జిని నియమించాలి.
- సమగ్ర భూ సర్వే నిర్వహించి భూ ఆధార్ కార్డులు, పాస్ పుస్తకాలు ఇవ్వాలి.
- వ్యవసాయేతర భూముల వివరాలు, సమస్యలు ఉంటే గ్రామ సభల్లో తెలపాలి.
- సాగుకాలం ఉండాలి. సాగు చేస్తున్న రైతుల కౌలు రైతుల వివరాలు పొందుపరచాలి.
- కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను, బిల్లులో పొందుపరచాలి.
- షెడ్యూల్ ఒకటి కింద గత కాలంగా వస్తున్న భూ రికార్డులన్నీ బిల్లులో చేర్చాలి.
- తెలంగాణ హక్కుల రికార్డు బిల్లు, పబ్లిక్ అండ్ విజిబుల్-2024 గా పేర్కొనాలి.
- విస్తృత పరిధిలో తెలంగాణ హక్కుల రికార్డు బిల్లు 2024ను చట్టం చేయాలి.
- రెవెన్యూ కోడ్‌ను తీసుకురాకుండా చట్టం చేస్తే ఉపయోగం లేదు
- 15.సెక్షన్ 4 ప్రకారం హక్కుల రికార్డు తయారీలో మెయింటెనెన్స్ ఆఫ్ రికార్డు సంబంధించి రెవెన్యూ అధికారి నిర్ణయం తీసుకుంటే అప్పిల్ చేయగలిగే అవకాశం ఈ బిల్లులో లేదు.2020 ధరణి రికార్డునే సెక్షన్ 4 (4)-2024 బిల్లులో పొందుపరిచారు. దీనిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది.
- 16.రిజిస్ట్రేషన్ చేసే టైమ్‌లో భూ వివరాల మ్యాప్ కూడా జత చేయాలి.

బహుజన పోరాట యోధుడు.. సర్వాయి పాపన్న



పాకాల శంకర్ గౌడ్
9848377734

రాచరికపు వ్యవస్థ నీడలో అగ్రకుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా, జమీందార్లు, జాగీర్దారుల అరాచకాలను సహించలేక కడుపు మండి కత్తి పట్టిన వీరుడు పాపన్న. ఖిలాషాపూర్‌ను కేంద్రంగా చేసుకొని మొఘలుల ఆధిపత్యాన్ని ఎదిరించి గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. బహుజనులు ఏకమై పోరాడితే రాజ్యాధికారం సాధించవచ్చని నిరూపించిన పోరాటయోధుడు. కుల,మత, జాతి వర్గ విభేదాలు లేని సమాజం కోసం 350 ఏండ్ల కిందనే కృషి చేసిన నాయకుడు. ఆధిపత్య, అగ్రకుల పాలకులు బహు జనులను అణగదొక్కుతున్న 17వ శతాబ్దంలోనే స్వీయ సైన్యంతో దక్కన్‌పై బహుజన రాజ్య స్థాపన చేసిన తొలి బహుజన రాజు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. మహాత్మా జ్యోతిరావు పూలేకంటే ముందే సామాజిక న్యాయం అమలు చేసిన గొప్ప సామాజిక విప్లవకారుడు.'చరిత్ర చదవనివారు చరిత్ర నిర్మాతలు కాలేరు' అన్నట్లుగా మహనీయుల జీవిత చరిత్రలను నేటితరం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ధూళిమిట్ట శాసనం ప్రకారం పాపన్న ఉమ్మడి వరంగల్ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ఖిలాషాపూర్‌లో 1650 ఆగష్టు 18 జన్మించాడు. బాల్యంలో పశువుల కాపరిగా నాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు స్నేహితులతో చర్చించేవాడు. చిన్నతనం నుంచే ఆధిపత్య బ్రాహ్మణ భావజాల వ్యతిరేక బీజాలు పాపన్నలో ఏర్పడ్డాయి.నిత్యం పూజలు చేసే సంప్రదాయాలను యుక్త వయసు వచ్చే నాటికి క్రమక్రమంగా వ్యతిరేకించాడు.బానిసత్వం నుండి ప్రజలకు విముక్తి కల్పిస్తాని కులవృత్తి చేయనని తల్లితో ప్రతిజ్ఞ చేసాడు.పాపన్న ఎక్కువగా ఇతర కులాల వారితో కలిసి తిరిగేవాడు.వీరిలో చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాళ్లు, దూదేకుల పీరు, కొత్వాల్ మీరు సాహేబ్ పాపన్న ప్రధాన అనుచరులు.వీరందరూ బహుజనులే.

తెలంగాణాలో మొగల్ రాజుల ఆధిపత్యాన్ని అంతం చేయాలని, తాబేదారులు, జమీనుదారులు, జాగీర్దారులు, దొరలు, భూస్వాములు చేసే దురాగతాలను గమనించి బానిసత్వ విముక్తి కల్పించాలని గోల్కొండ కోటపై బహుజనుల జెండా ఎగురవేయాలని నిర్ణయించాడు.పాపన్నకు ఎలాంటి వారసత్వ నాయకత్వం, ధనం, అధికారం కాని లేవు.12వేల మందితో గెరిల్లా సైన్యాన్ని,3వేల మందితో పదాతి దళాలు,500 మందితో రక్షకదళాలను ఏర్పాటు చేసుకున్నాడు. దళిత, గిరిజనులను చేరదీసి వారికి యుద్ధవిద్యలను నేర్పాడు. మొగలు సైన్యంపై తన సైన్యంతో దాడి చేసి తన సొంత ఊరు ఖిలాషాపూర్‌ని రాజధానిగా చేసుకొని 1675లో సర్వాయి పేటలో తన రాజ్యాన్ని స్థాపించాడు.

ఛత్రపతి శివాజీకి సమకాలికుడు పాపన్న. శివాజీ ముస్లింల పాలన అంతానికి మహారాష్ట్రలో ఎలాగైతే పోరాడాడో, పాపన్న కూడా తెలంగాణాలో మొగలుల పాలన అంతానికి పోరాడారు. 1687-1724 వరకు మొగల్ చక్రవర్తి ఔరంగజేబు సైన్యానికి వ్యతిరేకంగా పోరాడాడు. సర్వాయిపేట కోటతో మొదలుపెట్టి పాపన్న ఒక్కో ప్రాంతాన్ని ఆక్రమించి విజయ దుర్గాలు,కోటలు(21) వరకు నిర్మించాడు. 1678 వరకు తాటికొండ, వేములకొండలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. కనుచూపు మేరలో శత్రువులను కనిపెట్టేలా కోటలు నిర్మించాడని చరిత్రకారులు చెబుతారు. ఆధునిక ఆయుధాలు ఉపయోగించినట్లు చారిత్రక ఆనవాళ్లు లభించాయి.కోటకు నాలుగు వైపులా బురుజులు, మధ్యలో ఎత్తైన మరో బురుజు, ఒక బురుజు నుంచి మరో బురుజు వైపు నడిచి వెళ్లేందుకు సరిపడా వెడల్పయిన స్థలం, శత్రువులను ఎదుర్కొనేందుకు వీలుగా కోట గోడపై పిట్ట గోడలకు అనువైన రంధ్రాలు ఉండటంతో పాటు ఈ కోట నుంచి బయటకు వెళ్లేందుకు మూడు సొరంగాలున్నాయి. కోటలను శత్రువులకు అంతుచిక్కకుండా నిర్మించాడు.



> బహుజనుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడ్డ తొలి బహుజన రాజు పాపన్న చరిత్రను అగ్రవర్ణ చరిత్రకారులు వక్రీకరించారు. ఆధిపత్యాన్ని ఎదిరించి, బానిసత్వాన్ని ధిక్కరించిన సర్వాయి పాపన్నను దోపిడీ దొంగగా చిత్రీకరించారు. పిచ్చుకకుంట్ల వాళ్లు, దాసరి కాంద్రవాళ్ళు, వీరముష్టి వాళ్లు పాపన్న చరిత్రను వీర గాథలుగా ఊరూరా తిరిగి చెప్పేవారు.జానపద కళారూపాల ద్వారా పాపన్న చరిత్రకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించాయి.పాపన్న చరిత్రను ఆంగ్లేయ కవి జే.యే.బోయేల్ ఇండియన్ అంటిక్వెరి పత్రికలో 1874లోనే రాశారు.

తెలంగాణలో మొగలాయి విస్తరణను తొలిసారిగా అడ్డుకున్నది సర్వాయి పాపన్నే. అతని సామ్రాజ్యం తాటికొండ, కొలనుపాక, చేర్యాల నుండి నాటి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్, హుజూరాబాద్ వరకు విస్తరించింది. పాపన్న ముస్లిం మతానికి చెందిన ఒక స్త్రీని వివాహం చేసుకున్నాడు. ఆమె భువనగిరి కోట ఫౌజ్దార్ (మిలిటరీ గవర్నర్) సోదరి. సామాన్య వ్యక్తి శత్రుదుర్భేద్యమైన కోటలను వశపర్చుకోవడం అతని వ్యూహానికి నిదర్శనం. పాపన్న ఆలోచనలకు బెంబేలెత్తిన భూస్వాములు, మొగలాయి తొత్తులైన నిజాములు, కుట్రలు పన్ని సైన్యాన్ని బలహీనపర్చారు. 1700-1705 మధ్యకాలంలో ఖిలాషాపురంలో మరొక దుర్గం నిర్మించాడు. ఒక్కో మెట్టు ఎక్కుతూ చివరకు గోల్కొండ కోటను స్వాధీనపర్చుకొని ఏడు నెలలపాటు అధికారం చెలాయించాడు. మొగలురాజు బహుదార్ షా పాపన్న పరాక్రమాన్ని గుర్తించి గోల్కొండ ప్రభువుగా ప్రకటించాడు.

ఒక సామాన్య గీత కార్మికుడు గోల్కొండ ప్రభువుగా ఉండటం గిట్టని అగ్రకుల ఆధిపత్య వర్గాలు ఢిల్లీ బహుదూర్ షాకు పాపన్నపై అసత్య ప్రచారాలు చేశారు. ఆ విషయాలు నమ్మిన ఢిల్లీ బహదూర్ షా పాపన్న సైన్యంపై దాడి చేసి ఆరు నెలలు పోరాడినట్లు చరిత్ర. యుద్ధం జరుగుతున్న రోజుల్లోనే(1710) ఓ రోజు రాత్రి పాపన్న ఉద్యమద్రోహి చేత పట్టుపడ్డాడు. కొద్దిరోజుల తర్వాత పాపన్నను ఉరి తీసి మృతదేహాన్ని ముక్కలుగా చేసి తలను ఢిల్లీకి పంపారని చరిత్రకారులు రిచర్డ్స్, హనుమంతరావులు తెలిపారు. పాపన్న ప్రయత్నాన్ని ద్వంద్వ తిరుగుబాటుగా వారు అభివర్ణించారు. మొగలు ప్రభువుల అరాచకాలకు మత చాందస విధానాలకు వ్యతిరేకంగా ఇరవైయేండ్లు బహుజన రాజ్య విస్తరణకు(ఓరుగల్లు నుండి గోల్కొండ వరకు) కృషి చేసాడు పాపన్న.

బహుజనుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడ్డ తొలి బహుజన రాజు పాపన్న చరిత్రను అగ్రవర్ణ చరిత్రకారులు వక్రీకరించారు. ఆధిపత్యాన్ని ఎదిరించి, బానిసత్వాన్ని ధిక్కరించిన సర్వాయి పాపన్నను దోపిడీ దొంగగా చిత్రీకరించారు. పిచ్చుకకుంట్ల వాళ్ళు, దాసరి కాంద్రవాళ్ళు, వీరముష్టి వాళ్లు పాపన్న చరిత్రను వీరగాథలుగా ఊరూరా తిరిగి చెప్పేవారు.జానపద కళారూపాల ద్వారా పాపన్న చరిత్రకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు లభించాయి.పాపన్న చరిత్రను ఆంగ్లేయ కవి జే.యే.బోయేల్ ఇండియన్ అంటిక్వెరి పత్రికలో 1874లోనే రాశారు. పాపన్న వీరత్వానికి గుర్తుగా లండన్ మ్యూజియంలో విగ్రహాన్ని పొందుపరిచారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్‌బుక్‌లో పాపన్న గురించి రాసారు. చరిత్రను పరిశోధించి తెలుగు యూనివర్సిటీ మాజీ వీసీ, కీర్తిశేషులు ఆచార్య పేర్వారం జగన్నాథం, పీహెచ్‌డీ తీసుకుని పాపన్న తెలంగాణ ప్రాంతంలోని ఖిలాషాపురానికి చెందినవాడని రుజువు చేశారు. ప్రముఖ కవులు మల్లంపల్లి సోమశేఖర్‌శర్మ, ఆదిరాజు వీరభద్రరావు, చోల్లేటి నృసింహశర్మ రామరాజులు పాపన్న చరిత్రను వెలుగులోకి తెచ్చారు. పాపన్న గౌడ్ జీవిత చరిత్రను కొంపల్లి వెంకటేష్ గౌడ్ రాసారు. బిఎస్ఎల్ హన్మంతరావు తాను రాసిన ఆంధ్రుల చరిత్రలో పాపన్న వీరత్వాన్ని, ప్రజా ప్రభుత్వాన్ని కొనియాడారు.

అలనాటి అగ్రవర్ణ ఆధిపత్య చరిత్రకారులు, నాటి ఆంధ్ర పాలకులు పాపన్న చరిత్రను వక్రీకరించి ప్రపంచానికి తెలియకుండా తొక్కిపెట్టారు. తెలంగాణకు చెందిన పోరాట యోధులు సర్దార్ సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ, కొమురం భీం, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి, వర్ధంతులను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది.జనగామ జిల్లా ఖిలాసాపూర్‌లో 17వ శతాబ్దంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ నిర్మించిన చారిత్రక కోట వారసత్వాన్ని కాపాడడం, పూర్వవైభవ పునరుద్ధరణ, సాంస్కృతిక పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి.బహుజనులు ఐక్యమై రాజ్యాధికారం కోసం ఉద్యమిస్తామని ప్రతిన పూనాలి.అప్పుడే పాపన్న ఆశయ సాధనలో సఫలీకృతం అయినట్టు.

(18 ఆగస్టు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ జయంతి)



> ఈ ఏడాది మన దేశ బడ్జెట్ అక్షరాల రూ.42 లక్షల కోట్లు. ఇందులో కేంద్రం క్రీడా రంగానికి ఏ మేరకు నిధులు కేటాయించిందనేది ప్రభుత్వమే పరిశీలన చేసుకోవాలి.పదహారేండ్ల వయసులోనే అమెరికా క్రీడాకారుడు క్విన్సివిల్సన్ రన్నింగ్‌లో బంగారు పతకం సాధించడం మన దేశానికి ఒక సవాల్. యువకులు, చైతన్యవంతులు, సామర్థ్యంగలవారు, క్రీడల్లో రాణించగలిగే సత్తా ఉన్నవారు భారత్‌లో కూడా ఎక్కువే. కానీ వారిని గుర్తించి, ప్రతిభాపాటవాలను వెలికి తీయకపోవడం వల్లే పారిస్ పతకాల వేటలో మనం ఓడిపోయాం.

'పారిస్' పతకాల పట్టికలో మనమెక్కడ!?



గుర్రం రాంమోహన్ రెడ్డి
7981018644

ప్రపంచక్రీడ వేదికపై భారత కీర్తి పతాకం ఎగురుతుందని ఆశించాం. ఒలంపిక్స్ క్రీడ సమరంలో బంగారు పతకం లేకుండనే భారత క్రీడాకారులు వెనుదిరిగారు. రెండంకెల పతకాలు సాధించి విశ్వవేదిక శిఖర స్థాయిలో క్రీడాకారులు నిలుస్తారని భావించాం. టోక్యోలో జరిగిన ఒలంపిక్స్ క్రీడలో భారత్ 71 స్థానంలో నిలువగా జులై 26 నుంచి ఆగస్టు 11 వరకు పారిస్‌లో జరిగిన క్రీడలో భారత్ 71వ స్థానంలో నిలిచిందంటే క్రీడారంగం పట్ల మన పాలకుల నిర్లక్ష్యవైఖరిని తెలియజేస్తోంది. ప్రతిభ కనబరుస్తున క్రీడాకారులకు ప్రోత్సహించలేకనా, రాజకీయ క్రీనీడ అవరించడం వల్లనా భారత క్రీడలు ఈ స్థాయికి చేరాయన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఐర్లాండ్, నెదార్లాండ్, కెన్యా, హంగేరి, నార్వే, ఉజ్బేకిస్తాన్‌లాంటి చిన్న చిన్న దేశాలు పతకాలు సాధించి, పతకాల పట్టికలో అగ్రభాగాన ఉంటే భారత్ మాత్రం ఆరు పతకాలతో 71వ స్థానంలో వుందంటే తీవ్రంగా కలిచివేసే అంశం. గతంలో ఎప్పుడు లేని విధంగా 117 మంది అథ్లెట్లతో పారిస్‌కు క్రీడకారులు వెళ్లిన అథ్లెట్లలో ఒక్క బంగారు పథకం సాధించని పరిస్థితి. 2020లో జపాన్ రాజధాని టోక్యలో జరిగిన 32వ ఒలంపిక్‌లో 7 పతకాలు భారత క్రీడాకారులు సాధిస్తే, పారిస్ 33 ఒలంపిక్‌లో ఒకటి రజతం, 5 కాంస్యం అంటే 6 పతకాలతో భారత క్రీడకారులు భారత గడ్డపై అడుగు పెట్టారు. 19 రోజుల పాటు పారిస్‌లో జరిగిన ఒలంపిక్స్‌లో 205 దేశాల అథ్లెట్లు, 32 క్రీడాంశాలు, 35 క్రీడ వేదికలో క్రీడలు నిర్వహించారు. 91 దేశాలు పతకాలు సాధిస్తే, భారత్ స్థానం 71 అంటే క్రీడాభిమానులకు తీవ్ర నిరాశ పర్చిందని చెప్పకతప్పదు. పతకాల పట్టికలో 126 పతకాలతో అమెరికా అగ్రభాగాన నిలువగా, 91 పతకాలతో చైనా రెండవ స్థానంలో, 45 పతకాలతో జపాన్ మూడవ స్థానం, 50 పతకాలతో ఆస్ట్రేలియా నాల్గవ స్థానం, 64 పతకాలతో ఫ్రాన్స్ ఐదవ స్థానంలో నిలిచాయి. న్యూజిలాండ్ 20, కెడా 27, ఉజ్బేకిస్తాన్ 13, హంగెరి 19, కెన్యా 11, నార్వే 8, ఐర్లాండ్ 7, పతకాలు సాధించి విశ్వ క్రీడ వేదికపై సత్తాచాటాయి.

మనకన్నా జనాభాలో తక్కువగా ఉన్న దేశాలు కూడా క్రీడల్లో రాణిస్తుండగా 140 కోట్ల జనాబా కలిగిన భారత్ క్రీడల్లో అదమ స్థానంలో ఉండటం ఒకింత అందోళనకరమైన అంశం.మనవాళ్ల ఒక్క స్వర్ణం లేకుండా పారిస్ నుంచి వెనుతిరగడమంటే అది క్రీడాకారుల తప్పుకాదు, క్రీడల్ని మొదటినుంచి ప్రోత్సహించని పాలకవర్గాలదే. అథ్లెట్స్‌లో భారత క్రీడాకారులు నాల్గోవ స్థానంలో నిలువగా 2028లో జరిగే ఒలంపిక్‌లో జయభేరి మోగిస్తామన్నా భరోసా ఇవ్వగలిగారు. "జావలిన్‌త్రోలో" నీరజ్ చోప్రా రజతం, రెజ్లింగ్‌లో అమన్ సేహ్రావత్ కాంస్యం, షూటింగ్‌లో మనుభాకర్ కాంస్యం, హాకీలో కాంస్యం, షూటింగ్‌లో స్వప్నిలే కుశాల్ కాంస్యం పతకాలు సాధించారు. కేవలం షూటింగ్‌లో 3 కాంస్య పతకాలు దక్కడం విశేషం. రియో, టోక్యోలో జరిగిన ఒలింపిక్‌లో షూటింగ్‌లో ఒక్క పథకం సాధించలేకపోయినప్పటికి పారిస్‌లో మూడు పతకాలు సాధించి క్రీడాభిమానుల్లో కాస్త ఉత్తేజం నింపారు. టోక్యో రియోల్లో జరిగిన ఒలంపిక్స్‌లో భారత క్రీడకారులు టెన్నిస్‌లో మెరిసి పతకాలు సాధించగా, పారిస్‌లో నిరాశపర్చారు. గతంలో కంటే పారిస్ ఒలంపిక్స్‌లో క్రీడకారులు ప్రతిభ కనబర్చినప్పటికీ పతకాల పట్టికలో భాగా వెనుకబడిపోయారు. 2008, 2012, 2016, 2021లో అత్యంత ప్రతిభ కనబర్చి షూటింగ్‌లో పతకాలు సాధించినట్టుగానే పారిస్‌లో షూటింగ్‌లో ఏకంగా మూడు పతకాలు సాధించారు.

అగ్రరాజ్యంగా వెలుగొందుతున్న అమెరికాకు చైనా అన్ని రంగాల్లో సవాల్ విసురుతోంది. పారిస్‌లో జరిగిన ఒలంపిక్స్‌లో సైతం 40 స్వర్ణాలు సాధించి చైనా అమెరికాకు సవాల్ విసిరింది. అమెరికా, చైనా చెరో 40 స్వర్ణాలతో మెరిశాయి. జపాన్ 20 స్వర్ణాలు సాధించి మూడవ స్థానంలో నిలిచింది. ఆరు పతకాలు సాధించి మనవాళ్ల సంతృప్తి కలిగించారా...నిరాశపర్చారా? అన్న ప్రశ్నలు వెలుగు చూస్తున్నాయి. క్రీడల్లో భారత స్థానం ఎక్కడుందన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఆసియా క్రీడల్లో రాణించిన తరహాలో ఒలంపిక్ క్రీడల్లో భారత క్రీడ దిగ్గజాలు ఎందుకు రాణించ బడలేదని క్రీడ పండితులు విశ్లేషణలు చేస్తున్నారు. క్రీడా రంగానికి నిధులు కేటాయించక పోవడమా? క్రీడా కారులకు నిరంతరం శిక్షణ ఇవ్వకపోవడమా, క్రీడల్లో రాజకీయ జోక్యం పెరిగి పోవడమా అన్న చర్చనడుస్తోంది. అన్ని రంగాలకు పాలకులు అంచనాలు పెంచుతారు కాని క్రీడలకు ఎందుకు బడ్జెట్ పెంచరని క్రీడాభిమానుల నుంచి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ జోక్యం క్రీడల్లో పెచ్చు పెరిగిపోయిందని, ప్రతిభవంతులైన క్రీడాకారులను తొక్కి వేయడం వల్లనే విశ్వ క్రీడ పతకాల పట్టికలో దిగువ స్థాయికి పడిపోయామన్న వాదనాలు తెరపైకి వస్తున్నాయి. పారిస్ ఒలంపిక్స్‌లో సాధించిన పతకాలను చూసి పాలకు కనువిప్పు కలుగుతుందా? ఈ ఏడాది మన దేశ బడ్జెట్ అక్షరాల రూ.42 లక్షల కోట్లు. ఇందులో కేంద్రం క్రీడా రంగానికి ఏ మేరకు నిధులు కేటాయించిందనేది ప్రభుత్వమే పరిశీలన చేసుకోవాలి. పదహారేండ్ల వయసులోనే అమెరికా క్రీడాకారుడు క్విన్సివిల్సన్ రన్నింగ్‌లో బంగారు పతకం సాధించడం మన దేశానికి ఒక సవాల్. యువకులు, చైతన్యవంతులు, సామర్థ్యంగలవారు, క్రీడల్లో రాణించగలిగే సత్తా ఉన్నవారు భారత్‌లో కూడా ఎక్కువే. కానీ వారిని గుర్తించి, ప్రతిభాపాటవాలను వెలికి తీయకపోవడం వల్లే పారిస్ పతకాల వేటలో మనం ఓడిపోయాం. ప్రభుత్వం ఇదో గుణపాఠంగా తీసుకుని క్రీడారంగం పట్ల శ్రద్ధ కనపరిచి, తగిన నిధులు కేటాయించి,క్రీడలను ప్రోత్సహిస్తే గనుక, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించగలిగే ఆత్మస్థైర్యం క్రీడాకారుల్లో పెంపొందుతుంది.

కరెంట్ అఫైర్స్

'గ్రేవ్‌యార్డ్ ఫర్ చిల్డ్రన్' అంటే ఏమిటి?



ఇజ్రాయిల్..గాజాలో భూతల దాడులు ముమ్మరం చేసింది. వైమానిక వేగం పెంచింది. హమాస్ ఉగ్రవాదులను పూర్తిగా ఏరిపారేసే వరకు యుద్ధం ఆగదని తేల్చి చెబుతోంది. గాజాని జల్లెడ పట్టి, శత్రువు అనే వాడు లేకుండా చేస్తానంటోంది. గాజాలో అమాయకులు ఉసురు తీయడంలో ఇజ్రాయిల్ సేనలు చెలరేగిపోతున్నాయి. ఇజ్రాయిల్ దాడుల్లో ప్రతి రోజు 420 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. 'గ్రేవ్‌యార్డ్ ఫర్ చిల్డ్రన్'..ఇది గాజాలో కొనసాగుతోన్న మారణహోమాన్ని చూసి, ఆ ప్రాంతానికి యూనిసెఫ్ పెట్టిన పేరు. తెలుగులో దీని అర్థం చిన్నారుల శ్మశాన వాటిక. ఇజ్రాయిల్ దాడుల్లో ఎక్కువగా బలైపోతున్నది అమాయక పౌరులే. వారిలోనూ చిన్నారుల సంఖ్యే ఎక్కువగా ఉంటోంది. గాజాలో ఇజ్రాయిల్ నిరంతరం బాంబుల వర్షం కురిపిస్తోంది. ఫలితంగా పాలుతాగే చిన్నారులు సైతం నెత్తుటి ముద్దలుగా మారిపోతున్నారు.

ఆకలి సూచీలో భారత్‌కు 107వ స్థానం



భారత్‌లో ఆకలి కేకలు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. ప్రపంచ ఆకలి సూచిలో మన దేశం ఆరు స్థానాలు పడిపోయింది. 101 నుంచి 107కు దిగజారిపోయింది. బంగ్లాదేశ్, పాకిస్తాన్ కంటే మనం వెనుకబడి ఉండడం ఆందోళన కలిగిస్తోంది. మొత్తం 121 స్థానాలకుగాను భారత్ 107 స్థానంలో ఉన్నట్టుగా 2022 సంవత్సరానికి గాను గ్లోబల్ హంకర్ ఇండెక్స్ వెల్లడించింది. చైల్డ్ వేస్టింగ్ రేటులో (పోషకాహార లోపంలో అయిదేళ్ల వయసులోపు పిల్లల్లో ఎదుగుదల లేకపోవడం) 19.3 శాతంతో ప్రపంచంలోనే భారతం తొలి స్థానంలో ఉంది. ఐరిష్ సహాయ సంస్థ కన్సర్న్ వరల్డ్‌వైడ్, జర్మనీకి చెందిన వెల్ట్ హంగర్ హిల్ఫ్ ఈ ఆకలి సూచి నివేదికని రూపొందించి.

ఆర్థిక సంవత్సరానికి పరిశ్రమల్లో పెరిగిన ఉత్పత్తి శాతం



2023-24 ఆర్థిక సంవత్సరంలో 0.6 శాతం ఉత్పత్తి పెరగడంపై పారిశ్రామిక వేత్తలు హర్షం వ్యక్తం చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగానూ పరిశ్రమల్లో ఉత్పత్తి 5.8 శాతం పెరిగినట్లు ప్రభుత్వానికి చెందిన నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్(ఎన్ఎస్ఓ) డేటా వెల్లడించింది. ఒక్క మార్చి నెలలోనే ఏకంగా 4.9 శాతం ఉత్పత్తి పెరిగిందని... గతేడాది అదే సమయానికి కేవలం 1.9 శాతంగానే ఉత్పత్తి జరిగినట్లు తేలింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 5.2 శాతం ఉత్పత్తి జరగ్గా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 0.6 శాతం ఉత్పత్తి పెరగడంపై పారిశ్రామిక వేత్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది మైనింగ్ ఉత్పత్తులు 1.2 శాతం, విద్యుత్తు ఉత్పత్తులు 8.6 శాతం పెరిగాయి. ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ (ఐఐపీ)లో గత ఆర్థిక సంవత్సరంలో 5.2 వృద్ధి శాతం నమోదు చేయగా.. 2023-24లో అత్యధికంగా 5.8 వృద్ధి నమోదైంది.

ఆగ్రాలో మరో తాజ్ మహల్.. రాధాస్వామి సత్సంగ్ భవనం



అగ్రా అంటేనే తాజ్ మహల్ అని అందరికీ తెలుసు. కానీ ఇక్కడే మరో అద్భుతమైన పాలరాతి భవనం ఉందని తెలిస్తే మీకు ఆశ్చర్యం కలుగుతుంది. ఈ భవనం తాజ్ మహల్‌కు పోటీనిస్తుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. రాధాస్వామి సత్సంగ్ శాఖ వ్యవస్థాపకుడు పరమ పురుష్ పూరన్ ధని స్వామిజీ సమాధి స్థలంపై నిర్మించబడిన ఈ భవనం, స్వచ్ఛమైన తెల్లని పాలరాతితో నిర్మితమై, పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. తాజ్ మహల్ నుంచి 12.కి.మీ దూరంలో ఉన్న స్వామి బాగ్‌లో ఈ భవనం ఉండడం వల్ల దీన్ని రెండో తాజ్ మహల్ అని కూడా పిలుస్తున్నారు. 193 అడుగుల ఎత్తు ఉన్న ఈ భవనం రాజస్థాన్‌లోని మక్రానా నుంచి తెచ్చిన తెల్లని పాలరాతితో నిర్మించబడింది.

జలయజ్ఞంలో భాగంగా రాష్ట్రంలో ప్రారంభించిన తొలి ఎత్తిపోతల పథకం ఏది?

తెలంగాణ జాగ్రఫీ

1 ఉత్తర తెలంగాణకు వరప్రదాయినిగా పేర్కొనే ప్రాజెక్టు
1) నిజాం సాగర్ ప్రాజెక్టు
2) శ్రీరాంసాగర్ ప్రాజెక్టు
3) ఆలీసాగర్ ప్రాజెక్టు
4) అర్గుల రాజారాం ఎత్తిపోతల పథకం

2. ప్రపంచంలోనే అతిపెద్ద, అతి ఎత్తైన రాతికట్టడం, ఆధునిక దేవాలయంగా ప్రసిద్ధి చెందిన ప్రాజెక్టు?
1) నాగార్జున సాగర్ ప్రాజెక్టు
2) శ్రీరాంసాగర్ ప్రాజెక్టు
3) ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు
4) కాళేశ్వరం ప్రాజెక్టు

3. నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు జవహర్ లాల్ నెహ్రూ ఎప్పుడు శంకుస్థాపన చేశారు?
1) 1955 డిసెంబర్ 30 2) 1955 డిసెంబర్ 23
3) 1955 డిసెంబర్ 10 4) 1955 డిసెంబర్ 20

4. జలయజ్ఞంలో భాగంగా రాష్ట్రంలో ప్రారంభించిన తొలి ఎత్తిపోతల పథకం ఏది?
1) నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం
2) అర్గుల రాజారాం ఎత్తిపోతల పథకం
3) దేవాదుల ఎత్తిపోతల పథకం
4) ఆలీసాగర్ ఎత్తిపోతల పథకం

5. జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం ఏ జిల్లాలో కలదు?
1) జోగులాంబ గద్వాల్
2) వనపర్తి
3) మహబూబ్‌నగర్
4) నాగర్‌కర్నూల్

6. రాజోలిబండ మళ్లింపు పథకం ఏ రెండు రాష్ట్రాల మధ్య ఉమ్మడి ప్రాజెక్టు?
1) మహరాష్ట్ర, తెలంగాణ
2) చత్తీస్‌గఢ్, తెలంగాణ
3) కర్ణాటక, తెలంగాణ
4) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ

7. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని పరివాహక ప్రాంతంలో లేని జిల్లా ఏది?
1) మహబూబ్‌నగర్
2) రంగారెడ్డి
3) నల్గొండ
4) వరంగల్

8. జతపర్చుము :
1) కాళేశ్వరం ప్రాజెక్టు ఎ) పెన్‌గంగా
2) తుమ్మిడి హట్టి బి) ప్రాణహిత
3) చనాఖా-కొరాటా సి) గోదావరి
1) 1-ఎ,2-బి,3-సి 2) 1-బి,2-సి,3-ఎ
3) 1-సి,2-బి,3-ఎ 4) 1-సి,2-ఎ,3-బి

9. కాళేశ్వరం ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో ఉండే జిల్లాలు ?
1) కరీంనగర్, మెదక్, నల్గొండ, నిజామాబాద్
2) కరీంనగర్, మెదక్, నల్గొండ, ఆదిలాబాద్
3) కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం
4) కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం

10. బొగ్గులవాగు ప్రాజెక్టు ఏ జిల్లాలో కలదు?
1) జయశంకర్ భూపాలపల్లి
2) మహబూబ్‌నగర్
3) జనగామ
4) వరంగల్ రూరల్

11. పోచారం ప్రాజెక్టును ఏ నదిపై నిర్మించారు?
1) పాలేరు 2) ఆలేరు
3) శబరి 4) కిన్నెరసాని

12. తాలిపేరు ప్రాజెక్టు, పెద్దవాగు ప్రాజెక్టులు ప్రస్తుతం ఏ జిల్లాలో కలవు?
1) ఖమ్మం 2) జనగామ
3) భద్రాద్రి కొత్తగూడెం 4) మహబూబ్‌నగర్

13. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం పనులు 1963 ప్రారంభించగా ఏ సంవత్సరం నాటికి పూర్తి చేశారు?
1) 1976 2) 1977
3) 1980 4) 1978

14. ప్రస్తుతం సింగూరు ప్రాజెక్టు ఏ జిల్లాలో కలదు?
1) మెదక్ 2) సిద్దిపేట
3) సంగారెడ్డి 4) వికారాబాద్

15. కోయిల్‌సాగర్ ప్రాజెక్టును ఏ నదిపై నిర్మించారు?
1) కృష్ణ 2) భీమా
3) డిండి 4) పెద్దవాగు

16. గోదావరి నదిపై నిర్మించబడిన కంతనపల్లి సుజల స్రవంతి పథకం ఏ జిల్లాలో కలదు?
1) వనపర్తి 2) మహబూబ్‌నగర్
3) జయశంకర్ భూపాపల్లి 4) జనగామ

17. భక్తరామదాసు ఎత్తిపోతలు పథకం ఏ జిల్లాలో కలదు?
1) ఖమ్మం
2) యాదాద్రి భువనగిరి
3) భద్రాద్రి కొత్తగూడెం
4) జనగామ

18. సీతారామా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రస్తుతం ఏ జిల్లాలో కలదు?
1) భద్రాద్రి కొత్తగూడెం
2) జనగామ
3) మహబూబ్‌నగర్
4) ఖమ్మం

19. వైరా ప్రాజెక్టు
1) ఖమ్మం 2) శబరి
3) సీలేరు 4) కిన్నెరసానీ

20. లంకసాగర్ ప్రాజెక్టును ఖమ్మం జిల్లాలో ఏ నదిపై నిర్మించారు?
1) కట్లేరునది 2) శబరి
3) సీలేరు 4) కిన్నెరసానీ

21. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏ నదిపై అర్ధ (కొమురం భీం) ప్రాజెక్టును నిర్మిస్తున్నారు?
1) పెద్దవాగు 2) రాళ్లవాగు
3) సుద్దవాగు 4) చెలిమలవాగు

22. గడ్డెనవాగు ప్రాజెక్టును ఏ నదిపై నిర్మించారు?
1) వట్టివాగు 2) సుద్దవాగు
3) పెద్దవాగు 4) మతాడివాగు

23. నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ బాధితులను విముక్తి కల్పించడానికి ఉద్దేశించిన పథకం?
1) డిండి ఎత్తిపోతల పథకం
2) నక్కలగండి ప్రాజెక్టు
3) పై రెండు
4) ఏదీకాదు

24. రాజోలి బండ మళ్లింపు పథకం ఏ నదిపైన నిర్మించారు?
1) కృష్ణ 2) భీమా
3) తుంగభద్ర 4) ఘటప్రభ

25. కడెం రిజార్వాయర్ ప్రస్తుతం ఏ జిల్లాలో కలదు?
1) మంచిర్యాల 2) ఆదిలాబాద్
3) ఆసిఫాబాద్ 4) నిర్మల్

26. కరీంనగర్ వాసులకు ట్యాంక్ బండ్ అనుభూతిని కల్గిస్తున్న ప్రాజెక్టు?
1) లోయర్ మానేరు 2) మధ్య మానేరు
3) ఎగువ మానేరు 4) ఏదీకాదు

27. గండిపేట (ఉస్మాన్‌సాగర్) ప్రాజెక్టు ఉద్దేశ్యం
1) మూసీనది వలన కలిగే వరదల నుండి హైద్రాబాద్‌ను కాపాడటం
2) హైద్రాబాద్ నగర ప్రజలకు త్రాగునీటికోసం
3) పై రెండు 4) ఏదీకాదు

28. ఎగువ మానేరు డ్యాం ప్రస్తుతం ఏ జిల్లాలో కలదు?
1) రాజన్న సిరిసిల్ల 2) పెద్దపల్లి
3) జగిత్యాల 4) జనగామ

29. గొల్లవాగు ప్రాజెక్టు, నీల్వాయి ప్రాజెక్టులు ఏ జిల్లాలో కలవు?
1) మంచిర్యాల 2) ఆదిలాబాద్
3) నిర్మల్ 4) కొమురం భీం ఆసిఫాబాద్

30. అసిఫ్‌నహర్ ప్రాజెక్టు, శాలిగౌరారం ప్రాజెక్టులు ప్రస్తుతం ఏ జిల్లాలో కలవు?
1) నల్గొండ 2) సూర్యాపేట
3) జనగామ 4) యాదాద్రి భువనగిరి

31. వట్టివాగు ప్రాజెక్టు, చెలిమెలవాగు (ఎన్టీఆర్ సాగర్) ప్రాజెక్టులు ప్రస్తుతం ఉన్న జిల్లా ఏది?
1) మంచిర్యాల 2) ఆదిలాబాద్
3) జగిత్యాల 4) కొమురం భీం ఆసిఫాబాద్

సమాధానాలు

1. 2	2. 1	3. 3	4. 4	5. 1
6. 3	7. 4	8. 3	9. 1	10. 1
11. 2	12.3	13.4	14.3	15. 4
16. 3	17. 1	18. 1	19. 1	20. 1
21. 1	22. 2	23. 3	24. 4	25. 4
26. 1	27. 3	28. 1	29. 1	30. 4
31. 4				